www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHI

పార్లమెంట్ పైకప్పు లీకేజీ

బయట పేపర్ లీక్.. లోపల వాటర్ లీక్: కాంగ్రెస్

నిర్మాణానికి 1,200 కోట్లు

ఇప్పుడు రూ.120 బకెట్‌పై ఆధారపడాల్సొచ్చింది: ఆప్



12

శుక్రవారం | 2-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 108 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి మ. 3.27 తదుపరి చతుర్దశి; నక్షత్రం: ఆర్ద్ర ఉ. 10.59 తదుపరి పునర్వసు; వర్జ్యం: రా. 11.29-1.09; దుర్ముహూర్తం: ఉ. 8.31-9.22, మ. 12.46-1.37; అమృతఘడియలు: లేవు; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 5.58; సూర్యాస్తమయం: 6.44 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వర్గీకరణపై తీర్పునిచ్చిన ధర్మాసనంలోని సభ్యులు వరుసగా జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ బేల ఎం.త్రివేదీ, జస్టిస్ బీఆర్ గవాయ్, చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పంకజ్ మిథాల్, జస్టిస్ సతీశ్ చంద్రశర్మ



వర్గీకరణకు సై!

ఎస్సీ, ఎస్టీలను కేటగిరీలుగా విభజించొచ్చు

ఉప కులాలకు కోటా రాజ్యాంగబద్ధమే

ఆ అధికారం రాష్ట్రాలకు ఉంది: సుప్రీంకోర్టు

సమగ్ర కథనాలు 10, 11లో

- పక్కా డేటాతోనే వర్గీకరణ చేపట్టాలి
- ఎస్సీ, ఎస్టీల్లోనూ క్రీమీలేయర్ అమలు
- 6-1 మెజారిటీతో తీర్పు వెల్లడి
- ఎస్సీలంతా ఒకే స్థాయిలో లేరు
- కొన్ని వర్గాలు మరింత వెనుకబడ్డాయి
- సీజే చంద్రచూడ్ బెంచ్ 565 పేజీల తీర్పు
- ఏపీ ఎస్సీ రిజర్వేషన్లపై తీర్పు పునఃసమీక్ష
- దశాబ్దాల తర్వాత ఫలించిన మాదిగల కల
- తీర్పుపై బాలగోపాల్ వ్యాసం ప్రభావం



న్యూఢిల్లీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కొన్ని దశాబ్దాలుగా దేశంలో రగులుతున్న ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ సమస్యకు సుప్రీంకోర్టు తెరదించింది. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల ఉప వర్గీకరణ ఆమోదయోగ్యమేనని, ఆయా వర్గాల్లో అత్యంత వెనుకబడిన ఉప వర్గాల వారికి రాష్ట్రాల స్థాయిలో కోటాలో ప్రత్యేక కోటా కేటాయించవచ్చని ఏడుగురు సభ్యుల ధర్మాసనం గురువారం మెజారిటీ తీర్పును వెలువరించింది. ఎస్సీలంతా ఒకే స్థాయిలో లేరని, అందులో సామాజికంగా, విద్యాపరంగా మరింత వెనుబడిన వర్గాలు ఉన్నాయని, వాటిని పైకి తీసుకురావడానికి ఎస్సీ వర్గీకరణ చేయడానికి రాష్ట్రాలకు రాజ్యాంగబద్ధంగానే ఆ అధికారం ఉందని చరిత్రాత్మక తీర్పులో పేర్కొంది. దాంతో తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో ఏళ్లుగా వర్గీకరణ కోసం పోరాడుతున్న మాదిగలకు ఎస్సీ రిజర్వేషన్లలో ప్రత్యేక కోటా ఇచ్చేందుకు మార్గం సుగమమైంది. ఇదే డిమాండ్ ఉన్న ఇతరచోట్లా తదుపరి చర్యలకు అవకాశం ఏర్పడింది. పలు రాష్ట్రాల్లో ఎస్టీల వర్గీకరణ చేపట్టాలన్న డిమాండ్లు కూడా ఉన్నాయి. తాజా తీర్పుతో వాటికి కూడా బలం

మిగతా 11వ పేజీలో...

ఊరూవాడా

'దండోరా'!

అలుపెరగని ఎమ్మార్పీఎస్ ప్రస్థానం

బాబు హయాంలో ఆనాడే అమలు

- 2000-2004 మధ్య ఉమ్మడి ఏపీలో అమల్లోకి వర్గీకరణ
- దీనికోసం ప్రత్యేక జీవో తెచ్చిన చంద్రబాబు
- 1981 జనగణన ఆధారంగా ఏబీసీడీ విధానం
- విద్య, ఉద్యోగ రంగాల్లో సమగ్రంగా అమలు
- జనాభా దామాషాలో ఎస్సీ కులాలు, ఉప కులాలకు సామాజిక న్యాయానికి యత్నం



ధర్మమే గెలిచింది

- 30 ఏళ్ల ఉద్యమంలో అమరులైన మాదిగ బిడ్డలకు అంకితం
- చంద్రబాబు చేసిన చట్టాన్నే అత్యున్నత కోర్టు సమర్థించింది
- ఆయన న్యాయం వైపే అని మళ్లీ రుజువైంది
- బాబు సీఎంగా ఉండడం మా జాతికి ఉపయోగపడుతుంది
- జగన్ సీఎంగా ఉంటే అడ్డుకునేవారేమో!
- వర్గీకరణ పూర్తయ్యే వరకు నియామకాలొద్దు
- మాల సోదరులారా అడ్డుకోకండి: మందకృష్ణ
- సుప్రీం తీర్పు తర్వాత భావోద్వేగంతో కంటతడి

తొలి ముందడుగు మాదే

- సామాజిక న్యాయం కోసమే నాడు వర్గీకరణ
- అది సరైనదేనని ఇప్పుడు సుప్రీం తేల్చింది
- అందరికీ న్యాయం జరిగేలా చూస్తాం
- దళితులు ఐక్యంగా అభివృద్ధి చెందాలి: బాబు

తీర్పును వ్యతిరేకిస్తున్నాం



- ఎస్సీలపై కుట్ర జరుగుతోంది
- కృష్ణను పావుగా వాడుకున్నారు
- వర్గీకరణ కాంగ్రెస్ సూత్రమైతే రాజీనామాకు నేను సిద్ధం
- రేపు రాజమండ్రిలో అత్యవసర భేటీ
- మాజీ ఎంపీ హర్షకుమార్ వెల్లడి



గురువారం శ్రీశైలం ప్రాజెక్టు వద్ద కృష్ణమ్మకు జలహారతి ఇస్తున్న సీఎం చంద్రబాబు

రాయలసీమలో ప్రతి ఎకరాకూ నీరు

- సిద్దేశ్వరం వద్ద రిజర్వాయర్ నిర్మిస్తాం
- ఐకానిక్ హైవే బ్రిడ్జి కూడా: సీఎం
- 20 ఏళ్లలో జూలైలోనే శ్రీశైలం నిండడం ఇదే మొదటిసారి
- సీమను రతనాల సీమగా మారుస్తాం
- జవాబుదారీగా పాలన సాగిస్తాం
- పేదలందరికీ ఇంటి స్థలాలు ఇస్తాం
- ఇళ్ల నిర్మాణానికి రూ.నాలుగేసి లక్షలు
- 15 నుంచి మళ్లీ అన్న క్యాంటీన్లు
- గత ఐదేళ్లలో చరిత్రలో చూడని నష్టం
- ఆదాయం నిల్లు.. అప్పులు ఫుల్లు: బాబు
- శ్రీశైలం ప్రాజెక్టు వద్ద జలహారతి
- గుండుమలలో పింఛన్ల పంపిణీ

12

ఒక్క రోజులోనే పింఛన్ల పంపిణీ

98 శాతం పూర్తి.. 64 లక్షల మందికి 2,737 కోట్లు అందజేత

సచివాలయ ఉద్యోగులతో రెండో నెలలోనూ విజయవంతం

3



శ్రీసత్యసాయి జిల్లా గుండుమల గ్రామంలో ఓబులమ్మకు పెన్షన్ అందజేస్తున్న సీఎం చంద్రబాబు



స్వప్నిల్.. కంచు మోత

- 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్‌లో దేశానికి తొలి పతకం
- పారిస్ ఒలింపిక్స్‌లో సింధు, నిఖత్, సాత్విక్ పరాజయం

ఆశలు లేని స్థితి నుంచి దూసుకొచ్చాడు.. అంచనాలు లేనివాడే సంచలనం సృష్టించాడు.. దేశానికి పతకం తెచ్చిన వీరుడయ్యాడు.. పారిస్ ఒలింపిక్స్ 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్‌లో మహారాష్ట్ర కుర్రాడు స్వప్నిల్ కుశాలె కాంస్యం కొల్లగొట్టాడు. ఈ అంశంలో భారత్‌కు ఇదే తొలి ఒలింపిక్ పతకం కావడం విశేషం. క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఏడో స్థానంతో పతక రౌండ్‌కు అర్హత సాధించిన స్వప్నిల్ మెడల్ రౌండ్‌లో నిలకడైన ప్రదర్శనతో రాణించాడు. ఓ దశలో ఆరో స్థానానికి దిగజారినా.. ఒత్తిడికి లోనుకాకుండా ఏకాగ్రతతో నిలదొక్కుకుని మెడల్ గెలిచాడు. పారిస్‌లో ఇది భారత్‌కు మూడో పతకం కాగా.. అన్నీ కాంస్యాలే.. అన్నీ షూటింగ్‌లోనే వచ్చాయి. తెలుగు క్రీడాకారులు బ్యాడ్మింటన్ స్టార్లు పీవీ సింధు, సాత్విక్ సాయిరాజ్, బాక్సర్ నిఖత్ జరీన్ నిరుత్సాహ పరిచారు. హ్యాట్రిక్ మెడల్ సాధించే అవకాశం ఉన్న సింధు ప్రిక్వార్టర్స్‌లోనే పరాజయం పాలైంది. భారీ అంచనాలతో బరిలో దిగిన నిఖత్‌కు రౌండ్-16లోనే షాక్ తగిలింది. చిరాగ్ షెట్టితో కలిసి పతకం తెస్తాడనుకున్న సాత్విక్ పోరాటం క్వార్టర్స్‌లోనే ముగిసింది.

9







ప్రభుత్వ భద్రతకు పొన్నవోలు అనర్హుడు

హైకోర్టు స్పష్టీకరణ

12

- ప్రస్తుతం ఆయన చట్టబద్ధమైన పదవుల్లో లేరు
- ప్రాణహాని లేదని ఎస్ఆర్‌సీ నివేదిక ఇచ్చింది
- అభ్యంతరముంటే ఆ రిపోర్టును సవాల్ చేసుకోండి
- పొన్నవోలుకు న్యాయస్థానం సూచన
- 8 వరకు భద్రత కొనసాగించాలని అధికారులకు ఆదేశం
- అందుకయ్యే ఖర్చు ఆయనే భరించాలని వెల్లడి

గనుల వెంకటరెడ్డిపై సస్పెన్షన్ వేటు

12

- ఏసీబీ విచారణకు ఆదేశించిన ప్రభుత్వం
- అమరావతిలో అందుబాటులో ఉండాలని ఆదేశం
- ఇసుక అమ్మకం టెండర్లలో అక్రమాలపై చర్యలు

ఉత్తరాది అతలాకుతలం

- హిమాచల్‌లో క్లౌడ్ బరస్ట్‌తో కుంభవృష్టి!
- 50 మంది గల్లంతు.. ఐదుగురి దుర్మరణం
- ఉత్తరాఖండ్‌లో రాత్రివేళ పోటెత్తిన వరద
- రాష్ట్రవ్యాప్తంగా వర్షాలకు 12 మంది మృతి
- నీటిలోనే ఢిల్లీ.. ప్రాణాలు కోల్పోయిన ఐదుగురు
- రాజస్థాన్‌లోనూ భారీ వర్షాలు.. ముగ్గురి మృతి
- 11 రాష్ట్రాలకు ఐఎండీ ఆరెంజ్ అలర్ట్ జారీ

12



ఢిల్లీలో గోడ కూలి..

మా నాన్నను కోల్పోయినప్పటి

పరిస్థితి గుర్తుకొచ్చింది

వయనాడ్ విపత్తుపై రాహుల్

ప్రియాంకతో కలిసి పర్యటన

మీతోనే ఒరిజినల్ పత్రాలు!

- 'ఆన్‌లైన్' రిజిస్ట్రేషన్లు తప్పనిసరి కాదు
- ఆప్షనల్ చేస్తూ సర్క్యులర్‌కు సవరణ

12

హే 'రామ్'.. ఇదేం పని?



- నాడు రిజిస్ట్రేషన్ల టెండర్‌లో గోల్‌మాల్
- 10 కార్యాలయాల్లో కార్పొరేట్ లుక్ కోసం రూ.99.75 కోట్లకు రామ్ ఇన్ఫోకు కాంట్రాక్టు
- అడ్డగోలుగా అస్మదీయ కంపెనీకి లబ్ధి
- రెండోసారి టెండర్లు పిలిచి మరీ అప్పగింత
- న్యాయ పరిశీలన తప్పించుకునేలా వ్యూహం
- ఎన్నికల కోడ్ రావడంతో పనులకు బ్రేక్
- ప్రభుత్వం మారినా అదే కంపెనీని కొనసాగించేందుకు అధికారుల యత్నం

12

సాగు మీటర్లకు చెక్!

రైతులకు మేలు చేసేలా 'పీఎం కుసుమ్'

- ఈ పథకం ద్వారా ఉచిత సోలార్ విద్యుత్.. కూటమి ప్రభుత్వం యోచన
- గత ప్రభుత్వంలో 18 లక్షల పంపుసెట్లకు 4000 కోట్లతో మీటర్లు బిగించాలని నిర్ణయం
- 7,000 మెగావాట్ల కొనుగోలుకు ఒప్పందం.. షిర్డీ సాయి, సెకీ ఒప్పందాలపై త్వరలో సమీక్ష

3



సత్పురుషుల స్నేహం

క్షీరేణాత్మగతో దకాయహి గుణా దత్తాః పురాతేఖిలాః
క్షీరోత్తాపమవేక్ష్య తేన పయసాస్వాత్మా కృశానో హుతః
గన్తుం పావక మున్మన స్తదభవ ద్దృష్ట్వాతు మిత్రాపదం
యుక్తం తేన జలేన శామ్యతి సతాం మైత్రి పునస్త్వీదృశీ...

అనే ఈ శ్లోకంలో మంచివారితో చెలిమి గురించి తన నీతిశతకంలో భర్తృహరి వివరించాడు. దాన్ని...



సుభాషితం

క్షీరము మున్ను నీటికొసగెన్ స్వగుణంబులు దన్ను జేరుటన్
క్షీరముతప్తమౌట గని చిచ్చురికెన్ వెతచే జలంబు, దుర్వార సుహృద్విపత్తిగని వహ్ని జొరం జనె దుగ్ధమంతలో
నీరముగూడి శాంతమగు నిల్చు మహాత్ముల మైత్రి యీగతిన్... అనే పద్య రూపంలో ఏనుగు లక్ష్మణకవి తెలుగులోకి అనువదించాడు.

భావం: పాలలో నీరు కలిసినప్పుడు... తన తెల్లదనాన్ని, తియ్యదనాన్ని నీటికి ఇచ్చి... నీటితో పాలు మైత్రి చేసుకుంటాయి. పాలను కాచుతున్నప్పుడు... పాలు మరిగిపోవడాన్ని సహించలేక... నీరు పైకి లేచి ఆవిరైపోతుంది. తనను స్నేహితుడు విడిచి వెళ్ళిపోతున్నాడనే వేదనతో... పాలు పొంగి మంటల్లో పడిపోవడానికి ప్రయత్నిస్తాయి. అప్పుడు పాల మీద నీరు పడితే (చల్లితే)... తనను మిత్రుడు మళ్ళీ కలిశాడన్న సంతోషంతో పాలు ఊరట పొంది వెనక్కు తగ్గుతాయి. మహాత్ములతో స్నేహం కూడా ఈ విధంగానే ఉంటుంది. మిత్రులకు కష్టం వచ్చినప్పుడు, దూరమైనప్పుడు తల్లడిల్లుతారు. వారు తిరిగి తమను చేరుకున్నప్పుడు సంతోషపడతారు.

చింతన



జాతస్య హి ధ్రువో మృత్యు ధ్రువం జన్మ మృతస్యచ
తస్మాద పరిహార్యర్థే న త్వం శోచితు మర్హసి

"పుట్టిన ప్రతి ఒక్కడూ గిట్టక మానడు. గిట్టినవాడు మళ్ళీ పుట్టకమానడు. అనివార్యమైన ఈ విషయం గురించి శోకించడం తగదు" అని శ్రీకృష్ణుడు 'భగవద్గీత'లో చెప్పాడు. కానీ ఈ యదార్థం అంతిమ సంస్కారాలు జరిగే సమయంలో... ఘంటసాల గళంలో వినిపిస్తూ ఉంటుంది. అసలు వినవలసినవాడు పార్థివదేహంగా మారి... దాన్ని వినలేడు. విగిలినవారు విన్నా దాన్ని పట్టించుకోరు. ప్రతి మనిషి జీవితకాల చక్రంలో ఎనిమిది దశలు ఉంటాయి. అవి గర్భస్థ దశ, బాల్యం, విద్య, సంసారం, సంపాదన, విరామం, విముక్తం, చివరకు నిర్యాణం. ఈ దశలలో ఎదురయ్యే బాధలను, కన్నీళ్ళను, సుఖాలను, దుఃఖాన్ని, క్రోధాన్ని, ఆవేశాన్ని జయించాలంటే, కర్మనే కార్యంగా స్వీకరించి జీవించా లంటే, స్థిత ప్రజ్ఞుడిగా ఉండాలంటే... ఈ ఒక్క శ్లోకంలోని మర్మాన్ని అర్థం చేసుకుంటే చాలు. జీవితం ఒడుదొడుకులు లేకుండా ఉంటుంది. కార్యోన్ముఖంగా సాగుతుంది. 'కర్మ' అంటే తలరాత కాదు. మనం చేసే ప్రతి పనినీ 'కర్మ' అనే అంటారు. కర్మ సిద్ధాంతం అంటే తన లక్ష్యాన్ని తానే ఎంచుకొని, శ్రమించి పోరాడడం, సాధించడం.

మరణానికి ప్రణాళిక

వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోపరాణి
తథా శరీరాణి విహాయ జీర్ణా న్యన్యాని సంయాతి నవాని దేహీ...

అని కూడా చెప్పాడు గీతాచార్యుడు. మనం ధరించిన వస్త్రాలను విడిచిపెట్టి, వేరొక దుస్తులను ఎలా ధరిస్తామో... అలాగే ఆత్మ ఒక శరీరాన్ని విడిచిపెట్టి... కొత్త శరీరంలోకి వెళుతుంది. ఇది నిరంతరం జరుగుతున్న ప్రక్రియ. కాబట్టి దీనికోసం సుదీర్ఘంగా చింతించవద్దని అర్థం. మనమందరం గమనించాల్సిన మరో విషయం ఏమిటంటే... శరీరం ధాతు సమ్మేళనం. మరణించిన తరువాత ఆ ధాతువులు పంచభూతాలలో కలుస్తాయి. ప్రకృతిలో (పరమాత్మలో) విలీనం అవుతాయి. కాబట్టి అనివార్యమైన మరణం కోసం ప్రణాళిక వేసుకోవాలి. మానసిక, ఆధ్యాత్మిక, కుటుంబ, సమాజ శ్రేయస్సుకు అది అత్యవసరం.

కుటుంబంలో చర్చించాలి:

విద్య, ఉద్యోగం, ఆస్తి, అంతస్తులు, ఆరోగ్యం, బీమా... ఇలా అన్నిటి గురించీ మనం చర్చిస్తాం. కానీ జీవితంలో తప్పనిసరిగా సంభవించే మరణం గురించి ఆలోచించడానికి భయపడతాం. అలాంటి ఆలోచనను అపశకునంగా భావిస్తాం. చర్చ జరిగినప్పుడే వాస్తవ పరిస్థితి అర్థమవుతుంది. జీవన లక్ష్యాల గురించి ఆలోచిస్తాం. మానసిక, ఆర్థిక, అంతిమ సంస్కార, అనంతర సంస్కార ప్రణాళిక రూపొందించుకోగలుగుతాం. "అహనీ అహని భూతాని గచ్ఛంతిహ యమాలయం... శేషః స్థిరత్వం ఇచ్ఛంతి కిమాశ్చర్యమతః పరం... ప్రతి క్షణం ఎందరో చనిపోతూనే ఉన్నారు. కానీ బతికి ఉన్నవారికి మేము కూడా ఒక రోజు మరణిస్తామనే ఆలోచనే రాదు. ఇది చాలా ఆశ్చర్యకరం. ఇది వాస్తవం" అని శ్రీకృష్ణభగవానుడు చెప్పాడు. దాన్ని ఇప్పటికీ మనం అర్థం చేసుకోలేదు.

చర్చ ఎందుకు జరగాలంటే:

మరణం అనివార్యం అని తెలిసినప్పుడు మనిషిలో భయం తగ్గుతుంది. లక్ష్య సాధన కోసం ధైర్యం పెరుగుతుంది. పదవీ విరమణ ప్రణాళిక మాదిరిగానే నిర్యాణ (మరణ) ప్రణాళిక ద్వారా... మరణించే వరకూ ఎలా బతకాలి, ఏం చెయ్యాలి అనేది నిర్ధారించుకోగలం. ఆరోగ్యం కోసం, కుటుంబం కోసం, ఆస్తుల పంపకం కోసం ప్రణాళికలు రూపొందించుకోగలం. మరణం మరో ప్రయాణానికి నాంది అని గ్రహించి... దాన్ని సంతోషంగా స్వీకరించగలం.

> **మానసిక దృఢత్వం అవసరం**
>
> చావు భయం చాలామందిని పిరికివాళ్ళుగా చేస్తుంది. అది లక్ష్య సాధనకు అవరోధంగా మారుతుంది. మరణం అనివార్యం అని అర్థం చేసుకున్నప్పుడు, లక్ష్య సాధనలో మరణం కూడా ఒక ఆయుధంగా మారుతుంది.

అంతిమ సంస్కారం:

ఏ వ్యక్తికైనా మరణానంతర కార్యక్రమాలు కూడా గౌరవప్రదంగా ఉండాలి. అంతిమ సంస్కారం ఎక్కడ జరగాలి, ఎలా జరగాలి, ఎవరు చేయాలనే విషయంలో స్పష్టత ఉండాలి. పార్థివ శరీరానికి కూడా సజీవుడైన వ్యక్తికి ఇచ్చే గౌరవం ఇవ్వాలి. దశదిన కర్మ, సంతాప సభలు కూడా శోక సమావేశాల్లా కాకుండా... మృతుడైన వ్యక్తితో తమ అనుబంధాలను, గత స్మృతులను ఆత్మీయులు తలచుకొనేలా ఉండాలి. స్మారక చిహ్నాల్లాంటివాటిని కోరుకొనే ఉంటారు. వీటన్నిటికీ అయ్యే ఖర్చు కుటుంబానికి భారం కాకుండా ముందే ఆర్థికమైన ఏర్పాటు చేసుకుంటే మంచిది. ఇలాంటివి ఆలోచించడం కష్టంగాను, భయంగాను అనిపిస్తుంది. కానీ అవతార పురుషులకు కూడా మరణం తప్పలేదు. కాబట్టి జన్మ, కర్మ, మరణం, పునర్జన్మ అనేవి తప్పించుకోలేనివని గమనించాలి.

ఆత్మీయ సందేశం:

మనం మన జీవితకాలంలో ఎందరినో కలుసుకుంటాం. కానీ ఎన్నో సంఘటనలను మనకు అత్యంత సన్నిహితులైన బంధు మిత్రులతో పంచుకోం. మన అనుభవాలను, అనుభూతులను ఆడియో లేదా వీడియో రూపంలోని ఒక సందేశం ద్వారా... మరణానంతరం మన సన్నిహితులకు అందించేలా వినూత్నమైన ఆలోచన చేయవచ్చు. మీరు ప్రత్యక్షంగా చెప్పలేని విషయాలు... మీ తదనంతరం వారికి తెలియడం వల్ల మీపట్ల వారి ఆత్మీయత మరింత పెరుగుతుంది.

- డాక్టర్ బూర నర్సయ్య గౌడ్
మాజీ ఎంపీ

గీతాసారం

తటస్థతతోనే మనశ్శాంతి

'సుఖ దుఃఖే సమకృత్వా' అనే శ్లోకంలో... సుఖ దుఃఖాలను, లాభనష్టాలను, జయాపజయాలను సమానంగా భావించి యుద్ధానికి సిద్ధపడాలని అర్జునుడికి శ్రీకృష్ణుడు సూచించాడు. సమత్వానికి ఆయన ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇచ్చాడు. ఆ తరువాత "అయుక్తుడికి అంటే ఇంద్రియ నిగ్రహం లేనివాడికి ఆత్మ విషయకమైన బుద్ధి, ఆత్మ స్వరూపం తాలూకు భావన.. ఈ రెండూ కలగవు. ఫలితంగా అతనికి శాంతి ఉండదు. శాంతి లేనివారికి సంతోషం ఉండదు" అని 'నాస్తి బుద్ధి రయుక్తశ్య' అనే శ్లోకం ద్వారా బోధించాడు. దీనిలో సమత్వానికి సంబంధించిన మరో దృష్టి కోణం ఉంది. మనుషులు తమలో తమను స్థిరపరచుకొనేవరకూ... అంటే ఆత్మ వివేచన పొందే వరకూ... స్నేహితులు, శత్రువులు, ఉద్యోగం, జీవిత భాగస్వామి, పిల్లలు, డబ్బు, ఆనందం, అధికారం ఆస్తులు అనే వాటి మీద తమ మనుగడ కోసం ఆధారపడతారు. దృష్టి డబ్బు మీద కేంద్రీకృతం అయినవారి ప్రణాళికలన్నీ సంపదను పెంచుకోవడం చుట్టూ తిరుగుతాయి. దానికోసం ఆరోగ్యం, అనుబంధాలు లాంటి అన్ని విషయాలనూ పణంగా పెడతారు. సుఖమే ప్రధానం అనుకున్నవారు ఆ సుఖాన్ని పొందడం కోసం ఇతరులను మోసం చేయడానికి వెనుకాడరు. శత్రుత్వమే ప్రధానంగా భావించేవారు తమ శత్రువులను ఎలా దెబ్బ తీయాలా? అని ఆలోచిస్తారు. మనం ఇతరులతో ముడిపడి ఉన్నప్పుడు... మన శాంతి వారి చేతుల్లో ఉంటుంది. మనల్ని వారి మీద ఆధారపడేలా చేస్తుంది. అందుకే మనం మధ్యలో కేంద్రీకృతమై ఉండే సమస్థితి గురించి శ్రీకృష్ణుడు నొక్కి చెప్పాడు. ఆ స్థితే మోక్షం.

> "ఇంద్రియ నిగ్రహం లేనివాడికి ఆత్మ విషయకమైన బుద్ధి, ఆత్మ స్వరూపం తాలూకు భావన కలగవు. ఫలితంగా అతనికి శాంతి ఉండదు. శాంతి లేనివారికి సంతోషం ఉండదు" అని 'నాస్తి బుద్ధి రయుక్తశ్య' అనే శ్లోకం ద్వారా శ్రీకృష్ణుడు బోధించాడు.

శ్రీకృష్ణుడు భగవద్గీతలో ఉపయోగించిన 'భావం' అనే పదాన్ని మనం



భావోద్వేగాలతో ముడిపెట్టి అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాం. ఎవరైనా వ్యక్తి లేదా వస్తువు 'నా' లేదా 'నేను'తో ముడిపడి ఉన్నప్పుడు... లోతైన భావోద్వేగాలు ప్రేరేపితమవుతాయి. లేదంటే కొన్నిసార్లు అవి మన హృదయాన్ని తాకనుకూడా తాకకపోవచ్చు. మన భావోద్వేగాలన్నీ వ్యక్తిపరమైనవని ఇది సూచిస్తుంది. అయితే శ్రీకృష్ణుడు చెబుతున్నది... సమానత్వం నుంచి ఉద్భవించే 'భావం' గురించి.. అది 'నేను' అనే భావనతో సంబంధం కలిగి ఉన్నా, లేకున్నా ఒకటిగానే ఉంటుంది. మన పరిసరాలు అప్రియంగా, అస్తవ్యస్తంగా, కలవరపెట్టేవిగా ఉండవచ్చు. కానీ తటస్థంగా ఉండడం ద్వారా అంతర్గత సామరస్యాన్ని పొందిన వ్యక్తిని అవి ప్రభావితం చేయలేవు. శ్రీకృష్ణుడు దాన్నే 'శాంతిని పొందడం' అని సూచించాడు. అది అంతిమంగా మనకు ఆనందాన్ని ఇస్తుంది.



కె. శివప్రసాద్
ఐఎఎస్

జూలై జీఎస్‌టీ ఆదాయం రూ.1.82 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: జూలైలో వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) స్థూల ఆదాయం వార్షిక ప్రాతిపదికన 10.3 శాతం వృద్ధితో రూ.1.82 లక్షల కోట్లకు చేరుకుంది. జీఎస్‌టీ చట్టం అమలులోకి వచ్చిన (2017 జూలై నుంచి) ఏడేళ్లలో ఇది మూడో అత్యధిక నెలవారీ వసూలు. గత నెలలో పన్ను రిఫండ్లు రూ.16,283 కోట్లుగా నమోదయ్యాయి. రిఫండ్లు మినహాయించగా.. నికర జీఎస్‌టీ వసూళ్లు 14.4 శాతం వృద్ధితో రూ.1.66 లక్షల కోట్లుగా ఉన్నాయి. మొత్తం జీఎస్‌టీ ఆదాయం రూ.1,82,075 కోట్లలో సెంట్రల్ జీఎస్‌టీ రూ.32,386 కోట్లు, స్టేట్ జీఎస్‌టీ రూ.40,289 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.96,447 కోట్లుగా ఉన్నాయి. సెస్సు రూపంలో మరో రూ.12,953 కోట్లు సమకూరాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసికంలో జీఎస్‌టీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 10.2 శాతం వృద్ధి చెంది రూ.7.39 లక్షల కోట్లకు చేరుకుంది.ఈ ఏడాది ఏప్రిల్‌లో జీఎస్‌టీ వసూళ్లు ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.2.10 లక్షల కోట్లకు పెరగగా.. 2023 ఏప్రిల్‌లో రెండో అత్యధిక స్థాయి రూ.1.87 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.

ఆంధ్రప్రదేశ్ ఆదాయం రూ.3,346 కోట్లు

గత నెలకు తెలంగాణ జీఎస్‌టీ ఆదాయం 2 శాతం పెరిగి రూ.4,940 కోట్లుగా, ఏపీ జీఎస్‌టీ రాబడి 7 శాతం తగ్గి రూ.3,346 కోట్లుగా నమోదయ్యాయి.

ఇన్ఫోసిస్ జీఎస్‌టీ నోటీసులు వెనక్కి

బెంగళూరు: పన్నుల ఎగవేతకు సంబంధించి రూ.32,000 కోట్లు చెల్లించాలని ఇన్ఫోసిస్‌కు జారీ చేసిన ప్రీ-షోకాజ్ నోటీసుల్ని కర్ణాటక ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. బెంగళూరులోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్‌టీ ఇంటెలిజెన్స్ నుంచి ఈ మేరకు సమాచారం అందినట్టు ఇన్ఫోసిస్ తెలిపింది. అయితే దీనికి సంబంధించి కంపెనీ మరిన్ని వివరాలు అందజేయాలని కోరింది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్‌టీ ఇంటలిజెన్స్ బుధవారం జారీ చేసిన ఈ నోటీసు కార్పొరేట్ రంగంలో ప్రకంపనలు సృష్టించింది. నిబంధనలు తుచ తప్పక పాటించే ఇన్ఫోసిస్‌కు ఇలా నోటీసులు జారీ చేయడాన్ని అనేక మంది తప్పు పట్టారు. కంపెనీ మాజీ సీఎఫ్‌ఓ మోహన్‌దాస్ పాయ్ అయితే దీన్ని 'పన్ను టెర్రరిజం'గా అభివర్ణించారు. ఈ విమర్శలతో కర్ణాటక ప్రభుత్వం ఈ విషయంలో వెనక్కి తగ్గినట్టు భావిస్తున్నారు.

ఏథర్ ఎనర్జీతో అమరరాజా ఒప్పందం

బెంగళూరు: అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ (ఏఆర్‌ఈఎం) పూర్తి యాజమాన్య కంపెనీ అయిన అమరరాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీస్ (ఏఆర్‌ఏసీటీ) ఏథర్ ఎనర్జీతో ఒక అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేసింది. ఈ ఒప్పందం కింద తెలంగాణలోని దివిటిపల్లిలో రానున్న తమ గిగా ఫ్యాక్టరీలో ఎన్‌ఎంసీ (నికెల్ మాంగనీస్ కోబాల్ట్), ఎల్‌ఎఫ్‌పీ (లిథియం ఐరన్ ఫాస్పేట్), లిథియం అయాన్ (లై-అయాన్) వంటి ఆధునిక రసాయనిక బ్యాటరీలు ఉత్పత్తి చేయడంలో ఉభయ సంస్థలు సహకరించుకుంటాయి. భారతదేశం స్వచ్ఛ, హరిత ఇంధనాల వినియోగానికి మారుతున్న నేపథ్యంలో ఆటోమొబైల్ పరిశ్రమ విద్యుత్ వాహనాలు ప్రత్యేకించి విద్యుత్ టూవీలర్ల తయారీపై దృష్టి సారించింది. 2030 నాటికి విద్యుత్ టూవీలర్ల పరిశ్రమ 40 శాతం విస్తరిస్తుందని అంచనా. పెరుగుతున్న మార్కెట్ అవకాశాలు అందిపుచ్చుకునేందుకు అమరరాజా, ఏథర్ ఆశావహ ప్రణాళికలు రూపొందించుకున్న నేపథ్యంలో ఈ ఒప్పందం ఉభయ సంస్థలకు కీలకం కానుంది. ఏథర్ ఎనర్జీకి కర్ణాటకలోని హోసూరు, తమిళనాడుల్లో రెండు తయారీ ప్లాంట్లు పని చేస్తున్నాయి. మహారాష్ట్రలో మరో ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్టు ఇటీవలే ప్రకటించింది. అమరరాజా కూడా ఇ-మొబిలిటీ రంగానికి అవసరం అయిన ఉత్పత్తులు, సొల్యూషన్లు అందించేందుకు కట్టుబడి ఉంది. ఇదిలా ఉండగా లిథియం అయాన్ సెల్స్‌ను భారతదేశంలోని పరిస్థితులకు అనుగుణంగా తయారుచేసేందుకు వీలుగా ఎల్‌ఎఫ్‌పీ టెక్నాలజీని లోకలైజ్ చేసేందుకు జీబీటీతో అమరరాజా ఇటీవల ఒప్పందం కుదుర్చుకుంది. జీబీటీతో తాము ఇటీవల కుదుర్చుకున్న ఒప్పందంతో పాటు తాజాగా ఏథర్ ఎనర్జీతో కుదుర్చుకున్నం ఒప్పందం వల్ల ఈవీ మార్కెట్‌కు అవసరమైన సొల్యూషన్లు అందించేందుకు తాము చేస్తున్న కృషికి మరింత బలం చేకూరుతుందని ఏఆర్‌ఈఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విక్రమాదిత్య గౌరినేని అన్నారు.

నిఫ్టీ @25,000

ఇంట్రాడేలో 82,000 స్థాయికి సెన్సెక్స్



ముంబై: స్టాక్ మార్కెట్ వరుసగా ఐదో రోజూ సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించింది. ఎన్ఎస్ఈ ప్రధాన సూచీ నిఫ్టీ తొలిసారిగా 25,000 మైలురాయిని దాటగా.. ఇంట్రాడేలో సెన్సెక్స్ 82,000 స్థాయిని చేరుకుంది. సెప్టెంబరు నుంచి వడ్డీరేట్లను తగ్గిస్తామని యూఎస్ ఫెడరల్ రిజర్వ్ సంకేతాలిచ్చిన నేపథ్యంలో ఇన్వెస్టర్లు బ్యాంకింగ్, ఆయిల్ రంగ షేర్లలో కొనుగోళ్లకు పాల్పడటం ఇందుకు దోహదపడింది. సెన్సెక్స్ ఆరంభ ట్రేడింగ్‌లో 388.15 పాయింట్ల వరకు పెరిగి 82,129.49 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. అయితే, ఐరోపా, ఆసియా మార్కెట్ల బలహీన సంకేతాలు, పశ్చిమాసియాలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా మన సూచీలూ క్రమంగా తగ్గుతూ వచ్చాయి. మధ్యాహ్నం సెషన్‌లో లాభ, నష్టాల మధ్య దోబూచులాడిన సెన్సెక్స్. చివరికి 126.21 పాయింట్ల పెరుగుదలతో జీవితకాల గరిష్ఠ స్థాయి 81,867.55 వద్ద స్థిరపడింది. ప్రారంభ ట్రేడింగ్‌లో 127.15 పాయింట్ల వరకు పెరిగి 25,078.30 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసిన నిఫ్టీ చివరికి 59.75 పాయింట్ల లాభంతో 25,010.90 వద్ద క్లోజైంది. నిఫ్టీ 25000 పైన ముగియడం ఇదే ప్రథమం.

24 రోజుల్లో 1,000 పాయింట్ల వృద్ధి

కేవలం 24 ట్రేడింగ్ సెషన్లలో నిఫ్టీ 24,000 నుంచి 25,000 స్థాయికి చేరుకుంది. సూచీకిది మూడో అత్యంత వేగవంతమైన 1,000 పాయింట్ల వృద్ధి. నిఫ్టీ 23,000 నుంచి 24,000కు 23 సెషన్లలో పుంజుకుంది. అది రెండో అత్యంత వేగవంతమైన ర్యాలీ. కాగా, 2021 ఆగస్టులో సూచీ కేవలం 19 ట్రేడింగ్ సెషన్లలో 16,000 నుంచి 17,000 పాయింట్లకు ఎగబాకింది. ఇప్పటివరకు సూచీకిదే అత్యంత వేగవంతమైన 1,000 పాయింట్ల వృద్ధి.

కీలక మైలురాళ్లివే...

5,000	2007 సెప్టెంబరు 27
10,000	2017 జూలై 25
15,000	2021 ఫిబ్రవరి 5
20,000	2023 సెప్టెంబరు 11
21,000	2023 డిసెంబరు 14
22,000	2024 జనవరి 15
23,000	2024 మే 25
24,000	2024 జూన్ 27
25,000	2024 ఆగస్టు 1

221 రోజుల్లో 5,000 పాయింట్ల ర్యాలీ

గత ఏడాది సెప్టెంబరు 11న తొలిసారిగా 20,000 మైలురాయికి చేరిన నిఫ్టీ.. గడిచిన 221 ట్రేడింగ్ సెషన్లలో 5,000 పాయింట్లు పెరిగి 25,000 స్థాయికి అధిరోహించింది. ఈ ర్యాలీలో సూచీలోని 50 కంపెనీల షేర్లలో 45 పాజిటివ్ రిటర్నులు పంచాయి. ఆటో, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాల షేర్లు టాప్ గెయినర్లుగా నిలిచాయి. నిఫ్టీ 50 సూచీని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజి 1,000 బేస్ పాయింట్లతో 1,996 ఏప్రిల్ 22న ప్రారంభించింది.

ఐపీఓకు హీరో ఫిన్‌కార్ప్

హీరోమోటోకార్ప్ ఆర్థిక సేవల విభాగం హీరో ఫిన్‌కార్ప్ ఐపీఓకు సిద్ధమైంది. ఐపీఓ ద్వారా రూ.3,668 కోట్ల వరకు సమీకరించేందుకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా సంస్థ రూ.2,100 కోట్ల తాజా ఈక్విటీ జారీతోపాటు ఇన్వెస్టర్లకు చెందిన రూ.1,568 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించాలనుకుంటోంది.

ఫస్ట్ క్రై ఇష్యూ ధర రూ.440-465

- ఫస్ట్ క్రై మాతృసంస్థ బ్రెయిన్‌బీస్ సొల్యూషన్స్ లిమిటెడ్ వచ్చే నెల 6న విడుదల చేయనున్న ఐపీఓలో ధరల శ్రేణిని రూ.440-465గా నిర్ణయించింది. తద్వారా రూ.4,194 కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉంది.
- అదే రోజు విడుదల కానున్న యూనికామర్స్ ఈ-సొల్యూషన్స్ లిమిటెడ్ ఐపీఓ ధరల శ్రేణిని రూ.102-108గా నిర్ణయించింది.

టాప్‌గేర్‌లో టాటా మోటార్స్ లాభం

న్యూఢిల్లీ: టాటా మోటార్స్ వర్తమాన ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.5,566 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 74 శాతం ఎక్కువ. ఇదే సమయంలో కంపెనీ ఆదాయం సైతం రూ.1,03,597 కోట్ల నుంచి రూ.1,09,623 కోట్లకు పెరిగింది. అనుబంధ కంపెనీలను మినహాయించినా (స్టాండ్ అలోన్) టాటా మోటార్స్ రూ.2,190 కోట్ల నికర లాభం నమోదు చేసింది.

ఐటీసీ లాభం రూ.4917 కోట్లు

కోల్‌కతా: ఐటీసీ తొలి త్రైమాసిక ఫలితాలు మార్కెట్‌ను నిరాశ పరిచాయి. ఈ కాలానికి కంపెనీ స్టాండ్ అలోన్ లాభం రూ.4,917.45 కోట్లుగా నమోదయింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.4,902.74 కోట్లతో పోలిస్తే ఇది కేవలం 0.3 శాతం మాత్రమే ఎక్కువ. కంపెనీ ఆదాయం రూ.17,704.23 కోట్ల నుంచి రూ.18,921.01 కోట్లకు చేరింది.

అదానీ ఎంటర్‌ప్రైజెస్ లాభాలు అదుర్స్

న్యూఢిల్లీ: అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏఈఎల్) జూన్ త్రైమాసికానికి రూ.1,458 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.675 కోట్లతో పోలిస్తే ఇది 116 శాతం ఎక్కువ. ఇదే సమయంలో కంపెనీ ఆదాయం కూడా 13 శాతం వృద్ధితో రూ.26,067 కోట్లకు చేరింది. ఇదిలా ఉండగా ఏఈఎల్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్న డేటా కేంద్రం పూర్తి కావస్తున్నట్టు తెలిపింది. ఇప్పటి వరకు ఈ కేంద్ర నిర్మాణం 94 శాతం పూర్తయినట్టు కంపెనీ తెలిపింది. గురువారం సమావేశమైన ఏఈఎల్ బోర్డు మరో కీలక నిర్ణయం తీసుకుంది. కంపెనీకి చెందిన ఆహార ఎఫ్ఎంసీజీ వ్యాపారాన్ని అదానీ విల్‌మార్ కంపెనీకి బదిలీ చేసేందుకు ఆమోదం తెలిపింది.

ఆటో మార్కెట్ జోరుకు బ్రేక్



న్యూఢిల్లీ: దేశంలోని ప్రముఖ కార్ల తయారీ కంపెనీలన్నింటి అమ్మకాలు జూలై నెలలో నిరాశావహంగా ఉన్నాయి. ప్రధానంగా అగ్రగామి కంపెనీలు మారుతి సుజుకీ, హ్యుండయ్, టాటా మోటార్స్ అమ్మకాల్లో క్షీణత నమోదు చేశాయి. వాహనాలకు డిమాండు తగ్గడం ఇందుకు కారణం. జూలై నెలలో మారుతి 1,37,463 కార్లు విక్రయించింది. గత ఏడాది ఇదే నెలలో నమోదైన విక్రయాలు 1,52,126తో పోల్చితే అమ్మకాల్లో 9.64 శాతం క్షీణత నమోదయింది. ప్రధానంగా మినీ సెగ్మెంట్‌లోకి వచ్చే ఆల్టో, ఎస్-ప్రెసో కార్ల అమ్మకాలు 9590 నుంచి 9960కి పెరిగాయి. కాని కాంపాక్ట్, యుటిలిటీ కార్ల అమ్మకాలు తగ్గాయి. ఇదిలా ఉండగా ఫ్యాక్టరీ నుంచి డీలర్లకు పంపిన వాహనాల సంఖ్య జూలై నెలలో 3 శాతం తగ్గి 50,701 యూనిట్ల నుంచి 49,013 యూనిట్లకు తగ్గిందని హ్యుండయ్ మోటార్ ఇండియా ప్రకటించింది. టాటా మోటార్స్ 70,161 కార్లు విక్రయించింది. గత ఏడాది ఇదే నెలలో జరిగిన 78,844 అమ్మకాలతో పోల్చితే 11 శాతం క్షీణత నమోదయింది.

టూ వీలర్ల జోరు: ద్విచక్ర వాహనాల అమ్మకాలు మాత్రం జోరుగానే సాగాయి. బజాజ్ ఆటో 2,10,997 వాహనాలు విక్రయించింది. గత ఏడాది జూలైతో (1,79,263 యూనిట్లు) పోల్చితే అమ్మకాలు 18 శాతం పెరిగాయి.

- టీవీఎస్ మోటార్ కంపెనీ అమ్మకాల్లో 8 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఈ కంపెనీ అమ్మకాలు 2,35,230 నుంచి 2,54,250కి పెరిగాయి.
- హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా అమ్మకాలు 41 శాతం పెరిగి 4,39,118 యూనిట్లకు చేరాయి.

బిజినెస్

ఐడీబీఐ బ్యాంకు రేసులో కోటక్ బ్యాంకు !

న్యూఢిల్లీ: ఐడీబీఐ బ్యాంకు ఈక్విటీలో మెజారిటీ వాటా కొనుగోలు చేసేందుకు కోటక్ మహీంద్రా బ్యాంకు ఆసక్తి చూపిస్తున్నట్టు సమాచారం. ఇందుకోసం బిడ్డింగ్‌లో కూడా పాల్గొంది. ఈ బ్యాంకు ఈక్విటీలో కేంద్ర ప్రభుత్వానికి 45.48 శాతం, ఎల్ఐసీకి 49.24 శాతం వాటా ఉంది. ఇందులో మేనేజ్‌మెంట్ కంట్రోల్‌తో 60.7 శాతం వాటా అమ్మకానికి ప్రభుత్వం బిడ్లు ఆహ్వానించింది. దీంతో కోటక్ బ్యాంకుతో పాటు ప్రవాస భారత బిలియనీర్ ప్రేమ్ వత్సా నేతృత్వంలోని ఫెయిర్‌ఫాక్స్ ఇండియా, యూఏఈకి చెందిన ఎమిరేట్స్ ఎన్‌డీబీ సంస్థలు ప్రాథమిక బిడ్స్ ఫైల్ చేశాయి. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈ బిడ్స్‌కు ఇప్పటికే క్లియరెన్స్ ఇచ్చింది. ఆర్‌బీఐ అనుమతి ఒక్కటే మిగిలి ఉంది. త్వరలోనే ఆర్‌బీఐ నుంచి కూడా అనుమతి లభిస్తుందని భావిస్తున్నారు. అపుడు ఈ మూడు సంస్థలు తమ తుది బిడ్స్ సమర్పించాలి. అయితే ఈ వార్తలపై ఈ మూడు సంస్థలు అధికారికంగా నోరు మెదపడం లేదు. ఈ ప్రయత్నంలో విజయవంతమైతే కోటక్ బ్యాంకుకు ఐఎన్‌జీ వైశ్యా బ్యాంకు తర్వాత ఇది రెండో కొనుగోలు అవుతుంది.

బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ వడ్డీరేటు తగ్గింపు

లండన్: యూరో జోన్‌లో వడ్డీరేట్ల తగ్గింపు ప్రారంభమైంది. స్వల్ప కాలిక వడ్డీరేటును బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ (బీఓఈ) 5.25 శాతం నుంచి ఐదు శాతానికి తగ్గించింది. 2020 కొవిడ్ తర్వాత బీఓఈ వడ్డీ రేట్లు తగ్గించడం ఇదే మొదటిసారి. రిటైల్ ద్రవ్యోల్బణం నిర్దీత రెండు శాతానికి రావడంతో ఈ చర్య తీసుకున్నట్టు బీఓఈ గవర్నర్ ఆండ్రూ బెయిలీ చెప్పారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	70,360 ▲	64,500 ▲	91,700 ▲
ముంబై	69,720 ▲	63,860 ▲	83,460 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



2వ తేదీ			
హైదరాబాద్	440	విజయవాడ	450
వరంగల్	442	గోదావరి	440
చిత్తూరు	513	విశాఖపట్నం	450
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	87	విజయవాడ	92
వరంగల్	87	గుంటూరు	92
కరీంనగర్	87	ఒంగోలు	92
మహబూబ్‌నగర్	87	చిత్తూరు	106
కర్నూలు	87	నెల్లూరు	106
విశాఖపట్నం	86	అనంతపురం	92
గోదావరి	92		

రాష్ట్ర పీపీగా మెండ లక్ష్మీనారాయణ బాధ్యతలు స్వీకరణ



అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మెండ లక్ష్మీనారాయణ హైకోర్టులోని తన చాంబర్‌లో గురువారం బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టుకు సతీ సమేతంగా వచ్చిన లక్ష్మీనారాయణ... కుటుంబ సభ్యులు, న్యాయవాదుల సమక్షంలో కార్యాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆ తరువాత అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు, కుటుంబ స భ్యులు, శ్రేయోభిలాషులు, హైకోర్టు న్యాయవాదుల సమక్షంలో పీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు లక్ష్మీనారాయణకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర చరిత్రలోనే మొదటిసారి ఓ బీసీని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

వాసుదేవరెడ్డికి 41(ఏ) నోటీసులు ఇస్తాం

- హైకోర్టుకు నివేదించిన ప్రభుత్వ న్యాయవాది
- అర్నేశ్ కుమార్ కేసులో సుప్రీం మార్గదర్శకాలు పాటించండి
- పోలీసులకు హైకోర్టు స్పష్టీకరణ

అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): లిక్కర్ గోడౌన్‌ను ఖాళీ చేయాలని బెదిరించారనే ఆరోపణలతో గుడివాడ పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ బెవరేజెస్ కార్పొరేషన్ పూర్వ ఎండీ వాసుదేవరెడ్డి దాఖలు చేసిన పిటిషన్ గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది. పోలీసుల తరఫున ప్రభుత్వ న్యాయవాది కేఎం కృష్ణారెడ్డి వాదనలు వినిపిస్తూ... పిటిషనర్‌పై నమోదు చేసిన సెక్షన్లు అన్నీ ఏడేళ్లలోపు శిక్షకు వీలున్నవేనన్నారు. సీఆర్పీసీ సెక్షన్ 41(ఏ) కింద నోటీసులు ఇవ్వాలని పోలీసులు నిర్ణయానికి వచ్చారన్నారు. ఈ వాదనలు పరిగణలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ పిటిషనర్ విషయంలో అర్నేశ్ కుమార్ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను పాటించాలని పోలీసులను ఆదేశించారు. లిక్కర్ గోడౌన్ లైసెన్స్ లీజు ఒప్పందం ముగియక ముందే బలవంతంగా ఖాళీ చేయించి తన తల్లి మరణానికి కారణమయ్యారని పేర్కొంటూ దుగ్గిరాల ప్రభాకర్ గుడివాడ రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా మాజీ మంత్రి కొడాలి నాని, బెవరేజ్ కార్పొరేషన్ పూర్వ ఎండీ వాసుదేవరెడ్డి తదితరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వాసుదేవరెడ్డి హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.

సాగు మీటర్లకు చెక్!

- రైతులకు మేలు చేసేలా 'పీఎం కుసుమ్'
- ఈ పథకం ద్వారా ఉచిత సోలార్ విద్యుత్
- టీడీపీ కూటమి ప్రభుత్వం యోచన
- గత ప్రభుత్వంలో 18 లక్షల పంప్‌సెట్లకు 4000 కోట్లతో మీటర్లు బిగించాలని నిర్ణయం
- 7,000 మెగావాట్ల కొనుగోలుకూ ఒప్పందం
- షిర్డీ సాయి, సెకీ ఒప్పందాలపై త్వరలో సమీక్ష

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ ప్రభుత్వంలో అస్మదీయులకు ఆర్థిక లబ్ధిని చేకూర్చడం ద్వారా రాష్ట్రంపై తీవ్ర ఆర్థిక భారం పడేలా తీసుకున్న ప్రధాన నిర్ణయాలపై పునఃసమీక్ష చేసేందుకు ఇంధన శాఖ సిద్ధమవుతోంది. రాష్ట్ర విద్యుత్ సంస్థలు, వినియోగదారులపై మోయలేని భారం వేసేలా తీసుకున్న నిర్ణయాలపై హేతుబద్ధమైన నిర్ణయం తీసుకోవాలని భావిస్తోంది. రాష్ట్రంలోని 18 లక్షల వ్యవసాయ పంప్‌సెట్లకు రూ.4,000 కోట్లతో స్మార్ట్ మీటర్లను బిగించే కార్యక్రమాన్ని ఆపేసి రైతులకు మేలు చేయాలన్న యోచనలో ప్రభుత్వం ఉంది. కేంద్రం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి కిసాన్ ఉర్జా ఏవమ్ సురక్షా ఉత్థాన్ మహాభియాన్ (పీఎం కుసుమ్) పథకాన్ని అమలు చేయడం ద్వారా రాష్ట్రంలోని రైతులందరికీ ప్రయోజనం కల్పించాలని భావిస్తోంది. ఈ పథకం వద్దని గతంలో జగన్ ప్రభుత్వం కేంద్రానికి చెప్పింది. సాగు మీటర్ల బిగింపు కాంట్రాక్టును అస్మదీయ కంపెనీకి ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకుందనే విమర్శలున్నాయి. గుజరాత్‌లో పీఎం కుసుమ్ పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తుండటం, ఏపీలో కూటమి ప్రభుత్వం రావడంతో రాష్ట్రంలో ఈ పథకం అమలు చేసే దిశగా మళ్లీ కదలిక వచ్చింది. ఈ పథకం కింద రాష్ట్రంలోని వ్యవసాయ పంప్ సెట్లకు సోలార్ విద్యుత్‌ను అందించేలా వ్యవసాయ యోగ్యం కాని భూముల్లో 10,000 మెగావాట్ల దాకా గ్రిడ్ కనెక్టెడ్ రెన్యువబుల్ ఎనర్జీ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేందుకు (ఆర్ఈపీపీ) కేంద్రం అనుమతులు ఇస్తోంది. అదే విధంగా వాటర్ యూజర్స్ అసోసియేషన్లు, కొంతమంది రైతులు గ్రూపుగా, వ్యక్తిగతంగానూ 500 కిలోవాట్ల నుంచి 2 మెగావాట్ల దాకా సోలార్ ఆధారిత ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు సహకారం అందిస్తుంది. ఈ పథకం కింద కిలోవాట్‌కు 60 పైసలు లేదా మెగావాట్‌కు ఆరు లక్షల రూపాయలను చెల్లించేందుకు కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ ఆమోదించింది. 17.5 లక్షల వ్యవసాయ పంప్ సెట్లకు పీఎం కుసుమ్ పథకాన్ని అమలు చేయాలని కేంద్రం లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ పథకాన్ని అమలు చేస్తే డిస్కమ్‌ల నుంచి అధిక ధరలతో కూడిన విద్యుత్‌ను రైతులు తీసుకునే అవసరం ఉండదని కేంద్రం చెబుతోంది. రాష్ట్రంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ పథకాన్ని అందిస్తున్నా, విద్యుత్ వినియోగానికి అయ్యే భారాన్ని డిస్కమ్‌లకు ప్రభుత్వం చెల్లిస్తోంది. పీఎం కుసుమ్ పథకాన్ని అమలు చేస్తే జీవితాంతం రైతులకు ఉచిత సోలార్ విద్యుత్ అందుతుందని, పగటిపూట సౌర విద్యుత్ ద్వారా పంప్‌సెట్లను వాడుకోవచ్చని కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ చెబుతోంది.

అస్మదీయులకు కాంట్రాక్టులు

జగన్ సీఎంగా ఉన్నప్పుడు అస్మదీయ సంస్థ షిర్డీ సాయికి ఆర్థిక లబ్ధిని చేకూర్చేందుకు వీలుగా వ్యవసాయ పంప్ సెంట్లకు స్మార్ట్ మీటర్లను బిగించే కార్యక్రమానికి ప్రణాళిక రచించారు. కేంద్రం అమలు చేస్తున్న రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్‌డీఎస్ఎస్)ను తెరపైకి తీసుకువచ్చారు. గత ఏడాది గృహాలకు, వ్యవసాయ పంప్‌సెట్లకు మీటర్లను బిగించేందుకు డిస్కమ్‌లు టెండర్లను పిలిచాయి. పట్టణాల్లో మీటర్లు బిగించే పనులను అదానీ, రాష్ట్రంలోని 18 లక్షల వ్యవసాయ పంప్ సెట్లకు మీటర్లు బిగించే బాధ్యతలను షిర్డీ సాయి దక్కించుకుంది. ఒక్కో వ్యవసాయ పంప్‌సెట్‌కు స్మార్ట్ మీటరు బిగించేందుకు రూ.6,000 ధరను కేంద్రం ఖరారు చేసింది. ఈ పథకం కోసం రూ.4,000 కోట్ల వ్యయం అవుతుందని అంచనా. ఇప్పటికే శ్రీకాకుళం జిల్లాలో ప్రయోగాత్మకంగా వ్యవసాయ పంప్‌సెట్లకు మీటర్లను బిగించారు. నెలవారీ కరెంటు బిల్లుల మొత్తాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో వేస్తామని, వాటిని డిస్కమ్‌లకు క్రమం తప్పకుండా రైతులు చెల్లించాలని గత ప్రభుత్వం చెప్పింది. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల అమలు కోసం డిస్కమ్‌లు రూ.14,000 కోట్ల మేర రుణాన్ని పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా తీసుకుంది. ఈ భారాన్ని ఎలా మోయాలో, ఏం చేయాలో డిస్కమ్‌లకు అర్థం కావడంలేదు.

సెకీకి లేఖ రాసే యోచన

డిస్కమ్‌లపై 25 ఏళ్లకు దాదాపు రూ.75,000 కోట్ల భారం పడేలా సోలార్ ఎనర్జీ కార్పొరేషన్‌తో గత ప్రభుత్వంలో విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని చేసుకున్నారు. ఈ ఒప్పందం మేరకు సెకీ ఈ ఏడాది సెప్టెంబరులో 3,000 మెగావాట్లు, వచ్చే ఏడాది మరో 3,000 మెగావాట్లు, 2026లో మిగిలిన వెయ్యి మెగావాట్లను రాష్ట్రానికి సరఫరా చేయాల్సి ఉంది. రాష్ట్రంలో పీఎం కుసుమ్ పథకాన్ని అమలుచేస్తే సెకీతో 7,000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందం అమలు చేయాల్సిన అవసరం ఉండదని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ఒప్పందం మేరకు సెప్టెంబరు నుంచే తొలిదశ విద్యుత్‌ను సరఫరా చేస్తారా లేక జాప్యం అవుతుందా అని సోలార్ ఎనర్జీ కార్పొరేషన్‌కు ప్రభుత్వం లేఖ రాసే యోచనలో ఉందని చెబుతున్నారు. ఒకవేళ తీవ్ర జాప్యమైతే ఒప్పందాన్ని ఎందుకు రద్దు చేసుకోకూడదంటూ సెకీని ప్రశ్నించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని తెలుస్తోంది.

శ్రీవారి సేవలకు ఒకే నంబరు, ఐడీతో బల్క్ బుకింగ్స్

- టీటీడీ ఐటీలో భారీగా వెలుగు చూస్తున్న అక్రమాలు
- నకిలీ వివరాలతో భారీగా టికెట్లు పొందినట్టు గుర్తింపు
- విచారణలో గుర్తించిన నంబర్లు, ఐడీలు బ్లాక్
- అక్రమాలకు తావు లేకుండా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు

తిరుమల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం మారిన వెంటనే తీసుకున్న చర్యలతో టీటీడీ ఐటీ విభాగంలో భారీ అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు టీటీడీ అందించే దర్శనం, వసతి, ఆర్జిత సేవలు దళారుల ప్రమేయం లేకుండా మరింత పారదర్శకంగా నేరుగా అందించేందుకు ఈవో శ్యామలరావు చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆఫ్‌లైన్ (కౌంటర్), ఆన్‌లైన్ (వెబ్‌పోర్టల్) రెండింటిలోనూ అందించే సేవలను మధ్యవర్తులు పొంది భక్తులను మోసం చేసి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్టు విచారణలో తేలింది. అలాగే కొంతమంది ఎలాగైనా సేవలను పొందాలని ఒకే మొబైల్ నంబర్, మెయిల్ ఐడీలు ఉపయోగించి బల్క్ బుకింగ్ పొందినట్టు గుర్తించారు. ఈ క్రమంలో గత ఏడాది కాలంలో జరిగిన లావాదేవీలను టీటీడీ వెలికి తీయగా అనేక అక్రమాలు బయటపడ్డాయి.

నంబరు ఒకటే.. వేలల్లో రిజిస్ట్రేషన్లు

శ్రీవారి ఆర్జిత సేవల లక్కీడిప్ కోసం టీటీడీ ప్రతినెలా ఆన్‌లైన్‌లో కోటా విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. విడుదలైన తొలి రెండు రోజుల్లో రిజిస్ట్రేషన్లు చేసుకుంటే ఆ తర్వాత కంప్యూటర్ ద్వారా డిప్‌లో సేవలు కేటాయిస్తారు. ఈ క్రమంలో టాప్ 100లో ఒకే నంబరు, మెయిల్, నకిలీ గుర్తింపు కార్డుల ద్వారా దాదాపు 21 వేల రిజిస్ట్రేషన్లు చేసినట్టు విచారణలో తేలింది. 182 లావాదేవీల ద్వారా 360 మంది సేవలు పొందారు. తిరుమలలో ఇచ్చే గదులను 124 నంబర్ల ద్వారా 2,811 మంది పొందారు. అలాగే తిరుపతిలో ఇచ్చే స్లాటెడ్ సర్వదర్శనం (ఎస్ఎస్‌డీ) టోకెన్లను నకిలీ గుర్తింపు కార్డులతో 1,031 మంది పొందారు. ఆన్‌లైన్‌లో ఒకే నంబరు, మెయిల్ ద్వారా ఆరు వేల గదుల కేటాయింపు జరిగింది. మరోవైపు ఆన్‌లైన్ రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కూడా ఇదే తరహాలో రెండు వేల ట్రాన్సాక్షన్స్ ద్వారా 9,500 మంది పొందినట్టు తేలింది. ఈ క్రమంలో బల్క్ బుకింగ్‌లకు ఉపయోగించిన మొబైల్ నంబర్లు, మెయిల్, ఐడీ ప్రూఫ్‌లను బ్లాక్ చేశారు. అలాగే జూలై వరకు ఇలా బుక్ చేసుకుని వచ్చి వెళ్లిన వారిని ఏం చేయలేరు కనుక ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు వరకు ఈ తరహాలో బుక్ చేసుకుని దర్శనానికి, సేవలకు, గదులు పొందేందుకు వచ్చే వారిని విచారించనున్నారు. ఇందులో అక్రమాలకు పాల్పడినట్టు నిర్ధారణ అయితే క్రిమినల్ కేసులు కూడా పెట్టాలని టీటీడీ భావిస్తోంది. ఇకపై ఇలాంటి అక్రమాలకు తావు లేకుండా టీటీడీ సాఫ్ట్‌వేర్లలో నూతన మార్పులను చేస్తున్నారు.

'పని దినాలు' పెంచినందుకు ప్రధానికి కృతజ్ఞతలు: పవన్ కల్యాణ్

అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పని దినాలు పెంపుదలకు అంగీకరించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి పవన్ కల్యాణ్ ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలియజేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధి హామీ పని దినాలు పెంచేందుకు కేంద్రం అంగీకారం తెలిపిందన్నారు. 21.5 కోట్ల పని దినాలకు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రతిపాదనలకు ఆమోదం లభించిందని, ఈ కారణంగా 53 లక్షల కుటుంబాలకు లబ్ధి కలగనుందన్నారు.

స్వప్నిల్‌కు అభినందనలు..

'పారిస్ ఒలింపిక్స్‌లో మన దేశానికి మరో పతకం దక్కడం సంతోషాన్ని కలిగించింది. 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ విభాగంలో కాంస్యం సాధించిన యువ షూటర్ స్వప్నిల్‌కు హృదయపూర్వక అభినందనలు. ఈ ఒలింపిక్స్‌లో మన క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నా' అని పవన్ పేర్కొన్నారు.

పునుగోడు బాధిత కుటుంబాలకు ఐదేసి లక్షలు

సీఎం ఆదేశాలతో పరిహారం అందజేసిన మంత్రి గొట్టిపాటి

అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): 'పునుగోడు' బాధిత కుటుంబాలకు గురువారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరిహారాన్ని అందించారు. ప్రకాశం జిల్లా కనిగిరి మండలం, పునుగోడులో జరిగిన ప్రమాదంలో బాలాజీ, షేక్ నజీర్ ఖాన్, వీరమాచి గౌతమ్ కుమార్ విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన విషయం తెలిసిందే. 23న జరిగిన ఈ ఘటనపై వెంటనే స్పందించిన సీఎం చంద్రబాబు బాధిత కుటుంబాలకు నష్టపరిహారాన్ని ప్రకటించారు. సీఎం ఆదేశాల మేరకు గురువారం మంత్రి గొట్టిపాటి బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.5 లక్షలు అందజేశారు.

ఒక్క రోజులోనే పింఛన్ల పంపిణీ

- 98 శాతం పూర్తి... 64 లక్షల మందికి 2,737 కోట్లు అందజేత
- సచివాలయ ఉద్యోగులతో రెండో నెలలోనూ విజయవంతం
- ముఖ్యమంత్రికి మనఃపూర్వక అభినందనలు: పవన్

అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక పెన్షన్ల పంపిణీ ఒక్క రోజులోనే దాదాపుగా పూర్తి చేశారు. సచివాలయ ఉద్యోగులు రెండో నెలలో కూడా పింఛన్ల పంపిణీని సమర్థంగా చేపట్టి సామాజిక పెన్షన్‌దారుల మన్ననలు పొందారు. మొదటి రోజు 98 శాతం పూర్తి చేయడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. 64 లక్షల మంది పెన్షన్ లబ్ధిదారులకు రూ.2737 కోట్లు అందించారు. వలంటీర్లు పంపిణీ చేస్తే తప్ప ఈ పంపిణీ సజావుగా సాగదన్న వైసీపీ ప్రభుత్వ వ్యాఖ్యల్లో వాస్తవం లేదని సచివాలయ ఉద్యోగులు నిరూపించారు. పింఛన్ల పంపిణీపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎన్డీయే కూటమి పాలన ప్రారంభమయ్యాక పెంచిన సామాజిక పింఛన్లను రెండో నెలలోనూ విజయవంతంగా లబ్ధిదారులకు ఇంటి దగ్గరే పంపిణీ చేశామని అన్నారు. గురువారం ఉదయం నుంచి ఇంటింటికి వెళ్లి అందించేలా సీఎం చంద్రబాబు రూపొందించిన కార్యక్రమం ప్రజలకు చేరువైందన్నారు. అందరూ హర్షించేలా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని తీసుకువచ్చిన ముఖ్యమంత్రికి మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేశారు. గత పాలకులు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అతలాకుతలం చేసినా ఎలాంటి ఆటంకాలు కలగకుండా సంక్షేమ పథకాలను ఈ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.

ఏడు కిలోమీటర్లు నడిచి.. కొండలెక్కి మరీ పింఛన్ల పంపిణీ

సాలూరు రూరల్, ఆగస్టు 1: పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలంలో గిరిశిఖర గ్రామాలకు ఏడు కిలోమీటర్లు నడిచి, కొండలెక్కి వంద శాతం పింఛన్లు అందించారు. ఏవోబీలో ఎత్తయిన గిరి శిఖరాల్లో ఉన్న కొదమ పంచాయతీలో చింతామల, లొద్ద, బందపాయి గ్రామాలకు పంచాయతీ కార్యదర్శి ఎర్రాయుడు ఏడు కిలోమీటర్లు నడిచి కొండలెక్కారు. చింతామల, లొద్ద, బందపాయిల్లో 97 మంది సామాజిక పింఛనుదారులు ఉండగా మధ్యాహ్నం లోపు వారందరికీ నగదు అందించారు. అలాగే కొండపై ఉన్న బొడ్డపాడు గ్రామానికి పంచాయతీ కార్యదర్శి బిడ్డిక తిరుమలదొర మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లి ఉదయం 10 గంటలకే పింఛన్లు ఇచ్చారు.



కొండపై ఉన్న చింతామలకు నడిచి వెళ్తున్న పంచాయతీ కార్యదర్శి ఎర్రాయుడు

నాడు జగన్ 35 మంది ప్రాణాలు తీశారు

- నేడు ఒకటో తేదీనే ఇంటింటికీ పింఛన్: టీడీపీ

అమరావతి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): 'ఎన్నికల సమయంలో జగన్ కావాలని పింఛనుదారులను మండుటెండలో తిప్పి 35 మంది వృద్ధుల ప్రాణాలు తీశారు. కూటమి ప్రభుత్వం ఇప్పుడు వలంటీర్లు లేకపోయినా ఏ ఒక్కరి ప్రాణం పోకుండా ఇంటింటికీ పింఛన్లు ఇవ్వగలుగుతోంది' అని టీడీపీ నేతలు అన్నారు. గురువారం పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. 'ఎన్నికల్లో ప్రయోజనం పొందడానికి జగన్ వయో వృద్ధుల ప్రాణాలు తీయడానికి వెనకాడలేదు. వలంటీర్లను కోర్టు తాత్కాలికంగా ఆపడంతో వారి స్థానంలో గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందితో ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేసే అవకాశం ఉన్నా జగన్ ఆ పని చేయలేదు. ఇప్పుడు వలంటీర్లు లేకపోయినా ప్రభుత్వ సిబ్బందితో మేం అవే పింఛన్లను ఇంటింటికీ పంపిణీ చేస్తున్నాం. రికార్డు స్థాయిలో మొదటి రోజే 95 శాతం పింఛన్లను ప్రజలకు పంపిణీ చేయించాం' అని దేవినేని ఉమా వ్యాఖ్యానించారు.

పెద్దిరెడ్డి అనుచరుల మరో భూ ఆక్రమణ

- టీడీపీ కేంద్ర కార్యాలయంలో బాధితుల ఫిర్యాదు
- ఇళ్లు, పింఛన్లు, ఆర్థిక సాయం కోరుతూ వినతులు

అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులు భూ ఆక్రమణకు పాల్పడ్డారని టీడీపీ కేంద్ర కార్యాలయానికి మరో ఫిర్యాదు అందింది. ప్రతిరోజూ నిర్వహిస్తున్న వినతుల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా అక్కడ నుంచి వచ్చిన బాధితులు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. గురువారం ప్రజల నుంచి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్సీలు అశోక్‌బాబు, రాంభూపాల్ రెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి మాల్యాద్రి వినతులు స్వీకరించారు. పుంగనూరు నియోజకవర్గం సుగాలి మెట్ట గ్రామానికి చెందిన గిరిజనుడు రాజశేఖర్ నాయక్ తన భూమిని పెద్దిరెడ్డి అనుచరుడైన స్థానిక జడ్పీటీసీ సభ్యుడు రాజు నాయక్, అతని సోదరుడు మునిస్వామి నాయక్ కలసి వారి పేరు మీదకు మార్చుకొన్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి తహసీల్దారు మాధవ రాజును కలిసి ఫిర్యాదు చేస్తే తమను బెదిరించారని వాపోయారు. రికార్డులు తారుమారు చేసి భూమిని ఆక్రమించుకొన్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

- సత్యసాయి జిల్లా తనకల్లు మండలం సింగిరివాండ్లపల్లిలో తమ భూమితో పాటు చీనీ చెట్లను కూడా కొందరు ఆక్రమించుకొన్నారని, అడిగితే దాడి చేస్తున్నారని పసుపులేటి మంగమ్మ ఫిర్యాదు చేశారు. తన భూమిని తమకు ఇప్పించాలని కోరారు.
- రాష్ట్రంలో అనేకచోట్ల భూమి యజమానులకు తెలియకుండా రికార్డుల్లో పేర్లు ఇష్టానుసారం మార్చిన ఘటనలు అనేకం జరిగాయని, వీటిని అరికట్టాలని శాఖమూరి నారాయణరావు వినతిపత్రం సమర్పించారు.
- ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం ముసునూరు మండలం చెక్కపల్లి గ్రామానికి చెందిన సర్వేషు తన భూమి ఆక్రమణకు గురైందని, ఆక్రమణదారుల చెర నుంచి దానిని విడిపించాలని కోరారు.
- పల్నాడు జిల్లా రెంటచింతల మండలానికి చెందిన డేగల రాజు తనకు మాచర్ల పట్టణంలో ఎమ్మార్వో ఆఫీసు ఎదురుగా ఎస్సీ కార్పొరేషన్‌కు చెందిన కాంప్లెక్స్‌లో షాపును గతంలో ప్రభుత్వం కేటాయిస్తే 2019 ఎన్నికల్లో టీడీపీ ఏజెంటుగా కూర్చున్నానన్న కారణంతో దానిని ఇవ్వలేదని ఫిర్యాదు చేశారు. తనకు షాపు ఇప్పించాలని కోరారు.
- దేవాలయాల్లో తాను చేసిన పనులకు బిల్లులు ఇవ్వాల్సి ఉండగా టీడీపీ సానుభూతిపరుడనే కారణంతో వాటిని నిలిపివేశారని, బిల్లులు ఇప్పించాలని శాఖమూరి ప్రసాదబాబు విజ్ఞప్తి చేశారు.
- వైసీపీ ప్రభుత్వ పాలనలో మీ-సేవా కేంద్రాలను మూతవేయడంతో 50వేల కుటుంబాలు ఉపాధి కోల్పోయాయని, వారిని ఆదుకోవాలని కేంద్రాల నిర్వాహకులు కోరారు.
- అన్ని మండలాల్లో ప్రత్యేకంగా ఎకనమిక్ గ్రోత్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేసి రైతులకు తోడ్పాటు నివ్వాలని, వ్యవసాయ శాఖ విశ్రాంత డీడీ షైల వరప్ర సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. దీనిపై తాను తయారు చేసిన ఒక నివేదికను ఆయన టీడీపీ నేతలకు అందచేశారు. ఇళ్లు, పింఛన్లు, ఆర్థిక సాయం కోరుతూ అనేకమంది వినతులు సమర్పించారు.

బీసీఏ, బీబీఏ ఫీజు రూ.18 వేలు..

అమరావతి : ఇంజనీరింగ్ కాలేజీల్లో బీసీఏ, బీబీఏ కోర్సులకు ఉన్నత విద్యాశాఖ ఫీజులు ఖరారు చేసింది. ఇంజనీరింగ్ కాలేజీలతో పాటు పలు డిగ్రీ కాలేజీలకు కలిపి మొత్తం 34 కాలేజీలకు ఫీజులు ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. అన్ని కాలేజీల్లో బీసీఏ, బీబీఏ కోర్సుల ఫీజును రూ.18 వేలుగా నిర్ణయించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఉద్యమానికి 'న్యాయం'

తెలుగు రాష్ట్రాల మాదిగలు ముప్పై సంవత్సరాలుగా చేస్తున్న పోరాటం విజయవంతమైంది. భారత ప్రధాన న్యాయమూర్తితో సహా ఏడుగురు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం గురువారం ఉదయం ఇచ్చిన చరిత్రాత్మక తీర్పుతో షెడ్యూల్డ్ కులాల, తెగల రిజర్వేషన్ల వర్గీకరణపై బిగుసుకున్న పీటముడి విడిపోయింది. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి చేసిన పోరాటం మాత్రమే కాదు, దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో తలెత్తిన ఇవే మోస్తరు డిమాండ్లు, జరిగిన జనాందోళనలు అన్నీ ఈ తీర్పుతో ఒక కీలకమయిన విజయం సాధించాయి. ఇప్పుడిక, రాష్ట్రాలు వాటి వాటి సొంత పరిస్థితులను బట్టి, ఎస్సీఎస్టీ తెగల రిజర్వేషన్లలో ఉప విభజన చేయవచ్చు. కాకపోతే, యథేచ్ఛగా, ఇష్టాయిష్టాలను బట్టి కాకుండా, వాస్తవమైన, లెక్కించదగిన సమాచారం ఆధారంగా మాత్రమే ఉపవిభజన జరగాలని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. ఈ తీర్పులో మరో ముఖ్యమైన అంశం, షెడ్యూల్డు కులాలు, తెగల రిజర్వేషన్లలో క్రీమీలేయర్ ప్రాతిపదికను అమలు చేయాలన్న ఆదేశం. రిజర్వేషన్లు అర్హులకే అందాలన్న విలువకు అనుగుణమైనది ఈ క్రీమీలేయర్ పరిగణన. షెడ్యూల్డ్ తెగల రిజర్వేషన్ల వర్గీకరణకు కూడా దారి సుగమం చేస్తున్న ఈ తీర్పువల్ల అనేక రాష్ట్రాలలో కొత్త ఆకాంక్షలు, ఆందోళనలు వ్యక్తంకావచ్చు.

న్యాయవివాదం వల్లనే వర్గీకరణ అంశం స్తంభించిపోవడం నిజమే కానీ, ఇది కేవలం లిటిగేషన్ మాత్రమే కాదు. దీని వెనుక ఎంతో ప్రజాపోరాట చరిత్ర ఉన్నది. వర్గీకరణ లేకపోవడం వల్ల తమకు జరుగుతున్న అన్యాయాన్ని తెలుగు రాష్ట్రాల మాదిగ సమాజం ఎలుగెత్తి చాటిన తరువాత, ఆ స్పందనను చూసి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చట్టం చేసి, దాని ప్రకారం రిజర్వేషన్లను కొంతకాలం అమలుచేశారు కూడా. దాని మీద న్యాయస్థానంలో దాఖలైన వ్యాజ్యమే 'ఇ.వి. చిన్నయ్య వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్.' 2004 నాటి ఈ కేసు తీర్పులో ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం వర్గీకరణ చెల్లదని చెప్పింది. రాజ్యాంగంలోని 341 అధికరణం షెడ్యూల్డు కులాల, తెగల జాబితా నిర్ణయాన్ని రాష్ట్రపతికి దఖలు పరిచిందని, దాన్ని రాష్ట్రాలు ఉల్లంఘించలేవని ఆ తీర్పు సారాంశం. ప్రస్తుతం పంజాబ్ ప్రభుత్వం వేసిన వ్యాజ్యం మీద ఇచ్చిన తీర్పులో ఈ 2004 నాటి తీర్పునే తప్పు పట్టారు. వర్గీకరణ అన్నది జాబితాను సవరించడం కాదని, అణగారిన తరగతులు ఏకరూప తరగతులు కావని, వాటిలోనూ అంతరాలు ఉంటాయని, ఏ రకంగానూ వర్గీకరణ రాజ్యాంగ నియమాలను ఉల్లంఘించినట్టు కాదని చెబుతూ, షెడ్యూల్డు కులాలు, తెగల రిజర్వేషన్లలో రాష్ట్రాలు ఉపవిభజన చేసుకోవచ్చునని చెప్పింది. చిన్నయ్య కేసులో ఇచ్చిన తీర్పుతో విభేదిస్తున్నామని ఈ కేసులో ఐదుగురు సభ్యుల బెంచి 2020లోనే అభిప్రాయపడడంతో, ఈ వ్యాజ్యాన్ని ఏడుగురు సభ్యుల బెంచికి నివేదించారు.

సమాజంలో అట్టడుగు, బడుగు వర్గాలకు రిజర్వేషన్లు కల్పించడానికి ఉన్న సమర్థనలే ఉపవిభజనకు కూడా వర్తిస్తాయి. మంద కృష్ణ మాదిగ చెప్పినట్టు, వర్గీకరణ అన్నది దోపిడీ పీడనలకు సంబంధించినది కాదు. అసమానతలకు సంబంధించినది. ఒక సామాజిక వర్గం విషయంలో సానుకూల వివక్ష చూపించినప్పుడు, ఆ వర్గంలోని వేరువేరు శ్రేణులు సమానంగా ఆ లబ్ధి పొందలేకపోతే, జరిగేది అన్యాయమే. ఆ అన్యాయాన్ని సరిదిద్దడానికి, జనాభా, ఇతర సామాజిక ప్రాతిపదికల పైన వర్గీకరణ చేసి పంచడమే న్యాయమని మాదిగ దండోరా ఉద్యమం వాదించింది. వివిధ రాజకీయ పక్షాలు, ప్రజాస్వామిక వాదులు, పౌరసమాజం అంతా మాదిగ ఉద్యమానికి సానుభూతిగా నిలిచారు. ఈ ప్రయాణంలో ప్రత్యేకంగా చెప్పుకోదగినది చంద్రబాబు నాయుడు, ఆయన పార్టీ తెలుగుదేశం అందించిన మద్దతు, చూపిన చొరవ. వర్గీకరణ కారణంగా మాదిగలకు కలిగే ప్రయోజనాన్ని ఆచరణాత్మకంగా, నాటి తెలుగుదేశం ప్రభుత్వంలో అమలైన రిజర్వేషన్లు నిరూపించాయి.

ప్రజా ఉద్యమాల చరిత్రలో ఎంఆర్‌పీఎస్ ది ప్రత్యేకమైన అధ్యాయం. సృజనాత్మకమైన, సాహసోపేతమైన ఆందోళనరూపాలను రూపొందించి, ప్రభుత్వాలను ఉక్కిరిబిక్కిరి చేసింది ఆ సంస్థ. పార్టీల మీద నైతికమయిన, రాజకీయమైన ఒత్తిడిని తీసుకురాగలిగింది. అనేకమార్లు శాసనసభల చేత తీర్మానాలను చేయించింది, అఖిలపక్షాలు ఢిల్లీ వెళ్లేట్టు చేయగలిగింది. ఎవరు మద్దతు ఇస్తే, వారి పక్కన నిలబడి, తన ఉద్యమాన్ని మందకృష్ణ కొనసాగించగలిగారు. దీర్ఘకాలం ఉద్యమం స్తబ్ధ దశలోకి వెళ్లినా, ఇతర ప్రజా ఉద్యమాలను చేపట్టి తమ సంస్థ ఉనికిని చాటుకున్నారు.

రెండు తెలుగురాష్ట్రాలు సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా వర్గీకరణ చేపడతామని ముందుకు రావడం హర్షణీయం. ఈ కేసులో పిటిషనర్లుగా అనేక రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయి. అవి అన్నీ వెంటనే నిర్ణయాలు తీసుకునే అవకాశమున్నది. కేంద్రప్రభుత్వం తీసుకోవలసిన చర్యలేవీ లేవు కానీ, బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో నిర్ణయాలు ఎట్లా ఉంటాయో చూడవలసి ఉన్నది. ఏది ఏమయినా, వివక్షితులలో అంతర్గత వివక్ష ఉండరాదనే సహజసూత్రం నెగ్గింది. ఈ ఉద్యమం వల్ల దళిత ఉద్యమంలో కొన్ని పొరపొచ్చాలు, అనైక్యత ఏర్పడిందని బాధపడినవారున్నారు. ఇప్పుడు, ఈ తీర్పు తరువాత, అంతా వాస్తవాన్ని అంగీకరిస్తారని, బలశాలి అయిన సమష్టి దళిత సమాజంగా రూపొందుతారని ఆశించవచ్చు.

సుప్రీం 'వర్గీకరణ' తీర్పు

సమన్యాయానికి సరైన దారి

ఎస్సీల్లో ప్రతి వెనుకబడిన కులానికి, ఎస్టీల్లో ప్రతి వెనుకబడిన తెగకు రిజర్వేషన్ల పంపిణీ న్యాయం జరగడానికి వీలుగా, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను వర్గీకరించి తీరాల్సిందేనని గురువారం నాడు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ ఆధ్వర్యంలోని ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పునివ్వడాన్ని స్వాగతిస్తున్నాం. దేశ న్యాయ వ్యవస్థలో, సామాజిక న్యాయ కల్పనలో, ఈ తీర్పు ఒక ముఖ్య ఘట్టమవుతుంది. ఎస్సీల్లోనూ, ఎస్టీల్లోనూ అత్యంత వెనుకబడిన ఎస్సీ కులాలు, జాతులు, తెగలకు విద్య–ఉద్యోగ రంగాల్లో పంపిణీ న్యాయం కల్పించడానికి ఈ తీర్పు తొలి అడుగు



దక్షిణాది రాష్ట్రాల్లో మాదిగలు సాగించిన ఉద్యమం, ఉత్తరాది రాష్ట్రాల్లో సాగిన వాల్మీకి ఉద్యమం అనేక చారిత్రక మలుపులు తిరిగాయి. దశాబ్దాల తర్వాత ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పుతో రిజర్వేషన్ల వర్గీకరణ సమస్య ఒక పరిష్కార దశకు చేరింది.

అవుతుందని భావిస్తున్నాం. ఈ తీర్పు పట్ల పంపిణీ న్యాయం, సామాజిక న్యాయం కోరుకునే శక్తులు, వ్యక్తులందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో అరవై ఒక్క ఎస్సీ కులాలు ఉన్నాయి. ముప్పై ఐదు ఎస్టీ తెగలు ఉన్నాయి. అలాగే దేశంలో సుమారు 1150 ఎస్సీ కులాలు, 650 ఎస్టీ తెగలు ఉన్నాయి. ఈ రెండు సాంఘిక కేటగిరీల్లోనూ అభివృద్ధి వ్యత్యాసాలు ప్రస్ఫుటంగా, తీవ్రంగా ప్రబలి ఉన్నాయి ఈ విషయం 1965లో కేంద్ర న్యాయశాఖ విచారణ కోసం నియమించిన జస్టిస్ లోకూర్ కమిటీ తన నివేదికలో స్పష్టం చేసింది. విద్య, ఉద్యోగ, సంక్షేమ రాజకీయ రంగాల్లో ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు చెందిన కులాలు, తెగల వారికి భారత రాజ్యాంగం రిజర్వేషన్ అవకాశాలు కల్పిస్తున్నది. కాగా సింహభాగం రిజర్వేషన్ అవకాశాలను కొన్ని ఎస్సీ కులాలు, ఎస్టీ తెగలే అనుభవిస్తుండగా, చాలా కులాలు, తెగలు ఇంకా రిజర్వేషన్లు అందుకోలేని దుస్థితిలోనే ఉన్నాయి. అభివృద్ధిలో అడుగుకి నెట్టివేయబడుతున్నాయి.

దేశ జనాభాలో దాదాపు మూడు వంతులకు పైగా ఎస్సీ, ఎస్టీ జనాభా ఉన్నారు. దేశంలో సుమారు 1780 విడివిడి సమూహాలుగా ఉన్న ఎస్సీ, ఎస్టీల్లో, కేవలం వేళ్ళపై లెక్కపెట్టగలిగే కులాలు, జాతులు, తెగల్లో కొంత మంది, కొన్ని కుటుంబాలే అధిక భాగం రిజర్వేషన్ల లబ్ధి పొందుతున్న పరిస్థితి ఉన్నది. ఈ అపసవ్య పరిస్థితులను మార్చుకోవాలని 1994 నుంచి ఎమ్మార్పీఎస్ ఉద్యమిస్తున్నది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మాదిగలు ఎన్నో చరిత్రాత్మక ఉద్యమాలు చేశారు. కర్ణాటక, తమిళనాడు మొదలైన దక్షిణాది రాష్ట్రాల్లో మాదిగలు సాగించిన ఉద్యమం, ఉత్తరాది రాష్ట్రాల్లో సాగిన వాల్మీకి ఉద్యమం అనేక చారిత్రక మలుపులు తిరిగాయి. ఈ ఉద్యమాలు రాజకీయ, సామాజిక ప్రభావాలను చూపాయి. దశాబ్దాల తర్వాత ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పుతో రిజర్వేషన్ల వర్గీకరణ సమస్య ఒక పరిష్కార దశకు చేరింది.

ఎవరి వాటా విద్య ఉద్యోగ, సంక్షేమ, రాజకీయ అవకాశాల రిజర్వేషన్లను వారు పొందగలిగే గ్యారెంటీ పరిస్థితులు ఉండగలిగినప్పుడే, ఆ పరిస్థితుల్ని కాపాడుకోగలిగినప్పుడే అంతర్గతంగా ఎస్సీ (మాదిగ–మాల) కులాల మధ్య, ఎస్సీ–ఎస్టీల మధ్య ఐక్యత సాధ్యమవుతుంది. సాంఘిక రాజకీయ అనుబంధం దృఢమవుతుంది. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని సోదర మాల కులస్తులు, లంబాడి, ఎరుకల జాతి మిత్రులు ఈ తీర్పుకి కట్టుబడాలని పిలుపునిస్తున్నాం. సుప్రీంకోర్టు వ్యక్తం చేసిన విధంగా ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను హేతుబద్ధంగా పంపిణీ చేయడానికి వీలుగా కేంద్ర ప్రభుత్వం అవసరమైన రాజ్యాంగ సవరణ చేయాలని, ఈ మేరకు రాష్ట్రాలకు అధికారాలను త్వరగా దఖలుపరచాలని కోరుతున్నాం. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సుప్రీంకోర్టు తీర్పు అమలును త్వరగా ముందుకు తీసుకెళ్లాలని కోరుతున్నాం. మాదిగ ఉద్యమాన్ని బలపరిచిన సామాజిక, న్యాయ శక్తులకు, రాజకీయ పార్టీలకు, సంఘాలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. తదుపరి ప్రక్రియల్లోనూ అండగా నిలబడాలని, రిజర్వేషన్లలో మేము సత్వర న్యాయం పొందటానికి, తద్వారా అధికార సాధనలో భాగస్వాములు కావడానికి కలిసి రావాలని సామాజిక, న్యాయ శక్తులను కోరుతున్నాం.




○ కృపాకర్ మాదిగ
వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి
మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి

రాజ్యాంగ ఉల్లంఘనలకు తెరపడుతుందా?

మూడున్నర, నాలుగు మాసాల్లో పదవీ విరమణ చేయబోతున్న భారత ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ రెండు కీలకమైన వివాదాలను విచారణకు చేపట్టారు. ఇందులో ఒకటి– రాజ్యాంగం ఆర్టికల్ 110 దుర్వినియోగంపై దాఖలైన పిటిషన్లను ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించాలని తీసుకున్న నిర్ణయం. రెండవది రాష్ట్రాల గవర్నర్లకు కోర్టు కేసుల నుంచి రక్షణ కల్పిస్తున్న రాజ్యాంగ అధికరణ 361ను సమీక్షించాలని సంకల్పించడం.

ఎవరు అధికారంలోకి వచ్చినా రాజ్యాంగానికి లోబడి పాలించాలి. తాము మాత్రం ఇందుకు అతీతులమని బీజేపీ పాలకులు భావిస్తుంటారు. వివాదాస్పద బిల్లులను ద్రవ్య బిల్లుల (మనీ బిల్లు) మార్గంలో (ఆర్టికల్ 110 దారిలో) ఆమోదింపచేసుకునే జబర్దస్తీ పద్ధతిని బీజేపీ పాలకులు ఎంచుకొని చాలాకాలమైంది. ఆధార్ కార్డు బిల్లుకు ఈ విధంగానే పార్లమెంట్ అనుమతిని సాధించారు. అయితే ఇది ఇప్పుడు వివాదంలో కూరుకున్నది. మనీ బిల్లు లేదా ఆర్టికల్ 110 నిజానికి ప్రభుత్వ ధనసేకరణ, ఖర్చులకు మాత్రమే పరిమితమైనది. ఈ మనీ బిల్లు రాష్ట్రపతి, స్పీకర్ అదుపాజ్ఞలలో కేవలం లోక్‌సభ ఆమోదంతో శాసన రూపం ధరిస్తుంది. ఈ అంశాలతో ఏ మాత్రం సంబంధం లేని వివాదాస్పద ఆధార్ బిల్లును మనీ బిల్లుగా పరిగణింపజేసి చట్టం చేయించుకోడం రాజ్యాంగానికి తీవ్ర అపరాధం. బీజేపీకి రాజ్యసభలో ఇప్పటికీ మెజారిటీ సిద్ధించలేదు. అందుచేత మనీ బిల్లు మార్గాన్ని మళ్ళీ దుర్వినియోగం చేయగలరనే భయాలు కొనసాగుతున్నాయి. 2024–25 కేంద్ర బడ్జెట్ ప్రవేశపెడుతున్నందున మనీ బిల్లు మార్గం మళ్ళీ దురుపయోగం కావొచ్చుననే భయాన్ని వ్యక్తం చేస్తూ ఇటీవల సీనియర్ అడ్వకేట్లు కపిల్ సిబల్, అభిషేక్ మను సింఘ్వి, ఇందిరా జైసింగ్‌లు సిజెఐని ఆశ్రయించారు. ఆధార్‌ను ఆసరా చేసుకొని పంపిణీ చేస్తున్న సబ్సిడీలు సంఘటిత నిధి నుంచి తీసుకొంటున్నందున ఆధార్ బిల్లు మనీ బిల్లు కిందికే వస్తుందని కేంద్రం బుకాయించింది. అయితే ఆధార్ బిల్లుకు మనీ బిల్లు హోదా కల్పించి చట్టం చేయించుకోడాన్ని 41 మెజారిటీ తీర్పుతో 2018లో సుప్రీంకోర్టు ధ్రువీకరించింది. అసమ్మతి తీర్పు చెప్పిన ఏకైక న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ దానిని రాజ్యాంగ విరుద్ధ చర్యగా పేర్కొన్నారు. ఆధార్ బిల్లులో మన స్వేచ్ఛలను అరికట్టే అంశాలున్నాయని అన్నారు. సాధారణ బిల్లును మనీ బిల్లు మార్గంలో చట్టం చేయించుకోడం శాసన నిర్మాణంలో రాజ్యసభ పాత్రను పరిమితం చేయడమే అవుతుందనీ పేర్కొన్నారు. వాస్తవానికి



రాజ్యాంగ అధికరణ 110 దుర్వినియోగానికి తెరదించడం, గవర్నర్ల 361(2) కవచాన్ని తొలగించడం నేటి అవసరం. మూడున్నర, నాలుగు మాసాల్లో పదవీ విరమణ చేయబోతున్న భారత ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ ఈ కీలకమైన వివాదాలను విచారణకు చేపట్టారు.

ఈ వివాదంపై ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం సిఫార్సు మేరకు ఏడుగురు జడ్జీల ధర్మాసనం నియామక నిర్ణయం ఎప్పుడో జరిగిపోయింది. ఈ ముడిని పూర్తిగా విప్పే వైపుగా సిజెఐ హోదాలో చంద్రచూడ్ ఇప్పుడు కీలక నిర్ణయం తీసుకున్నారు.

ఈ పద్ధతిని సవాలు చేస్తున్న పిటిషన్లను రాజ్యాంగ ధర్మాసనం వచ్చే అక్టోబర్‌లో విచారణకు చేపడుతుందని ప్రకటించారు. చంద్రచూడ్ చేసిన ప్రకటనను కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ స్వాగతించారు. గత పదేళ్లలో చాలా బిల్లులను మనీ బిల్లుల పేరిట ఆర్టికల్ 110 ద్వారా బుల్డోజ్ చేశారన్నారు. వచ్చే నవంబర్‌లో తాను రిటైర్ అయ్యేలోగానే దీనిపై చంద్రచూడ్ స్పష్టమైన అంతిమతీర్పును ప్రకటించాలని జైరాం రమేష్ కోరారు.

సుప్రీంకోర్టు నుంచి చంద్రచూడ్ ఇచ్చిన తీర్పుల్లో ప్రముఖమైనది వ్యక్తి గోప్యత హక్కుకు సంబంధించినది. ఇది రాజ్యాంగం హామీ ఇస్తున్న హక్కు అని, వ్యక్తికి వ్యక్తిగత గోప్యత హక్కు ద్వారానే ఆత్మగౌరవం, స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు లభిస్తాయని జస్టిస్ కెఎస్ పుట్టస్వామి, ఎఎన్ఆర్ వెర్సెస్ భారత యూనియన్ కేసులో స్పష్టం చేశారు. ఈ తీర్పు ఫ్యూడల్ సమాజ దుర్మార్గ విలువల పట్టును బద్దలు గొట్టి సమాజంలో వ్యక్తి గౌరవానికి పట్టం కట్టింది. ఈ తీర్పుతోనే తొమ్మిది మంది న్యాయమూర్తుల విస్తృత ధర్మాసనం పౌరుల వ్యక్తిగత గోప్యతా హక్కును రాజ్యాంగం 21 అధికరణ కింద ప్రాథమిక హక్కుల్లో చేర్చింది. పరస్పర సమ్మతితో సాగే స్వలింగ సంపర్కానికి ఆమోద ముద్ర వేసి మానవ సంబంధాల్లో విప్లవాత్మక మార్పును చంద్రచూడ్ ఆవిష్కరించారు. బ్రిటిష్ హయాంలో శిక్షాస్మృతిలో చేర్చిన 377 సెక్షన్ కోరలను పెకిలించారు. స్వలింగ సంపర్క హక్కును నిరాకరించడం వ్యక్తి గోప్యత హక్కును ఉల్లంఘించడమేనని స్పష్టం చేశారు. సైన్యంలో మహిళలకు పురుషులతో సమానంగా పూర్తి స్థాయి సైనిక బాధ్యతలు అప్పగించాలని ఇచ్చిన మరో తీర్పు సైతం చరిత్రాత్మకమైనదే. ఇలా చంద్రచూడ్ తన పదవీకాలంలో న్యాయవ్యవస్థకు మరింత సునిశితమైన మానవీయ చూపును కల్పించారు. మహిళకు తన శరీరంపై పూర్తి అధికారం ఉండాలని చెబుతూ ఆమె తాను ధరించిన గర్భం వద్దనుకుంటే 20–24 వారాల పిండాన్ని కూడా తొలగింపజేసుకోవచ్చని తీర్పు ఇచ్చారు. ఎన్నికల ప్రక్రియకు అపూర్వ స్థాయిలో కార్పొరేట్ ధన కాలుష్యాన్ని చేర్చిన ఎలక్టోరల్ బాండ్ల పద్ధతి గుట్టు రట్టు చేసి దానికి తెరదించారు. ఇప్పుడు మనీ బిల్లు మార్గం దురాక్రమణను కూడా అరికట్టిస్తారని చంద్రచూడ్‌పై ఆశలు పెట్టుకోడం సహజం.

రాష్ట్రాల గవర్నర్లపై కేసులు పెట్టకుండా నిరోధించడం తగదంటూ దాఖలైన పిటిషన్ కూడా ఎంతో ముఖ్యమైనది. రాష్ట్రపతి, గవర్నర్లు పదవిలో ఉన్నంతకాలం వారిపై ఎటువంటి కోర్టు కేసులు పెట్టరాదని ఆర్టికల్ 361(2) నిర్దేశిస్తున్నది. గత పదేళ్లలో ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల గవర్నర్లు ఇష్టావిలాసంగా రాజకీయ విమర్శలు చేసి అక్కడి ప్రభుత్వాలను ఇరకాటంలో పెట్టిన సంగతి తెలిసిందే. ఈ ధోరణి ఇంకా కొనసాగుతున్నది. ప్రతిపక్ష రాష్ట్రాల్లో ప్రభుత్వాలు శాసనసభలో ఆమోదింపజేసుకున్న బిల్లులకు మాసాలు, ఏళ్ల తరబడిగా ఆమోదం తెలపకుండా రాజ్‌భవన్‌లు కోల్డ్ స్టోరేజ్‌లో ఉంచాయి. కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. తమిళనాడు గవర్నరు ఎస్.రవి రాజ్యాంగ విరుద్ధ ప్రవర్తన పట్ల చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం మొన్న మార్చి నెలలోనే తీవ్ర అభ్యంతరం తెలిపింది. ఆయన రాజ్యాంగాన్ని ఉల్లంఘించి మాట్లాడుతుంటే మేము కళ్ళు మూసుకొని కూర్చోవాలా అని చంద్రచూడ్ ప్రశ్నించారు. డిఎంకె నాయకుడు కె.పొన్ముడి శిక్షపై సుప్రీంకోర్టు స్టే విధించిన తర్వాత ముఖ్యమంత్రి స్టాలిన్ సిఫార్సు మీదట ఆయన చేత తిరిగి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించడానికి గవర్నర్ నిరాకరించడాన్ని సిజెఐ తప్పుపట్టారు. ఆయన సుప్రీంకోర్టునే ధిక్కరిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఒకరోజులో పొన్ముడి చేత పదవీ ప్రమాణ స్వీకారం చేయించాలని అల్టిమేటమ్ ఇచ్చారు.

గవర్నర్లు దారి తప్పి రాష్ట్ర ప్రభుత్వాల పాలనను అడ్డుకుంటున్నప్పుడు వారిని సరి చేయించాల్సిన బాధ్యత గల కేంద్ర పాలకులు నిమ్మకు నీరెత్తినట్టు కూచుంటున్నారు. పైపెచ్చు అలా ప్రవర్తించడంలో అగ్రేసరులు అనిపించుకొంటున్న గవర్నర్లకు మరింత ఉన్నత పదవులిచ్చి గౌరవిస్తున్నారు. తనను రాజ్‌భవన్‌లోనే లైంగికంగా వేధించారని పశ్చిమ బెంగాల్ గవర్నర్ సివి ఆనంద బోస్ మీద ఇటీవల ఒక మహిళ చేసిన ఆరోపణ తెలిసిందే. దీనిపై విచారణ జరిపి న్యాయం ప్రసాదించవలసిందిగా కోరుతూ ఆమె సుప్రీంకోర్టుకు ఎక్కారు. సిజెఐ చంద్రచూడ్ సారథ్యంలో ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం ఏర్పాటైంది. గవర్నర్లు కోర్టు కేసుల నుంచి రాజ్యాంగం 361(2)ద్వారా పొందుతున్న పూర్తి రక్షణ ఉచితానుచితాల నిగ్గు తేల్చాలంటూ ఆ మహిళ అర్థించారు. దీనిని మన్నించిన ధర్మాసనం ఇప్పుడు ఆర్టికల్ 361(2) మంచి చెడ్డలపై దృష్టి సారించింది.

రాజ్యాంగ అధికరణ 110 దుర్వినియోగానికి తెరదించడం, గవర్నర్ల 361(2) కవచాన్ని తొలగించడం నేటి అవసరం. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో రాజ్యాంగంపై జరిగిన చర్చకు దీనివల్ల సార్థకత కలుగుతుంది.

■ జి. శ్రీరామమూర్తి
సీనియర్ జర్నలిస్ట్

'తెలుగు నేల మీద ఆమె నడవని ఉద్యమం లేదు'

మాధవి కూడా వెళ్లిపోయింది. చాలా నిశ్శబ్దంగా.

అత్యంత ప్రభావశీలురైన వ్యక్తుల్లో బాలగోపాల్ ఒకరు. అనేక పెద్ద పెద్ద హత్యా ప్రయత్నాల నుండి బయటపడి అతి చిన్న అనారోగ్య కారణంగా బాలగోపాల్ మనల్ని విడిచి వెళ్లిన తర్వాత ఆ వెలితి, ఆ శూన్యం అలాగే ఉంది. గుండె కింద తడి కూడా. బాలగోపాల్ చెల్లెలు మాధవి కూడా మరణించారని విన్నాక ఆ తడి మళ్ళీ ఉబికి వచ్చింది. బాలగోపాల్ తాత్వికతను జీవనశైలిని పని విధానాన్ని ఎక్కువగా అనుసరించిన, ఆచరించిన కుటుంబసభ్యురాలు మాధవి.



దాదాపుగా 1990 నుంచి 2020 వరకు నిరంతరం తెలుగు నేల మీద ఆమె నడవని ఉద్యమం లేదు, నిలవని పోరాటం లేదు. చాలా నిశ్శబ్దంగా పనిచేసింది.. అంతకంటే నిశ్శబ్దంగా వెళ్లిపోయింది. తాను పని చేసిన సంఘాలకు వ్యక్తులకు కూడా తెలియనంత పని చేసింది. తాను ఎవరి కోసమైతే పని చేసిందో వాళ్లకు కూడా తను చేసిన పని గాని, దాని ఫలితం గాని తెలియదు. గ్రామీణ ఉపాధి హామీ పథకం తెలంగాణ, స్త్రీ వాద, దళిత, అస్తిత్వ దళిత ఉద్యమాల్లో తన పరిమితుల మేర పనిచేసింది, కళింగ సముద్రపు ఒడ్డు నుండి నల్లమల మీదుగా దండకారణ్య నడిబొడ్డు వరకు అన్ని పనుల్లో అన్నతో పాటు నడవడమే గాక, తాను అవసరమనుకున్న చోట ఒంటరిగాను ఇతరులతోను కలిసి పనిచేసింది.

సమస్త జీవరాశుల కోసం ఏదో ఒక మేరకు పని చేస్తున్న హక్కుల ఉద్యమకారులు ఇలా ఒకొక్కరు వెళ్లిపోతుంటే దుఃఖం కూడా ఇంకిపోతుంది. కులం, మతం, ప్రాంతం, భాష, వర్గం ఆధిపత్యాల నడుమ; పరిసరాలు, పరిస్థితులు, అవకాశాలు, అవసరాల ప్రభావాలతో కుటుంబం సంసారం బరువు బాధ్యతల మధ్య తాము జీవించిన కాలంలో విలువల కోసం తపించి, ఆచరించి అసమానతలు అన్యాయాలకు ఎదురునిలిచి పౌర మానవ సమస్త జీవజాతుల హక్కుల కోసం జీవించిన వాళ్లకు మరణం ఏముంటుంది. మాధవి విద్యావంతురాలు హక్కుల ఉద్యమకారిణిగానే కాకుండా పేద పిల్లల చదువుల కోసం తన వంతుగా అనేక మందికి ఆర్థిక, హార్దిక సహకారం అందించింది. మంచి గాయని కూడా.. రఫీని తన గొంతులో భలే నింపుకునేది. ఎంతలా అంటే రఫీ ఆడపిల్ల అయితే ఇలాగే పాడేవాడన్నంతగా.

గ్రామీణ ఉపాధి హామీ పథకం–తెలంగాణ ఉద్యమంలో, నల్లగొండ, నల్లమలలో తనతో పని చేసిన అనేక అనుభవాలు ఉన్నాయి. తను 'మనందరిల్లు' ఆలగడపలో గడిపిన జ్ఞాపకాల బరువుతో మానవ హక్కుల సంఘ సభ్యురాలు మాధవికి, ఆమె నడిచిన తోవలో అమరులకు నివాళులు.

–వేనేపల్లి పాండురంగారావు, 'మట్టి మనిషి'

వింత కోరికల జగన్.. వితండవాదాల వైసీపీ

ఎడ్డెం అంటే తెడ్డెం, తెడ్డెం అంటే ఎడ్డెం అనే సామెత ఒకటి ఉంది. దీని అర్థం ప్రతి మాటకు అడ్డదిడ్డంగా వాదన చేయటం. వాడుక భాషలో మొండి వాదన, కుతర్కం అనీ అంటారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిది సరిగ్గా ఇలాంటి వాదనే.

ఒకసారి ఆయన ఐదేళ్ళ పరిపాలన కాలాన్ని సమీక్షిస్తే, ఇలాంటి హేతుబద్ధత లేని, శాస్త్రీయత లేని అంశాలే ఎక్కువగా కనిపిస్తాయి. వాటిలో కొన్ని... 1. ఆయన తొలి సమావేశం పెట్టి ప్రజావేదికను కూల్చేశారు. ఇందుకు చెప్పిన కారణం. ప్రజావేదిక అక్రమ కట్టడం అని. ప్రభుత్వ స్థలంలో, ప్రభుత్వ సొమ్ముతో నిర్మించిన 'ప్రజా ప్రయోజనాల భవనం' ఎలా అక్రమమో బుర్ర బద్దలుకొట్టుకున్నా, ఎవ్వరికీ అర్థం కాదు, ఆయనకు తప్ప. అలాంటప్పుడు అసెంబ్లీ, శాసన మండలి, హైకోర్టు కూడా అక్రమ కట్టడాలే కదా? ఆయా జిల్లాల్లో ఉన్న కలెక్టర్ భవనాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆయన నిర్మించిన సచివాలయాలు ఆ కోవలోకే వస్తాయి కదా? ఇలాంటి ప్రశ్నలు ఎవ్వరూ వేయకూడదు. ఆయన అక్రమం అంటే అక్రమం. సక్రమం అంటే సక్రమం. అందరూ అదే అనాలి. 2. శాసనమండలిని 'దద్దమ్మల సభ'తో పోల్చారు. శాసన సభలోనే ఎందరో డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లు ఉంటారని, ఇక దద్దమ్మలు దేనికి? అని ప్రకటించారు. కానీ, చాలామంది 'దద్దమ్మ'లకు ఎమ్మెల్సీలు ఇచ్చారు. 3. మూడు రాజధానుల మూర్ఖపు సిద్ధాంతం. ఇది దేశంలోని ఏ రాష్ట్ర ముఖ్యమంత్రికి రాని, ఎక్కడా కనిపించని విచిత్ర ఆలోచన. ఈ సంగతి జగన్‌కూ తెలుసు. ఇదే ప్రశ్న ఎవరైనా వేస్తారని ఆయన చాలా సుదీర్ఘ ఆలోచనా ప్రయాణం చేసి దక్షిణాఫ్రికా నుంచి మూడు ముక్కల సిద్ధాంతాన్ని దిగుమతి చేశారు. దీనిని మూడు ప్రాంతాల్లో ప్రమోట్ చేసే పని చేపట్టారు. ఆఖరికి మూడు రాజధానుల మద్దతు కోసం ఆంధ్రప్రదేశ్ భాషాప్రయుక్త రాష్ట్రంగా ఏర్పాటు కాక ముందటి ప్రైవేటు హౌస్‌లో ముగ్గురో, నలుగురో కూర్చుని రాసుకున్న చట్టబద్ధత లేని శ్రీబాగ్ ఒప్పందాన్ని ఆకాశానికి ఎత్తేశారు. ఇప్పటికీ ఆ కుంపటిని నెత్తి మీద నుంచి దింపలేదు. అమరావతి ఏకైక రాజధానిగా అసెంబ్లీ చేసిన తీర్మానం, రైతులతో ప్రభుత్వం చేసుకున్న ఫాం 9.14 ఒప్పందం, సీఆర్‌డీఏ చట్టం ఇవేవీ చెల్లవని వాదించారు. వాటిని రద్దు చేశారు. హైకోర్టు చెప్పినా తన కుందేటికి మూడే కాళ్ళు ఉన్నాయని నిరూపించేందుకు సుప్రీంకోర్టు తలుపులు తట్టారు. మూడు రాజధానుల పేరుతో మూడు ప్రాంతాల్లో విభజన కార్చిచ్చు మండించే ప్రయత్నం చేశారు. మూడు రాజధానుల శిబిరం ఒకటి పెట్టి పోషించారు. 4. అమరావతికి 'కమ్మరావతి', భ్రమరావతి వంటి పేర్లు పెట్టారు. భూములు ఇచ్చిన వారంతా చంద్రబాబు బినామీలని ముద్ర వేశారు. భూ కుంభకోణాలు జరిగాయని అబద్ధాలు ప్రచారం చేశారు. ఆఖరికి ఆ ప్రాంతాన్ని ఎడారిలా, శ్మశానదిబ్బతో పోల్చి అమరావతిపై పెద్ద ఎత్తున వ్యతిరేకత పెంచే ప్రయత్నం చేశారు. అసలు అమరావతిలో సోషల్ బాలెన్స్ లేదని పెద్ద బండరాయి విసిరేశారు. అక్కడి భూములను ఇ–వేలం ద్వారా అమ్మే ప్రయత్నం చేశారు. రాజధాని కోసం ఇచ్చిన పొలాలను సెంటు పట్టాలుగా మార్చి, నిరుపేదలకు ఆశలు కల్పించారు. రాజధాని రైతుల పైకి బడుగులను ఉసిగొలిపే కుట్రలు చేశారు. అమరావతికి భూములు ఇచ్చిన గ్రామాలు తాడికొండ అసెంబ్లీ నియోజకవర్గం అన్నా, అది ఎస్సీ రిజర్వ్‌డ్ అన్నా వినలేదు. రాజధాని భూముల్లో ఎస్సీ ఎస్టీ కులాల భూములే అధికంగా 34 శాతం ఉన్నాయి అన్నా ఖాతరు చేయలేదు. దళిత బహుజనులు రాజధాని ఉద్యమంలో కీలకపాత్ర పోషిస్తున్నారని, వారిని భయపెట్టేందుకు ఎస్సీలపై వారి చేతనే ఎట్రాసిటీ కేసు పెట్టించి తొమ్మిది మంది ఎస్సీలను జైలుకు పంపారు. 5. దశాబ్దాలుగా ఉన్న కింది కులాల అన్ని సామాజిక వర్గాల పథకాలను నిలిపేశారు. ఎందుకు నిలిపేశారు? అంటే బటన్ నొక్కుడును చూపారు. 6. విపక్షాలపై దాడులను ప్రశ్నిస్తే, కార్యకర్తలకు బీపీ ఉంటుందని థియరీ చెప్పారు.

ఇలా శిశుపాలుడు చేసిన తప్పులు నూరైతే, జగన్మోహన్‌రెడ్డి చేసిన తప్పిదాలు వెయ్యిన్నొక్కటి. తాజాగా అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా కోసం అలిగారు. బుంగమూతి పెట్టారు. హోదా ఇవ్వకపోతే అసెంబ్లీకి ససేమిరా రాను అనే మరో వింతవాదానికి, చిన్నపిల్లల చాక్లెట్ తరహా తగాదాకు తెర లేపారు. 57 శాతం ఓట్లతో, 93శాతం సీట్లతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వాన్ని దింపి, నెల రోజుల్లోనే రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన పెట్టాలని ఢిల్లీ వెళ్ళి గోల చేసిన నాయకుడు కూడా జగన్ ఒక్కరే. ఆయన ప్రభుత్వానికి 11 సీట్లు వచ్చిందే ఏపీలో ఊపిరి ఆడని అరాచక పాలన వల్ల అన్న సంగతిని ససేమిరా అంగీకరించరు. అసెంబ్లీలో సీట్ల సంఖ్యను బట్టి అధికార పక్షమా? ప్రతిపక్షమా? అన్నవి అసెంబ్లీ నిబంధనలు, రాజ్యాంగ వ్యవస్థలు నిర్ణయిస్తాయి అన్న విషయం మాత్రమే ఇప్పటి వరకు అందరికీ తెలిసిన అంశం. కానీ, అడుక్కుంటేనో, గింజుకుంటేనో, కోర్టులను ఆశ్రయిస్తేనో, గోల చేస్తేనో కూడా వస్తుందని, లేదా ప్రజల్ని నమ్మించవచ్చని జగన్‌కు మాత్రమే తెలుసు. 23 సీట్లతో ప్రతిపక్షంగా ఉన్న తెలుగుదేశం పార్టీని ఉద్దేశించి ఏడుగురు ఎమ్మెల్యేలను లాగేస్తాను. ప్రతిపక్ష హోదా కూడా ఊడిపోతోంది అని అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబును బెదిరించారు. అంటే, ప్రతిపక్ష హోదా ఉండాలంటే పది శాతం సీట్లు అంటే 18 మంది ఎమ్మెల్యేలు ఉండాలి అన్నది జగన్‌కు తెలుసు అనే కదా అర్థం? ఆయన ఐదేళ్ళ పాటు వైనాట్ 175 అనే జపాన్ని పఠించారు. అంటే ప్రతిపక్ష హోదా కాదు, ప్రతిపక్షమే రాష్ట్రంలో ఉండకూడదు అనే కదా అర్థం. సింహం సింగిల్‌గా వస్తోందని, ఏం పీక్కుంటారో పీక్కోండి వంటి మాటలకు పరమార్థం ఏమిటో గుర్తు చేయకూడదు సుమా! ఇవన్నీ రెండు నెలలకే మరిచిపోతే ఎలా?




2019లో తెలుగుదేశం పార్టీకి 23 సీట్లు వచ్చినా, జనసేన, బీజేపీలకు ఏ ఒక్క సీటు లేకున్నా, వారు ప్రజాక్షేత్రంలో ప్రజలు ఇచ్చిన 'ప్రతిపక్ష హోదా'ను సమర్థవంతంగా నిర్వహించారు. జగన్మోహన్‌రెడ్డిలా వింత కోరికలు, వింత వాదాలు చేయలేదు. చట్టాలను, న్యాయస్థానాలను గౌరవించనంత కాలం, తప్పుడు విధానాలను సమీక్షించుకోనంత కాలం వైసీపీకి మనుగడ కష్టం.

1994లో ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ పార్టీకి కేవలం 26 సీట్లు వచ్చినా, పార్టీ పరంగా ఫ్లోర్ లీడర్ పాత్రను ఆనాటి పీజేఆర్ పోషించారు. రాష్ట్రంలో పిఆర్పీ, లోక్‌సత్తా, సీపీఐ, సీపీఎం వంటి పార్టీలు కూడా ప్రజలు ఇచ్చిన అసెంబ్లీ సీట్లను గౌరవించి సగర్వంగా అసెంబ్లీలో వారి పాత్రను పోషించాయి. 2019లో తెలుగుదేశం పార్టీకి 23 సీట్లు వచ్చినా, జనసేన, బీజేపీలకు ఏ ఒక్క సీటు లేకున్నా, వారు ప్రజాక్షేత్రంలో ప్రజలు ఇచ్చిన 'ప్రతిపక్ష హోదా'ను సమర్థవంతంగా నిర్వహించారు. జగన్మోహన్‌రెడ్డిలా వింత కోరికలు, వింత వాదాలు చేయలేదు. ఇలాంటి పలు వితండ వాదనలతో జగన్ రాజకీయం చేయటాన్ని ప్రమాదమైన ధోరణిగానే భావించాలి. చట్టాలను, న్యాయస్థానాలను గౌరవించనంత కాలం, తప్పుడు విధానాలను సమీక్షించుకోనంత కాలం వైసీపీకి మనుగడ కష్టం. అలాంటి పార్టీ ఉనికిలో ఉంటే, తిరిగి అధికారంలోకి వస్తే రాష్ట్రానికి తీరని నష్టం.

• పోతుల బాలకోటయ్య
అమరావతి బహుజన ఐకాస అధ్యక్షులు

త్రివేణి సంగమం ఆయన జీవనం!

ఔత్సాహిక నాటకరంగంలో తన స్వయంకృషి, అంకితభావం, నిబద్ధతతో ఐదు దశాబ్దాలు నటప్రస్థానం చేసినవారు భళ్ళమూడి రామమూర్తి. నాటకరంగంలో అరంగ్రేటం చేసింది మొదలు... అటు నాటక సేవ, ఆధ్యాత్మిక రంగం, సామాజిక సేవ రంగాలలోనూ అంతే నిబద్ధతతో, విరామం లేని త్రివేణి సంగమం లాంటి జీవనయానం గడిపారు. తన పందొమ్మిదవ ఏట 'శ్రీ వెంకటేశ్వర కళాసమితి' ప్రదర్శించిన 'సీతారామ కళ్యాణం' నాటకంలో, 'నందీశ్వరుడు' పాత్రతో తొలిసారి రంగస్థలంపై అడుగుపెట్టారు. అనంతరం కోటవీధికి చెందిన ఆనాటి నట, దర్శకులు స్వర్గీయ వై.ఎస్. రాజు ఆదరణ, ప్రోత్సాహంతో, 'నాలుగిళ్ళ చావిడి' నాటకంలో, 'మాష్టారు' పాత్ర ద్వారా సాంఘిక నాటకరంగ నటనలోకి అడుగుపెట్టారు.



నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఢిల్లీ) ఆధ్వర్యంలో, ఆంధ్ర విశ్వవిద్యాలయం థియేటర్ ఆర్ట్స్ విద్యార్థినీ, విద్యార్థులకు, ప్రఖ్యాత నట, దర్శకులు ఎం.కె. రైనా, డెబ్బై రోజుల పాటు శిక్షణనిచ్చారు. ఆ శిక్షణ ద్వారా 'కింగ్ ఈడిపస్' (గ్రీకు నాటకం), ముద్రారాక్షసం (చారిత్రక నాటకం), ఊరేగింపు (వీధి నాటకం) ప్రదర్శనలలో, అగ్రశ్రేణి నటీనటులతో కలిసి నటించడం ఆయన నటజీవితంలో మేలిమలుపు. తెలుగునాట వీధి నాటకానికి శ్రీకారం చుట్టింది తిరునగరి రామాంజనేయులు. తర్వాతి కాలంలో, వీధి నాటకానికి చిరునామాగా వెలుగొందిన బాదల్ సర్కార్, సఫ్దర్ హష్మీ, గురుచరణ్ సింగ్, అత్తిలి కృష్ణారావు వంటి వారి స్ఫూర్తితో, దాదాపు దశాబ్దకాలం పాటు వీధినాటక ప్రక్రియ యజ్ఞాన్ని కొనసాగించారు.

సామాజిక అసమానతల పట్ల... ముఖ్యంగా గిరిజనులు, బలహీనవర్గాలు ఈనాటికీ గురవుతున్న ఆ దోపిడీ, వివక్ష, పీడనలపై భళ్ళమూడిలో ఒక వామపక్ష విప్లవవాది కనిపిస్తారు. ప్రజా యుద్ధనౌక గద్దర్, భూషణం మాష్టారు, కా.రా. మాష్టారు, అట్టాడ అప్పలనాయుడు, వంగపండు ప్రసాదరావు వంటి ప్రజా సాహితీవేత్తలతో ఆయనకు గొప్ప అనుబంధం, సాన్నిహిత్యం ఉన్నాయి. 2009లో రామమూర్తి షష్టిపూర్తి ఉత్సవాలు వైభోవపేతంగా జరిగాయి. ఆ తర్వాత కూడా ఆయన విశ్రమించలేదు. ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఢిల్లీ) రీసోర్స్ పర్సన్, మాస్టర్ ట్రైనీగా నియమించింది. భళ్ళమూడి రామమూర్తి ఒక యజ్ఞంలా భావించి, అనేక సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా వీధి నాటకాన్ని ఉపయోగించారు. ఆయన చేసిన వీధి నాటక ప్రయోగాలన్నీ ఒక ఎత్తు. తరతరాలు మానవ నాగరికత పరిణామాన్ని, మానవతను వెక్కిరిస్తూ, ఈనాటికీ భారతీయ సమాజానికొక మచ్చలా మిగిలిపోయిన సెక్స్‌వర్కర్ల జీవితాలు, అలాగే హిజ్రాల జీవిత సంఘటనల నేపథ్యంలో, ఆయన చేసిన కృషి ఒక ఎత్తు. స్వయంగా ఎలమంచిలి ప్రాంతంలోని సెక్స్‌వర్కర్లనే పాత్రధారులుగా చేసి, వారి చేత ఈ వీధినాటికలు ప్రదర్శించడం ఆయన చేసిన పెద్ద సాహసం.

తన నాటికలో పాత్రధారుల్ని, పోలీసులు తమ శైలిలో పోలీస్ స్టేషన్లలో పెట్టినప్పుడు, ఆయన ఆయా స్టేషన్లకు వెళ్ళి సంబంధిత పోలీసు అధికారులను ఒప్పించి, వారిని విడిపించి తీసుకురావడం ఆయనకొక విషమ పరీక్ష. అలాగే ఎయిడ్స్ వ్యాధి విజృంభణకు ఒక కారణమైన హిజ్రాలను కూడా చైతన్యవంతులను చేసి, అనేక వీధినాటిక ప్రదర్శనలివ్వడం తన నాటక ప్రస్థానంలో మరచిపోలేని జ్ఞాపకం అంటారాయన. బహుముఖాలుగా, తన నాటక పరిజ్ఞానాన్ని సామాజిక సేవా దృక్పథంతో, దశాబ్దాలుగా కొనసాగించిన భళ్ళమూడి రామమూర్తిని జాతీయ పురస్కారంతో గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే! పేద, మధ్యతరగతి వారికి కనీస అవసరమైన గృహనిర్మాణం–ప్రభుత్వాల ఆలోచనలు అంశంగా 'నా ఇల్లు' టెలిఫిల్మ్ నిర్మించారు.


అనుభవాలు, జ్ఞాపకాలను ఆయన తన డైరీలలో అక్షరబద్ధం చేసుకున్నారు. జన్మతః వచ్చిన ధారణతో, తన అనుభవాలను దృశ్యమానంగా చెప్పగలగడం భళ్ళమూడికే చెల్లుతుంది. ఇటీవలే ఆ అపురూప జ్ఞాపకాల ఆధారంగా వివిధ రంగాలకు చెందిన మహనీయుల చరిత్రను ఒక వ్యాస సంకలనంగా రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు. అందులో, అలనాటి ఆధ్యాత్మిక భజన గీతాల రచయితలు బాలృష్ దాస్, అనుపోజు లక్ష్మణరావు, అంగర సూర్యారావు, గణపతిరాజు అచ్యుతరామరాజు, నటరాజ్ కె. వెంకటేశ్వరరావు, ఆర్.వి. చలం, రఘురామయ్య అత్తిలి కృష్ణారావు, ఎస్.కె. మిశ్రో వంటి ఎందరో నటశ్రేష్ఠుల చరిత్ర ఈ తరానికి తెలియజెప్పాలన్న ఆయన తపన ఆదర్శప్రాయం.

విశాఖపట్నంలో, విశాఖ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 3న ప్రముఖ కథ, నాటక రచయిత అంగర సూర్యారావు స్మారక పురస్కారం భళ్ళమూడి రామమూర్తికి అందజేస్తున్న సందర్భంగా ఆ నటయోగికి అభినందనలు.

– బి.వి. అప్పారావు

పెరుగుతున్న ఫ్రస్టేషన్

టెన్షన్.. టెన్షన్..



రెండు జిల్లాల్లో ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐల బదిలీల టెన్షన్

టెన్షన్.. టెన్షన్.. పోలీసుల బదిలీల్లో మునుపెన్నడూ లేనంత టెన్షన్. కాసులు కురిపించే స్టేషన్లకు ఎలాగైనా వెళ్లాలని ఎవరికి వారు పైరవీల్లో మునిగి తేలుతుంటే, తమ పరిస్థితి ఏమవుతుందోనని గతంలో వైసీపీకి వీర విధేయులుగా పనిచేసిన వారు కంగారు పడుతున్నారు. త్వరలో పోలీసు కమిషనరేట్‌తో పాటు కృష్ణాజిల్లాలోని అన్ని స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలను మార్పు చేయడానికి సన్నాహాలు జరుగుతుండగా, ఎవరి ప్రయత్నాలు వారు మొదలుపెట్టేశారు. పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, కృష్ణాజిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్ రావులు.. డీజీపీ అశోక్‌కుమార్‌తో సంప్రదింపులు జరిపిన అనంతరం ఈనెల 15 నాటికి మొత్తం మార్పులు, చేర్పులు జరిగే అవకాశాలు ఉండటంతో అందరి కన్ను 'పెద్ద'స్టేషన్లపైనే పడింది. కావాల్సిన సీటు కోసం అటు నాయకుల చుట్టూ కొందరు ఖాకీలు ప్రదక్షిణలు చేస్తుండగా, ఇటు ఇన్‌స్పెక్టర్ల కోసం వస్తున్న సిఫార్సులతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.
- విజయవాడ, ఆంధ్రజ్యోతి

- కాసులు పట్టే పోలీస్ స్టేషన్ కోసం తీవ్ర ప్రయత్నాలు
- నాడు వైసీపీ విధేయులు.. నేడు కూటమి నేతలతో పైరవీలు
- రాజకీయ నాయకుల వద్దకు ఖాకీల క్యూ
- సిఫారసు లేఖలతో తలలు పట్టుకుంటున్న అధికారులు
- వెస్ట్‌జోన్‌లో ఆ నాలుగు స్టేషన్లంటే భలే మక్కువ

మళ్లీ 'కృష్ణా'వైపే..

● జోగి రమేశ్ మంత్రిగా ఉన్నప్పుడు మైనారిటీ వర్గానికి చెందిన ఓ ఇన్‌స్పెక్టర్‌ను మచిలీపట్నం రూరల్ సీఐగా పోస్టింగ్ వేయించుకున్నారు. జోగి రమేశ్ నియోజకవర్గం మారాక ఆయనతో పాటు ఆ ఇన్‌స్పెక్టర్ కూడా మారిపోయారు. ఇప్పుడు ఆయన తిరిగి రూరల్ పీఎస్‌కు రావాలని ఆరాటపడుతున్నారు. ఈయనకు ముందు జోగి సామాజికవర్గానికి చెందిన ఒక ఇన్‌స్పెక్టర్ రూరల్ పీఎస్‌కు ఎస్‌హెచ్‌వోగా ఉండేవారు. జోగి అండ ఉండటంతో ఆయన అక్రమాలకు అంతు లేకుండాపోయింది. ఆరోపణలు తీవ్రమవ్వడంతో ఆయన్ను అక్కడి నుంచి పశ్చిమగోదావరి జిల్లాకు పంపారు. కొద్దిరోజుల్లో ఇన్‌స్పెక్టర్ల బదిలీలు అనివార్యం కావడంతో ఆయన తిరిగి బందరులో అడుగుపెట్టడానికి ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు.

● చల్లపల్లిలో పనిచేసిన ఓ ఇన్‌స్పెక్టర్ ఒక మహిళ విషయంలో దారుణంగా వ్యవహరించారు. ప్రస్తుతం ఆయన పశ్చిమగోదావరి జిల్లాలో పనిచేస్తున్నారు. ఆయన మనసు ఇప్పుడు బందరు వైపు మళ్లింది.

● గుడివాడ పట్టణంలో మూడు పీఎస్‌లు ఉన్నాయి. ఇది ఒక సర్కిల్ స్టేషన్‌గా ఉంది. వాటిలో రెండింటికి మాత్రం పోటీ తీవ్రంగా ఉంది. ఒకప్పుడు గుడివాడ టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేసి, భారీగా వ్యవహారాలను చక్కబెట్టి ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందిన ఆయన ఇప్పుడు గుడివాడను ఎంచుకున్నారు. శాంతిభద్రతల విభాగంలో ఏదో ఒక పీఎస్‌కు ఎస్‌హెచ్‌వోగా రావాలని ప్రయత్నాలు చేస్తున్నారు. గుడివాడలో ఎస్ఐగా పనిచేసిన సమయంలో ఆయనపై భారీగా ఆరోపణలు వచ్చాయి.

కొన్నాళ్ల క్రితం గుడివాడ ట్రాఫిక్‌లో ఎస్ఐగా పనిచేసి ఇన్‌స్పెక్టర్ హోదాలో ఉన్న ఓ అధికారి ఇప్పుడు మళ్లీ గుడివాడపై కన్నేశారు. ఇక్కడికి రావడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. ఆయన ఎస్ఐగా ఇంతకుముందు ముదినేపల్లిలో పనిచేసినప్పుడు ఏసీబీ ట్రాప్ నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. తర్వాత అక్కడి నుంచి గుడివాడలో వన్‌టౌన్, ట్రాఫిక్ ఎస్ఐగా వ్యవహరించారు. ఇప్పుడు ఆయన గుడివాడకు రావడానికి అన్ని మార్గాలు తిరుగుతున్నారు.

'ఎన్టీఆర్'లో ఆ స్టేషన్లే ముద్దు

ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి విజయవాడ వెస్ట్‌జోన్‌లో సీఐల పోస్టుల కోసం పైరవీలు జోరందుకున్నాయి. గతంలో వైసీపీకి వీర విధేయులుగా ఉండి, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు బనాయించిన వారు ఇప్పుడు రూటు మార్చారు. కూటమి నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేసున్నారు. వెస్ట్‌జోన్‌లో వన్‌టౌన్, కొత్త పేట, భవానీపురం, ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్లు ఉన్నాయి. ప్రస్తుతం ఇవన్నీ కాసులు కురిపించే స్టేషన్లుగా మారాయి.

● వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో దుర్గమ్మ ఆలయం ఉంది. అమ్మవారిని దర్శించుకోవడానికి నిత్యం ప్రముఖులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో చాలామంది వన్‌టౌన్‌కు రావడానికి ఆసక్తి చూపిస్తున్నారు. వన్‌టౌన్ వ్యాపార కేంద్రంగా కూడా ఉండటంతో పోటీ తీవ్రంగానే ఉంది.

●- ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్ పరిధిలో కూడా జాతీయ రహదారి ఉంది. ఇక్కడ పరిశ్రమలు, ఆయిల్ కంపెనీలు ఉన్నాయి. దీంతో ఈ నాలుగు పీఎస్‌లకు పోటీ ఎక్కువగా ఉంది.

● గతంలో గన్నవరం మాజీ ఎమ్మెల్యే అడుగుజాడల్లో నడిచి నాటి టీడీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించి బెదిరింపులకు పాల్పడిన గన్నవరం ఎస్ఐ వివాదాస్పదుడిగా పేరొందారు. గన్నవరం పరిసర ప్రాంతాల్లో కోట్లాది రూపాయల విలువచేసే మామిడి తోటలను బినామీ పేర్లతో కొన్నాడు. సీఐగా పదోన్నతి రావడంతో నగరంలో పలు స్టేషన్లలో పనిచేశాడు. ఇబ్రహీంపట్నంలో పనిచేసినప్పుడు ఆయనపై ఎన్నో ఆరోపణలు వచ్చాయి. బీఆర్‌టీఎస్ రోడ్డులో సొంతంగా డ్రైవింగ్ చేసుకుంటూ వెళ్తున్నప్పుడు పలు వాహనాలను ఆయన ఢీకొన్నాడు. ఈ వ్యవహారాన్ని బయటకు రానివ్వలేదు. ప్రస్తుతం కమిషనరేట్‌లో ఉన్న ఈయన ప్రధానమైన పోలీస్ స్టేషన్లలో పోస్టింగ్ కోసం ప్రయత్నిస్తున్నాడు.

● కొత్తపేట పోలీసుస్టేషన్‌లో గతంలో పనిచేసిన ఓ సీఐ హోంగార్డులతో మసాజ్ చేయించుకుని వివాదాస్పదుడిగా మారాడు. అప్పటి వైసీపీ ప్రజాప్రతినిధి ఇంటికి రోజూ వెళ్లి, ఆ తర్వాతే స్టేషన్‌కు వచ్చేవాడు. కరోనా సమయంలో వ్యాపారులను బెదిరించి భారీగా డబ్బు వసూలు చేసి స్వామిభక్తిని చాటుకున్నాడు. ఇతని అవినీతి అక్రమాలపై నాటి సీపీ విచారణకు కూడా ఆదేశించారు. ఇలాంటి వారంతా ఇప్పుడు కూటమి నాయకులు చుట్టూ పోస్టింగ్‌ల కోసం తిరుగుతున్నారు.

● భవానీపురం పోలీసు స్టేషన్ జాతీయ రహదారికి అనుబంధంగా ఉంది. ఇక్కడ భూమి రేట్లు పెరగడంతో పాటు లావాదేవీలు, వివాదాలు ఈ స్టేషన్‌కే చేరుతుంటాయి. ఇక్కడే హోల్‌సేల్ ఐరన్ మార్కెట్, సరుకుల మార్కెట్ ఉన్నాయి. దీంతో ఈ స్టేషన్‌కు వెళ్లేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తున్నారు

స్వాతంత్ర్య వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు | అధికారులతో ప్రత్యేక సమీక్ష 6లో..





నగరంలోని 13వ డివిజన్ కృష్ణానగర్‌లో పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కలెక్టర్ సృజన (ఇన్‌సెట్‌లో) ఎ.కొండూరు మండలం రామచంద్రాపురంలో వృద్ధురాలి ఇంటికెళ్లి పెన్షన్ ఇస్తున్న అంగన్వాడీ

రంచనుగా పింఛను

జిల్లావ్యాప్తంగా 96.7 శాతం పంపిణీ

నేటి ఉదయానికల్లా మొత్తం ప్రక్రియ పూర్తి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జిల్లావ్యాప్తంగా గురువారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ జరిగింది. మొదటి రోజు 96.7 శాతం మేర పెన్షన్లు పంపిణీ చేశారు. జిల్లావ్యాప్తంగా 2,34,143 మంది పెన్షనర్లకు గానూ గురువారం 2,26,422 మందికి పంపిణీ చేశారు. రూ.99 కోట్ల డబ్బు చెల్లించాల్సి ఉండగా, తొలిరోజు రూ.95.51 కోట్లు అందజేశామని డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. విజయవాడ అర్బన్ మండలాల పరిధిలో 68,224 మంది పెన్షనర్లకు గానూ 66,979 మందికి.. అంటే అత్యధికంగా 98.18 శాతం మేర పెన్షన్లు పంపిణీ చేశారు. శుక్రవారం ఉదయం 8 గంటల నాటికి నూరుశాతం పెన్షన్ల పంపిణీ పూర్తవుతుంది.

ప్రజా పంపిణీ వ్యవస్థపై సమగ్ర సర్వే

- గ్రామాలు, పట్టణాల్లో సివిల్ సప్లయిస్ అధికారుల సర్వే
- డోర్ డెలివరీపై ఎక్కువ మంది సానుకూలత
- మరిన్ని నిత్యావసరాలు ఇవ్వాలని కొందరి ఆకాంక్ష

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ప్రజా పంపిణీ వ్యవస్థ ఎలా ఉంది? ఎలా సాగుతోంది? ఈ వ్యవస్థ ద్వారా ప్రజలు ఏం ఆశిస్తున్నారు? వంటి అంశాలపై జిల్లా సివిల్ సప్లయిస్ అధికారులు క్షేత్రస్థాయిలో కార్డుదారుల దగ్గరకు వెళ్లి అభిప్రాయాలు సేకరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు ఈ మేరకు ప్రజల్లోకి వెళ్తున్నారు. మండలాలవారీగా శాంపిల్ సర్వే నిర్వహిస్తున్నారు. జిల్లా సివిల్ సప్లయ్ అధికారి (డీఎస్‌వో) మోహన్‌బాబు నేతృత్వంలోని ఏఎస్‌వో-1 లక్ష్మీనారాయణరెడ్డి, పీడీఎస్ డీటీ బత్తిన రామకృష్ణ గురువారం ఇబ్రహీంపట్నం మండలంలో సర్వే నిర్వహించారు. ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు, కార్డుదారుల ఆకాంక్షల మేరకు నడుచుకునేందుకు ప్రభుత్వం ఈ సర్వే చేయిస్తోంది.

ఏయే అంశాలు?

డోర్ డెలివరీపై సంతృప్తిగా ఉందా? రేషన్ డిపోల దగ్గర తీసుకోవటం బాగుందా? అని అధికారుల.. లబ్ధిదారులను ప్రశ్నిస్తున్నారు. ఇంకా ఏదైనా అదనంగా సరుకులను కోరుకుంటున్నారా..? వంటి ప్రశ్నలను కూడా సంధిస్తున్నారు. రైతుబజార్లలో సబ్సిడీ ధరకు అందిస్తున్న నిత్యావసరాల గురించి కూడా అడుగుతున్నారు. కాగా, డోర్ డెలివరీకే ప్రజలు ఓటేస్తున్నారు. అలాగే, ఎండీయూ ఆపరేటర్ల బదులు రేషన్ డీలర్ల ద్వారా నిత్యావసరాలను పంపిణీ చేయించాలన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. బియ్యం, పంచదారతో పాటు నాణ్యతతో కూడిన కందిపప్పు, గోధుమపిండి, నూనెను కూడా తప్పనిసరి చేయాలని కోరుతున్నారు. అలాగే, బహిరంగ మార్కెట్‌లో నిత్యావసరాలు, కూరగాయల ధరలు అధికంగా ఉన్నాయని, భరించే స్థితిలో లేవన్న అభిప్రాయాన్ని చాలామంది వ్యక్తం చేశారు. గ్రామాలు, పట్టణాల్లోని ప్రజల అభిప్రాయాలనే ఈ సర్వేలో పరిగణనలోకి తీసుకున్నారు. మరో రెండు, మూడు రోజులు సర్వే జరగనుంది. ఆ తర్వాత నివేదికను ప్రభుత్వానికి పంపిస్తారు. డీఎస్‌వో మోహన్‌బాబు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ప్రజాపంపిణీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా పనిచేయించాలన్న ఉద్దేశంతో ఈ సర్వే చేపట్టామన్నారు.

హీటర్ షాక్.. బాలుడు మృతి



అక్షయ్ మృతదేహం

విజయవాడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : హీటర్ షాక్ తగలడంతో ఓ బాలుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన పాత రాజరాజేశ్వరిపేటలో జరిగింది. కట్ట సురేష్ దంపతులకు ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. పెద్దకుమారుడు వైజాగ్‌లో బీఎస్సీ నర్సింగ్ చేస్తున్నాడు. రెండో కుమారుడు అక్షయ్‌కుమార్ (14) ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. సురేష్ బీరువాల పని చేస్తుంటాడు. ఆయన భార్య వన్‌టౌన్‌లో ఓ షాపులో పనిచేస్తోంది. రోజూ కుమారుడ్ని బైకుపై స్కూల్ వద్ద విడిచిపెడతాడు. రాత్రి 8 గంటలకు భార్యాభర్తలు తిరిగి ఇంటికి వస్తారు. అక్షయ్ స్కూల్ నుంచి సాయంత్రం ఇంటికి వస్తాడు. బుధవారం రాత్రి భార్యాభర్తలు వచ్చేసరికి అక్షయ్ ఒకపక్క విగతజీవిగా పడి ఉన్నాడు. అక్కడ బకెట్‌లో హీటర్ ప్లగ్‌కు వేలాడుతూ ఉంది. నేలపై నీళ్లు ఉన్నాయి. స్నానం చేయడానికి వేడినీళ్ల కోసం హీటర్ ఆన్ చేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై బాలుడు చనిపోయాడని పోలీసులు ధ్రువీకరించారు. దీనిపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

రైల్వే వాహనం ఢీకొని మహిళ దుర్మరణం

కుమారుడికి గాయాలు



ప్రమాదానికి కారణమైన వాహనం (ఇన్‌సెట్‌లో) లావణ్య (ఫైల్)

విద్యాధరపురం/ప్రభుత్వాసుపత్రి, ఆగస్టు 1 : విద్యాధరపురం ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డు జంక్షన్ వద్ద రైల్వే వాహనం ఢీకొని గురువారం ఓ మహిళ మృతిచెందింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు రైల్వే వాహనం డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. చిట్టినగర్ సెంటర్‌కు సమీపంలోని ఆర్‌ఆర్ చికెన్ సెంటర్ ఎదురుగా బాయన నరేష్ భార్య లావణ్య కుమార్తె, కుమారుడితో ఉంటున్నారు. నరేష్ వన్‌టౌన్‌లో వస్త్ర వ్యాపారం చేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం లావణ్య, ఆమె కుమారుడు అఖిల్ సాయిరాం (25) వారి యాక్టివా వాహనంపై గొల్లపూడిలో ఉన్న ఆమె సోదరుడి వద్దకు బయల్దేరారు. ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డు జంక్షన్ వద్ద సొరంగం వైపు నుంచి వేగంగా వచ్చిన రైల్వే వాహనం (లారీ) యాక్టివా బైకును ఢీకొని 50 మీటర్ల వరకు ఈడ్చుకెళ్లింది. ఈ సంఘటనలో లావణ్య లారీ టైర్ కిందపడి అక్కడికక్కడే చనిపోయారు. ఆమె కుమారుడికి గాయాలయ్యాయి. స్థానికులు లారీని ఆపి డ్రైవర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు లారీని స్టేషన్‌కు తరలించారు. గాయపడిన అఖిల్ సాయిరాంను చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. కాగా, మృతురాలి బంధువులు ప్రభుత్వాసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. వారికి భవానీపురం సీఐ సర్దిచెప్పారు.

'మల్లవల్లి'లో భూ సమస్యలు పరిష్కరించాలి




మల్లవల్లిలోని ఇండస్ట్రియల్ ఏరియా

యూనిట్లు నెలకొల్పడానికి సిద్ధంగా ఉన్న 121 ప్లాట్లకు సేల్ అగ్రిమెంట్ చేయండి

వివాదాల్లో ఉన్న 170 ప్లాట్లకు ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించేలా చర్యలు

ఏపీఐఐసీ ఎండీకి మంత్రి టీజీ భరత్ ఆదేశాలు

అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మల్లవల్లి పారిశ్రామికవాడ (మోడల్ ఇండస్ట్రియల్ పార్క్)లో పారిశ్రామికవేత్తలకు కేటాయించిన భూముల్లో సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించింది. మల్లవల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు సీఎంవో అధికారి కార్తికేయ మిశ్రాకు తమ సమస్యలను వివరించారు. "రాష్ట్ర విభజన తర్వాత సీఎం చంద్రబాబు పిలుపు మేరకు 350 మందికి పైగా పారిశ్రామికవేత్తలు దాదాపు రూ.1,100 కోట్ల పెట్టుబడులతో ఏపీలో యూనిట్లు నెలకొల్పేందుకు ముందుకు రాగా, ఏపీఐఐసీ ద్వారా 2018 జనవరిలో ప్రభుత్వం భూములు కేటాయించింది. భూ కేటాయింపులకు ప్రభుత్వం నిర్ణయించిన చార్జీలు అప్పుడే చెల్లించాం. కానీ ఆ భూములు పలు వివాదాల్లో ఉన్నాయి. అప్పటినుంచి భూముల రిజిస్ట్రేషన్, ఇండస్ట్రియల్ పార్కులో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయలేదు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మల్లవల్లి పార్కులో భూములు పొందిన వారిపై టీడీపీ సానుభూతిపరులనే ముద్రవేసి కేన్సిలేషన్ నోటీసులు ఇచ్చారు. ఎస్ఎంఈ పారిశ్రామికవేత్తలను టార్గెట్ చేసి అనేక ఇబ్బందులకు గురిచేశారు. అయినా ధైర్యం చేసి యూనిట్లు ప్రారంభించిన వారికి విద్యుత్తు, నీరు, ఇతర సౌకర్యాలు కల్పించకుండా అడ్డంకులు సృష్టించారు. గత ప్రభుత్వం ఎన్ని విధాలుగా వేధించి, ఒత్తిళ్లు తీసుకువచ్చినా గట్టిగా నిలబడ్డాం. ఏపీఐఐసీ ద్వారా జారీ చేసిన కేన్సిలేషన్ లేఖలపై కోర్టులను ఆశ్రయించి పోరాడుతున్నాం. ఇప్పుడు చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉన్నాం. మల్లవల్లి ఇండస్ట్రియల్ పార్కులో ప్రస్తుతం 121 మంది పారిశ్రామికవేత్తలకు కేటాయించిన ప్లాట్లు యూనిట్లు నెలకొల్పడానికి రెడీగా ఉన్నాయి. మరో 170 ప్లాట్లు వివాదాల్లో ఉన్నాయి. సిద్ధంగా ఉన్న ప్లాట్లను సేల్ అగ్రిమెంట్ చేయాలి. వివాదాల్లో ఉన్న ప్లాట్లకు బదులుగా ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించాలి" అని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి టీజీ భరత్.. అప్పటికప్పుడే ఏపీఐఐసీ వైస్ చైర్మన్, ఎండీకి ఆదేశాలు జారీ చేశారు. మల్లవల్లి పారిశ్రామికవాడలో యూనిట్లు నెలకొల్పడానికి సిద్ధంగా ఉన్న 121 ప్లాట్లను సేల్ అగ్రిమెంట్ చేయడంతో పాటు వివాదాల్లో ఉన్న 170 ప్లాట్లకు బదులు ప్రత్యామ్నాయ స్థలాలను కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీలైనంత త్వరగా ఈ సమస్యను పరిష్కరించాలని సూచించారు. దీనిపై మంత్రి భరత్‌కు మల్లవల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ అధ్యక్షుడు జీఎన్‌బీ చౌదరి ధన్యవాదాలు తెలిపారు. ఇటువంటి బిజినెస్ ఫ్రెండ్లీ వాతావరణం ఉంటే ఏపీకి పరిశ్రమలు పరుగెత్తుకుంటూ వస్తాయని ఆయన స్పష్టం చేశారు.



దుర్గగుడి అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించండి

▸▸ కేంద్రమంత్రికి ఎంపీ కేశినేని శివనాథ్ విజ్ఞప్తి 6లో..

కోర్టుల పేర్లు మార్పు

- కొత్త క్రిమినల్ చట్టాలను అనుసరించే..
- త్వరలో ఆయా కోర్టుల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయం

6లో..





దుర్గగుడి అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించండి

▸ కేంద్రమంత్రికి ఎంపీ కేశినేని శివనాథ్ విజ్ఞప్తి



న్యూఢిల్లీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధాని ప్రాంతంలోని అతి పెద్ద, ప్రాచీన దేవాలయం శ్రీ దుర్గ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం అభివృద్ధికి ప్రసాద్ పథకం కింద రూ. 100 కోట్లు మంజూరు చేయాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) విజ్ఞప్తి చేశారు. గురువారం, కేంద్ర మంత్రితో భేటీ అయినా ఎంపీ ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఆంధ్రప్రదేశ్‌లో తిరుమల తరువాత అతి పెద్ద దేవస్థానంగా శ్రీ దుర్గ మల్లేశ్వర స్వామి వారి ఆలయం ప్రసిద్ధి పొందిందని తెలిపారు. రోజుకి అమ్మవారిని 25,000 మంది భక్తులు దర్శించుకుంటారని, శుక్ర, శని, ఆదివారాలలో 50,000 మందికి పైగా భక్తులు తరలివస్తారని వివరించారు. ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని దర్శించేందుకు వచ్చే భక్తుల భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, నిర్మాణాల ప్రతిపాదనల వివరాలను ఎంపీ వివరించారు. భక్తులకి అవసరమైన అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు, ఆలయ అభివృద్ధికి ప్రసాద్ పథకం కింద రూ.100 కోట్లు మంజూరు చేయించాలని కోరారు. తన అభ్యర్థనపై కేంద్రమంత్రి షెకావత్ సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ కేశినేని తెలిపారు.

● అమృత్ పథకం కింద మచిలీపట్నానికి రూ.100.28 కోట్ల విలువైన 7 ప్రాజెక్టులు మంజూరు అయినట్లు కేంద్రం తెలిపింది. గురువారం, లోక్‌సభలో జనసేన ఎంపీ బాలశౌరీ అడిగిన ప్రశ్నకు కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల సహాయ మంత్రి టోకన్ సాహు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 7 ప్రాజెక్టులలో 4 పూర్తయ్యాయని, మూడు వివిధ దశలలో ఉన్నాయని తెలిపారు.

పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యుడిగా ఎంపీ బాలశౌరి

మచిలీపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యుడిగా గురువారం మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి ఎంపికయ్యారు. కమిటీలో మొత్తం 15మంది సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ సభ్యులు కేంద్రప్రభుత్వ ఖాతాలను పరిశీలిస్తారు.



జిల్లా ఉపాధి కల్పనా అధికారులతో ఓంకాప్ జీఎం

గల్ఫ్ కార్మికులకు ముందస్తు అవగాహన కల్పించండి

▸ ఓంకాప్ జీఎం క్రాంతికుమారి

కృష్ణలంక, ఆగస్టు 1 : ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లేవారికి ప్రయాణ జాగ్రత్తలు, ఉద్యోగ మెళకువలపై శిక్షణ ఇచ్చి గుర్తింపు పొందిన ఏజెన్సీల ద్వారా మాత్రమే అవకాశాలు పొందేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ జనరల్ మేనేజర్ బీఆర్ క్రాంతికుమారి తెలిపారు. గల్ఫ్ వర్కర్లకు అందించాల్సిన శిక్షణపై ఐటీఐ కళాశాల ప్రాంగణంలో గల ఓంకాప్ కార్యాలయంలో శ్రీకాకుళం, విశాఖపట్నం, కడప, చిత్తూరు, కాకినాడ, విజయవాడ జిల్లా ఉపాధి కల్పనా అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విదేశాలలో ఉపాధి కోసం సరైన ధృవపత్రాలతో ప్రభుత్వ అనుమతితో నడపబడే ఏజెన్సీల ద్వారా మాత్రమే వెళ్లేలా అవగాహన కల్పించాలన్నారు. సరైన వివరాలతో కనీసం 6 నెలల పాటు చెల్లుబాటయ్యే పాస్‌పోర్టు వర్క్ వీసా తప్పనిసరిగా వుండాలన్నారు. ఉపాధి పొందిన వారికి లైంగిక వేధింపులు, హింస, ఇతర ఇబ్బందులు ఎదురైనప్పుడు భారతీయ రాయబార కార్యాలయాన్ని సంప్రదించాల్సిన విధానంపై అవగాహన కల్పించాలన్నారు. ఓంకాప్ జిల్లా ఉపాధి కల్పన అధికారులు సంయుక్తంగా బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఓంకాప్ హెచ్‌ఆర్ మేనేజర్ ఎం.సతీష్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ జి.గోపి, విశాఖపట్నం, శ్రీకాకుళం, కడప, కాకినాడ, చిత్తూరు, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన ఉపాధి కల్పన కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇనాం భూముల క్రయ విక్రయాలపై నిషేధం ఎత్తేయండి

▸ చంద్రబాబుకు ఎమ్మెల్యే తాతయ్య వినతి



జగ్గయ్యపేట, ఆగస్టు 1 : దేవాదాయశాఖ ఇనాం భూముల క్రయవిక్రయాలపై నిషేధం ఎత్తివేసేందుకు చర్యలు తీసుకోవాలని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య బుధవారం సెక్రటేరియట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో 1100 ఎకరాలు నిషేధిత జాబితాలో ఉండటం వల్ల యజమానులు, ప్లాట్ల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, క్రయవిక్రయాలు నిలిచిపోవటం, బ్యాంకు రుణాలు రాకపోవటం, స్వాధీనంలో ఉన్న హక్కులు లేక కష్టాలు పడుతున్నారని వివరించారు. గతంలో ఈ భూములపై నిషేధం ఎత్తివేతకు తీసుకున్న చర్యలు తుది దశలో ఉన్నాయని తెలిపారు. సీఎం సానుకూలంగా స్పందించారని ఆయన చెప్పారు.

కోర్టుల పేర్లు మార్పు



విజయవాడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో న్యాయస్థానాల సముదాయంలోని క్రిమినల్ కోర్టుల పేర్లు మారాయి. కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలతో ఈ పేర్లలో మార్పులు వచ్చాయి. కేంద్రం బీఎన్ఎస్ (భారతీయ న్యాయ సన్హిత), బీఎన్ఎస్ఎస్(భారతీయ నాగరిక సురక్షా సన్హిత), బీఎస్ఏ (భారతీయ సాక్ష్యా అధినియం) చట్టాలను అమల్లోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఈ కేసులను విచారించే కోర్టుల పేర్లను మార్చారు. క్రిమినల్ కేసులను చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ (సీఎంఎం), అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ (ఏసీఎంఎం) కోర్టుల్లో విచారిస్తున్నారు. విజయవాడలో ఐదు సీఎంఎం కోర్టులు, తొమ్మిది మెట్రోపాలిటన్ కోర్టులు, ఆరు ఏసీఎంఎం కోర్టులున్నాయి. వాటిలో సీఎంఎం కోర్టులను చీఫ్ జుడిషియల్ మేజిస్ట్రేట్ (సీజేఎం)గా మార్పు చేశారు. ఏసీఎంఎంఎం కోర్టుల పేర్లను ఏసీజేఎంగా వ్యవహరిస్తున్నారు. మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టును జుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులుగా పిలుస్తున్నాయి. మార్చిన పేర్లతో త్వరలో ఆయా కోర్టుల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని న్యాయాధికారులు నిర్ణయించారు.

ధానాపూర్-ఎస్ఎంబీటీ బెంగళూరు మధ్య ప్రత్యేక రైళ్లు



రైల్వేస్టేషన్, ఆగస్టు 1 : ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు ధానాపూర్-బెంగుళూరు మధ్య ఈనెల 11వ తేదీ వరకు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు విజయవాడ రైల్వే డివిజన్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ నుస్రరత్ ఎం.మండ్రూపకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 03247 నెంబరు రైలు ఈనెల 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ప్రతి గురువారం, 03248 రైలు 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ప్రతి శనివారం, 03241 రైలు 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ప్రతి శుక్రవారం, 03242 రైలు 4వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ప్రతి ఆదివారం రెండేసి ట్రిప్పుల చొప్పున నడుస్తాయన్నారు. 03245 రైలు 7వ తేది బుధవారం, 03246 రైలు ఈనెల 9వ తేదీ శుక్రవారం, 03259 రైలు 6వ తేదీ మంగళవారం, 03260 ఈనెల 8వ తేది గురువారం ఒక ట్రిప్పు చొప్పున నడుస్తాయన్నారు.

బీఎస్ఎన్ఎల్ సిమ్ కార్డ్ అప్‌గ్రేడ్ చేసుకోండి

గుణదల, ఆగస్టు 1 : బిఎస్ఎన్ఎల్ వినియోగదారులు సిమ్ కార్డ్‌ను తక్షణమే అప్‌గ్రేడ్ చేసుకుని 4జి సేవలను సద్వినియోగం చేసుకోవాలని బీఎస్ఎన్ఎల్ విజయవాడ బిజినెస్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ వై.రవీంద్రనాథ్ గురువారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో తెలిపారు. బిఎస్ఎన్ఎల్ దశలవారీగా పాన్ ఇండియా ఆధారంగా 4జి టెక్నాలజీని ప్రవేశపెట్టడం జరిగిందని చెప్పారు. అయినప్పటికీ చాలా మంది వినియోగదారులు ఇప్పటికీ తమ మొబైల్ సేవలను 2జి, 3జి సిమ్‌లో మాత్రమే ఉపయోగిస్తున్నారన్నారు. కస్టమర్లకు వారి ప్రాంతాల్లో 4జి సేవలు ప్రారంభించినప్పుడు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. వినియోగదారులు సిమ్‌ను అప్‌గ్రేడ్ చేసిన తర్వాత 2జి, 3జి, 4జి సేవలను ఆస్వాదించవచ్చని చెప్పారు. 4జికి అప్‌గ్రేడ్ చేసిన తర్వాత 2జి, 3జి సేవలు కూడా కొనసాగుతాయని తెలిపారు. 54040కి సిమ్ అనే సందేశాన్ని పంపడం ద్వారా కస్టమర్లు తమ సిమ్ రకాన్ని సులభంగా కొనసాగించవచ్చని చెప్పారు. ప్రస్తుతం ప్రవేశ పెట్టిన 4జి సిమ్ అప్‌గ్రేడ్ ఆఫర్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



తూర్పులో వృద్ధునికి పింఛను ఇస్తున్న కలెక్టర్ సృజన



షేర్ అహ్మద్ పేటలో శ్రీరాం తాతయ్య..



వీరభద్రపురంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్..



కోడూరులో పింఛను పంపిణీ చేస్తున్న బుద్ధప్రసాద్

ఆత్మీయ పలకరింపుతో..

ఎన్టీఆర్ భరోసా పంపిణీ

ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు వెంటరాగా.. సచివాలయ ఉద్యోగులు గురువారం తెల్లవారుజామున 3.30 గంటల నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. నిద్ర లేపి పింఛన్లు అందచేయడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. తెల్లవారుజామున 3.30 గంటలకు పింఛన్లు ఇవ్వడం గతంలో ఎన్నడూ లేదని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు.

అర్హులైన పేదలందరికీ పింఛన్లు

▸ మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 1 : అర్హులైన పేదలు, దివ్యాంగులకు పింఛన్లు పంపిణీ చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గురువారం ఉదయం కొనకళ్ల నారాయణ, జనసేన నేత బండిరామకృష్ణ, తదితరులతో కలిసి మంత్రి చిన్నాపురం, నారాయణపురంలలో పింఛన్లు పంపిణీ చేశారు. చిన్నాపురంలో మంచానికే పరిమితమైన దివ్యాంగుడు నాంచారయ్యకు రూ.15 వేలు అందజేశారు. చేనేత కార్మికుడు



చిన్నాపురంలో చేనేత కార్మికునికి పింఛను అందజేస్తున్న మంత్రి రవీంద్ర

సుబ్బారావుకు రూ.4వేలు అందజేశారు. నారాయణపురం యానాదుల కాలనీలో ఏకశిరి చెంచమ్మకు వితంతు పింఛను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసభాపతి బూరగడ్డ వేదవ్యాస్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన కృష్ణా కలెక్టర్

కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ గురువారం ఉదయం 6 గంటలకే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. లబ్ధిదారులను కుశల ప్రశ్నలు వేస్తూ కలెక్టర్ చిలకలపూడిలోని 6వ డివిజన్‌లో విజయలక్ష్మికి పింఛను పంపిణీ చేశారు. మునిసిపల్ కమిషనరు బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.



16వ వార్డులో వృద్ధురాలికి పింఛను అందచేస్తున్న కలెక్టర్ బాలాజీ

పెడనలో 98 శాతం పూర్తి..

పెడన : పెడన మునిసిపాలిటీలో పింఛన్ల పంపిణీ విజయవంతమైంది. సచివాలయ ఉద్యోగులు గురువారం సాయంత్రం 5.30 గంటలకు 98 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. మునిసిపాలిటీ పరిధిలో మొత్తం 4477 మంది లబ్ధిదారులుండగా సాయంత్రానికి 4406 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. కలెక్టర్ బాలాజీ గురువారం వార్డుల్లో పింఛన్ల పంపిణీ తీరు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. 16వ వార్డులో వృద్ధులకు పింఛన్లు అందజేసి కుశల ప్రశ్నలు వేశారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావుతో కలిసి 7వ వార్డు వీరభద్రపురంలో ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేశారు. కమిషనర్ వెంకట్రామయ్య, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పామర్తి జితేంద్ర, టీడీపీ నాయకులు ఏడుకొండలు, వహబ్‌ఖాన్, కమ్మగంటి బాబు, తమ్మా భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో.. కలెక్టర్ సృజన

పటమట : లబ్ధిదారులను ఆత్మీయంగా పలకరిస్తూ వారి ఇళ్ల వద్దకే వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్ మొత్తాన్ని అందించే కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలో 13వ డివిజన్ కృష్ణానగర్ 57వ సచివాలయం పరిధిలో గురువారం లబ్ధిదారులను స్వయంగా కలిసి పింఛన్లు అందించారు. ముఖ్యమంత్రి తరఫున క్షేమసమాచారాన్ని తెలుసుకొని వృద్ధాప్య పింఛన్ మొత్తం రూ.4 వేల చొప్పున, డయాలసిస్ చేయించుకుంటున్న నాగవరపు బాలాజీకి రూ.10 వేలు అందించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 2,34,143 మంది పింఛన్‌దారులకు సుమారు రూ.99 కోట్ల మేర అందజేసే కార్యక్రమాన్ని విజయవంతమైనట్టు తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు మ్యాప్ చేసిన లబ్ధిదారుల ఇళ్లవద్దకే వెళ్లి పింఛన్ మొత్తాన్ని అందించినట్టు పేర్కొన్నారు.

పేదల సంక్షేమంపై చిత్తశుద్ధి : ఎమ్మెల్యే గద్దె

పేదలు ఇబ్బంది పడకూడదనే లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ మొత్తాన్ని అందజేస్తున్నట్టు తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. పేదల సంక్షేమాన్ని దృష్టిలో వుంచుకొని వారిపై చిత్తశుద్ధితో ప్రభుత్వం సేవలందిస్తోందన్నారు. కొత్తగా అర్హులను గుర్తించేందుకు చర్యలు తీసుకొంటున్నామని, గతంలో వివిధ కారణాల వల్ల నిలిచిపోయిన వారి జాబితాను సమీక్షించి వారికి కూడా లబ్ధి చేకూర్చనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, స్థానిక కార్పొరేటర్ ఎం.ప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆసుపత్రి బెడ్ వద్దకే.. పింఛన్

పెనమలూరు : ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో భాగంగా కూటమి శ్రేణులు లబ్ధిదారులను వెతికి మరీ వారి చేతికి నేరుగా పింఛన్ సొమ్మును అందజేస్తూ సమాజానికి ఆదర్శంగా నిలిచారు. పెదపులిపాక గ్రామానికి చెందిన నాగేశ్వరమ్మ అనారోగ్యంతో నిమ్రా ఆసుపత్రిలోని క్రిటికల్ కేర్ యూనిట్‌లో ప్రత్యేక చికిత్స తీసుకొంటోంది. ఆమె వద్దకు గ్రామ



ఆసుపత్రి బెడ్ మీదే పింఛన్ అందిస్తున్న పెదపులిపాక టీడీపీ నాయకులు

టీడీపీ నేతలు సచివాలయ సిబ్బంది ప్రసాద్‌ను దాదాపు ముప్పై కిలోమీటర్లు తీసుకెళ్లి ఆమె చేతికి పింఛను అందజేసి ఆదర్శంగా నిలిచారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు మునునూరి శ్రీనివాసరావు, మండల తెలుగు యువత అధ్యక్షుడు గుజ్జర్లపూడి బాబురావు తదితరులు ఉన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

▸ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

కృష్ణలంక, ఆగస్టు 1 : ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 15వ తేదీన నిర్వహించనున్న 78వ భారత స్వాతంత్ర్య దినోత్సవ రాష్ట్రస్థాయి వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. వేడుకల ఏర్పాట్లపై గురువారం సచివాలయంలో ఆయన సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ సృజన, జేసీ నిధి మీనా, మున్సిపల్ కమిషనర్ హెచ్‌ఎం.ధ్యానచంద్ర, విజయవాడ ఆర్డీవో బీహెచ్ భవానీశంకర్ తదితరులు వర్చువల్‌గా హాజరయ్యారు. వేడుకల నిర్వహణకు సంబంధించి శాఖలపరంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై సీఎస్ మార్గనిర్దేశనం చేశారు. అదే రోజు సాయంత్రం రాజ్‌భవన్‌లో జరగనున్న ఎట్



సీఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సృజన

హోం కార్యక్రమానికి సంబంధించి కూడా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలపై శాఖల వారీగా ప్రత్యేక శకటాల ప్రదర్శన, ముఖ్యమైన భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరణ, వర్షాకాలం నేపథ్యంలో ప్రత్యేకంగా తీసుకోవాల్సిన చర్యలు, పోలీస్ బందోబస్తు తదితరాలపై సీఎస్ సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అత్యంత వైభవంగా వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేయనున్నట్లు కలెక్టర్ సృజన తెలిపారు.

తల్లిపాలు బిడ్డకు ఆరోగ్య ప్రదాయిని

కృష్ణలంక : తల్లిపాలు బిడ్డకు ఆరోగ్య ప్రదాయిని అని, బిడ్డకు తల్లిపాలను మించిన శ్రేయస్కరం మరొకటి లేదని కలెక్టర్ జి.సృజన అన్నారు. గురువారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు (ఆగస్టు 1-7) ప్రారంభమైన సందర్భంగా కలెక్టర్ జి.సృజన మాట్లాడుతూ, తల్లిపాల వారోత్సవాల ఔన్నత్యాన్ని తెలియజేయడం, అపోహలను తొలగించడం, క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు, ఆశాలు ప్రత్యేక సెషన్లతో అవగాహన కార్యక్రమాలు, 2కే ర్యాలీలు, గృహ సందర్శనలు వంటివి ఈ వారోత్సవాల సందర్భంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో వారోత్సవాలు జరుగుతాయన్నారు. తల్లి శారీరక, మానసిక స్థితిని అర్థం చేసుకొని భర్త, కుటుంబసభ్యులు ఆమెకు తోడుగా నిలవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

ఫిషింగ్ హార్బర్ పనులు వేగవంతం చేయాలి : కలెక్టర్

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 1 : ఫిషింగ్ హార్బర్ పనులను వేగవంతం చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ డికె బాలాజీ సూచించారు. గురువారం గిలకలదిండిలోని ఫిషింగ్ హార్బరును కలెక్టర్ సందర్శించి నిర్వహిస్తున్న పనుల వివరాలను అడిగితెలుసుకున్నారు.రూ 422 కోట్ల వ్యయంతో జరుగుతున్న ఫిషింగ్ హార్బరు పనుల్లో 50 శాతం పూర్తయినట్టు ఏపీ మారిటైం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా అధికారి ఏ చంద్రశేఖర్, ఈఈ మునిరెడ్డి, ఏఈ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రవాణా సంస్థ ఉద్యోగుల వార్షిక సమావేశం రేపు

బస్ స్టేషన్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రజారవాణా సంస్థ ఉద్యోగుల వార్షిక సమావేశం ఈనెల 3వ తేదీన భవానీపురంలోని శక్తిగ్రాండ్ హోటల్‌లో నిర్వహించనున్నట్టు సంఘం అధ్యక్షుడు బి.కేదారేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సమావేశం ప్రారంభమవుతుందని, సమావేశానికి ముఖ్య అతిథిగా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ పాల్గొంటారని తెలిపారు. ప్రభుత్వంలో విలీనమైన ఉద్యోగుల సమస్యల పైన చర్చ జరుగుతుందని, దీంతో పాటు నూతన కమిటీని ఎన్నుకోనున్నట్టు తెలిపారు.

ఏసీఏ సీనియర్ క్రికెట్‌లో పట్టుబిగించిన కృష్ణా

విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 1 : ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూలపాడు వేదికగా గురువారం ప్రారంభమైన సెంట్రల్ జోన్ సీనియర్ పురుషుల మల్టీ డే అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో తొలి రోజే కృష్ణా టీమ్ ప్రత్యర్థి ప్రకాశంపై పట్టు బిగించింది. మొదటి మ్యాచ్‌లో టాస్ గెలిచిన ప్రకాశం ఫీల్డింగ్ ఎంచుకోగా, బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 81 ఓవర్లలో 384/4 పరుగులు చేసింది. సందీప్ చెలరేగి 200 బంతుల్లో 23 ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో 167 పరుగులతో అజేయంగా నిలిచాడు. ప్రణీత్ 72 పరుగులతో క్రీజులో ఉన్నాడు. విశాల్ అర్ధసెంచరీ(64) వద్ద అవుటయ్యాడు. ప్రకాశం బౌలర్ వి.వేణు 69 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు.

వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

● డాక్టర్ బీఎస్‌సీపీ రాజు



ప్రభుత్వాసుపత్రి, ఆగస్టు 1: సీజనల్ వారీగా వచ్చే వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని చిన్న పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ బీఎస్‌సీపీ రాజు తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల్లో మలేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్, అతిసార వంటి వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. వాతావరణంలో మార్పుల వలన వైరస్ పెరిగి దగ్గు, జలుబు, జ్వరం సంభవిస్తాయన్నారు. చిన్నపిల్లలకు త్వరగా దరిచేరతాయన్నారు. తాగునీటి కలుషితం, బయట తినే ఆహార పదార్థాలు, శుభ్రత పాటించకపోవడంతో విరోచనాలు, వాంతులు, టైఫాయిడ్ వంటి వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వ్యాధులు సోకే అవకాశం ఉంటుందన్నారు. ఎవరైనా అనారోగ్యానికి గురైనట్టయితే వైద్యులను సంప్రదించి వారి సూచనల మేరకు నడుచుకోవాలన్నారు. నిల్వ ఉన్న ఆహారం, కలుషిత నీరు తాగటం వలన టైఫా యిడ్ జ్వరం వచ్చే అవకాశం ఉందని నివారణకు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలన్నారు.

మంద కృష్ణమాదిగకు చిత్రపటానికి పాలాభిషేకం

ధర్నాచౌక్, ఆగస్టు 1: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పేరెల్లి ఏలీషా మాదిగ ఆధ్వర్యంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ విజయోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద ఉన్న జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏలీషా మాదిగ మాట్లాడుతూ ఉద్యమకారులకు, ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మొదటి నుంచి కృష్ణమాదిగకు అండగా నిలిచిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ సుబ్బారావు మాదిగ, మందా వెంకటేశ్వరరావు మాదిగ, కోటా దానియేలు మాదిగ పాల్గొన్నారు.

చంద్రబాబుకు కృతజ్ఞతగా 16 నుంచి యాత్ర: పేరుపోగు

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ స్వాగతించారు. ఈ సందర్భంగా గాంధీనగర్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానికులకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఏబీసీడీ గ్రూపుల వర్గీకరణకు అనుకూల తీర్పు రావడానికున్న అడ్డంకులను అధిగమించేందుకు చిత్తశుద్ధితో కృషి చేసిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని మోదీ, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ 16 నుంచి కృతజ్ఞతయాత్ర చేపడుతున్నట్టు తెలిపారు.

సౌత్‌జోన్ త్రోబాల్ చాంప్‌కు రాష్ట్ర జట్ల పయనం

విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 1: కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ నెల 3, 4న జరిగే సౌత్‌జోన్ త్రోబాల్ చాంపియన్‌షిప్ పాల్గొనే జట్లను ఎంపిక చేశామని ఏపీ త్రోబాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఈదా సులోచన తెలిపారు. నగరంలోని ఐజీఎంసీ స్టేడియంలో క్రీడా జట్లకు జెర్సీలను ఏపీ త్రోబాల్ ప్రెసిడెంట్ మురళీకృష్ణంరాజు, ట్రెజరర్ పి శిరీష, ఏపీ సెక్రటరీ ఎండీ గౌస్‌బాబు, జిల్లాక్రీడాభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్ అందించి క్రీడా జట్లను అభినందించారు. క్రీడాకారులు పతకాలతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.

ప్రత్యేక కౌంటర్లలో నాణ్యమైన సరుకులు : జేసీ

కృష్ణలంక, ఆగస్టు 1 : పౌరసరఫరాలశాఖ మంత్రి ఆదేశాలను అనుసరించి జిల్లాలో రైతుబజార్లు, పెద్ద సంస్థాగత రిటైల్ దుకాణాల్లో సరసమైన ధరల్లో నాణ్యమైన నిత్యావసర సరుకులు అందుబాటులో వున్నట్టు జేసీ నిధి మీనా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉషోదయ, మెట్రో, రిలయన్స్, డీమార్ట్ తదితర పెద్ద రిటైల్ దుకాణాల్లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా సరసమైన ధరలకు నాణ్యమైన సరుకులు పొందవచ్చన్నారు. కిలో కందిపప్పు (దేశవాళి) రూ.150, కిలో బియ్యం (స్టీమ్డ్-బీపీటీ/సోనామసూరి) రూ.48, పచ్చిబీపీటీ/సోనామసూరి రూ.47కే అందజేయనున్నట్టు వివరించారు. కౌంటర్ల వద్ద సరుకుల నాణ్యతను టెక్నికల్ సిబ్బంది, తూకాన్ని లీగల్ మెట్రాలజీ సిబ్బంది తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మతిస్థిమితం లేని మహిళపై లైంగిక దాడి

▸ నిందితుడి అరెస్టు, రిమాండ్



బంటుమిల్లి, ఆగస్టు 1 : మతిస్థిమితం లేని మహిళపై లైంగికదాడికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బంటుమిల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన బంటుమిల్లి రాజీవ్‌గాంధీ మార్కెట్‌లో మతిస్థిమితం లేని మహిళ(43) తమ్ముడు, మరదలితో కలిసి నివాసం ఉంటోంది. గత నెల 26వ తేదీన తమ్ముడు, అతడి భార్య పనుల నిమిత్తం బయటికి వెళ్లగా పక్కనే నివాసం ఉంటున్న కొనాల వెంకటేశ్వరరావు లైంగికదాడి చేశాడు. సాయంత్రం తమ్ముడు, మరదలు ఇంటికి వచ్చేసరికి తీవ్ర రక్తస్రావంతో మహిళ బాధపడుతుండగా వైద్యం నిమిత్తం మచిలీపట్నం తరలించారు. కోలుకున్న అనంతరం 29వ తేదీన ఇంటికి చేరుకున్నారు. సాయంత్రం కొనాల వెంకటేశ్వరరావు మతిస్థిమితం లేని మహిళను చూసి సైగ చేస్తుండడాన్ని మరదలు గమనించింది. అనుమానంతో గ్రామ పెద్దల ద్వారా వెంకటేశ్వరరావును ప్రశ్నించగా లైంగికదాడి చేసినట్టు ఒప్పుకోవడంతో బంటుమిల్లి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పెడన సీఐ కె.నాగేంద్ర ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తూ గురువారం వెంకటేశ్వరరావును అరెస్టు చేసి బంటుమిల్లి కోర్టులో హాజరు పరచి రిమాండ్ నిమిత్తం బందరు సబ్ జైలుకు తరలించారు.

ఎన్టీఆర్ జిల్లా దేవదాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్‌గా లోకేశ్వరి

వన్‌టౌన్ ఆగస్టు 1 : ఎన్టీఆర్ జిల్లా దేవాదాయ శాఖ ఇంఛార్జి సహాయ కమీషనర్‌గా అంకమ్మ పేరంటాలమ్మ దేవస్థానం ఈ.ఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న లోకేశ్వరిని నియమించారు. ఈ మేరకు గురువారం సంబంధిత ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ఇంఛార్జి సహాయ కమీషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సీతారావమ్మ వ్యక్తిగత పనుల పై 3 నెలల పాటు సెలవు పై వెళ్లారు. దీంతో సంబంధిత అధికారులు లోకేశ్వరిని ఇంఛార్జి సహాయ కమీషనర్‌గా నియమించారు. ఆమె రెండు మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	96, 105, 116
చికెన్ విత్ స్కిన్	180
చికెన్ స్కిన్‌లెస్	190

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.50

నగరాభివృద్ధికి కృషి చేయండి

కమిషనర్‌ను కోరిన టీడీపీ నాయకులు

వన్‌టౌన్ ఆగస్టు 1 : నగర అభివృద్ధికి మరింత కృషి చేయాలని సెంట్రల్ సమన్వయకర్త, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్రను కోరారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ ధ్యానచంద్రను ఆయన చాంబర్‌లో నవనీతం సాంబశివరావు కలిసి విజ్ఞప్తి చేశారు. టీడీపీ నాయకులు పైడి శ్రీను, ఎస్.కే. జాన్‌వలీ, బంగారు నాయుడుతో కలిసి సాంబశివరావు కమిషనర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందచేసి దుశ్శాలువాతో సత్కరించారు.





పెన్షన్ల పంపిణీ 39వ డివిజన్‌లో



52వ డివిజన్‌లో



64వ డివిజన్‌లో



18వ డివిజన్‌లో



మధురానగర్‌లో



ఊర్మిళానగర్‌లో



31వ డివిజన్‌లో



4వ డివిజన్‌లో

ఉత్సాహపూరితంగా పెన్షన్ల పంపిణీ

వన్‌టౌన్, ఆగస్టు 1: నగరంలో గురువారం ఉదయం వేకువ జాము నుంచే ఉత్సాహపూరిత వాతావరణంలో సామాజిక భద్రతా పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా ప్రాంత సచివాలయ ఉద్యోగులతో పాటు స్థానిక నాయకులు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పెన్షన్ పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం పెన్షన్ మొత్తాన్ని 3వేల నుంచి 4 వేలకు పెంచింది. ఈ మొత్తాన్ని తీసుకుంటున్న లబ్ధిదారులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు.

●52వ డివిజన్‌లో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, 49వ డివిజన్‌లో కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్, బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కొమర కిరణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● 39వ డివిజన్ నాలుగు స్తంభాల సెంటర్‌లో జరిగిన పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్, డివిజన్ టీడీపీ అధ్యక్షుడు రేగళ్ల లక్ష్మణరావు పాల్గొన్నారు.● 40వ డివిజన్‌లో డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పొనుగుపాటి వెంకట సుబ్బయ్య, సచివాలయ అడ్మిన్ అజయ్ బాబు, తదితరులు 121, 122, 123, 124 సచివాలయాల పరిధిలో లబ్ధిదారులకు పెన్షన్ల పంపిణీని ఉదయమే పూర్తి చేశారు.

పాయకాపురం, అజిత్‌సింగ్‌నగర్: 64వ డివిజన్ కండ్రిక కాలనీలో గురువారం టీడీపీ నేతలు, అధికారులు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని 58వ డివిజన్‌లో అధ్యక్షుడు అలా తారక రామారావు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. 62వ డివిజన్ ప్రకాష్‌నగర్‌లో డివిజన్ ఇన్‌చార్జ్ పైడి శ్రీను ఆధ్వర్యంలో పెన్షన్లను అందజేశారు.

రాణిగారితోట: 18వ డివిజన్‌లో జరిగిన పెన్షన్ల పంపిణీలో డివిజన్ అధ్యక్షుడు వేముల దుర్గారావు పాల్గొన్నారు. పింఛన్లు పెంచడంతో అనేక మంది పేదల ఆర్థికంగా ఇబ్బందులు లేకుండా జీవితాన్ని కొనసాగిస్తున్నారని వారందరు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నారని అన్నారు.

మధురానగర్: మధురానగర్‌లో పింఛన్ పంపిణీ ఉదయం ఆరు గంటలకు సగం పూర్తి చేశారు. స్పెషలాఫీసర్ రమణ రెడ్డి, డివిజన్ ఇన్‌ఛార్జి నెక్కంటి ప్రసాద్, బీసీ నాయకుడు అంగిరేకుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భవానీపురం: 43వ డివిజన్ ఊర్మిళానగర్‌లో టీడీపీ సీనియర్ నాయకుడు మోరబోయిన రాంబాబు, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు బి కోటి, జనసేన నాయకులు కార్యకర్తలు పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. 45వ డివిజన్ జనసేన నాయకులు బొమ్మ రాంబాబు పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారు.

సత్యనారాయణపురం: 31వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ పిన్నంరాజు త్రిమూర్తిరాజు, డివిజన్ అధ్యక్షుడు పడమటి రామకృష్ణ, సచివాలయం సెక్రటరీల ఆధ్వరంలో పింఛన్లు పంపిణీ చేశారు. 33వ డివిజన్‌లో పక్షవాతంతో బాధపడుతున్న రాధారాణి అనే మహిళకు రూ.15వేల పెన్షన్ డివిజన్ ఇన్‌చార్జి గార్లపాటి విజయకుమార్ పంపిణీ చేశారు.

భారతీనగర్: నాల్గవ డివిజన్‌లోని భారతీనగర్‌లో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రద్దు చేసిన పెన్షన్లను పునరుద్ధరించాలి



వన్‌టౌన్: రద్దు చేసిన పెన్షన్‌లను పునరుద్ధరించాలని 50వ డివిజన్ కార్పొరేటర్ బి. సత్యబాబు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన గత ప్రభుత్వం అర్హులకు కూడా పెన్షన్‌లను రద్దు చేసిందని, కరెంటు బిల్లు, ఆదాయపు పన్ను, స్థలాలు ఉన్నాయన్న తప్పుడు కారణాలతో అనేక మందికి పెన్షన్‌లు రద్దు చేశారన్నారు. వీటిని వెంటనే పునరుద్ధరించాలన్నారు. కొత్త పెన్షన్ దరఖాస్తులను స్వీకరించాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం తీర్పు హర్షణీయం



మాట్లాడుతున్న చల్లగాలి అనిల్

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 1 : సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ అనివార్యమని సెంట్రల్ టీడీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి చల్లగాలి అనిల్ అన్నారు. ఆయా రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చని దేశ ఉన్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని అజిత్‌సింగ్‌నగర్‌లోని దళిత మార్గ్‌లో ఎస్సీ సెల్ నేతలు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు సహకరించిన ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలియజేశారు. నేతలు కోడాలి వంశీ, రాజేష్, వినయ్, అశోక్, శ్రీనివాసరావు, కొండలరావు పాల్గొన్నారు.

విద్యాధరపురం: సుప్రీం కోర్టు వర్గీకరణ చేసేందుకు రాష్ట్రాలకు అనుమతి ఇచ్చిందని టీడీపీ నాయకుడు, దళితరత్న పరిశపోగు రాజేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్గీకరణ చేస్తానని హామీ ఇవ్వటం పట్ల, వర్గీకరణకు నాంది పలికిన చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

భవానీపురం: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అవసరమే అన్న సుప్రీంకోర్టు నిర్ణయం హర్షణీయమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్ అన్నారు. సుప్రీం కోర్టు నిర్ణయాన్ని సమర్థిస్తూ పశ్చిమలోని 45వ డివిజన్ జోజినగర్‌లో గురువారం దళిత నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బేగ్ మాట్లాడారు. తొలుత బాబూ జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్, మందకృష్ణ మాదిగల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి, బాణాసంచా కాల్చారు. కేక్ కట్ చేసి అందరికి పంచారు. ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్న సీఎం చంద్రబాబు, ప్రధాని మోదీలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కోడూరి అఖిల్, పశ్చిమ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎర్ర రామారావు, రెల్లి సంఘం రాష్ట్ర నాయకురాలు తుపాకుల రమణమ్మ, తుడుము అనిల్, బేతపూడి సుధాకర్, చిలకా బసవయ్యలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే డివిజన్ల పర్యటన

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

గుణదల, ఆగస్టు 1: నియోజకవర్గంలో డివిజన్ల వారీగా పర్యటించేది స్థానికంగా ఉన్న ప్రధాన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకేనని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. తూర్పులోని 3వ డివిజన్ పరిధి రామవరప్పాడు రింగ్ రోడ్ వద్ద ఉన్న ఇంద్రలోక్ ఎస్టేట్స్‌లో స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకునేందుకు గద్దె గురువారం పర్యటించారు. పర్యటనలో ప్రధానంగా స్థానికులు తమకు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ అవసరమని, తమ ఎస్టేట్స్‌కు పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలో గుబురుగా చెట్లు పెరిగిపోవడంతో విషసర్పాలు తరచూ తమ నివాసాల్లోకి వచ్చేస్తున్నాయని తెలియజేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆయన ఆ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. డివిజన్ అధ్యక్షుడు తాడి బాబూరావు, కృష్ణమోహన్, రమేష్, కె.చక్రవర్తి, కె.సూర్యనారాయణ, కమల్‌రాజ్, సూర్యప్రకాష్, నారాయణరావు పాల్గొన్నారు.

జయరాజు సేవలు మరువలేనివి

మొగల్రాజపురం: టీడీపీ పశ్చిమ ఎమ్మెల్యేగా పని చేసిన బీఎస్ జయరాజు సేవలు మరువలేనివని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చెప్పారు. 7వ డివిజన్ శిఖామణి సెంటర్‌లో బీఎస్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో బీఎస్ జయరాజు వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా పని చేసిన ఆయన పార్టీ కోసం అంకిత భావంతో పని చేశారని కొనియాడారు. చెన్నుపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆయన మంచితనం వల్ల అన్ని పార్టీలలో స్నేహితులు ఉన్నారని చెప్పారు. కార్యక్రమానికి ముందు జయరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పేదలకు 300 చీరలు పంపిణీ చేశారు. డివిజన్ అధ్యక్షుడే సతీష్ చంద్ర, సొంగా సంజయ్‌వర్మ, నాగుమోతు రాజా, కామా దేవరాజు, పెనుగొండ శ్రీను, దోమకొండ రవి తదితరులు పాల్గొన్నారు.



మహిళకు చీర పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గద్దె, చెన్నుపాటి శ్రీనివాస్, బీఎస్ విద్యాసాగర్ తదితరులు

వర్లకు జన్మదిన శుభాకాంక్షలు

విద్యాధరపురం, ఆగస్టు 1 : టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య జన్మదినం సందర్భంగా గురువారం విద్యాధరపురంలోని ఆయన నివాసంలో పశ్చిమ ఎస్సీ సెల్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి ఎంఎస్ బేగ్, పశ్చిమ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎర్ర రామారావు, కార్యదర్శి కత్తి డేవిడ్, నాయకులు పుట్ల గోపాలం, పెరుమాల్ తుడుము, అనిల్ కుమార్ తదితరులు రామయ్యకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందన

సత్యనారాయణపురం, ఆగస్టు 1: చదువుతో పాటు క్రీడలకు కొంత సమయం కేటాయించాలని ఎస్వీపీఆర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎం.సూర్యప్రభ అన్నారు. పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్స్ బాల బాలికల షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొంటున్న 11 మంది విద్యార్థులను అభినందించారు. వీరు.ఈ నెల 10నుంచి 11 వరకూ చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వ్యాయామ అధ్యాపకులు జలసూత్రం వెంకట్‌రావ్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



నవజాత శిశువుకు తల్లిపాలు శ్రేయస్కరం



మాట్లాడుతున్న డాక్టర్ రాథోడ్

పాయకాపురం, ఆగస్టు 1 : నవజాత శిశువుకు తల్లిపాలు శ్రేయస్కరం అని రాజీవ్‌నగర్ ఎన్టీఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం డాక్టర్ రాథోడ్ అన్నారు. ప్రపంచ తల్లిపాల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రకాష్‌నగర్, రాజీవ్‌నగర్, శాంతినగర్, కండ్రిక కాలనీల్లో ఎన్టీఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో తల్లిపాల వలన శిశువుకు కలిగే ప్రయోజనాలను వివరిస్తూ గురువారం అవగాహనా కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ శిశువుకు తల్లిపాల ద్వారా ముఖ్యమైన పోషకాలు అందుతాయని తెలిపారు. పుట్టిన పిల్లలకు సంపూర్ణ పోషణ, మానసిక వికాసం తల్లిపాలతోనే సాధ్యమని పేర్కొన్నారు. డాక్టర్లు రమ్య, రాజా, కాజా, నాయక్, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, డ్రగ్స్ కట్టడి చేయడమే లక్ష్యం

సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్

గుణదల, ఆగస్టు 1: గంజాయి, డ్రగ్స్‌ను కట్టడి చేసి యువతను సన్మార్గంలో నడిపించి శాంతి భద్రతలను కాపాడటమే లక్ష్యంగా పనిచేయనున్నట్లు సెంట్రల్ జోన్ ఏసీపీ కె.దామోదర్ తెలిపారు. గురువారం సాయంత్రం సెంట్రల్ జోన్ ఏసీపీగా కె.దామోదర్ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి విక్రయిస్తున్నా....సరఫరా చేస్తున్నా...అటువంటి వ్యక్తులపై చట్టపరంగా ఉక్కుపాదం మోపుతామన్నారు. యువతను తప్పుదోవ పట్టించడానికి కొంతమంది ముఠా కొద్దికాలం క్రితం గంజాయి సరఫరా కార్యకలాపాలు నగరంలో కొనసాగిస్తున్నట్లు తెలియ వచ్చిందని అటువంటి వారి ఆగడాలు చెల్లవని హెచ్చరించారు. సస్పెక్ట్‌షీట్, రౌడీషీట్ ఉన్న వారిపై నిత్యం నిఘా ఉంటుందని, ఇకనైనా ప్రవర్తన మార్చుకుని జీవనం సాగించకుంటే అటువంటి వారిపై నగర బహిష్కరణ తప్పదని హెచ్చరించారు. శివారు ప్రాంతాల్లో పెట్రోలింగ్ పెంచి నగరాన్ని ప్రశాంత వాతా వరణంలో ఉంచడమే లక్ష్యంగా పనిచేయనున్నట్లు తెలిపారు.

ఆధునిక చర్యలతో దోమల నియంత్రణ : కమిషనర్ ధ్యానచంద్ర

సత్యనారాయణపురం, ఆగస్టు 1: దోమల నియంత్రణకు ఆధునిక చర్యలతో ముందుకు వెళ్లాలని సంబంధిత అధికారులను నగర కమిషనర్ ధ్యాన చంద్ర ఆదేశించారు. రామకృష్ణాపురం బుడమేరు కాలువను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుడమేరు కాల్వలో నిరంతరం వ్యర్థాలు పేరుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, వ్యర్థాలు పేరుకు పోయిన చోట దోమల లార్వా ఉండే అవకాశం ఉందని, మనుషులు వెళ్లలేని ప్రదేశాల్లో డ్రోన్‌ల సాయంతో ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేస్తూ దోమలు అరికట్టాలన్నారు. ఏలూరు, రైవస్ కాల్వలో ట్రకర్స్ వాహనం వినియోగించి పేరుకు పోయినవ్యర్థాలను నిరంతరం తొలగిస్తూ దోమల వ్యాప్తిని అరికట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మేయర్, ఎమ్మెల్యేలు అమ్ముకున్న పోస్టులను రద్దు చేయండి

టీడీపీ నాయకుల వినతి

వన్‌టౌన్: విజయవాడ నగరపాలకసంస్థ పరిధిలో ప్రజారోగ్యం ఇంజనీరింగ్‌కు పట్టణ ప్రణాళిక ఉద్యానవన విభాగాల్లో ఖాళీ పోస్టులను భర్తీచేసే సందర్భంలో వైసీపీ నాయకులు అమ్ముకున్నట్లు టీడీపీ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు గత ఏడాది కాల్ లెటర్‌లు పంపించి ఇంటర్వ్యూలు నిర్వహించిన పోస్టులను రద్దుచేయాలని కార్పొరేషన్ టీడీపీ ఫ్లోర్‌లీడర్ నెలిబండ్ల బాలస్వామి, ఉప ఫ్లోర్‌లీడర్ ఉమ్మడి వెంకటేశ్వరరావులు గురువారం నగర కమిషనర్ ధ్యానచంద్రను ఆయన చాంబర్‌లో కలిసి వినతి పత్రం అందచేశారు. మేయర్, అప్పటి ఎమ్మెల్యేలు, వైసీపీ కార్పొరేటర్‌లు, డిప్యూటీ మేయర్‌లు అందరూ కలిసి వాటాలు వేసుకొని 159 పోస్టులను అమ్ముకున్నారన్నారు. తిరిగి నోటిఫికేషన్ జారీ చేసి పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. పోస్టుల అమ్మకాలపై తాము రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ ద్వారా ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

ల్యాప్‌టాప్, ఐఫోన్ చోరీ

పాయకాపురం, ఆగస్టు 1 : ల్యాప్‌టాప్, ఐఫోన్ చోరీకి గురైన ఘటనపై గురువారం నున్న రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం శాంతినగర్‌కు చెందిన ప్రకాష్‌నగర్‌లో పచారీ దుకాణం నిర్వహిస్తున్న పెండ్యాల నరేష్‌బాబు ఉదయం 9 గంటలకు తన బ్యాగ్‌ను షాపు ముందు ఉంచి దుకాణాన్ని తెరిచి సామాన్లు సర్దుకున్నాడు. కొంత సేపటి తర్వాత చూడగా షాపు ముందు పెట్టి ఉంచిన బ్యాగ్ లేదు. దీంతో బాధితుడు నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బ్యాగ్‌లో ల్యాప్‌టాప్, ఐఫోన్ ఉన్నట్లు పోలీసుల ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థినికి అభినందన

విజయవాడ స్పోర్ట్స్, ఆగస్టు 1 : రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన చిట్టూరి హైస్కూల్ విద్యార్థిని టి. సాయిదుర్గ సాత్విక అభినందన కార్యక్రమం గురువారం స్కూల్‌లో జరిగింది. స్కూల్ హెచ్‌ఎం ఎ సుధారాణి, సెక్రటరీ డాక్టర్ సామ మణికంఠ, విద్యార్థిని, కోచ్ ఎం. అంకమ్మరావులకు అభినందనలు తెలిపారు.


studio green
STUDIO GREEN FILMS (P) LTD.
BESTEST ENTERTAINMENT
SINGLE SCREENS RS.99/-
@ THE BESTEST PRICE
MULTIPLEXES RS.125/-
ALLU SIRISH'S
బడ్డీ
SAM ANTON
FROM TODAY
NETFLIX


TRISHA PRESENTS
SURAKSH
నేడే బ్రహ్మాండమైన విడుదల
తిరగబడరసామీ...


VIJAYA BHASKAR KRAFT
A VIJAYA BHASKAR FILM
నేడే విడుదల
SREE KAMAL TANVI AKAANKSHA
ఉషాపరిణయం
Love is Beautiful..!
WRITTEN, PRODUCED & DIRECTED BY VIJAYA BHASKAR K
DOP SATISH MUTYALA MUSIC RR DHRUVAN


SRI NEELAKANTA MAHADEVA ENTERTAINMENTS LLP
PVR INOX PICTURES RELEASE
నేడే విడుదల
Average Student నాని
IN THEATRES 2 AUGUST


IN CINEMAS AUG 2
SVC RELEASE
అలనాటి రామచంద్రుడు
నేడే విడుదల


INFINITI FILM VENTURES
IN THEATRES AUGUST 9TH
VIJAY ANTONY
తుఫాన్
S.D.VIJAY MILTON
KAMAL BOHRA | D. LALITHAA | B.PRADEEP | PANKAJ BOHRA


M3 MEDIA
MAHARSHI KONDLA PRESENTS
SINGLE SCREENS RS 99
MULTIPLEXES RS 112
You Are TRAPPED
VARUN SANDESH
విరాజీ
ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 2న విడుదల
నేడే విడుదల
PRODUCER MAHENDRA NATH KONDLA DIRECTOR ADHYANTH HARSHA
MUSIC ON SABARI MUSIC


MEGA BLOCKBUSTER
2ND WEEK
KALANITHI MARAN PRESENTS
DHANUSH
రాయన్
WRITTEN AND DIRECTED BY DHANUSH
AN A R RAHMAN MUSICAL
IN CINEMAS NOW

మిస్టర్ కూల్ బుల్లెట్


కలల కోటలో చిరకాల స్వప్నాన్ని నెరవేర్చుకొన్న మిస్టర్ కూల్ బుల్లెట్ స్వప్నిల్ కుశాలె. మధ్యతరగతి కుటుంబంలో పుట్టినా.. పెద్దపెద్ద కలలనే కన్నాడు. అది నెరవేరే వరకు అకుంఠిత దీక్షతో కృషి చేశాడు.. మువ్వన్నెలను రెపరెపలాడించాడు. 2012లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన స్వప్నిల్.. టోక్యో అవకాశం త్రుటిలో చేజారినా అధైర్యపడలేదు. రెట్టించిన పట్టుదలతో శ్రమించాడు.. పారిస్ బెర్త్ పట్టేశాడు. ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగి.. అతి కష్టమైన 50 మీ రైఫిల్ 3 పొజిషన్స్‌లో కంచు మోత మోగించాడు.

అప్పుతో రైఫిల్ కొని..: మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో కంబల్వాడి గ్రామానికి చెందిన స్వప్నిల్ చిన్ననాటి నుంచే షూటింగ్‌పై ఆసక్తి పెంచుకొన్నాడు. ఉపాధ్యాయుడైన అతడి తండ్రి లోన్ తీసుకొని రైఫిల్ కొనిపించగా.. సర్పంచ్ అయిన అతడి తల్లి అనిత ఎంతో ప్రోత్సహించింది. భారత మాజీ షూటర్ దీపాలీ దేశ్‌పాండే శిక్షణలో రాటుదేలాడు. 2015లో ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్స్ జూనియర్ కేటగిరీలో స్వర్ణంతో మెరిశాడు. అనంతరం జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్స్ 50 మీ. రైఫిల్ ప్రోన్‌లో ప్రముఖ షూటర్లు గగన్ నారంగ్, చైన్ సింగ్ లాంటి వారికే ఝలక్ ఇచ్చాడు. కెరీర్‌లో వేగంగా ఎదిగిన స్వప్నిల్.. 2022 ఆసియా క్రీడల్లో టీమ్ స్వర్ణం సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. ఈ ఏడాది మేలో జరిగిన ట్రయల్స్‌లో పారిస్ టికెట్ పట్టేసిన కుశాలె.. ఆడిన తొలి ఒలింపిక్స్‌లోనే పతకంతో అదరగొట్టాడు. షూటింగ్‌లో తనకు ఫేవరెట్ ఎవరూ లేకపోయినా.. ధోనీని ఆదర్శంగా తీసుకొంటానని రైల్వే టికెట్ కలెక్టర్ అయిన కుశాలె చెప్పాడు. మహీ బయోపిక్‌ను తాను ఎన్నో సార్లు చూశానని తెలిపాడు. తీవ్ర ఒత్తిడిలోనూ ధోనీలా ఎంతో కూల్‌గా ఉండడాన్ని తాను కూడా అలవర్చుకోవడానికి యత్నిస్తున్నట్టు కుశాలె చెప్పాడు. కాగా, పోటీ జరుగుతున్న సమయంలో దేవుడిని ప్రార్థిస్తూ ఎంతో ఉత్కంఠగా గడిపిన అనిత.. పతకం నెగ్గిన విషయం తెలుసుకొని తీవ్ర భావోద్వేగానికి గురైంది. తన విజయంలో తల్లిదండ్రులు, కోచ్ కృషి ఎంతో ఉందని కాంస్యం నెగ్గిన అనంతరం కుశాలె కూడా చెప్పాడు.

విజేతకు మోదీ ఫోన్

షూటింగ్‌లో కాంస్యం సాధించిన స్వప్నిల్ కుశాలెతో ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్‌లో మాట్లాడి అభినందించారు. అలాగే సోషల్ మీడియాలోనూ అతడి ఘనతను కొనియాడారు. 'కుశాలె నుంచి అత్యద్భుత ప్రదర్శన. పురుషుల 50మీ. రైఫిల్3 పొజిషన్స్‌లో కాంస్యం సాధించినందుకు అభినందనలు. ఈక్రమంలో తను గొప్ప నైపుణ్యం, స్థితప్రజ్ఞత ప్రదర్శించాడు. తన గెలుపుతో ప్రతీ భారతీయుడి హృదయం ఆనందంతో నిండిపోయింది'

- ప్రధాని నరేంద్ర మోదీ



ప్రమోషన్ వచ్చేసింది

ఒలింపిక్స్ కాంస్యం షూటర్ కుశాలెకు ఎక్కడలేని గుర్తింపే కాకుండా ఉద్యోగంలో ప్రమోషన్‌ను కూడా తెచ్చిపెట్టింది. ప్రస్తుతం సెంట్రల్ రైల్వేలో టీటీఈగా పనిచేస్తున్న కుశాలె.. ఇప్పుడు ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ)గా మారనున్నట్టు సెంట్రల్ రైల్వే జీఎం రామ్‌కరణ్ యాదవ్ వెల్లడించాడు. 2015లో రైల్వేస్‌లో చేరిన కుశాలె గత కొన్ని సంవత్సరాలుగా ప్రమోషన్ కోసం ఎంతగా ప్రయత్నించినా ఎవరూ పట్టించుకోలేదట.



'దేశానికి మెడల్ అందించినందుకు చాలా సంతోషంగా ఉన్నాను. ఏమీ తినకుండా కేవలం బ్లాక్ టీ తాగి బరిలోకి దిగాను. అలాగే పోటీలో స్కోరుబోర్డును పట్టించుకోకుండా నా శ్వాసపైనే ఎక్కువగా దృష్టి సారించాను. ఈ స్థాయికి చేరుకోవడం నా 12 ఏళ్ల శ్రమ ఫలితం. ఫైనల్లోనూ అదే విషయం నా మనసులో ఉండిపోయింది. కొన్నేళ్లుగా విజయం కోసం చూస్తున్న నేను ఈ పతకంతో అందరినీ గర్వపడేలా చేశాను'

- స్వప్నిల్ కుశాలె

పారిస్ గేమ్స్ పతక రేసులో ఉన్నారంటూ ఎవరెవరి గురించో మాట్లాడుకున్నారు.. కానీ అతడి గురించి ఎవరికీ అంచనాల్లేవు. కనీసం ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాడన్న ఆశలు కూడా పెట్టుకోలేదు. అనామకుడిగా బరిలోకి దిగిన.. 28 ఏళ్ల షూటర్ స్వప్నిల్ కుశాలె లక్ష్యంపైనే గురి పెట్టాడు. చివరకు ఎవరికీ పట్టింపులేని తనను ప్రపంచమే గుర్తించేలా చేసుకున్నాడు. షూటింగ్‌లో అతిక్లిష్టమైన 50మీ. రైఫిల్3 పొజిషన్స్‌లో కంచు మోతతో తన చిరకాల స్వప్నాన్ని నిజం చేసుకోవడమే కాదు.. దేశం గర్వపడేలా చేశాడు. ఎంఎస్ ధోనీని అమితంగా ఆరాధించే స్వప్నిల్ అతడి మాదిరే ఒత్తిడిలోనూ మిస్టర్ కూల్‌గా పనికానిచ్చేసి.. ఈ విభాగంలో మెడల్ కొట్టిన తొలి భారత షూటర్‌గానూ నిలిచాడు.

దేశానికిది మూడో మెడల్

ఖుష్.. కుశాలె

50మీ. రైఫిల్3 పొజిషన్స్‌లో కాంస్యం ● సిఫ్ట్ కౌర్, అంజుమ్ విఫలం

స్వప్నిల్ కెరీర్

2017	కామన్వెల్త్ చాంపియన్‌షిప్స్	50మీ. రైఫిల్ ప్రోన్	కాంస్యం
2021	వరల్డ్‌కప్	50మీ. రైఫిల్3 పొజిషన్స్ టీమ్	స్వర్ణం
2022	ఆసియా గేమ్స్	50మీ. రైఫిల్3 పొజిషన్స్ టీమ్	స్వర్ణం
2022	వరల్డ్ చాంపియన్‌షిప్స్	50మీ. రైఫిల్3 పొజిషన్స్ టీమ్	కాంస్యం
2023	ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్స్	50మీ. రైఫిల్3 పొజిషన్స్ టీమ్	రజతం
2024	ఆసియా రైఫిల్/పిస్టల్ చాంపియన్‌షిప్స్	50మీ. రైఫిల్3 పొజిషన్స్ టీమ్	స్వర్ణం
2024	ఒలింపిక్స్	50మీ. రైఫిల్3 పొజిషన్స్	కాంస్యం

పారిస్: భారత షూటర్లు పతక పండుగ చేసుకుంటూ క్రీడాభిమానులను మురిపిస్తున్నారు. చివరి రెండు ఒలింపిక్స్‌లో తీవ్రంగా నిరాశపరిచినప్పటికీ.. ఈసారి మాత్రం తమ అద్భుత ప్రదర్శనతో దేశానికి హ్యాట్రిక్ పతకం అందించారు. గురువారం జరిగిన 50మీ. రైఫిల్ 3 పొజిషన్స్‌లో స్వప్నిల్ కుశాలె (451.4 పాయింట్లు) మూడో స్థానంలో నిలిచి కాంస్యం సాధించాడు. తొలిసారి మెగా ఈవెంట్‌లో బరిలోకి దిగిన తను క్వాలిఫయింగ్‌లో ఏడో స్థానంలో నిలవడమే కాకుండా ఫైనల్ రౌండ్‌లోనూ అందరినీ ఆశ్చర్యపరిచాడు. ప్రోన్, స్టాండింగ్ దశల్లో ప్రశాంతత, స్థిరత్వంతో కూడిన ప్రదర్శనతో పోడియం ఫినిష్ చేశాడు. ఈ విభాగంలో చైనాకు చెందిన లియూ యుకున్ (453.7) స్వర్ణం, సెరియ్ కులిష్ (461.3, ఉక్రెయిన్) రజతం అందుకున్నారు.

ఆరో స్థానం నుంచి ఎగబాకి..: కఠినంగా సాగిన ఫైనల్స్‌లో స్వప్నిల్ ఆరంభం నిదానంగానే సాగింది. కానీ క్రమంగా అంతులేని ఏకాగ్రతతో ఒక్కో స్థానం మెరుగుపర్చుకుంటూ పతక ఆశలు రేపాడు. ఫైనల్లో పాల్గొన్న 8 మంది ముందుగా 40 షాట్లు సంధించారు. ఇందులో తొలి 15 నీలింగ్ (మోకాళ్ల మీద కూర్చుని), ఆ తర్వాత 15 ప్రోన్ (బోర్లా పడుకుని), మిగిలిన 10 స్టాండింగ్ (నిలబడి) పొజిషన్‌లో షూట్ చేశారు. ఈ క్రమంలో స్వప్నిల్‌కు ఆరంభంలో గురి సరిగ్గా కుదరలేదు. తొలి షాట్‌ను 9.6తో ఆరంభించగా నీలింగ్ పొజిషన్‌ను ఆరో స్థానంతో ముగించాడు. కానీ ప్రోన్‌లో మాత్రం అద్భుతంగా పుంజుకున్నాడు. ఐదు షాట్లను ఇన్నర్ 10గా ముగించడంతో 310.1 పాయింట్లతో ఐదో స్థానానికి ఎగబాకాడు. చివరగా స్టాండింగ్‌లోనూ అదరగొట్టి మూడో స్థానంలో నిలవగలిగాడు. ఇక ప్రతీ షాట్‌కు ఓ షూటర్ తప్పుకొనే కీలక ఎలిమినేషన్ రౌండ్‌లోనూ స్వప్నిల్ తడబాటుకు గురవకుండా టాప్-4కు వెళ్లాడు. ఇందులో 9.9 స్కోరుతో 441.4 పాయింట్లు సాధించి టాప్-3లో ఎంట్రీ ఇవ్వడంతో మెడల్ ఖరారైంది. ఫైనల్ షాట్‌లో 10 స్కోరు చేయడంతో (451.4) 0.5 పాయింట్ల తేడాతో స్వప్నిల్ కాంస్యంతో సరిపెట్టుకున్నాడు. అతడికన్నా ముందున్న కులిష్ 451.9తో టాప్-2 కోసం చైనా షూటర్‌తో పోటీపడ్డాడు.

సిఫ్ట్, అంజుమ్ ఫ్లాప్ షో: మహిళల 50మీ. రైఫిల్ 3 పొజిషన్‌లో ప్రపంచ రికార్డు నేపథ్యం కలిగిన సిఫ్ట్ కౌర్ శర్మపై, మాజీ వరల్డ్ చాంపియన్ అయిన అంజుమ్ మౌద్గిల్‌పై ముందునుంచీ పతక అంచనాలున్నాయి. కానీ అందరినీ తీవ్రంగా నిరాశపరుస్తూ వీరు కనీసం ఫైనల్స్‌కు కూడా అర్హత సాధించలేకపోయారు. గురువారం జరిగిన క్వాలిఫయింగ్స్‌లో మొత్తం 32 మంది షూటర్లు పాల్గొనగా.. సిఫ్ట్ 575 పాయింట్లతో 31వ స్థానంలో నిలవడం గమనార్హం. అటు అంజుమ్ 584 పాయింట్లతో 18వ స్థానంలో నిలిచి టాప్-8కు చాలా దూరంలోనే ఉండిపోయింది.

పతకాల పట్టిక

	దేశం	స్వ	ర	కా	మొ
1	చైనా	11	7	5	23
2	అమెరికా	9	14	13	36
3	ఫ్రాన్స్	8	11	8	27
4	జపాన్	8	3	5	16
44	భారత్	0	0	3	3

గమనిక: స్వ=స్వర్ణం, ర=రజతం, కా=కాంస్యం, మొ=మొత్తం.

ఆశలు ఆవిరి

- ఒకేరోజు నిష్క్రమించిన తెలుగు ప్లేయర్లు
- నిరాశపరచిన నిఖత్, సింధు, సాత్విక్
- క్వార్టర్స్‌కు లక్ష్యసేన్

పారిస్: పతకం ఖాయం అనుకొన్న తెలుగు క్రీడాకారులు తీవ్రంగా నిరాశపరచారు. పోటీలకు ఆరో రోజైన గురువారం స్వప్నిల్ కుశాలె కాంస్యం, లక్ష్యసేన్ గెలుపు మినహా భారత్‌కు ఏమాత్రం కలిసిరాలేదు. ముఖ్యంగా పీవీ సింధు, నిఖత్ జరీన్, సాత్విక్ సాయిరాజ్ జోడీ పేలవ ప్రదర్శనతో మెగా ఈవెంట్ నుంచి నిష్క్రమించారు.



నిఖత్ జరీన్

నిఖత్ ఏకపక్షంగా...

మహిళల 50 కిలోల ప్రీక్వార్టర్స్‌లో నిఖత్ 0-5తో ఆసియాడ్ చాంపియన్ వు యు (చైనా) చేతిలో చిత్తయింది. చైనా బాక్సర్ ఎత్తులు, చురుకుదనం ముందు నిఖత్ నిలవలేకపోయింది. మూడు రౌండ్లలో ప్రత్యర్థిపై ఒక్కసారి కూడా బలమైన పంచ్ విసరలేక పోయింది. మరోవైపు వేగంగా కదులుతూ ప్రత్యర్థి పంచ్‌లను తప్పించుకుంటూనే.. వు యు ఎదురుదాడి చేస్తూ పాయింట్లు రాబట్టింది. జరీన్ దూకుడు కనబరుస్తున్న ప్రతీసారి వ్యూహాత్మకంగా లాక్ చేసి ఆమె చేతులు కట్టేసింది. బౌట్ ముగిసిన తర్వాత ప్రత్యర్థి వేగంతో తాను పోటీపడలేక పోయానని నిఖత్ అంగీకరించింది. తొలి రౌండ్‌లోనే చైనా బాక్సర్ దూకుడుతో నిఖత్‌పై ఒత్తిడి పెంచింది. వేగవంతమైన ఫుట్‌వర్క్‌తో అదునుచూసి దాడి చేస్తుంటే.. నిఖత్ కౌంటర్ ఇవ్వలేక పోయింది. దీంతో జరీన్ తొలి రౌండ్‌ను 1-4తో కోల్పోయింది. రెండో రౌండ్‌లో నిఖత్ కొంత ఫర్వాలేదనిపించినా.. యు తెలివిగా భారత బాక్సర్ ముఖంపై బలమైన హుక్‌లు విసిరింది. దీంతో రెండో రౌండ్‌లో కూడా జరీన్ 2-3 తేడాతో ఓడింది. అప్పటికే డీలాపడిన నిఖత్.. మూడో రౌండ్‌లో పెద్దగా ప్రతిఘటించలేక బౌట్‌ను చేజార్చుకొంది. అనంతరం ప్రెస్ మీట్‌లో 'అందరికీ క్షమాపణలు' అంటూ కన్నీటి పర్యంతమైంది.

సాత్విక్ కల చెదిరింది




హ్యాట్రిక్ పతక వేటలో ఉన్న ఏస్ షట్లర్ సింధుతోపాటు డబుల్స్ టాప్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టికి షాక్ తగిలింది. క్వార్టర్స్‌లో సాత్విక్-చిరాగ్ ద్వయం 21-13, 14-21, 16-21తో మలేసియాకు చెందిన ఆరోన్ చియా-సో వుయిక్ చేతిలో పరాజయం పాలైంది. దీంతో స్వర్ణం తెస్తారను కొన్న సాత్విక్ జోడీ.. ఉత్త చేతులతో ఇంటిముఖం పట్టింది.



సింధు కూడా..

మహిళల సింగిల్స్ ప్రీక్వార్టర్స్‌లో సింధు 19-21, 14-21తో హి బింగ్జియావో (చైనా) చేతిలో వరుస గేముల్లో చిత్తయింది. తొలి గేమ్ ఆరంభం నుంచే సింధు వెనుకంజలోనే సాగింది. అయితే, బ్రేక్ తర్వాత పుంజుకొని 19-19తో సమం చేసినా.. కీలక సమయంలో తడబాటులో గేమ్‌ను చేజార్చుకొంది. ఇక, రెండో గేమ్‌లో ఏమాత్రం పోరాటం కనబర్చలేదు. కాగా, సింగిల్స్‌లో లక్ష్య సేన్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. సహచర షట్లర్ హెచ్ఎస్ ప్రణయ్‌తో జరిగిన రౌండ్-16 పోరులో సేన్ 21-12, 21-6తో అలవోకగా నెగ్గాడు. ఈ క్రమంలో కశ్యప్, శ్రీకాంత్ తర్వాత ఒలింపిక్స్‌లో క్వార్టర్స్‌కు చేరుకొన్న మూడో పురుష షట్లర్‌గా నిలిచాడు. తర్వాతి రౌండ్‌లో 12వ సీడ్ చో టిన్ చెన్ (చైనీస్ తైపీ)తో సేన్ తలపడనున్నాడు.



లక్ష్యసేన్

ప్రియాంకకు 41వ స్థానం..: అథ్లెటిక్స్‌ను భారత్ పేలవంగా ఆరంభించింది. మహిళల 20 కి.మీ రేస్ వాక్‌లో ప్రియాంక గోస్వామి గంటా 39 నిమిషాల 55 సెకన్ల టైమింగ్‌తో ముగించి 41వ స్థానంలో నిలిచింది. పురుషుల 20 కిమీ రేస్‌లో వికాస్ సింగ్ 30, పరమ్‌జీత్ సింగ్ 37వ స్థానంలో నిలిచారు. ఇక ఇదే విభాగంలో తలపడిన ఆకాశ్ దీప్ సింగ్ ఆరు కి.మీ. తర్వాత రేస్ నుంచి వైదొలిగాడు.

ప్రవీణ్ తొలి రౌండ్‌లోనే..: పురుషుల ఆర్చరీ వ్యక్తిగత విభాగంలో మిగిలిన ఏకైక ఆర్చర్ ప్రవీణ్ జాదవ్ తొలి రౌండ్‌లోనే అవుటయ్యాడు. రౌండ్-64లో జాదవ్ 0-6తో కొ వెంచావ్ (చైనా) చేతిలో చిత్తయ్యాడు.

శరవణన్ వెనుకంజ..: సెయిలింగ్ పురుషుల డింగీ ఈవెంట్‌లో విష్ణు శరవణన్ రెండు రేస్‌లు ముగిసే సరికి 25వ స్థానంలో కొనసాగుతున్నాడు. తొలి రేస్‌లో 10, రెండో రేస్‌లో 34వ స్థానంలో నిలిచాడు. మొత్తం 10 రేస్‌లు పూర్తయిన తర్వాత టాప్-10లో నిలిచిన సెయిలర్లు పతక రౌండ్‌కు చేరుకొంటారు. మహిళల డింగీలో నేత్ర కుమనన్ తొలి రేస్‌లో ఆరో స్థానంలో నిలిచింది. తగిన విధంగా గాలి లేకపోవడంతో రెండో రేస్‌ను వాయిదా వేశారు.

హాకీలో ఓటమి..

భారత హాకీ జట్టుకు తొలి ఓటమి ఎదురైంది. గ్రూప్-బీలో జరిగిన మ్యాచ్‌లో భారత్ 1-2తో బెల్జియం చేతిలో పరాజయాన్ని చవిచూసింది. 18వ నిమిషంలోనే అభిషేక్ గోల్ చేసి భారత్‌ను 1-0 ఆధిక్యంలో నిలిపాడు. అయితే, తిబ్యూ స్టాక్‌బోరెక్స్ (33వ నిమిషం), జాన్ డోమెన్ (44వ) చెరో గోల్‌తో బెల్జియాన్ని గెలిపించారు. గ్రూప్‌లో చివరి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో భారత్ తలపడనుంది. న్యూజిలాండ్‌పై గెలిచి అర్జెంటీనాతో డ్రా చేసుకొన్న టీమిండియా క్వార్టర్స్ బెర్త్‌ను దాదాపు ఖరారు చేసుకొంది.



పారిస్‌లో నేటి భారతం



గోల్ఫ్: పురుషుల వ్యక్తిగత ఫైనల్స్ (రౌండ్-2): శుభాంకర్ శర్మ, గగన్‌జీత్ భుల్లార్ (మ.12.30)
షూటింగ్: మహిళల 25మీ. పిస్టల్ క్వాలిఫికేషన్: ఇషాసింగ్, మను భాకర్ (మ.12.30); **పురుషుల స్కీట్ క్వాలిఫికేషన్:** అనంత్‌జీత్ సింగ్ (మ. 1గం.)
ఆర్చరీ: మిక్స్‌డ్ టీమ్ విభాగం (1/8 ఎలిమినేషన్ రౌండ్) : ధీరజ్/అంకిత X ఇండోనేసియా (మ.1.19)
రోయింగ్: పురుషుల సింగిల్ స్కల్స్ ఫైనల్స్ (ఫైనల్ డి): బల్‌రాజ్ పన్వర్ (మ.1.48)
జూడో : మహిళల +78 కి. (ఎలిమినేషన్ రౌండ్ 32) :తులికా మాన్Xఇడాలిస్ ఓర్టిజ్ (క్యూబా) (మ.2.12)
సెయిలింగ్: **మహిళల డింగీ (రేస్-3):** నేత్ర కుమనన్ (మ.3.45), (రేస్-4): నేత్ర కుమనన్ (సా.4.53), **పురుషుల డింగీ (రేస్-3) :** విష్ణు (రా. 7.05), (రేస్-4): విష్ణు (రా.8.15)
హాకీ: **పురుషుల గ్రూప్ దశ :** భారత్ Xఆస్ట్రేలియా (సా. 4.45)
బ్యాడ్మింటన్: పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్ : లక్ష్యసేన్ X చౌ టీన్ చెన్ (తైపీ) (సా.6.30)
అథ్లెటిక్స్: మహిళల 5 వేల మీ. (హీట్-1): అంకిత ధ్యానీ (రా.9.40), మహిళల 5 వేల మీ. (హీట్-2) పారుల్ చౌధురి (రా.10.06), పురుషుల షాట్‌పుట్ (క్వాలిఫికేషన్): తజిందర్ పాల్ తూర్ (రా.11.40).



భళా..బైల్స్

అమెరికా స్టార్‌కు 'ఆల్‌రౌండ్' స్వర్ణం

అమెరికన్ సూపర్ స్టార్ సిమోన్ బైల్స్ అదరగొట్టింది. అంచనాలను నిలబెట్టుకొంటూ మహిళల జిమ్నాస్టిక్స్ వ్యక్తిగత ఆల్‌రౌండ్ విభాగంలో స్వర్ణ పతకం కొల్లగొట్టింది. గురువారం రాత్రి జరిగిన ఫైనల్లో బైల్స్ మొత్తం 59.131 పాయింట్లతో విజేతగా నిలిచింది. తద్వారా 1964లో వెరా కస్లావస్కా తర్వాత ఒలింపిక్స్ వ్యక్తిగత ఆల్‌రౌండ్ విభాగంలో రెండు పసిడి పతకాలు సొంతం చేసుకున్న తొలి జిమ్నాస్ట్‌గా బైల్స్ చరిత్ర సృష్టించింది. ఇక ఈసారి క్రీడల్లో బైల్స్‌కిది రెండో స్వర్ణ పతకం కావడం విశేషం. ఇంతకుముందు ఆర్టిస్టిక్ టీమ్ విభాగంలో అమెరికా జట్టు స్వర్ణ పతకం అందుకొన్న సంగతి తెలిసిందే. ఇక..ఆల్‌రౌండ్ ఫైనల్లో రెబెకా అండ్రాడే (బ్రెజిల్, 57.932) రజతం, ఈ విభాగంలో ప్రస్తుత చాంపియన్, అమెరికాకే చెందిన సునిసా లీ (56.465) కాంస్య పతకం దక్కించుకున్నారు.

ఇక సీనియర్ల వంతు

- నేటి నుంచి శ్రీలంకతో వన్డే సిరీస్
- బరిలోకి రోహిత్, విరాట్, రాహుల్

మధ్యాహ్నం 2.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

కొలంబో: టీ20 వరల్డ్‌కప్‌లో చాంపియన్‌గా నిలిచిన వెంటనే టీమిండియా జింబాబ్వే, శ్రీలంకలపై సిరీస్‌లు గెలుచుకుంది. ఇప్పుడు ఈ ఏడాది తొలిసారిగా వన్డేలు ఆడబోతోంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం ఆతిథ్య శ్రీలంకతో మొదటి మ్యాచ్ జరుగనుంది. కెప్టెన్‌గా రోహిత్ శర్మ పగ్గాలు తీసుకోవడంతో పాటు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కూడా జట్టులో చేరాడు. అలాగే చాలాకాలం తర్వాత కేఎల్ రాహుల్ కనిపించనున్నాడు. హార్దిక్, బుమ్రా, జడేజాలకు విశ్రాంతినిచ్చారు. 2023 వన్డే వరల్డ్‌కప్ నుంచి ఇప్పటివరకు భారత్ కేవలం మూడు వన్డే మ్యాచ్‌లు మాత్రమే ఆడింది. మరో ఆరు నెలల్లో చాంపియన్స్ ట్రోఫీ జరగాల్సి ఉండగా.. లంకతో సిరీస్‌ను సన్నాహకంగా భావించాలనుకుంటోంది. అలాగే వికెట్ కీపర్‌గా ఎవరిని ఆడించాలనేది కూడా తేలాల్సి ఉంది. పంత్ గైర్హాజరీలో ఈ బాధ్యతలు రాహుల్ తీసుకున్నాడు. అయితే రెండేళ్లుగా పంత్ వన్డేలు ఆడలేదు. కానీ టాప్-6 బ్యాటర్లలో ఒక్క లెఫ్ట్ హ్యాండర్ కూడా లేకపోవడం పంత్‌కు కలిసివచ్చే విషయం. ముమ్ముందు రాహుల్ లేదా పంత్‌లలో ఒకరివైపు మొగ్గు చూపేందుకు ఈ మ్యాచ్‌లు ఉపయోగపడగలవు. అలాగే తొలిసారి గంభీర్ శిక్షణలో జట్టు టీ20 సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయగా.. ఇప్పుడు సీనియర్ల నుంచి తను ఎలాంటి ప్రదర్శన రాబట్టగలడో వేచిచూడాల్సిందే. మరోవైపు ఆరుగురు పేసర్లు గాయంతో దూరం కావడంతో శ్రీలంక బౌలింగ్ బలహీనంగా మారింది. ఈస్థితిలో స్టార్లతో కూడిన భారత్‌కు ఆతిథ్య జట్టు ఏమేరకు పోటీనివ్వగలదనేది ఆసక్తికరంగా మారింది.



గంభీర్, అగార్కర్‌లతో కోహ్లీ

తుది జట్లు (అంచనా): **భారత్:** రోహిత్ శర్మ (కెప్టెన్), గిల్, విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, రాహుల్/పంత్, దూబే/పరాగ్, అక్షర్, హర్షిత్, కుల్దీప్, సిరాజ్, ఖలీల్/అర్ష్‌దీప్. **శ్రీలంక:** నిస్సాంక, ఫెర్నాండో, కుశాల్ మెండిస్, సమరవిక్రమ, అసలంక (కెప్టెన్), లియనగె, హసరంగ, కరుణరత్నె, వెల్లలగె, తీక్షణ, ఫెర్నాండో.



ఎదురులేని లెడెకి

అమెరికా 'బంగారు చేప' కేటీ లెడెకి 1500 మీ. ఫ్రీస్టయిల్‌లో టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఆమె 15ని 30.02సె. కొత్త ఒలింపిక్ రికార్డు టైమింగ్‌తో పసిడి పతకం చేజిక్కించుకుంది. ఈక్రమంలో టోక్యో విశ్వక్రీడల్లో తానే నెలకొల్పిన రికార్డు (15ని 35.35సె.)ను కేటీ తిరగ రాసింది. కాగా..ఒలింపిక్ మహిళల స్విమ్మింగ్‌లో అమెరికాకే చెందిన జెన్నీ థాంప్సన్ అత్యధిక స్వర్ణాల (8) రికార్డును లెడెకి సమం చేసింది. అంతేకాదు..ఒలింపిక్స్‌లో లెడెకి సాధించిన మొత్తం పతకాల సంఖ్య 12కి చేరింది.

నడాల్..ఒలింపిక్స్ ఆఖరి మ్యాచ్..



స్పెయిన్ దిగ్గజం రఫెల్ నడాల్ ఒలింపిక్స్‌లో చివరి ఆట ఆడేశాడు. తన దేశానికే చెందిన యువ సంచలనం కార్లోస్ అల్కారజ్‌తో కలిసి పురుషుల డబుల్స్ బరిలో దిగిన నడాల్ క్వార్టర్‌ఫైనల్లోనే తిరుగుముఖం పట్టాడు. నాలుగో సీడ్ అమెరికా జంట ఆస్టిన్ క్రాజిసెక్/రాజీవ్ రామ్ 6-2, 6-4తో నడాల్/అల్కారజ్ ద్వయాన్ని చిత్తు చేసి సెమీఫైనల్లో ప్రవేశించింది.

మహిళల పోటీల్లో పురుషులా?

అల్జీరియా, తైవాన్ బాక్సర్లపై వివాదం



ఇమేని ఖెలీఫ్




లిన్ యు టింగ్

విల్లేపింటే (ఫ్రాన్స్): ఒలింపిక్స్‌లో ఇద్దరు మహిళా బాక్సర్లపై తీవ్రమైన చర్చ నడుస్తోంది. అల్జీరియాకు చెందిన ఇమేని ఖెలీఫ్ (25), తైవాన్‌కు చెందిన లిన్ యు టింగ్ (28) మహిళా బాక్సర్లు కాదన్న వాదన బలంగా వినిపిస్తోంది. గురువారం రాత్రి ఖెలీఫ్‌తో మహిళల 66 కి. విభాగం బౌట్ నుంచి ఇటలీ బాక్సర్ యాంజెలా అనూహ్యంగా వైదొలగింది. తొలి రౌండ్ 46 సె. ఆట తర్వాత ఖెలీఫ్ పంచ్‌లకు విలవిలలాడిన యాంజెలా బాధను తట్టుకోలేక విరమించుకుంది. అయితే ఖెలీఫ్‌ను చూసిన వారంతా ఆమె..పురుష బాక్సరని అభిప్రాయపడ్డారు. ఖెలీఫ్ పంచ్‌లకు భయపడి బౌట్ నుంచి యాంజెలా వైదొలగిందని ఆమె పట్ల సానుభూతి ప్రకటిస్తున్నారు. ఖెలీఫ్‌లో టెస్టోస్టెరోన్ స్థాయిలు అధికంగా ఉన్నాయనే వాదనలనూ వారు గుర్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మహిళల పోటీలకు ఖెలీఫ్‌ను ఎలా అనుమతించారని ఐఓసీని వారు నిలదీస్తున్నారు. పైగా..గత ఏడాది ఢిల్లీ వేదికగా అంతర్జాతీయ బాక్సింగ్ సంఘం (ఐబీఏ) నిర్వహించిన వరల్డ్ మహిళా బాక్సింగ్ చాంపియన్‌షిప్ సందర్భంగా ఇమేని, లిన్ యు అనర్హత వేటుకు గురవడాన్ని వారు ప్రస్తావిస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణపై.. తొలి అడుగు మాదే

సామాజిక న్యాయం కోసమే నాడు ఏ, బీ, సీ, డీ నిర్ణయం

అది సరైనదేనని ఇప్పుడు సుప్రీం తేల్చింది: చంద్రబాబు



అమరావతి/అనంతపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు సంబంధించి సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. దీనిపై ముందడుగు వేసింది టీడీపీయేనని గుర్తుచేశారు. గురువారం శ్రీశైలం సున్నిపెంటలో, శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గం గుండుమలలో జరిగిన ప్రజావేదిక సభలో ఆయన మాట్లాడారు. 'ఎక్స్' వేదికగానూ స్పందించారు. 1996లో జస్టిస్ రామచంద్రరాజు కమిషన్ వేసి దేశంలోనే తొలిసారిగా ఎస్సీ వర్గీకరణపై టీడీపీయే ముందడుగు వేసిందని గుర్తుచేశారు. "సామాజిక న్యాయం కోసం ఎస్సీ వర్గీకరణకు ఏ, బీ, సీ, డీ కేటగిరీ నిర్ణయం తీసుకున్నాం. మా నిర్ణయం సరైనదేనని, న్యాయమైనదని, చట్టబద్ధత ఉందని సుప్రీంకోర్టు ఇప్పుడు తీర్పు ఇచ్చింది. అన్ని కులాలు, అన్ని మతాలు, అన్ని ప్రాంతాలకు న్యాయం జరగాల్సి ఉంది. ఎస్సీ వర్గీకరణను ప్రధాని మోదీ కూడా ఆమోదించారు. ఇది శుభ పరిణామం. ఎవరికీ అన్యాయం జరగకుండా అందరికీ న్యాయం జరిగేలా చూస్తాం. అన్ని వర్గాలకు న్యాయం జరగాలి. సామాజిక న్యాయం గెలవాలన్నదే టీడీపీ సిద్ధాంతం. అత్యంత నిరుపేదలకు ఫలాలు అందించడానికి వర్గీకరణ ఉపయోగపడుతుంది. దళితులు ఐక్యంగా ఉండి అభివృద్ధి సాధించాలి. ఆర్థికంగా, సామాజికంగా వారి జీవితాల్లో వెలుగులు రావాలి" అని ఆయన ఆకాంక్షించారు.

సుప్రీం తీర్పును వ్యతిరేకిస్తున్నాం

- ఎస్సీలపై కుట్ర జరుగుతోంది
- మంద కృష్ణను పావుగా వాడుకున్నారు
- తెలంగాణ అసెంబ్లీలో రేవంత్ తీర్మానం ఎలా చేస్తారు?
- వర్గీకరణ కాంగ్రెస్ సూత్రమైతే రాజీనామాకు నేను సిద్ధం
- 3న రాజమండ్రిలో అత్యవసర భేటీ: మాజీ ఎంపీ హర్షకుమార్



రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పును వ్యతిరేకిస్తున్నామని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగబద్ధంగా చెల్లుబాటు కాని ఎస్సీ వర్గీకరణను సుప్రీంకోర్టు ధర్మాసనం ఎలా సమర్థిస్తుందని ప్రశ్నించారు. ఇది చాలా దురదృష్టకరమైన రోజని వ్యాఖ్యానించారు. ఐక్యంగా ఉన్న జాతిని విడదీయాలని ప్రధాని మోదీ కుట్ర చేయడం, దానిలో సుప్రీంకోర్టు కూడా భాగస్వామ్యం కావడం విచారించదగ్గ విషయమన్నారు. ఈ విషయంలో మంద కృష్ణను పావుగా వాడుకున్నారని చెప్పారు. వర్గీకరణ చెల్లదని గతంలో సుప్రీంకోర్టు స్పష్టం చేసిందన్నారు. సుప్రీంకోర్టు రాజ్యాంగానికి లోబడి ఉండాలా, పార్లమెంట్‌కా? అని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు తీర్పు పూర్తిగా కుట్ర అన్నారు. వర్గీకరణపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో తీర్మానం ఎలా చేశారని ప్రశ్నించారు. ఎస్సీలను విభజించడమే కాంగ్రెస్ సూత్రమైతే తాను కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తానని ప్రకటించారు. క్రీమీలేయర్‌కు తాము వ్యతిరేకం కాదని, అయితే ఐక్యతను దెబ్బతీసేలా కుట్ర చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. రాజ్యాంగానికి అతీతంగా ఎస్సీలపై జరుగుతున్న కుట్రకు వ్యతిరేకంగా ఈ నెల 3న రాజమహేంద్రవరంలో అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నామన్నారు.

ధర్మమే గెలిచింది..

30 ఏళ్ల ఉద్యమంలో అమరులైన మాదిగ బిడ్డలకు అంకితం

- వర్గీకరణ పూర్తయ్యే వరకు ఉద్యోగ నియామకాలు చేపట్టొద్దు
- చంద్రబాబు చేసిన చట్టాన్నే అత్యున్నత కోర్టు సమర్థించింది..
- ఆయన న్యాయం వైపే నిలబడతారని మరోసారి రుజువైంది
- బాబుగా సీఎంగా ఉండడం మా జాతికి ఉపయోగపడుతుంది
- త్వరలోనే విజయోత్సవ సభ
- 'ఆంధ్రజ్యోతి'తో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ



1996 నుంచి 'ఆంధ్రజ్యోతి' మా ఉద్యమంలో ఉంది.

ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో 'ఆంధ్రజ్యోతి'ది కీలక పాత్ర అని మందకృష్ణ మాదిగ తెలిపారు. 1996 నుంచి మాదిగ దండోరా ఉద్యమం ప్రతి దశలోనూ తమ వెన్నంటి నిలిచిందన్నారు. మూడు దశాబ్దాల సుదీర్ఘ పోరాటంలో వెలకట్టలేని మద్దతు ఇచ్చి.. తాము విజయం సాధించడంలో విశేష తోడ్పాటు అందించిందని కొనియాడారు.

న్యూఢిల్లీ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం అకుంఠిత దీక్షతో పోరాడామని, ఈ ప్రయాణంలో ఎందరినో కోల్పోయామని, చివరికి ధర్మమే గెలిచిందని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ అన్నారు. ఏపీ, తెలంగాణలో వర్గీకరణను వెంటనే చేపడతారనే విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేదాక ఉద్యోగ నియామకాలు చేపట్టవద్దని కోరారు. ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్లను అవసరం మేరకు రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. తీర్పు తర్వాత సుప్రీంకోర్టు నుంచి బయటకు వచ్చిన మందకృష్ణ ఉద్వేగంతో కంటతడి పెట్టారు. ఆయన వెంట పెద్ద సంఖ్యలో వచ్చిన కార్యకర్తలు మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మందకృష్ణ మాట్లాడారు. "న్యాయం, ధర్మం కోసం చేసిన పోరాటం గెలిచింది. 29 ఏళ్ల వయసులో ఉద్యమం ప్రారంభించా. ఒక జాతికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు 30 ఏళ్లు ఎంతో తపించాం. మమ్మల్ని దెబ్బతీసేందుకు ఎన్నో కుట్రలు జరిగాయి. పలుకుబడి ఉన్న స్వార్థపరులు వెన్నుపోటు పొడిచే ప్రయత్నం చేశారు. అయినా, మేం సహనం కోల్పోలేదు. ఇవాళ విజయం సాధించాం. పోరాటంలో ప్రాణాలొదిలిన మాదిగ బిడ్డలకు దీనిని అంకితం చేస్తున్నాం" అని పేర్కొన్నారు. ఉమ్మడి ఏపీ సీఎంగా ఉండగా ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని తీసుకొచ్చింది చంద్రబాబు అని మంద కృష్ణ గుర్తు చేశారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి అనివార్యం

ఎస్సీ వర్గీకరణను తెలంగాణలో అమలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అనివార్యమని మంద కృష్ణ తెలిపారు. "వర్గీకరణకు అనుకూలమని, సీఎం రేవంత్, కాంగ్రెస్ నేతలు అనేకసార్లు చెప్పారు. సుప్రీంకోర్టులో న్యాయవాదిని ఏర్పాటు చేశామని తెలిపారు. కర్ణాటకలోనూ వర్గీకరణ అమలు చేస్తారనే నమ్మకం ఉంది. దేశంలో రిజర్వేషన్ల చట్టం రెండో అడుగు వేయబోతోంది. రాజ్యాంగం అమల్లోకి వచ్చాక ఉమ్మడి రిజర్వేషన్ల విధానమే ఉంది. కొన్ని కులాలకే రిజర్వేషన్లు మళ్లీమళ్లీ దక్కాయి. ఇకపై మాత్రం ఆ ఫలాలు అన్ని వర్గాలు, వ్యక్తులు, కుటుంబాలకు అందుతాయి. రాజ్యాంగంలో అంబేడ్కర్ రిజర్వేషన్లు పొందుపరిచారు. వాటిని ముందుకు నడిపే ప్రక్రియను ఎమ్మార్పీఎస్ భుజానికెత్తుకుంది" అని అన్నారు. పదేళ్లకోసారి ఎస్సీ, ఎస్టీ జనాభా లెక్కలు ప్రభుత్వాల దగ్గర సిద్ధంగా ఉంటాయని.. కొత్తగా లెక్కలు చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. తక్షణమే రాష్ట్రాలు వర్గీకరణను చేపట్టాలని మంద కృష్ణ డిమాండ్ చేశారు. ఇప్పుడు అమలు చేయకుంటే సుప్రీం కోర్టు తీర్పునకు అన్యాయం చేసినట్టేనని వ్యాఖ్యానించారు. ఒకటి, రెండ్రోజులు ఢిల్లీలోనే ఉండి పెద్దలను కలిసి కృతజ్ఞతలు చెబుతానని మంద కృష్ణ వివరించారు. "హైదరాబాద్ వెళ్లాక అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి తేదీని ప్రకటించి విజయోత్సవ సభ, సహకరించిన వారికి అభినందన సభ నిర్వహిస్తాం. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను హైదరాబాద్‌కు తీసుకురావడంలో, వర్గీకరణను ముందుకు తీసుకెళ్లడానికి కమిటీ ఏర్పాటులో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఎంతో చొరవ చూపారు. వారందరినీ కలుస్తా. విజయోత్సవ, అభినందన సభలకు రావాలని కోరుతా" అని మందకృష్ణ తెలిపారు.

ఇది ఒకరి గెలుపు కాదు.. ఒకరి ఓటమి కాదు..

ఇది ఒకరి గెలుపు కాదు.. ఒకరి ఓటమి కాదని, సోదర వర్గమైన మాలలు పరిస్థితిని అర్థం చేసుకోవాలని, అడ్డంకులు సృష్టించొద్దని మంద కృష్ణ విజ్ఞప్తి చేశారు. "న్యాయమైన వాటా కోసమే తప్ప రిజర్వేషన్ ఫలాలన్నీ మాదిగలే తీసుకోవాలని నేను పోరాటం చేయలేదు. మాదిగల కంటే వెనకబడిన ఉపకులాలు ఉంటే వారి వాటా వారికి అందాలి. ఎక్కడ ఏ వర్గానికి, ఏ తెగకు అన్యాయం జరిగినా అక్కడ వర్గీకరణ అమలు చేయవచ్చన్న కోణంలో సుప్రీం కోర్టు తీర్పుని మనం చూడాలి" అని మందకృష్ణ తెలిపారు. "2004లో వర్గీకరణను రద్దు చేయకపోతే మన ఉద్యమాలు మరోలా ఉండేవి. 20 ఏళ్లలో ఉమ్మడి ప్రయోజనాల కోసం ఎన్నో పోరాటాలు చేసేవాళ్లం. దళిత, గిరిజన, బహుజన వర్గాల హక్కులను సాధించేవాళ్లం. దురదృష్టవశాత్తు 2004 నుంచి మా శక్తినంతా వర్గీకరణ మీదనే కేంద్రీకరించాల్సి వచ్చింది. గుండె జబ్బులున్న పిల్లల కోసం పోరాడితే ఆరోగ్య శ్రీ వచ్చింది. వికలాంగుల కోసం పోరాడితే పింఛన్లు పెరిగినయ్. ఇలా ఒకటి రెండు కాకుండా పూర్తిస్థాయిలో ఉద్యమిస్తే ఎన్నో సాధించేవాళ్లం. ప్రస్తుతం ప్రభుత్వ రంగ సంస్థల్లో రిజర్వేషన్ల పరిధి తగ్గిపోతున్నది. ప్రైవేట్ రంగం పెరిగిపోతున్నది. ఈ రంగంలోని అంశాలను ఎజెండాగా చేసుకుని భవిష్యత్తులో దళిత, గిరిజన, బీసీలు ముందుకు నడవాల్సిన అవసరం ఉంది. అట్రాసిటీ చట్టం రద్దు కాకుండా కాపాడుకున్నట్లే భవిష్యత్తులో కలిసి పోరాడుదాం" అని మంద కృష్ణ పిలుపునిచ్చారు.

మోదీ, వెంకయ్య సహా అందరికీ ధన్యవాదాలు

తమను ఎందరో పెద్దలు, భిన్న రాజకీయ ఆలోచనలున్న నాయకులు సమర్థించారని మంద కృష్ణ తెలిపారు. "యావత్ సమాజం మాదిగ దండోరాకు అండగా నిలిచారు. 30 ఏళ్లుగా నావెంట ఉన్న సహచరులు, నాకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు. ఒక పోరాటం విజయం సాధించింది అంటే అందుకు ప్రజాస్వామ్యవాదులు, పెద్దలు, మీడియా సంపూర్ణ సహకారం వల్లనే. పెద్దలు వెంకయ్యనాయుడు అండగా నిలిచారు. న్యాయాన్ని బతికించేందుకు, పేద వర్గాలకు అండగా నిలిచేందుకు ఇచ్చిన తీర్పుగా దీనిని మేం భావిస్తున్నాం" అని అభివర్ణించారు.

చంద్రబాబు చేసిన చట్టమే నడిపించింది..

"మా పోరాటం ముందుకునడిచి విజయం దక్కిందంటే చంద్రబాబు తెచ్చిన చట్టమే కారణం. నాడు ఆయన వర్గీకరణ చేయకపోతే వేలాది ఉద్యోగాలు వచ్చేవి కాదు. విద్యావకాశాలు దక్కేవి కాదు. చంద్రబాబు చేసిన చట్టాన్నే సుప్రీం కోర్టు సమర్థించింది. ఆయన ఎప్పుడూ న్యాయం, ధర్మం వైపే ఉంటారని మరోసారి రుజువైంది. సుప్రీం తీర్పు చంద్రబాబుకే గర్వకారణం. ఈ సమయంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉండడం మా జాతి భవిష్యత్తుకు ఉపయోగపడుతుంది. చంద్రబాబు స్థానంలో వైఎస్ జగన్ ఉంటే ఏపీలో వర్గీకరణ అమలయ్యేది కాదేమో?" అని మంద కృష్ణ వ్యాఖ్యానించారు.

ఓబీసీ ఉపకులాల వర్గీకరణకు మోక్షం ఎప్పుడు?

ఏడాది క్రితమే జస్టిస్ రోహిణీ కమిషన్ నివేదిక

ఇంతవరకు బయటపెట్టని ఎన్డీయే సర్కారు

ఉప కులాల్లో గందరగోళం రేగితే ఎన్నికలలో దెబ్బతింటామన్న భయంతో వెనుకడుగు!

సుప్రీం 'వర్గీకరణ' తీర్పుతో తెరపైకి 'ఓబీసీ'

న్యూఢిల్లీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డు కులాల్లో ఉప కులాలను వర్గీకరించి రిజర్వేషన్ ఫలాలు వారికి అందజేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో ఓబీసీ ఉప కులాలకు వర్గీకరణ మాటేమిటన్న విషయం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది. ఓబీసీల్లో ఉప కులాలను వర్గీకరించి రిజర్వేషన్ ఫలాలు అందించేందుకు 2017లో ఢిల్లీ హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ రోహిణి నేతృత్వంలో ఏర్పాటైన కమిషన్ తన నివేదికను రాష్ట్రపతి ముర్ముకు గత ఏడాది జూలైలోనే సమర్పించింది. కానీ ఇంతవరకూ ఆ నివేదిక వివరాలను ప్రభుత్వం బయటపెట్టలేదు. దాన్ని ప్రభుత్వం ఇంకా ఆమోదించలేదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ విషయంపై జస్టిస్ రోహిణితో మాట్లాడేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. రాష్ట్రపతి భవన్ నుంచి ఆ నివేదిక సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖకు కూడా చేరలేదని అధికార వర్గాలు తెలిపాయి. ఎన్నికల్లో ఇండియా కూటమి కులాలవారీగా జనగణన, రిజర్వేషన్ల అంశం తెరమీదకు తేవడంతో రోహిణీ కమిషన్ నివేదికను బయటపెడితే తమ ప్రయోజనాలు దెబ్బతింటాయని ఎన్డీఏ ప్రభుత్వం భావించిందన్న అభిప్రాయం ఉంది. ఇప్పుడైనా వెల్లడిస్తుందా లేదా అన్నది చర్చనీయాంశమవుతోంది. కానీ, ప్రభుత్వ ప్రతిస్పందన మాత్రం తెలియడం లేదు. ఆ నివేదికను ప్రభుత్వం ఆమోదిస్తే పార్లమెంట్‌లో ప్రవేశపెడతారని, అప్పుడే అందరికీ అందుబాటులోకి వస్తుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. నిజానికి ప్రభుత్వం రోహిణీ కమిషన్‌ను నియమించిన తర్వాత 13సార్లు పదవీకాలం పొడిగించింది. కాగా, కమిషన్ తన నివేదికను రూపొందించేటప్పుడు పలు అధ్యయనాలు చేసింది. దాదాపు 5 వేల ఓబీసీ కులాల్లో ఒక శాతం మాత్రమే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో, విద్యా సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లను పొందారని, 40 కులాలకే ప్రయోజనాలు దక్కాయని కమిషన్ దృష్టికి వచ్చింది. ఈ విషయంపై కమిషన్ శాస్త్రీయంగా అధ్యయనం చేసి నివేదిక సమర్పించింది. ఓబీసీలకు కల్పిస్తున్న 27 శాతం రిజర్వేషన్ ఇతర ఉపకులాలకు కూడా సమానంగా పంచాలని కమిషన్ అభిప్రాయపడినట్లు తేలింది. ఈ నివేదిక బయటపడితే ఓబీసీ ఉపకులాల్లో గందరగోళం చెలరేగుతుందని, కులాల మధ్య చిచ్చు రేగుతుందని, ఎన్నికల సమయంలో తమ ప్రయోజనాలు దెబ్బతింటాయని ప్రభుత్వం భావించిందన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. మణిపూర్‌లో రెండు తెగల మధ్య చిచ్చు రేగడం, ఈ ఏడాది ఆఖరిలోపు మహారాష్ట్ర, హరియాణా, ఝార్ఖండ్ రాష్ట్రాల ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ఈ నివేదిక ఇప్పట్లో బయటకు వచ్చే అవకాశాలు కనపడడం లేదు. అయితే ఎస్సీ ఎస్టీల వర్గీకరణకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఓబీసీల అంశం కూడా తెర ముందుకు రానున్నది.

వర్గీకరణపై సుప్రీం తీర్పు చరిత్రాత్మకం

మాదిగలకు శుభపరిణామం

- సుప్రీం తీర్పుపై సర్వత్రా హర్షం
- స్పందించిన డిప్యూటీ సీఎం పవన్, లోకేశ్
- మంత్రులు, పురందేశ్వరి, ఇతర నేతలు కూడా





అమరావతి/గుంటూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై పలువురు నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఇది ఓ వర్గం సాగించిన నిరంతర పోరాట ఫలితమని జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ పోరాటం చేసిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) నేత మంద కృష్ణ మాదిగకు గురువారం ఓ ప్రకటనలో అభినందనలు తెలియజేశారు. 'వర్గీకరణ ద్వారా సామాజిక న్యాయం సాధ్యమవుతుందని, అందరికీ సమాన అవకాశాలు కల్పించాలన్న లక్ష్యం నెరవేరుతుందని కేంద్రం ఈ ఏడాది ఫిబ్రవరిలో సుప్రీంకోర్టుకు తెలియజేసింది. ఎస్సీ వర్గీకరణకు ఎన్డీయే పాలనలో సానుకూలత రావడం స్వాగతించదగ్గ పరిణామం. ప్రధాని మోదీకి కృతజ్ఞతలు. చంద్రబాబు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే ఓట్ బ్యాంక్ రాజకీయాలకు భిన్నంగా, అందరికీ సమాన అవకాశాలు కల్పించేందుకు వర్గీకరణ నిర్ణయం తీసుకున్నారు. ఎస్సీల్లోని ఉప కులాల వారు కూడా ఎదగాలని, మాదిగలకు తగిన అవకాశాలు దక్కాలని ఆకాంక్షించే మాల సామాజికవేత్తలు, మేధావులూ ఉన్నారు' అని పవన్ పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వర్గీకరణ హామీకి కట్టుబడి ఉన్నామని మానవ వనరుల మంత్రి లోకేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. 'అన్ని సామాజిక వర్గాల ఆర్థిక, రాజకీయ అభివృద్ధి తెలుగుదేశం పార్టీ ఎజెండా' అని చెప్పారు. 'సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం సమపాళ్లలో అందాలన్నదే టీడీపీ ధ్యేయం. 30 ఏళ్ల కిందటే నాటి సీఎం చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ అమలు చేశారు. దాని వల్ల అప్పట్లో వేల మంది ఉద్యోగాలు పొందారు. ఈ తీర్పుతో ఎస్సీల్లోని అన్ని వర్గాలకు సమ న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నాం' అని రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్లు వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు మరో ప్రకటనలో తెలిపారు. వర్గీకరణను స్వాగతించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్... టీడీపీ ఎప్పుడూ సామాజిక న్యాయం దిశగానే అడుగులు వేస్తుంది. దళితుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేయడంలో టీడీపీ ముందుంటుంది' అని అన్నారు. వర్గీకరణ విజయంలో మొదటి ఘనత ఎమ్మార్పీఎస్ నేతలకు, రెండో ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కుతుందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, శాసన మండలిలో టీడీపీ పక్ష నేత యనమల రామకృష్ణుడు వ్యాఖ్యానించారు.

మాదిగలకు శుభపరిణామం: పురందేశ్వరి

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పును బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి స్వాగతించారు. 'మంద కృష్ణ మాదిగ కోరిన వెంటనే పీఎం మోదీ జాతీయ స్థాయిలో ఎస్సీ వర్గీకరణపై కమిటీ ఏర్పాటు చేసేందుకు ముందడుగు వేశారు. ఈ పరిణామాలు ఎస్సీ కులాల సంక్షేమ, వర్గీకరణ కోసం దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న మాదిగలకు శుభపరిణామం' అని ఎక్స్‌లో పోస్టు చేశారు.

తీర్పు హర్షణీయం: సీపీఐ

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీలను ఎ, బి, సి, డి లుగా వర్గీకరించాలని తమ పార్టీ మొదటి నుంచి చెబుతోందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సామాజిక న్యాయంలో పెద్ద మలుపు: డొక్కా

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు చరిత్రాత్మక తీర్పునివ్వటం సామాజిక న్యాయంలో పెద్ద మలుపు అని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి గుంటూరులో ఆయన అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, వర్గీకరణకు వైసీపీ తప్పితే అన్ని పార్టీలు మద్దతు పలికాయన్నారు. తీర్పు ఎవరికీ వ్యతిరేకం కాదని, ఇది ఒకరి విజయంగా చూడకూడదని తెలిపారు.

తీర్పు చరిత్రాత్మకం: మాదిగ ఎడ్యుకేషనల్ ట్రస్ట్

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుమతించడం ద్వారా సుప్రీం కోర్టు చరిత్రాత్మక తీర్పును వెలువరించిందని మాదిగ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ ఎ.వి.పటేల్ పేర్కొన్నారు. రిజర్వ్‌డ్ కేటగిరీ గ్రూపుల ఉప వర్గీకరణ అధికారాన్ని రాష్ట్రాలకు అప్పగించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈ తీర్పు బలహీనవర్గాల అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు.

దేశంలోనే అందరికంటే ముందుగా అమలుచేస్తాం: రేవంత్

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ధర్మాసనం అనుమతించినందున తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే అందరికంటే ముందుభాగాన నిలబడి షెడ్యూల్డు కులాల (ఎస్సీ) ఏబీసీడీ వర్గీకరణను అమలు చేసే బాధ్యత తీసుకుంటుందని ఆ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అవసరమైతే ఇదివరకే జారీ చేసిన ఉద్యోగ నోటిఫికేషన్లకూ వర్గీకరణను వర్తింపజేయడానికి ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొచ్చి.. మాదిగ, ఉప కులాల సోదరులకు న్యాయం చేసే బాధ్యతన తీసుకుంటాం అని చెప్పారు. వర్గీకరణ అత్యంత ప్రధానమైన అంశం అని.. దీనికి సభ ఏకాభిప్రాయానికి రావాలని, మాదిగ, మాదిగ ఉప కులాలకు సంపూర్ణంగా సహకరించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున నేను విజ్ఞప్తి చేస్తున్నానని పేర్కొన్నారు. సుప్రీం ధర్మాసనానికి కృతజ్ఞతలు తెలుపుతూ గురువారం శాసనసభలో సీఎం ఓ ప్రకటన చేశారు. సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనానికి తాను మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పు చాలా గొప్పదని, ఇంత ప్రధానమైన అంశం ప్రస్తావనకు వచ్చిన సమయంలో ప్రతిపక్ష నేత కేసీఆర్ సభలో లేరు అని పేర్కొన్నారు.

నాడు వర్గీకరణ ఇలా..

- 2000–2004 మధ్య ఉమ్మడి ఏపీలో అమలు
- దీనికోసం ప్రత్యేక జీవో తెచ్చిన చంద్రబాబు
- 1981 జనగణన ఆధారంగా ఏబీసీడీ విధానం
- విద్యా, ఉద్యోగ రంగాల్లో సమగ్రంగా అమలు
- జనాభా దామాషా ప్రకారం ఎస్సీ కులాలు, ఉప కులాలకు సామాజిక న్యాయానికి యత్నం



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'సమాజంలోని అన్ని వర్గాలు, కులాల వారికి న్యాయం జరగాలి. వారి జనాభా ప్రకారం... వారికి అందాల్సిన అవకాశాలు అందాలి'... ఇదే లక్ష్యంతో 24 ఏళ్ల కిందటే చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ అమలు చేశారు. తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో... అప్పట్లో చంద్రబాబు ప్రభుత్వం వర్గీకరణను ఎలా అమలు చేసిందనే అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2000 సంవత్సరంలో ప్రత్యేక జీవోను తెచ్చి వర్గీకరణ విధానాన్ని అమలుచేశారు. 2004లో సుప్రీంకోర్టు ఈ జీవోను రద్దు చేసేవరకు ఈ విధానం కొనసాగింది. జనాభా దామాషా ప్రకారం మాదిగలకు మెడికల్, ఇంజనీరింగ్ సీట్లలో భారీగా ప్రయోజనాలు కలిగించారు. 2000-2004 మధ్య కాలంలో మాదిగలకు ఈ విధానంలో సుమారు 22 వేల ఉద్యోగాలు దక్కాయి.

1981 జనగణన ప్రాతిపదికన...

రాజ్యాంగం ఎస్సీలకు 15 శాతం రిజర్వేషన్లు కల్పించింది. ఎస్సీ కులాలు, ఉప కులాలకు ఉమ్మడిగా రిజర్వేషన్లు అమలయ్యేవి. అయితే, సామాజిక, చారిత్రక కారణాల వల్ల ఈ కులాల్లో కొన్ని రిజర్వేషన్ ఫలాలను అధికంగా అనుభవిస్తే, కొన్ని అసలు పొందలేకపోయాయి. మరికొన్ని కులాలకు అరకొరగా ప్రయోజనాలు అందాయి. దీంతో ఎస్సీ వర్గీకరణ డిమాండ్ తెరపైకి వచ్చింది. జనాభా దామాషాను పరిగణనలోకి తీసుకోవాలని కూడా అప్పట్లో కోరారు. ముఖ్యంగా మాదిగ సామాజిక వర్గం ఈ డిమాండ్‌ను వినిపించింది. అయితే, వర్గీకరణ అంశాన్ని తొలినుంచీ టీడీపీ బలపరుస్తూ వచ్చింది. 1997 నుంచి 2004 వరకు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విధానాన్ని సమగ్రంగా అమలుచేశారు. దీనికోసం 1981 జనాభా లెక్కలను ప్రాతిపదికగా చేసుకున్నారు. దాని ప్రకారం, ఉమ్మడి ఏపీలోని ఆంధ్రా, తెలంగాణ ప్రాంతాల్లో ఎస్సీ కులస్థుల్లో రెల్లి 1.67 శాతం, మాదిగలు 46.94 శాతం, మాలలు 40 శాతం, ఆది-ఆంధ్రకు సంబంధించి 8.96 శాతం మంది ఉన్నట్టు గుర్తించారు. టీడీపీ ప్రభుత్వం నాడు ఈ దామాషా ప్రకారం కేటగిరి ఏ కింద ఉన్న రెల్లి కులస్థులకు 1 శాతం, మాదిగలకు 7 శాతం, మాలలకు 6 శాతం, ఆది-ఆంధ్రులకు 1 శాతంగా రిజర్వేషన్‌ను విభజించారు. రెల్లిలో 12 కులాలు, మాదిగల్లో 18, మాలల్లో 25, ఆది-ఆంధ్రలో 4 కులాలు ఉన్నాయి. కాగా, 2004లో సుప్రీంకోర్టు ఆదేశాలతో వర్గీకరణ జీవో రద్దయింది. 2004 తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలేవీ.. వర్గీకరణ విషయంలో చొరవను చూపలేదు. 2014లో మళ్లీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు అధికారంలోకి రావడంతో మాదిగల్లో ఆశలు చిగురించాయి.

ఆ తర్వాతా కొనసాగిన స్ఫూర్తి

సుప్రీంకోర్టు ఆదేశాలు ఉండటంతో 2004 తర్వాత వర్గీకరణను చేపట్టే పరిస్థితి లేదు. ఈ క్రమంలో 2014లో నవ్యాంధ్రకు తొలి సీఎంగా చంద్రబాబు బాధ్యతల్లోకి వచ్చారు. వర్గీకరణ స్ఫూర్తిని ఆయన ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో కొనసాగించారు. ముఖ్యంగా మాదిగ సామాజిక వర్గానికి జనాభా దామాషా ప్రకారం సంక్షేమ పథకాల్లో వాటా తగ్గకుండా చూశారు. దీనికోసం సాంఘిక సంక్షేమశాఖ 2015 మే 1న జీవో నం. 25ను తెచ్చింది. ఎస్సీ సబ్‌ప్లాన్‌కు సంబంధించిన నిధులను ఆయా కులాల కేటగిరీవారీగా పంపిణీ చేయాలలని ఆ జీవోలో స్పష్టం చేశారు. దీనికోసం 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుంది. దాని ప్రకారం సంక్షేమ ఫలాల పంపిణీ నాడు అందించింది.

చంద్రబాబు చొరవతోనే...

తొలిసారి ముఖ్యమంత్రి అయిన కొత్తల్లోనే చంద్రబాబు వర్గీకరణ అంశంపై దృష్టి సారించారు. దీనిపై పరిశీలనకు రిటైర్డ్ జస్టిస్ పి.రామచంద్రరాజు నేతృత్వంలో ఏకసభ కమిషన్‌ను నియమించారు. 28-05-1995న తన నివేదికను కమిటీ సమర్పించింది. కమిటీ నివేదికను పరిశీలించేందుకు అప్పటి ముగ్గురు మంత్రులు తమ్మినేని సీతారాం, కె.చంద్రశేఖర్, నిమ్మల కిష్టప్ప ఆధ్వర్యంలో 02-06-1997న కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటుచేశారు. తన సిఫారసులను 04-06-1997న సబ్ కమిటీ ఇచ్చింది. ఈ సిఫారసుల మేరకు షెడ్యూల్డ్ కులాలకు ఉన్న 15 శాతం రిజర్వేషన్లను ఏ, బీ, సీ, డీలుగా వర్గీకరిస్తూ 06-06-1997న జీఓ 68 జారీచేశారు. దీని ప్రకారం.. మాదిగ సామాజికవర్గాన్ని షెడ్యూల్డ్ కులాలలో రెండో వెనుకబడిన కులాల గ్రూపుగా గుర్తించారు. వర్గీకరణ ప్రకారం బ్యాక్‌లాగ్ పోస్టులను వర్గీకరణ ప్రకారం భర్తీ చేయడానికి 07-06-1997న జీఓ నెం.69 జారీచేశారు. ఈ క్రమంలో శాసనసభలో చంద్రబాబు హయాంలోనే వర్గీకరణకు అనుకూలంగా మూడు తీర్మానాలు చేశారు. అవి.. 1)22-04-1998న జస్టిస్ రామచంద్రరాజు సిఫారసుల మేరకు వర్గీకరణ చేస్తూ తీర్మానం. 2)01-04-2000న ఎస్సీ కులాల రిజర్వేషన్ బిల్లు-2000ను ఆమోదిస్తూ తీర్మానం. 3)ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో పార్లమెంట్ స్థాయిలో తగు చర్యలు తీసుకోవాలని 10-12-2004న శాసనసభలో తీర్మానం.

2011 జనాభా లెక్కల ప్రకారం ఏపీ, తెలంగాణలో కులాలవారీగా ఎస్సీ జనాభా

	ఎస్సీ కులాల జనాభా	మాదిగ జనాభా	మాల జనాభా	తేడా
ఆంధ్రప్రదేశ్	84,45,398	34,68,967	40,43,101	5,74,134
తెలంగాణ	54,32,680	32,33,642	15,27,143	17,06,499



ఎమ్మెల్యేగా ఉన్నప్పటి నుంచే కోరుతున్నా: వెంకయ్య

ఎస్సీ ఎస్టీ వర్గాల్లో మరింత వెనుకబడిన కులాల వారికి కోటా కల్పించడానికి వీలుగా ఉప వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు ఉందని సుప్రీం కోర్టు గురువారం ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకం. రిజర్వేషన్ల విధానంలో మరో ముందడుగు పడింది. ఎస్సీ, ఎస్టీ కులాల వారిలో మరింత అణగారిన వర్గాలకు రిజర్వేషన్ల ఫలాలు అందాలంటే ఉప వర్గీకరణ ఉండాలని శాసన సభ్యుడిగా ఉన్నప్పటి నుంచి కోరుతూనే ఉన్నా. వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా పోరాడుతున్న మందకృష్ణకు అభినందనలు. ఆయన ఉద్యమ కల సాకారమైంది.

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి: దండోరా

పార్లమెంటులో బిల్లు పెట్టి రాజ్యాంగ సవరణ ద్వారా ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని మాదిగ హక్కుల దండోరా డిమాండ్ చేసింది. గురువారం ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో దండోరా జాతీయ, రాష్ట్ర అధ్యక్షుడు దండు సురేందర్ మాదిగ, కొంగరి శంకర్ మాదిగ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. సుప్రీం కోర్టు తీర్పుతో మాదిగల బతుకుల్లో వెలుగులు వచ్చాయని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్ మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు వల్ల తెలంగాణ మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. జనాభా దామాషా ప్రకారం మాదిగ రిజర్వేషన్లను 12 శాతానికి పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.

సుప్రీం తీర్పును అమలు చేస్తాం: సీఎం స్టాలిన్

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమైనదని తమిళనాడు సీఎం స్టాలిన్ హర్షం వ్యక్తం చేశారు. సుప్రీం తీర్పును తమ ప్రభుత్వం వెంటనే అమలు చేస్తుందని అన్నారు. వర్గీకరణపై దశాబ్దాలుగా నెలకొన్న వివాదాన్ని సుప్రీం కోర్టు పరిష్కరించడం శుభపరిణామని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు.



వర్గీకరణకు సై!

(మొదటిపేజీ తరువాయి)

చేకూరనుంది. వెనుకబాటుతనంపై పూర్తి కసరత్తు తర్వాతే వర్గీకరణ అమలు చేయాలని సుప్రీంకోర్టు 565 పేజీల సుదీర్ఘ తీర్పులో స్పష్టం చేసింది. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉప కులాల ప్రాతినిధ్యంపై, వెనుకబాటుతనంపై పూర్తి శాస్త్రీయమైన, గణాంక వివరాలతో సమాచారాన్ని సిద్ధం చేసుకున్న తర్వాతే వర్గీకరణ చేపట్టాలని తేల్చిచెప్పింది. అయితే, ఒక ఉప కులానికి నూటికి నూరు శాతం రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్రాలు ఇష్టారాజ్యంగా నిర్ణయం తీసుకోవడం కుదరదని స్పష్టం చేసింది. రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్రాలు నిర్ణయాలు తీసుకోరాదని, అలాంటి నిర్ణయాలపై న్యాయ సమీక్ష జరుగుతుందని హెచ్చరించింది. అంతేకాకుండా, ఎస్సీ ఎస్టీల్లో సంపన్నులను(క్రీమీలేయర్) గుర్తించి వారికి రిజర్వేషన్ వర్తించకుండా చూడాలని స్పష్టం చేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం గురువారం 6-1 మెజారిటీతో తీర్పునిచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో చేపట్టి, ఐదేళ్ల పాటు అమలు చేసిన ఎస్సీ వర్గీకరణను 2004లో సుప్రీంకోర్టు రాజ్యాంగ విరుద్ధమంటూ కొట్టేసింది. రాజ్యాంగంలోని 341 నిబంధన కింద రాష్ట్రపతి జారీ చేసిన ఎస్సీ కులాల జాబితాలోని కులాలన్నీ ఒకే వర్గమని, వాటిని వర్గీకరించడం కుదరదని చెన్నయ్య వర్సెస్ ఆంధ్రప్రదేశ్ కేసులో ఇరవై ఏళ్ల క్రితం తీర్పునిచ్చింది. ఆ తర్వాత వివిధ రాష్ట్రాల్లో చేపట్టిన ఎస్సీ వర్గీకరణలను 2004 సుప్రీం తీర్పు ఆధారంగా హైకోర్టులు కొట్టేశాయి. హైకోర్టులిచ్చిన తీర్పులపై సుప్రీంకోర్టులో అప్పీళ్లు దాఖలు అయ్యాయి. 2004 నాటి తీర్పును పునస్సమీక్షిస్తూ, ఇతర అప్పీళ్లను పరిష్కరిస్తూ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం గురువారం తాజాగా తీర్పునిచ్చింది. రాజ్యాంగ ధర్మాసనంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ బేల ఎం.త్రివేదీ, జస్టిస్ పంకజ్ మిథాల్, జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ సతీశ్ చంద్రశర్మ సభ్యులుగా ఉన్నారు. ఈ ఏడాది ఆరంభంలో మూడు రోజులపాటు వాదనలు విని, ఫిబ్రవరి 8న తీర్పును రిజర్వు చేశారు. గురువారం తీర్పును వెలువరించింది. న్యాయమూర్తి జస్టిస్ బేల ఎం.త్రివేదీ మాత్రం వర్గీకరణను వ్యతిరేకిస్తూ విడిగా తీర్పునిచ్చారు.

2004 తీర్పులో ఏం చెప్పారు?

ఈవీ చిన్నయ్య కేసులో సుప్రీం న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.సంతోష్ హెగ్డే, జస్టిస్ ఎస్.ఎన్.వరియవా, జస్టిస్ బి.పి. సింగ్, జస్టిస్ హెచ్.కె. సీమా, జస్టిస్ ఎస్.బి.సిన్హాలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 341లో పేర్కొన్న కులాల జాబితాను రాష్ట్రాలు మార్చలేవని స్పష్టం చేశారు. రాష్ట్రపతి మాత్రమే ఆర్టికల్ 341 కింద ఏ రాష్ట్రానికైనా కొన్ని వర్గాలను షెడ్యూల్డు కులాలుగా నిర్ణయించగలరని, గవర్నర్‌తో సంప్రదించి ఆయా రాష్ట్రాలకు ఎస్సీల నోటిఫై చేయాలని తెలిపారు. 1997లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాదిగల ఉద్యమం ఊపందుకోవడంతో అప్పటి ప్రభుత్వం జస్టిస్ రామచంద్ర రాజు కమిషన్ని నియమించి, ఆ కమిషన్ సిఫారసుల మేరకు షెడ్యూల్డు కులాలను ఏబీసీడీలుగా వర్గీకరిస్తూ 2000 సంవత్సరంలో చట్టం చేసింది. ఈ చట్టాన్ని ఏపీ హైకోర్టులో సవాలు చేసినపుడు ఈ చట్టం సరైనదే నంటూ ఏపీ హైకోర్టు అయిదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం మెజారిటీ తీర్పును ప్రకటించింది. దాన్ని ఈవీ చిన్నయ్య సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో జస్టిస్ సంతోష్ హెగ్డే నేతృత్వంలోని ధర్మాసనం హైకోర్టు తీర్పును కొట్టేసింది. దాంతో నాలుగేళ్లుగా మాదిగలు అనుభవిస్తున్న వర్గీకరణ ఫలాలకు తెరపడింది. ఈవీ చిన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా పంజాబ్, హర్యానా హైకోర్టు కూడా 2010లో పంజాబ్‌లో ఎస్సీ వర్గీకరణను కొట్టివేసింది. ఎస్సీ కోటాలో సగం ఖాళీలను వాల్మీకులు, మరుబీ సిక్కులకు కేటాయిస్తూ పంజాబ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆ రాష్ట్ర హైకోర్టు కొట్టేసింది. దవీందర్ సింగ్ వర్సెస్ పంజాబ్ ప్రభుత్వం పేరుతో ఈ కేసు సుప్రీంకోర్టుకు వచ్చినపుడు 2020లో ఐదుగురు సభ్యుల ధర్మాసనం దాన్ని రాజ్యాంగ ధర్మాసనం పరిశీలించాలని సిఫార్సు చేసింది. ఉప వర్గీరకణ ఆమోద యోగ్యం కాదంటూ ఈవీ చిన్నయ్య కేసులో సుప్రీం ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని ఈ ధర్మాసనం కోరింది. ఆ మేరకు జస్టిస్ చంద్రచూడ్ ఆధ్వర్యంలో విస్తృత రాజ్యాంగ ధర్మాసనం సుదీర్ఘంగా విచారణ జరిపిన తర్వాత గురువారం తన నిర్ణయాన్ని ప్రకటించింది.

సుప్రీంతీర్పును ప్రభావితం చేసిన బాలగోపాల్ వ్యాసం

పంజాబ్ ప్రభుత్వం తరఫున వాదించిన ప్రముఖ న్యాయవాది కపిల్ సిబాల్ తన వాదనలో 2005లో ఎకనమిక్స్ అండ్ పొలిటికల్ వీక్లీలో ప్రముఖ తెలుగు రచయిత, మేధావి బాలగోపాల్ వ్యాసాన్ని విస్తృతంగా ఉటంకించారు. న్యాయ కోవిదుడైన బాలగోపాల్ ఆర్టికల్ 341కు వర్గీకరణ ఏ విధంగా విరుద్ధం కాదో స్పష్టంగా వివరించారని కపిల్ సిబాల్ వాదించారు. ఉప వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకం కాదని బాలగోపాల్ చేసిన వాదనను ఉటంకిస్తూ ఆయన బాలగోపాల్ రాసిన వ్యాసాన్ని తన పిటిషన్‌కు అనుబంధంగా చేర్చారు. స్వజాతి వర్గమైన షెడ్యూల్డు కులాలను విభజించే అధికారం రాజ్యాంగంలోని 341 కింద శాసనసభకు లేదు అన్నపుడు ఆ అధికారం పార్లమెంటుకు మాత్రం ఎందుకు ఉంటుందని బాలగోపాల్ 'దళితుల్లో దళితులకు న్యాయం' అన్న పేరుతో రాసిన వ్యాసంలో పేర్కొన్నారు. ఈవీ చిన్నయ్య కేసులో జస్టిస్ సంతోష్ హెగ్డే బెంచ్ ఇచ్చిన తీర్పు సామాజిక వాస్తవికతలకు దూరంగా ఉన్నదని బాలగోపాల్ విమర్శించారు. విద్య, సామాజిక సంక్షేమం, ఉపాధి కల్పనకు సంబంధించి రాష్ట్రాలకు అధికారాలు ఉన్నపుడు షెడ్యూల్డు కులాల్లో ఒక ఉప కులానికి జరుగుతున్న అన్యాయాన్ని అవి ఎందుకు సరి చేయలేవని ఆయన ప్రశ్నించారు. మాదిగలకు చిరకాలంగా జరుగుతున్న అన్యాయాన్ని వివరించిన బాలగోపాల్ రాజ్యాంగాన్ని స్వేచ్ఛగా, విశాలంగా మారుతున్న కాలం, సామాజిక అవసరాలకు అనుగుణంగా అన్వయింప చేయాలని అభిప్రాయ పడ్డారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ మాటలను జస్టిస్ సంతోష్ హెగ్డే ధర్మాసనం ఎలా తప్పుగా అన్వయించిందో ఆయన వివరించారు.

వర్గీకరణ రాజ్యాంగ ఉల్లంఘన కాదు: జస్టిస్ చంద్రచూడ్



చారిత్రక ఆధారాలు పరిశీలిస్తే ఎస్సీ వర్గంలో ఉన్న వారంతా నిజానికి ఒకే వర్గం కాదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ జస్టిస్ మిశ్రాతో కలిసి స్వయంగా రాసిన తీర్పులో పేర్కొన్నారు. కులాలను వర్గీకరించడం రాజ్యాంగంలోని 14వ అధికరణలో పేర్కొన్న సమానత్వ హక్కును ఉల్లంఘించినట్లు కాదని చెప్పారు. ఎస్సీ కులాల్లో కొత్తగా ఏదైనా కులాన్ని చేర్చే హక్కు పార్లమెంటుకు ఉంటుందని చెప్పే ఆర్టికల్ 341(2)కు ఎస్సీ కులాల వర్గీకరణ విరుద్ధం కాదని అన్నారు. రాష్ట్రాలకు ఆర్టికల్ 15(వివక్ష లేని), ఆర్టికల్ 16(సమాన అవకాశాలు) కింద ఆయా వర్గాల వెనుకబాటుతనాన్ని గుర్తించి రిజర్వేషన్లను కల్పించే అధికారం ఉందన్నారు. ఆర్టికల్ 341లో పేర్కొన్న కులాలను వేరు చేసి చూడటానికి హేతుబద్ధమైన సూత్రం ఉన్నపుడు, ఆ సూత్రం వర్గీకరణ లక్ష్యంతో సంబంధం కలిగి ఉన్నపుడు వర్గీకరణ చేపట్టవచ్చని చెప్పారు. నిజమైన సమానత్వాన్ని సాధించడానికి ఉప వర్గీకరణ మార్గం అయినపుడు వర్గీకరణ రాజ్యాంగ బద్ధమే అవుతుందన్నారు. లభిస్తున్న డేటాను బట్టి చూస్తే ఎస్సీ కులాల మధ్య కూడా అసమానతలు ఉన్నాయని, ఆ కులాలు వర్గంగా అవతరించిన ఒకేరకమైన కులాలు కాదని చెప్పారు. ఎస్సీ కులాలను ఆర్టికల్ 341 ద్వారా కలిపినంత మాత్రాన విభజించడం కుదరనంత ఏకరూప వర్గంగా అవి ఏర్పడవని అన్నారు. కేవలం చట్టపరంగా ఇతర కులాలతో వేరు చేసి చూపడమనే పరిమిత లక్ష్యంతోనే ఎస్సీ కులాలను ఆర్టికల్ 341 రూపంలో ఒకచోట కలిపారని వివరించారు. వెనుకబాటుతనం, ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం విషయంలో గణించదగ్గ, విశ్వసనీయమైన సమాచారం ఆధారంగానే వర్గీకరణ చేయవచ్చని చెప్పారు. ఇప్పటికే ఎస్సీ కులాల జాబితాలో ఉన్న ఏ కులానికైనా ఎస్సీ కులాలకు వర్తించే లబ్ధి చేకూరకుండా వర్గీకరణ చేపడితే రాజ్యాంగ విరుద్ధం అవుతుందని స్పష్టం చేశారు. బాగా వెనుకబడిన కులాలకు అధిక ప్రాధాన్యం లభించేట్లు చూడాల్సిన రాష్ట్ర ప్రభుత్వాల దేనని జస్టిస్ గవాయ్ అన్నారు. ఎస్సీ, ఎస్టీల్లో కొంతమంది వ్యక్తులే రిజర్వేషన్ ఫలాలను అనుభవిస్తున్నారని వ్యాఖ్యానించారు. వందల ఏళ్ల అణచివేతను ఎదుర్కొన్న ఎస్సీ, ఎస్టీ కులాల్లోనూ అంతరాలు ఉన్నాయని, క్షేత్ర స్థాయిలో కనిపిస్తున్న వాస్తవాలను కాదనలేమని చెప్పారు. రిజర్వేషన్లకు రాజ్యాంగంలోని 341 అధికరణే ప్రాతిపదిక అని ఈవీ చిన్నయ్య కేసులో సుప్రీంకోర్టు భావించడమే మౌలిక లోపమని జస్టిస్ గవాయి వ్యాఖ్యానించారు. రిజర్వేషన్ల కోసం కులాలను గుర్తించే పని మాత్రమే ఆర్టికల్ 341 చేస్తుందని చెప్పారు. ఒక పెద్ద వర్గంలో భాగమైన మరో ఉపవర్గం వివక్షను ఎదుర్కొంటున్నందుకే ఉప వర్గీకరణ చేయాల్సి వస్తోందని తెలిపారు.

మోదీ మద్దతే కీలక మలుపు

పరేడ్ గ్రౌండ్స్ సభలో ప్రధాని కీలక ప్రకటనే టర్నింగ్ పాయింట్

ఆ తర్వాతే న్యాయపరమైన చిక్కులు తొలగింపునకు కమిటీ వేసిన కేంద్రం

మాదిగలు ఇక మా వైపే.. కమలనాథుల్లో ధీమా

స్పందనపై మాత్రం వ్యూహాత్మక మౌనం.. మాలలు దూరమవుతారనేనా?

హైదరాబాద్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు పట్ల బీజేపీలో జోష్ వ్యక్తమవుతోంది. వర్గీకరణ అంశాన్ని తాము ఎన్నికల కోణంలో కాకుండా సామాజిక కోణంలోనే చూశామని, ఫలితంగా మున్ముందు మాదిగ సామాజికవర్గం తమకు అండగా ఉంటుందని భావిస్తోంది. సుదీర్ఘకాలం కొనసాగిన వర్గీకరణ ఉద్యమంలో తమ పార్టీది కీలక పాత్ర అని పార్టీ ముఖ్యనేతలు పేర్కొంటున్నారు. వర్గీకరణకు ఇతర పార్టీలు కూడా మద్దతిచ్చినా ప్రధాని మోదీ ప్రత్యేక చొరవ తీసుకోవడమే కీలక మలుపు అని బీజేపీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా, రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ, తొలుత ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణతో పాటు మరికొందరు ముఖ్యులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. వర్గీకరణకు మద్దతుపై విస్పష్ట హామీ ఇచ్చారు. ఆ తర్వాత నవంబరు 9న మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో పరేడ్‌గ్రౌండ్సులో నిర్వహించిన మాదిగల విశ్వరూప మహాసభకు మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వర్గీకరణ అంశానికి సంబంధించి న్యాయపరంగా ఎదురయ్యే చిక్కులు తొలగించేందుకు ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేస్తామని కీలక ప్రకటన చేశారు. ఈ మేరకు కేంద్రం, గత జనవరి 19న ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేసింది. ఈ నిర్ణయంతో న్యాయపరంగా ప్రక్రియ వేగవంతమైంది. వర్గీకరణపై కేంద్రం కమిటీ ద్వారా తన వైఖరిని స్పష్టంగా సుప్రీంకు నివేదించింది. ఫలితంగా సామాజిక న్యాయానికి పార్టీ కట్టుబడి ఉంటామంటూ తాను ఇచ్చిన మాటను మోదీ నిలబెట్టుకున్నట్లయిందని పార్టీ ముఖ్యనేత ఒకరు వివరించారు. నాలుగు దశాబ్దాల కిందట మండల్ కమిషన్‌తో బీసీల్లో సామాజిక, రాజకీయ చైతన్యం వచ్చింది.. ఇప్పుడు ఎస్సీ వర్గీకరణతో చిట్టచివరి దళితుడికి న్యాయం లభిస్తుందని బీజేపీ నేతలు భావిస్తున్నారు. దళితుల్లో దాదాపు 60 శాతం మాదిగలు ఉన్నట్లు అంచనా వేస్తున్న కమలనాథులు, వారంతా తమకే మద్దతిస్తారని ధీమా వ్యక్తం చేస్తున్నారు. 1997లో వరంగల్‌లో జరిగిన పార్టీ సమావేశంలో బంగారు లక్ష్మణ్ నాయకత్వంలో, వి. రామారావులు చొరవ తీసుకుని అందరికీ సమన్యాయం అన్న అంశంపై తీర్మానం చేశారని పార్టీ సీనియర్ నేత ఒకరు తెలిపారు. అయితే ఎస్సీ వర్గీకరణపై తమ వాదనకు అనుకూలంగా సుప్రీం తీర్పు వచ్చినా, బీజేపీ అధికారికంగా ఎలాంటి స్పందనా వెల్లడించలేదు. ఇది వ్యూహాత్మకం అని పార్టీ నేతలు పేర్కొంటున్నారు. జాతీయ నాయకత్వం ఆదేశాల మేరకే రాష్ట్రపార్టీ ముఖ్యనేతలు ఎవరూ స్పందించలేదని సమాచారం. మాదిగలకు న్యాయం చేసే సమయంలో మాలలు దూరం కావొద్దన్న అభిప్రాయంతో జాతీయ నాయకత్వం ఉంది. అందుకే ఆచీతూచి స్పందించాలని నిర్ణయించినట్లు పార్టీ నేతలు పేర్కొంటున్నారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీం తీర్పు చారిత్రాత్మకమైందని బీజేపీ సీనియర్ నేత మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా సాంబమూర్తి తెలిపారు. ఈ తీర్పును స్వాగతిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

లేని అధికారాన్ని కట్టబెడుతున్నారు: జస్టిస్ త్రివేదీ



రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ప్రకారం రాష్ట్రపతి జారీ చేసిన కులాల జాబితాను మార్చడానికి వీల్లేదని జస్టిస్ బేల ఎం.త్రివేదీ విడిగా ఇచ్చిన తన అసమ్మతి తీర్పులో పేర్కొన్నారు. పార్లమెంటు చట్టం ద్వారా అందులో కులాలను చేర్చడం, తీసివేయడానికి మాత్రమే అధికారం ఉందని చెప్పారు. వర్గీకరణ చేయడమంటే రాష్ట్రపతి జాబితాకు మార్పులు చేర్పులు చేయడమేనని అన్నారు. ఎస్సీ, ఎస్టీల జాబితాను రాజకీయ కారణాలతో ఇష్టం వచ్చినట్లు మార్చకుండా చూడటానికే రాజ్యాంగంలో 341 నిబంధనను చేర్చారని చెప్పారు. అధికరణానికి స్పష్టమైన అర్థం ఉన్నపుడు దాన్నే తీసుకోవాలని సూచించారు. రాష్ట్రపతి జాబితాలో ఉన్న ఒక వర్గంలో ఉప వర్గానికి అధిక ప్రాధాన్యమిచ్చినపుడు అదే వర్గంలోని ఇతర కులాలకు అన్యాయం జరుగుతుందని జస్టిస్ బేల ఎం.త్రివేదీ వ్యాఖ్యానించారు. అందరు ఎస్సీలకు వర్తించే రిజర్వేషన్ ఫలాలను కొన్ని ఉప కులాలకు కేటాయించే అధికారం రాష్ట్రాలకు లేదని చెప్పారు. రిజర్వేషన్లకు సంబంధించి ఎలాంటి కార్యనిర్వాహక, చట్టపరమైన అధికారాలు రాష్ట్ర ప్రభుత్వాలకు లేవన్నారు. అలా చేసేందుకు రాష్ట్రాలను అనుమతించడం.. లేని అధికారాన్ని కట్టబెట్టడం అవుతుందని చెప్పారు.



ఎస్సీ, ఎస్టీల్లోనూ క్రీమీలేయర్: జస్టిస్ గవాయ్



సకారాత్మక కార్యాచరణలో భాగంగా ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన రిజర్వేషన్ల ప్రయోజనాల నుంచి సంపన్నులను తప్పించాలని జస్టిస్ గవాయ్ స్పష్టం చేశారు. నిజమైన సమానత్వం సాధనకు అదే మార్గమని చెప్పారు. వర్గీకరణ చేసే క్రమంలో క్రీమీలేయర్ వాళ్లను తప్పించినపుడే నిజమైన సమానత్వం జరుగుతుందని, క్రీమీలేయర్‌లను గుర్తించేందుకు ప్రభుత్వం ఒక విధానం ఏర్పర్చుకోవాలని సూచించారు. జస్టిస్ విక్రమ్‌నాథ్ కూడా అదే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఓబీసీలకు వర్తింపజేస్తున్న క్రీమీలేయర్ ఎస్సీలకూ వర్తింపజేయాలన్నారు. రిజర్వేషన్లు ఒక తరానికి మాత్రమే వర్తింపజేయాలని జస్టిస్ పంకజ్ మిథాల్ సూచించారు. మొదటితరం రిజర్వేషన్లతో ఉన్నత స్థానాన్ని అందుకుంటే తర్వాతి తరానికి రిజర్వేషన్లు వర్తింపజేయొద్దని చెప్పారు. జస్టిస్ సతీశ్ చంద్ర కూడా క్రీమీలేయర్‌ను సమర్థించారు.

ఊరూ వాడా దండోరా!

30 ఏళ్ల వర్గీకరణ ఉద్యమంలో 23 మంది ప్రాణాలు కోల్పోయారు. గాంధీభవన్ ముట్టడిలో ఎమ్మార్పీఎస్‌కు చెందిన నలుగురు నాయకులు అగ్నిప్రమాదంలో తీవ్రంగా గాయపడగా... వారిలో ముగ్గురు మరణించారు.

23,560 పోలీసు కేసులు నమోద య్యాయి. ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు.

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో మూడుసార్లు ఏకగ్రీవ తీర్మానాలు జరిగాయి.

వర్గీకరణకు సభలు, యాత్రలు, దీక్షలతో మంద కృష్ణ పోరాటం

చంద్రబాబు హయాంలో నాలుగేళ్ల ఫలాలు

సాంకేతిక కారణాలతో జీవోను నిలిపిన సుప్రీంకోర్టు

పార్లమెంటులో సవరణ బిల్లుకోసం ఎమ్మార్పీఎస్ పోరు

ఇన్నేళ్లకు రాష్ట్రాలకే అధికారమిచ్చిన సుప్రీం కోర్టు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మూడు దశాబ్దాలకుపైగా అలుపెరగని ఉద్యమం! అనేక బలిదానాలు... వేలాది కేసులు! భారీ బహిరంగ సభలు! నిరాహార దీక్షలు... చైతన్య యాత్రలు! ఏళ్లు గడుస్తున్నా వెనుకడుగు వేసిందే లేదు! గమ్యం చేరేదాకా తగ్గేదే లేదు. ఇది.. ఎమ్మార్పీఎస్ 'వర్గీకరణ' ఉద్యమం సాగిన తీరు. మాదిగలకు రిజర్వేషన్ ప్రస్తావన వస్తే గుర్తుకొచ్చేది.. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్), దండోరా ఉద్యమం, మంద కృష్ణ మాదిగ! షెడ్యూల్డ్ కులాల జాబితాల్లో ఉన్న వారందరికీ సమానంగా రిజర్వేషన్ ఫలాలు అందించడానికి వర్గీకరణ సిద్ధాంతంతో ఇది ఆవిర్భవించింది. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు 'దండోరా' పేరుతో ఉద్యమాన్ని కొనసాగించారు. ఎమ్మార్పీఎస్ మొదటి సమావేశం 1995 మే 31న ఒంగోలులో జరిగింది. ఉద్యోగ, విద్యార్థి, యువసేన, మహిళా సమాఖ్య వంటి విభాగాలను ఏర్పాటుచేసి శక్తిమంతమైన సంస్థగా ఎదిగింది.

చలో హైదరాబాద్..

1996 మార్చి 2న హైదరాబాద్ నిజాం కళాశాల మైదానంలో మందకృష్ణ నేతృత్వంలో సుమారు 5 లక్షల మంది మాదిగలతో తొలి రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. వర్గీకరణ పోరాటంలో ఇదో కీలక ఘట్టం. మార్చి 25న నిజాం కళాశాలలోని జగజ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద 80 వేల మంది మాదిగలతో ఆత్మగౌరవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ర్యాలీ అనంతరం సమావేశానికి అప్పటి సీఎం చంద్రబాబు, మాదిగ మంత్రులు హాజరయ్యారు. వర్గీకరణకు చంద్రబాబు హామీ ఇచ్చారు. 1996 సెప్టెంబరు 2న ఇందిరా పార్క్ నుంచి బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహం వరకు జరిగిన భారీ ర్యాలీలో 2 లక్షల మందికి పైగా మాదిగలు పాల్గొన్నారు. టీడీపీకి చెందిన మాదిగ ఎమ్మెల్యేల బృందాన్ని పంపి... మాదిగలకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు హామీ ఇచ్చారు. రాత్రి 10 గంటలకు స్వయంగా జోక్యం చేసుకుని 45 రోజుల్లోగా విచారణ జరిపి వర్గీకరణ చేస్తామని ప్రకటించారు. కమిషన్‌ను ఏర్పాటు చేశారు. కాగా, వర్గీకరణకు మద్దతుగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టేందుకు మంద కృష్ణ మహా పాదయాత్ర (లాంగ్‌మార్చ్)లు నిర్వహించారు. చంద్రబాబు స్వగ్రామం నారావారిపల్లి నుంచి హైదరాబాద్‌లోని ఆయన అధికారిక నివాసం వరకు 1052 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. అదే సమయంలో



కమిషన్ నివేదికను సమర్పించింది. 1997లో హైదరాబాద్‌లో మహాపాదయాత్ర ముగిసినప్పుడు ప్రభుత్వం తమ డిమాండ్‌ను అంగీకరించే వరకు వెళ్లేది లేదని దండోరా నాయకులు భీష్మించారు. అయితే, కమిషన్ నివేదిక ఆధారంగా ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీడీగా వర్గీకరిసూ టీడీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

న్యాయ స్థానాల్లో...

వర్గీకరణ జీవోను సవాల్ చేస్తూ మాల మహానాడు హైకోర్టులో రిట్ పిటిషన్ వేసింది. సాంకేతిక కారణాలతో జీవోను కోర్టు సస్పెండ్ చేసింది. సాంకేతిక సమస్యలను సరిచేయడానికి రాష్ట్ర ప్రభుత్వం జాతీయ ఎస్సీ/ఎస్టీ కమిషన్‌ను సంప్రదించి మొత్తం సమాచారాన్ని సమర్పించింది. 1998 అక్టోబరు 1న ప్రభుత్వం వర్గీకరణపై ఆర్డినెన్స్ ఇవ్వాలని నిర్ణయించింది. మంత్రివర్గం అంగీకరించి గవర్నర్‌కు పంపారు. గవర్నర్ దానిని రాష్ట్రపతి అభిప్రాయానికి పంపారు. 1999 నవంబరు 30న రాష్ట్రపతి వర్గీకరణకు ఆర్డినెన్స్ జారీకి అనుమతించారు. 1999 డిసెంబరు 9న గవర్నర్ ఆర్డినెన్స్ జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 2000 ఏప్రిల్ 1న జీవో ఇచ్చింది. కానీ, మాల మహానాడు సుప్రీంకోర్టును ఆశ్రయించింది. వర్గీకరణ అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉందంటూ 2004 నవంబరు 5న వర్గీకరణ జీవోను కొట్టివేసింది. ఈ నాలుగేళ్ల కాలంలో మాదిగలు వర్గీకరణ ఫలాలను అనుభవించారు.

వైఎస్ హయాంలో...

2004 నవంబరు 16న కడప జిల్లాలోని వైఎస్ జన్మస్థలం బలపనూరు నుంచి 'చైతన్య యాత్ర' ప్రారంభించిన మంద కృష్ణ జీపులో రాష్ట్రమంతా పర్యటించారు. ప్రభుత్వం 2004 డిసెంబరు 10న ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. అయినా వర్గీకరణ కల నెరవేరలేదు. బెంగళూరు నుంచి హైదరాబాద్ వరకు 'మాదిగల ధర్మ యుద్ధ మహా పాదయాత్ర', అమలాపురం నుంచి హైదరాబాద్‌కు 'తిరుగుబాటు మహాపాదయాత్ర'లు చేశారు. యాత్ర ముగింపు రోజున ఇందిరా పార్కు వద్దకు వేలాదిగా మాదిగలు తరలివచ్చారు. రాజ్యాంగ సవరణకు 24 గంటల గడువిచ్చి ధర్నా ప్రారంభించారు. వైఎస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా ప్రకటించింది. 2007 మే 17న లక్షలాదిమందితో విజయవాడ సింగ్‌నగర్ స్టేడియంలో విశ్వరూప మహాసభ నిర్వహించారు. వర్గీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం కమిషన్‌కు చైర్మన్లను నియమించినా వారెవరూ బాధ్యతలు స్వీకరించలేదు. ఈ జాప్యాన్ని నివారించేందుకు మందకృష్ణ మాదిగ 2007 మే 17న సీఎం నివాసాన్ని ముట్టడిస్తామని ప్రకటించారు. పోలీసులు ఆయనను అరెస్టు చేసి గాంధీ ఆసుపత్రికి తరలించారు. దీంతో సికింద్రాబాద్‌లోని సీతాఫల్‌మండిలో ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించారు. ఆయన ఆరోగ్యం క్షీణిస్తుండటం, ఉద్యమ తాకిడికి తట్టుకోలేని వైఎస్ సర్కార్ కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి 2007 మే 21న ఉషా మెహ్రాను చైర్మన్‌గా నియమించేలా చూసింది. ఆమె నివేదిక సిద్ధం చేసినా సమర్పణలో జాప్యం జరిగింది. దీనిపై ఎమ్ఆర్‌పీఎస్ మరోసారి ఉద్యమం చేసింది. జస్టిస్ ఉషా మెహ్రా 2008 మే 1న నివేదికను సమర్పించారు. డిసెంబరు 14న మంద కృష్ణ నిరాహార దీక్ష ప్రారంభించి వర్గీకరణ బిల్లును పార్లమెంటులో పెట్టినప్పుడే విరమిస్తానని చెప్పారు. కాగా, జస్టిస్ ఉషా మెహ్రా కమిషన్ వర్గీకరణను సమర్థించినా తదుపరి చర్యలు తీసుకోకపోవడంతో 2009 ఫిబ్రవరి 16న విశ్వరూప మహా సభను నిర్వహించారు. ఫిబ్రవరిన 4న అసెంబ్లీని ముట్టడించారు. పార్లమెంటులో సవరణ బిల్లు ప్రవేశపెట్టాలనే డిమాండ్‌తో 2010 డిసెంబరు 4న నిజాం కళాశాలలో యుద్ధభేరి నిర్వహించారు. ఆ తర్వాత కృష్ణ వర్గీకరణపై రాజ్యాంగ సవరణపై హామీ ఇవ్వాలంటూ ఆమరణ దీక్ష చేపట్టారు. అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హామీ మేరకు విరమించారు.

వర్గీకరణ కోసం అనంతవాసి తొలి ఆత్మార్పణం



తాడిపత్రి, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణ కోసం ఉమ్మడి రాష్ట్రంలో ప్రాణత్యాగం చేసిన తొలి వ్యక్తి తెల్లబండ్ల రవి. అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం యర్రగుంటపల్లి గ్రామానికి చెందిన ఈయన డిగ్రీ చదివారు. ఉద్యోగం రాకపోవడంతో గ్రామంలోనే వ్యవసాయ కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకునేవారు. ఎస్సీ వర్గీకరణ జరిగితేనే తనలాంటి వారికి న్యాయం జరుగుతుందని నమ్మేవారు. ఈ క్రమంలో ఎమ్మార్పీఎస్‌లో చేరి.. 1994 నుంచి ఉద్యమంలో పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం 1998లో హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ ఆమరణ దీక్షకు దిగారు. ఆయనకు మద్దతుగా ఆ ఏడాది జూన్ 9న తెల్లబండ్ల రవి ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నారు. రవి శరీరం బాగా కాలింది. ఆయన్ను హైదరాబాద్ అపోలో ఆస్పత్రికి తరలించారు. ఐదు రోజులు మృత్యువుతో పోరాడి జూన్ 14న రవి తుది శ్వాస విడిచారు. ఆయన ప్రాణత్యాగానికి గుర్తుగా యర్రగుంటపల్లిలో ఎమ్మార్పీఎస్ నాయకులు స్తూపం నిర్మించారు.

ప్రకాశంలో పుట్టిన మాదిగ దండోరా.!

మాదిగ దండోరా (ఎమ్మార్పీఎస్ ఉద్యమం) పుట్టింది ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మారుమూల గ్రామం ఈదుముడిలో.! అదివరకే ఆ ఊరిలో సామాజిక స్పృహ కలిగిన మాదిగ యువకులు చెరువు నీళ్ల కోసం, భూపంపకాల్లో సమన్యాయం కోసం పోరాడిన సందర్భాలున్నాయి. వారిలో కొమ్మూరి విజయకుమార్ ఒకరు. కారంచేడు దుర్మార్గాన్ని నిరసిస్తూ పురుడుపోసుకొన్న 'దళిత మహాసభ'లో జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న సమయంలో మాదిగలను తగిన ప్రాధాన్యత లభించడం లేదంటూ నాయకత్వాన్ని విజయకుమార్ ప్రశ్నించారు. ఆ తర్వాత ఒంగోలు వేదికగా జరిగిన 'శక్తి ప్రదర్శన' సమావేశంలో విజయకుమార్‌ను దళిత మహాసభ నాయకులు వేదిక మీదకు ఆహ్వానించకుండా అవమానించారని ఒంగోలుకు చెందిన సామాజికవేత్త కత్తి కల్యాణ్ వివరించారు. అదే సభలో పాల్గొనడానికి వచ్చిన మంద కృష్ణను కలిసిన విజయకుమార్.. విద్య, ఉద్యోగ అంశాలలో మాదిగలకు జరుగుతున్న అన్యాయంపై సుదీర్ఘంగా చర్చించారు. జనాభాలో ఎక్కువగా ఉన్న మాదిగలకు రిజర్వేషన్ ఫలాలు అందడంలో తలెత్తుతున్న నష్టాన్ని వివరించారు. అప్పుడప్పుడే ప్రారంభమైన కాపు రిజర్వేషన్ పోరాట సమితి స్ఫూర్తితో మరో 13 మంది స్థానిక మాదిగ యువతతో కలిసిన మంద కృష్ణ.. 1994, జూలై 7న ఈదుముడిలో ఎమ్మార్పీఎస్‌ను స్థాపించారు.

మీతోనే ఒరిజినల్ పత్రాలు!

‘ఆన్‌లైన్’ రిజిస్ట్రేషన్లు తప్పనిసరి కాదు.. సవరణ సర్క్యులర్ జారీ

అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మీ ఆస్తి... మీ పత్రం... మీ ఇష్టం! ఆన్‌లైన్‌లో సమర్పించి... 'జిరాక్స్' తీసుకుంటారా? లేక... సాధారణ విధానంలోనే రిజిస్ట్రేషన్ చేయించుకుని ఒరిజినల్ పత్రాలు తీసుకుంటారా? ఇకపై ఇది ప్రజల ఇష్టమే! జగన్ సర్కారు తీసుకొచ్చిన 'జిరాక్స్' ఉత్తర్వులను సవరిస్తూ కొత్త ఆదేశాలు జారీ అయ్యాయి. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల ఐజీ శేషగిరిబాబు గురువారం పాత సర్క్యులర్‌ను సవరించారు. జగన్ హయాంలో ఆస్తుల రిజిస్ట్రేషన్‌లో 'ప్రింటౌంట్' విధానాన్ని ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా... రిజిస్ట్రేషన్ కోసం ప్రజలు తమ వద్ద ఉన్న డాక్యుమెంట్లన్నీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. ఆన్‌లైన్‌లోనే ఫారం నింపాలి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి సంతకం చేసి, వేలిముద్రలు వేయాలి. అలా ఆన్‌లైన్‌లో వచ్చిన డాక్యుమెంట్లు, సమాచారం ఆధారంగా సబ్‌రిజిస్ట్రార్లు ఆన్‌లైన్‌లోనే రిజిస్ట్రేషన్లు చేస్తారు. ఆ తర్వాత... డాక్యుమెంట్ కావాలంటే, బయట ప్రింటౌంట్ తీసుకోవాల్సిందే. ఇందులో... ఒరిజినల్ ఆస్తి పత్రాలు ఉండవు. దీనిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఇప్పుడు... చంద్రబాబు ప్రభుత్వం ఈ ఉత్తర్వులను సవరించింది. 'తప్పనిసరిగా ఆన్‌లైన్‌లోనే' అనే క్లాజును తీసేసింది. రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు రాలేని వాళ్లు లేదా ఆన్‌లైన్‌లోనే రిజిస్ట్రేషన్లు చేసుకోవాలనుకునే వారు మాత్రమే పాత విధానాన్ని అనుసరించవచ్చు. 'ఒరిజనల్' పత్రాలు కావాలనుకునే వారు... తమ డాక్యుమెంట్లు, స్టాంపు పేపర్లు తీసుకుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చి నేరుగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. ఒరిజినల్ ఆస్తి పత్రాలను తమ దగ్గరే భద్రపరుచుకోవచ్చు.



రౌండ్‌టేబుల్‌లో మంత్రి టీజీ భరత్, యూఏఈ ప్రతినిధులు

యూఏఈ నుంచి భారీగా పెట్టుబడులు: భరత్

దుబాయ్ పెట్టుబడిదారులతో మంత్రి రౌండ్ టేబుల్ సమావేశం

అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పారిశ్రామికవేత్తలు మన రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. యూఏఈ నుంచి వచ్చిన పెట్టుబడిదారులతో గురువారం విజయవాడలోని ఒక హోటల్‌లో మంత్రి సమక్షంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో రాష్ట్రానికి చెందిన పారిశ్రామికవేత్తలతోపాటు దుబాయ్ నుంచి వచ్చిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనువైన పరిస్థితుల గురించి వివరించారు. యూఏఈ అంబాసిడర్ అబ్దుల్ నాసిర్ జమాల్ అల్‌షాలీ మాట్లాడుతూ ఏపీలో తాము పెట్టాలనుకున్న ప్రాజెక్టులు గత ఐదేళ్లలో మూలనపడ్డాయని, ఏపీ ప్రభుత్వం తొలుత ఆ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

కొత్త పార్లమెంట్ పైకప్పు లీకేజీ

న్యూఢిల్లీ, ఆగస్టు 1: ఢిల్లీలో కురుస్తున్న భారీ వర్షాలకు కొత్త పార్లమెంటు భవనం పైకప్పు లీకవుతోంది. రూ.1,000 కోట్లకు పైగా ఖర్చు చేసి నిర్మించిన ఈ భవనం లాబీలోని గాజు పైకప్పు నుంచి కింద ఉంచిన బకెట్‌లోకి నీరు ధారగా పడుతున్న వీడియోను సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. "కొత్త భవనం కంటే పాత భవనం చాలా మెరుగ్గా ఉంది. వర్షాకాల సమావేశాలను పాతదానిలో ఎందుకు నిర్వహించకూడదు. కనీసం కొత్తదానిలో నీరు కారడం ఆగిపోయే వరకైనా..' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ వీడియోపై కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ స్పందించారు. "బయట పేపర్ లీక్.. లోపల వాటర్ లీక్.. నిర్మించిన ఏడాది పూర్తి కాకుండానే పార్లమెంట్ లాబీలో నీరు లీక్ కావడం కొత్త భవనంలో అత్యవసర పునరుద్ధరణ సమస్యలను ఎత్తి చూపుతోంది" అని ఎద్దేవా చేశారు. ఈ అంశంపై చర్చించడానికి ప్రస్తుత లోక్‌సభ సమావేశాల్లో ఆయన వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. 'రూ.1,200 కోట్ల వ్యయంతో నిర్మించిన పార్లమెంట్ ఇప్పుడు రూ.120 బకెట్‌పై ఆధారపడి ఉంది' అని ఆమ్ ఆద్మీ పార్టీ ఎద్దేవా చేసింది. సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా కొత్త పార్లమెంట్ భవనాన్ని 2023 మే 28న ప్రధాని మోదీ ప్రారంభించారు. కాగా, పైకప్పు గ్లాస్ డోమ్‌లకు ఏర్పాటుచేసిన పట్టీలు వదులుగా ఉండటంతో కొత్త పార్లమెంటు భవనం మకర ద్వారం వద్ద స్వల్పంగా నీరు లీకైందని, సకాలంలో సమస్యను గుర్తించి మరమ్మతులు చేపట్టామని లోక్‌సభ సెక్రెటేరియట్ తెలిపింది.

ఉత్తరాది అతలాకుతలం



వర్షాలకు హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీలో ధ్వంసమైన రోడ్డు

శిమ్లా, డెహ్రాడూన్, జైపూర్, ఆగస్టు 1: ఉత్తరాది రాష్ట్రాలను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. ముఖ్యంగా హిమాచల్ ప్రదేశ్‌లో క్లౌడ్ బరస్ట్‌తో కులు, పధార్, మండి, శిమ్లా జిల్లాలను వరద ముంచెత్తింది. 50 మంది గల్లంతవగా.. వీరిలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇళ్లు, బ్రిడ్జిలు, రోడ్లు కొట్టుకుపోయాయి. దీంతో సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. శ్రీఖండ్ మహదేవ్ సమీపంలో బుధవారం రాత్రి క్లౌడ్ బరస్ట్‌తో సర్పారా, గాన్వీ, కుర్పన్ నల్లాల్లో మెరుపు వరదలు సంభవించాయి. పార్వతి నదిపై మలానా డ్యామ్ కొట్టుకుపోయి దిగువ ప్రాంతాలను నీరు ముంచెత్తింది. శిమ్లా జిల్లా రాంపూర్‌లోని సమేజ్‌ఖడ్‌లో 30మంది కొట్టుకుపోయారు. వీరిలో ఇద్దరు మృతి చెందారు. మండి జిల్లా తెరాంగ్ సమీపంలోని రాజ్‌బన్ గ్రామం వద్ద మరో క్లౌడ్ బరస్ట్ జరిగింది. ఏడుగురు గల్లంతవగా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. కులు జిల్లాలో ఏడుగురు కొట్టుకుపోయారు. బియాస్ నది ఉధృతి, కొండచరియలు విరిగిపడడంతో కీలకమైన మనాలీ-చండీగఢ్ జాతీయ రహదారి పలుచోట్ల తీవ్రంగా దెబ్బతిన్నది. కాగా, ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలతో రాత్రికి రాత్రే వరద పోటెత్తింది. పలు నదులు ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. డెహ్రాడూన్‌లో పరిస్థితి తీవ్రంగా ఉంది. రాష్ట్రంలో మొత్తం 12 మంది మృతిచెందారు. హరిద్వార్‌లోనే ఆరుగురు చనిపోయారు. కేదార్‌నాథ్ మార్గంలో 1,500 మంది యాత్రికులు చిక్కుకుపోయారు. వీరిలో 425 మందిని హెలికాప్టర్ ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఉత్తరాఖండ్, హిమాచల్‌లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సైన్యం, స్థానిక పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. దేశ రాజధాని ఢిల్లీలోని చాలా ప్రాంతాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. ఆరుచోట్ల ఒక్క రోజులోనే 10 సెం.మీ.పైగా వర్షపాతం నమోదైంది. వివిధ ఘటనల్లో ఐదుగురు చనిపోయినట్లు అధికారులు తెలిపారు.

నాన్నను కోల్పోయినప్పటి పరిస్థితి గుర్తుకొచ్చింది: రాహుల్

"వయనాడ్‌లోని దృశ్యాలు హృదయాన్ని తీవ్రంగా గాయపరుస్తున్నాయి. ఏం చెప్పాలో తెలియడం లేదు. మా నాన్న చనిపోయినప్పుడు ఎలా ఉండేదో.. ఇప్పుడు అలాంటి బాధనే ఎదుర్కొంటున్నాను. నా దృష్టిలో ఇది జాతీయ విపత్తే" అని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ ఉద్వేగంతో అన్నారు. గురువారం ప్రియాంక గాంధీతో కలిసి రాహుల్ వయనాడ్‌లో పర్యటించారు.

సీమలో ప్రతి ఎకరాకూ నీరు

సిద్దేశ్వరం వద్ద రిజర్వాయర్ నిర్మిస్తాం

ఒక్కరోజులోనే 97% మందికి పెన్షన్లు

నేనే స్వయంగా వచ్చి ఇస్తున్నాను: చంద్రబాబు

శ్రీశైలం/నంద్యాల/అనంతపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): 'జూలైలోనే శ్రీశైలం రిజర్వాయర్ నిండడం ఇరవై ఏళ్లలో ఇదే ప్రథమం. మల్లన్న దయ వల్ల కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. నీరు మన సంపద. ప్రతి నీటిబొట్టునూ ఒడిసి పట్టి రాయలసీమలోని ప్రతి ఎకరాకూ నీరు అందిస్తాం..' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సీమ కరువును నివారించేందుకు సిద్దేశ్వరం వద్ద ఐకానిక్ హైవే బ్రిడ్జితో పాటు రిజర్వాయర్ కూడా నిర్మించడానికి అన్ని చర్యలూ తీసుకుంటామని ప్రకటించారు. రాయలసీమను రతనాల సీమగా మార్చే బాధ్యత తమదన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను తాను స్వయంగా ఇళ్లకు వచ్చి ఇస్తున్నానని.. మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, అధికారులు బాధ్యతగా, జవాబుదారీగా ఉండాలనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టానని తెలిపారు. గురువారం ఆయన నంద్యాల, శ్రీసత్యసాయి జిల్లాల్లో పర్యటించారు. తొలుత శ్రీశైలం వెళ్లారు. భ్రమరాంబిక, మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. తర్వాత శ్రీశైలం జలాశయానికి చేరుకుని.. కృష్ణా నదికి జలహారతి ఇచ్చి, కృష్ణమ్మకు సారెను నీటిలో వదిలి వాయనం సమర్పించారు. సుండిపెంటలో వాటర్ యూజర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన 'మన నీరు-మన సంపద' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం శ్రీసత్యసాయి జిల్లాకు వెళ్లారు. మడకశిర నియోజకవర్గం గుండుమలలో పలువురు లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పింఛన్లు అందజేశారు. ఆ తర్వాత కరియమ్మ ఆలయం వద్ద స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో పాల్గొన్నారు. సీఎం ప్రసంగిస్తున్న సమయంలో జోరుగా వర్షం కురిసింది. దాదాపు 45 నిమిషాలు వర్షంలోనే ప్రసంగం కొనసాగించారు. ప్రజలు కూడా తడుస్తూనే ఆయన ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. ఆయన ఏమన్నారో ఆయన మాటల్లోనే..

పింఛన్లు మొదలుపెట్టింది టీడీపీయే..

ఏ పని చేసినా అందరికీ తెలిసేలా.. జవాబుదారీతనంతో పాలన సాగిస్తున్నాం. ఒక్క రోజులోనే 97 శాతం పింఛన్లను పంపిణీ చేశాం. ఎవరికీ ఇబ్బంది లేకుండా గురువారం ఉదయం నుంచి సాయంత్రం దాకా ఇంటి వద్దనే పింఛన్లు ఇచ్చాం. నేనే నేరుగా వచ్చి ఇస్తున్నా. మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, అధికారులు ఈ ప్రభుత్వంలో బాధ్యతగా, జవాబుదారీగా ఉండాలనే దీనికి శ్రీకారం చుట్టా. పింఛన్లు ఇవ్వడం మొదలుపెట్టింది టీడీపీయే. అప్పట్లో ఎన్టీఆర్ రూ.35 నుంచి పింఛను ప్రారంభించారు. తర్వాత దానిని రూ.200 నుంచి రూ.1000కి, తర్వాత 2 వేలకు.. ప్రస్తుతం రూ.4 వేలకు పెంచిన ఘనత మాదే. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి బకాయిలతో కలిసి గత నెలలో ఒక్కో పింఛన్‌దారుడికి రూ.7 వేలిచ్చాం. వృద్ధులు, వితంతువులు, ఇతరత్రా లబ్ధిదారులకు రూ.4 వేలు.. వికలాంగులకు రూ.6 వేలు, కిడ్నీ బాధితులకు రూ.10 వేలు, మంచానికి పరిమితమైన వారికి రూ.15 వేలు ఇస్తున్నాం. బాధ్యత కలిగిన ప్రభుత్వం కాబట్టే ప్రతి ఒక్కరినీ ఆదుకుంటున్నాం. గత నెలలో రూ.4,408 కోట్లు పింఛను రూపంలో ఇచ్చాం. ఈ నెలలో రూ.2,737 కోట్లు ఇచ్చాం. ఏడాదికి రూ.33,500 కోట్లు ఇస్తున్నాం. ఇది పేదల ప్రభుత్వం.



మడకశిరలోని గుండుమల గ్రామంలో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో వర్షంలో తడుస్తూనే మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

అందరికీ ఇళ్లు..

పేదలందరికీ ఇళ్లు కట్టిస్తాం. గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇంటి స్థలాన్ని మంజూరు చేస్తాం, కొత్తగా నిర్మించే ఇళ్లకు ఒక్కోదానికి రూ.4 లక్షలు ఇస్తాం. సంపద సృష్టిస్తాం.. ఆదాయాన్ని పెంచుతాం. ఆ ఆదాయాన్ని పేదలకు పంచుతాం. ఆడబిడ్డలకు న్యాయం చేస్తాం. అన్న క్యాంటీన్లను ఈ నెల 15న పునఃప్రారంభిస్తాం. పేదవాడికి రూ.5కే భోజనం పెట్టే బాధ్యత మాది. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తాం. నా లక్ష్యం.. పేదరికం లేని దేశం.. పేదరికం లేని రాష్ట్రం.. పేదరికం లేని గ్రామం.

ఐదేళ్లలో 69,000 కోట్లు ఖర్చుచేశాం..

శ్రీశైల భ్రమరాంబ, మల్లన్న స్వామి వారిని దర్శించుకుని, శ్రీశైలం రిజర్వాయర్‌లో పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మకు జలహారతి ఇచ్చా. 20 సంవత్సరాల్లో ఎన్నడూ లేని విధంగా జూలైలోనే నిండుకుండలా తొణికిసలాడుతున్న శ్రీశైలం రిజర్వాయర్‌ను చూస్తే ఆనందంగా ఉంది. 2014-19 మధ్య మా హయాంలో సాగునీటి ప్రాజెక్టులపై రూ.69 వేల కోట్లు ఖర్చు పెట్టాం. దీనికి భిన్నంగా రాయలసీమలో రైతులకు డ్రిప్ పరికరాలు ఇవ్వని జగన్.. తన రోత పత్రికకు రూ.403 కోట్ల ప్రకటనలు ఇచ్చారు. ఇదంతా ఎవడబ్బ సొమ్ము? పేదలకు ఇళ్లు కట్టించలేదు గానీ.. రూ.500 కోట్లతో విశాఖలోని రుషికొండలో ప్యాలెస్ కట్టాడు. శ్రీశైలం కార్యక్రమంలో ఎంపీ బైరెడ్డి శబరి, మంత్రులు బీసీ జనార్దనరెడ్డి, రామానాయుడు, గొట్టిపాటి రవి, ఫరూక్, గుండమల సభలో మంత్రులు సత్యకుమార్, సవిత, ఎంపీ బీకే పార్థసారథి పాల్గొన్నారు.

కుటుంబమంతా సంతోషంగా ఉంది

ఎన్టీఆర్ భరోసా పింఛను రూ.4 వేలకు పెంచడంతో మా కుటుంబం ఎంతో సంతోషంగా ఉంది. పేదలపై చంద్రబాబుకు ఉన్న ప్రేమతో పింఛనును రూ.4 వేలకు పెంచి మా జీవితాల్లో వెలుగులు నింపారు. ఇతర పథకాల ద్వారా కూడా లబ్ధి పొందుతున్నాం. ఇందుకు సీఎంకు కృతజ్ఞతలు. ఈ ప్రభుత్వంలో సుభిక్షంగా ఉంటామన్న నమ్మకం ఏర్పడింది.

- ఓబుళమ్మ, గుండుమల, శ్రీసత్యసాయి జిల్లా

మీ రాకతో పండగొచ్చింది..

ముఖ్యమంత్రి స్వయంగా మా ఇంటికి వచ్చి పింఛను ఇవ్వడం జీవితంలో మరచిపోలేని సంఘటన. మీ రాకతో మా ఇంటికి పండగొచ్చింది. పింఛన్‌తో నా జీవనం సాఫీగా సాగుతుంది.

- పులమాసి రామన్న, గుండుమల, శ్రీసత్యసాయి జిల్లా

హే ‘రామ్’.. ఇదేం పని?

10 కార్యాలయాల్లో కార్పొరేట్ లుక్ కోసం రూ.99.75 కోట్లకు రామ్ ఇన్ఫోకు కాంట్రాక్టు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావు. అస్మదీయ కంపెనీలకు కాంట్రాక్టు కట్టబెట్టేందుకు అడ్డగోలుగా టెండర్ ప్రక్రియ నిర్వహించారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో ఇలాంటి బాగోతమే జరిగింది. ఈ శాఖను ఉపయోగించుకుని ప్రభుత్వ, ప్రైవేటు భూములు కొల్లగొట్టిన వైసీపీ నేతలు.. టెండర్ల గోల్‌మాల్‌కు స్కెచ్ వేశారు. రాష్ట్రవ్యాప్తంగా 295 రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉండగా.. వాటిలో ఎంపిక చేసిన 10 కార్యాలయాల్లో ఆధునిక హంగులు, సదుపాయాలతో మెరుగైన సేవలు అందించాలన్న ప్రతిపాదన చేశారు. 2023లో టెండర్లు పిలిచారు. కొన్ని కంపెనీలు వేశాయి. వాటిలో ఎల్1ను ఖరారు చేసే లోపే ముగిసిన టెండర్ ప్రక్రియను జూలైలో రద్దు చేశారు. ఇందుకు నాటి ప్రభుత్వం ఎలాంటి కారణాలు చెప్పలేదు. ఆ తర్వాత సెప్టెంబరులో మళ్లీ టెండర్లు పిలిచారు. ఈసారి రామ్ ఇన్ఫో అనే వైసీపీ అస్మదీయ కంపెనీ రూ.127 కోట్లతో టెండర్ వేసింది. ఈ కంపెనీతో పాటు టెక్‌బుల్ సాఫ్ట్‌వేర్, ఎస్ఆర్ఐటీ అనే కంపెనీలు టెండర్లు వేశాయి. రకరకాల కారణాలు చెప్పి టెక్‌బుల్ సాఫ్ట్‌వేర్‌కు అర్హత లేదని ప్రకటించారు. రేసులో రామ్ ఇన్ఫో, ఎస్ఆర్ఐటీ కంపెనీలు మిగిలాయి. టెక్నికల్ బిడ్, ఫైనాన్షియల్ బిడ్ విభాగాల్లో రామ్‌ఇన్ఫోకు అనుకూలంగా వ్యవహరించి దానికే కట్టబెట్టారు. టెండరు విలువ రూ.100 కోట్లు దాటితే జ్యుడీషియల్ పరిశీలనకు వెళ్లి ఆమోదం పొందాలి. దాన్ని గట్టెక్కేందుకు రామ్‌ఇన్ఫో తాను వేసిన బిడ్‌ను రూ.127 కోట్ల నుంచి రూ.99.75కోట్లకు తగ్గించుకుంది. టెండర్ల ప్రక్రియ ముగియగానే ఎన్నికల కోడ్ రావడంతో పనులు చేపట్టలేదు.

రామ్‌ఇన్ఫోకు అనుకూలంగా పావులు

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా రామ్ ఇన్ఫోకు అనుకూలంగా కొందరు అధికారులు పావులు కదుపుతున్నారు. నాటి ప్రభుత్వ పెద్దల ఆశీస్సులతో ఎల్1గా మారింది రామ్ ఇన్ఫో. కేవలం 10 కార్యాలయాల కోసం వేసిన రూ.100 కోట్ల టెండర్‌తో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మొత్తం 295 కార్యాలయాల్లో సదుపాయాలు మెరుగుపర్చవచ్చు. ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలు సులభతరం చేయాలనుకుంటే ముందుగా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఇంటర్నెట్ స్పీడ్ పెంచాలి. సాఫ్ట్‌వేర్‌ను బలోపేతం చేయాలి. అంతే తప్ప ఇంటీరియర్లు, ఖరీదైన ఫర్నీచర్లు కొనడం వల్ల జనాలకు ఏంటి ఉపయోగం? ఈ వివాదాస్పద టెండర్లను పునఃపరిశీలించి వాస్తవాలను బయటకు తీయాల్సిన అవసరం ఉంది.

వెంకటరెడ్డిపై సస్పెన్షన్ వేటు

ఏసీబీ విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

అమరావతిలో అందుబాటులో ఉండాలని నిర్దేశం

ఇసుక అమ్మకం టెండర్లలో అక్రమాలపై చర్యలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గనుల శాఖ మాజీ డైరెక్టర్ వి.జి. వెంకటరెడ్డిపై ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. ఆయన్ను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ బుధవారం రాత్రి ఉత్తర్వులు (జీవో 61) జారీ చేశారు. గనుల చట్టాలు, నిబంధనలకు విరుద్ధంగా ఇసుక మైనింగ్‌లో కమీషన్లు, మినహాయింపులు, ఉల్లంఘనలకు పాల్పడటం, సుప్రీంకోర్టు, జాతీయ హరిత ట్రైబ్యునల్(ఎన్జీటీ) ఆదేశాలను ఉల్లంఘించి ప్రభుత్వానికి తీరని నష్టం కలించారన్న అభియోగాలపై సెంట్రల్ సివిల్ సర్వీస్ రూల్స్-1965 ప్రకారం ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. వెంకటరెడ్డిపై సస్పెన్షన్ జూలై 31 నుంచే అమల్లోకి వచ్చింది. ప్రజా ప్రయోజనాల రీత్యా తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు ఆయన సస్పెన్షన్‌లోనే ఉంటారని సీఎస్ స్పష్టం చేశారు. క్రమశిక్షణ చర్యల కాలంలో ఆయన అమరావతిలోనే అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సస్పెన్షన్ ఉత్తర్వులు వెంకటరెడ్డికి అందించాలని గనుల శాఖ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను ఆదేశిస్తూ గురువారం మెమో జారీ చేశారు. ఇసుక అమ్మకం టెండర్లలో (2021 మే నుంచి 2024 జూన్ వరకు) అక్రమాలు, మైనింగ్, పర్యావరణ పరిరక్షణలో వైఫల్యం, ఎన్జీటీ, సుప్రీంకోర్టు ఉత్తర్వుల అమలులో నిర్లక్ష్యం తదితర అంశాలపై ఏసీబీతో సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ గనుల శాఖ ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ మేరకు వెంకటరెడ్డిపై విచారణకు ఆదేశిస్తూ ఏసీబీ డైరెక్టర్ జనరల్‌కు సీఎస్ లేఖ రాశారు. వెంకటరెడ్డి వ్యవహారంపై సర్కారు సీరియస్‌గా ఉన్న నేపథ్యంలో ఏసీబీ కూడా సత్వరమే విచారణ ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిసింది.

అంతా స్వయంకృతాపరాధం

రక్షణ శాఖలోని ఇండియన్ కోస్ట్‌గార్డ్‌లో సీనియర్ సివిల్ స్టాఫ్ అధికారిగా ఉన్న వెంకటరెడ్డి 2019 డిసెంబరులో డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి వచ్చారు. ఆయనది కడప జిల్లా. ఉమ్మడి కడప జిల్లాకు చెందిన అప్పటి సీఎంవో కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డికి బాగా సన్నిహితుడు కూడా. వెంకటరెడ్డి కోసం తొలుత విద్యాశాఖలో ప్రత్యేక కార్యదర్శి అనే పోస్టును సృష్టించి, పోస్టింగ్ ఇచ్చారు. 2020లో గనుల శాఖ డైరెక్టర్‌గా, 2021లో ఏపీఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. ఎండీసీ ద్వారా సర్కారుకు ఏటా రూ.4వేల కోట్ల ఆదాయం వస్తోంది. గనుల శాఖ, ఎండీసీకి ఎండీగా పనిచేయాలంటే జియాలజీ సబ్జెక్టులో కనీస అనుభవం ఉండాలి. కానీ నాటి సీఎం జగన్ అవేవీ పట్టించుకోలేదు. కేవలం వెంకటరెడ్డిది కడప జిల్లా, సొంత మనిషి అనే కారణాలతో రెండు కీలక పోస్టులు కట్టబెట్టారు. ఉచిత ఇసుకను రద్దుచేసి 2019లో ఒక పాలసీ, 2021లో మరో పాలసీని ప్రవేశపెట్టారు. తొలుత ఎండీసీ ద్వారా ఇసుక అమ్మకాలు జరిగాయి. అందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ గనులశాఖ డైరెక్టర్‌గా వెంకటరెడ్డే చూసుకున్నారు. ఇసుక వేలం, కంపెనీలతో అగ్రిమెంట్లు, రవాణా, బిల్లుల చెల్లింపులో రూ.వందల కోట్ల అక్రమాలు జరిగాయి. వెంకటరెడ్డితో పాటు మరో కీలక అధికారిపైనా తీవ్ర ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చాయి. జగనే అండతో వారిద్దరూ ఆరోపణల నుంచి బయటపడ్డారు.

అడ్డగోలుగా అక్రమాలు

జగన్ ప్రభుత్వంలో గనుల శాఖలో ఎన్నో అక్రమాలు జరిగాయి. ఇసుక సహా కీలక అంశాలలో వెంకటరెడ్డిపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. కోల్‌కతా కేంద్రంగా టెండర్లు నిర్వహించి జేపీ వెంచర్స్‌ను ఎంపిక చేసి.. 2021 మే నుంచి 2023 మే వరకు ఇసుక కాంట్రాక్టును కట్టబెట్టారు. ఆ సంస్థ ఎన్నో ఉల్లంఘనలకు పాల్పడింది. అక్రమ తవ్వకాలు ఆపాలని గనుల శాఖను ఎన్జీటీ పలుమార్లు ఆదేశించింది. అసలు అక్రమ తవ్వకాలే లేవని, అంతా పారదర్శకమే అంటూ వెంకటరెడ్డి తన నివేదికల ద్వారా ఎన్జీటీని తప్పుదోవ పట్టించారన్న ఫిర్యాదులున్నాయి. ఉమ్మడి జిల్లాల వారీగా వైసీపీ నేతలు అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు జరిపి రెండేళ్ల వ్యవధిలో తాడేపల్లి ప్యాలెస్‌కు రూ.7,800 కోట్ల మేర కప్పం కట్టారని గణాంకాలు బయటకొచ్చాయి. అయినా గనుల శాఖ చర్యలు తీసుకోలేదు. 2023-25 కాలానికి గత డిసెంబరులో మరోసారి ఎంఎస్‌టీసీ ద్వారానే రహస్యంగా ఇసుక టెండర్లు జరిపించారు. ఈసారి తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ మేనల్లుడి కంపెనీ అయిన ప్రతిమ ఇన్‌ఫ్రా, రాజస్థాన్‌కు చెందిన జీసీకేసీ సంస్థలను ఎంపిక చేశారు. తెర వెనుక జగన్ సోదరుడు అనిల్ రెడ్డి ఉన్నారని ఫిర్యాదులు వచ్చాయి. ఈ రెండు కంపెనీలు కూడా అక్రమ తవ్వకాలకు పాల్పడ్డాయని సుప్రీంకోర్టుకు స్పష్టమైన ఆధారాలు అందాయి. అయినా, తప్పులే జరగలేదని కోర్టును తప్పుదోవ పట్టించేలా నివేదికలు ఇచ్చారు.

మమ్మల్ని మన్నించండి కామ్రేడ్


ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కాపాడుతాం: మంత్రి లోకేశ్



అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): 'సీఎం చంద్రబాబు మడకశిర నియోజకవర్గం పర్యటన సదర్భంగా ఆ ప్రాంత సీపీఎం నేతలను పోలీసులు అరెస్టు చేసిన ఘటనపట్ల మన్నింపు కోరుతున్నా' అని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. స్థానిక సీపీఎం నేతల అరెస్టుపై ఆ పార్టీ విడుదల చేసిన పత్రికా ప్రకటనపై గురువారం రాత్రి లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. 'గృహ నిర్బంధాలు, ముందస్తు అరెస్టులకు మా కూటమి ప్రభుత్వం పూర్తిగా వ్యతిరేకం. పరదాల ప్రభుత్వం పోయినా కొంతమంది పోలీసుల తీరు మారలేదు. ఇటువంటి అప్రజాస్వామిక అరెస్టులను పునరావృతం కానివ్వం. ఇకపై ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల నేతల ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసుశాఖ అధికారులను కోరుతున్నా' అని లోకేశ్ పేర్కొన్నారు.

సీఎం పర్యటనలో పోలీసుల తీరుపై ప్రభుత్వం అసంతృప్తి

రెండు జిల్లాల పరిధిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం జరిపిన పర్యటనలో స్థానిక పోలీసు అధికారులు వ్యవహరించిన తీరుపై ప్రభుత్వం అసంతృప్తితో ఉంది. గురువారం నాటి చంద్రబాబు పర్యటనల్లో మడకశిర, దాని పొరుగున ఉన్న పెనుకొండ నియోజకవర్గాల్లో సిపిఎం పార్టీ నేతలను తెల్లవారుఝామునే అరెస్టు చేసి స్టేషన్లకు తరలించారు. ముఖ్యమంత్రి పర్యటన తర్వాత వారిని వదిలిపెట్టారు. ఈ విషయం తమ దృష్టికి రావడంతో ముఖ్యమంత్రి కార్యాలయం దీనిపై పోలీసు అధికారుల వివరణను కోరింది. మరోసారి ఇటువంటివి పునరావృతం కానివ్వవద్దని ఆదేశించింది.



శ్రీశైలం డ్యామ్ నుంచి పది గేట్ల ద్వారా దిగువకు వెళ్తున్న వరద

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

శ్రీశైలం, ఆగస్టు 1: ఎగువ నుంచి గురువారం శ్రీశైలం జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతోంది. జూరాల, సుంకేశుల నుంచి వరద ప్రవాహం పెరగడంతో డ్యామ్ 10 క్రస్టుగేట్లను 18 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువన నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. జూరాల నుంచి 3,16,639 క్యూసెక్కులు, సుంకేశుల నుంచి 1,47,380 క్యూసెక్కులు మొత్తం 4,64,019 వరద ప్రవాహం వస్తోంది. గురువారం సాయంత్రం 6 గంటలకి 3,09,600 క్యూసెక్కుల వరద శ్రీశైలానికి చేరింది. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత 883.80 అడుగులుగా నమోదైంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 208.7210 టీఎంసీలుగా నమోదైంది.

శాంతించిన గోదావరి

రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి), పోలవరం, ఆగస్టు 1: రెండు వారాలుగా ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి శాంతించింది. వరద తగ్గుముఖం పట్టడంతో భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరించుకున్నారు. దీంతో తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద కూడా గురువారం వరద తగ్గుముఖం పట్టింది. బ్యారేజీ నుంచి రాత్రి 7 గంటలకు కోనసీమ జిల్లా మీదుగా దిగువకు 10,30,897 క్యూసెక్కులు వదులుతున్నారు. ఇది 10 లక్షలకు దిగితే మొదటి ప్రమాద హెచ్చరికను వెనక్కు తీసుకుంటారు. కాగా, అఖండ గోదావరి వరద కారణంగా నీట మునిగిన లంకలు ఇంకా ముంపులోనే ఉన్నాయి.

నేడు అల్పపీడనం

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం ఆవరించింది. దీని ప్రభావంతో శుక్రవారం అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. అయితే ఇది బంగాళాఖాతంలో ఏర్పడుతుందా? లేదా భూ ఉపరితలంపై వస్తోందా? అన్నది ఇంకా చెప్పలేదు.

ప్రభుత్వ భద్రతకు పొన్నవోలు అనర్హుడు

అమరావతి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మాజీ అదనపు అడ్వకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి ఎలాంటి రాజ్యాంగబద్ధ, చట్టబద్ధ పదవుల్లో లేనందున రాష్ట్ర ప్రభుత్వం నుంచి భద్రత పొందేందుకు ఆయన అనర్హుడని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రాణహాని లేదని సెక్యూరిటీ రివ్యూ కమిటీ (ఎస్ఆర్‌సీ) ఇప్పటికే నివేదిక ఇచ్చిందని గుర్తుచేసింది. నివేదికపై అభ్యంతరం ఉంటే దానిని సవాల్ చేస్తూ పిటిషన్ వేసుకోవాలని సూచించింది. ఒకవేళ ప్రాణహాని ఉందని తేలి, ప్రభుత్వం భద్రత కల్పిస్తే, అందుకయ్యే ఖర్చును ఆయనే భరించాల్సి ఉంటుందని తేల్చిచెప్పింది. ఆయనకు ఎలాంటి ప్రాణహానీ లేదని నిర్ధారిస్తూ ఎస్ఆర్‌సీ నివేదిక ఇచ్చిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ చర్యలకు వీలుగా ఆ సమాచారాన్ని ఆయనకు తెలియపరచాలని ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశించింది.

హైకోర్టు స్పష్టీకరణ

ప్రస్తుతం ఆయన చట్టబద్ధమైన పదవుల్లో లేరు

ప్రాణహాని లేదని ఎస్ఆర్‌సీ నివేదిక ఇచ్చింది

అభ్యంతరముంటే ఆ రిపోర్టును సవాల్ చేసుకోవాలని సూచన



పొన్నవోలుకు 2+2 భద్రతను కొనసాగించాలని గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సవరించింది. తుదపరి విచారణ వరకు భద్రతను కొనసాగించాలని ఆదేశించింది. అందుకయ్యే ఖర్చును ఆయనే భరించాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 8కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. రెడ్‌బుక్‌లో తన పేరు ఉందని, తనకు భద్రత తొలగిస్తారనే ఆందోళన ఉందని, ప్రస్తుతం ఉన్న 2+2 సెక్యూరిటీని కొనసాగించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ మాజీ ఏఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం గురువారం మరోసారి విచారణకు వచ్చింది. ఆయన తరఫున న్యాయవాది బాలకృష్ణ వాదనలు వినిపిస్తూ.. సీనియర్ న్యాయవాది అందుబాటులో లేనందున విచారణకు హాజరుకాలేకపోతున్నారని.. విచారణను వాయిదా వేయాలని కోరారు. ప్రభుత్వం తరఫున న్యాయవాది కేఎం కృష్ణారెడ్డి వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. తదుపరి విచారణ వరకు పిటిషనర్‌కు భద్రతను కొనసాగించాలని ఆదేశించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

వైసీపీ పాలనలో కుప్పకూలిన ఆర్థిక వ్యవస్థ: కేశవ్

కూడేరు, ఆగస్టు 1: వైసీపీ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిందని, దాన్ని సరిచేసేందుకు ఆర్థిక శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోందని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పారు. అనంతపురం జిల్లా కూడేరు మండలం అంతరగంగలో గురువారం ఆయన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేశామని, దాని ప్రకారం రూ.10 లక్షల కోట్లు అప్పులు ఉన్నాయని, చెల్లించాల్సిన బకాయిలు రూ.లక్ష కోట్లకు పైగా ఉన్నాయని తెలిపారు. రోజుకు రూ.4 వేల కోట్లు చెల్లిస్తేనే బకాయిలు తీరే పరిస్థితి ఉందన్నారు.

లెక్కలు తేలకే ఆర్డినెన్స్: యనమల

అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ ఆర్థిక అరాచకత్వం వల్లే ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం బడ్జెట్‌పై ఆర్డినెన్స్ తేవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని శాసన మండలిలో టీడీపీ పక్ష నేత యనమల రామకృష్ణుడు వ్యాఖ్యానించారు. వైసీపీ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా ఎంత లోతుకు దిగజారిపోయిందో... ఎన్ని రూ.లక్షల కోట్లు అప్పులు తెచ్చిందో... ఎన్ని బకాయిలు ఉన్నాయో ఇప్పటికీ ఇంకా పూర్తి లెక్కలు తేలడం లేదని, ఈ పరిస్థితుల వల్లే పూర్తి స్థాయి బడ్జెట్ పెట్టకుండా నాలుగు నెలల కోసం ఆర్డినెన్స్ జారీ చేయాల్సి వచ్చిందని యనమల ఒక ప్రకటనలో తెలిపారు.

టీడీఆర్ అవకతవకల్లో ఎవరినీ వదలం: నారాయణ

నెల్లూరు సిటీ, ఆగస్టు 1: టీడీఆర్‌ల విషయంలో అనేక ప్రాంతాలలో అవకతవకలు జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించామని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. గురువారం నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక ప్రజా విజ్ఞప్తుల పరిష్కార దినాన్ని నిర్వహించారు. టీడీఆర్‌లలో లేని వ్యాల్యూలను చూపినట్లు తమ విచారణలో తేలిందని మంత్రి చెప్పారు. ఇందులోని అక్రమాలను గుర్తించేందుకు కమిటీ ఏర్పాటు చేశామన్నారు. పూర్తి వివరాలు అందాక బాధ్యులపై చర్యలు ఉంటాయన్నారు.

నాడు-నేడు పేరుతో 4వేల కోట్ల దోపిడీ: అచ్చెన్న

టెక్కలి, ఆగస్టు 1: గత ఐదేళ్లలో జగన్ రెడ్డికి రంగులపిచ్చి పట్టేసిందని, నాడు-నేడు పేరుతో రూ.4 వేల కోట్లను సెంట్రలైజ్డ్ దోపిడీకి పాల్పడ్డారని మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపించారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాడు-నేడు కింద కొన్ని పాఠశాలలకు రంగులు వేశారని, ఆతర్వాత ఆ పాఠశాలల్లో విద్యార్థులు లేరని, వాటికి తాళాలు వేయించారని అన్నారు.

రూ.8 లక్షల కోట్లకు లెక్కలు లేవు: పార్థసారథి

నూజివీడు, ఆగస్టు 1: గత వైసీపీ ప్రభుత్వం రూ.11 లక్షల కోట్లు అప్పులు తెచ్చి దానిలో కేవలం రూ.2.70 లక్షల కోట్లు మాత్రమే ప్రజా సంక్షేమానికి ఖర్చు చేసిందని, మిగిలిన రూ.8లక్షల కోట్లకు లెక్కలు చెప్పకుండా నిధులను దుర్వినియోగపరిచి, రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని మంత్రి కొలుసు పార్థసారథి విమర్శించారు. ఏలూరు జిల్లా నూజివీడు మండలం అన్నవరం గ్రామంలో గురువారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అడ్డగోలు జీవోలతో జగన్ ప్రభుత్వం సాక్షి మీడియాకు రూ.403 కోట్లు ప్రకటనల పేరుతో లబ్ధి చేకూర్చి, ఆర్థిక అవకతవకలకు పాల్పడిందని మంత్రి పార్థసారథి ఆరోపించారు.

సికిల్‌సెల్ ఎనీమియా నియంత్రణకు చర్యలు

- రాష్ట్ర ఆరోగ్యశాఖ కమిషనర్ హరికిరణ్

అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో సికిల్‌సెల్ ఎనీమియా నియంత్రణకు పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ కమిషనర్ సి.హరికిరణ్ అధికారులను ఆదేశించారు. సికిల్‌సెల్ ఎనీమియాపై ఆయన గురువారం సమీక్ష నిర్వహించారు. గిరిజన గ్రామ పంచాయతీ సమావేశ అజెండాలో సికిల్‌సెల్ ఎనీమియా అంశాన్ని కూడా చేర్చేలా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. ఇందుకోసం గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులను సంప్రదించాలని సూచించారు. కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా సికిల్‌సెల్ ఎనీమియా బాధితుల్ని స్ర్కీనింగ్ చేయాలని, ఈ ప్రక్రియను నిరంతరం కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంబంధిత ఐటీడీఏ పీవోలతో దీనిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తామన్నారు. ఎనీమియా నిర్మూలన కార్యక్రమాన్ని చాలెంజ్‌గా తీసుకుని సంతృప్తిస్థాయికి తీసుకువెళ్లాలని, ఇందుకోసం వినూత్న విధానాల్ని అవలంబించాలని సూచించారు. ప్రభుత్వాసుపత్రులకొచ్చే రోగులకు ఎక్స్‌రే, సిటిస్కాన్, ఎంఆర్ఐ తదితరాలు తొందరగా చేసి పంపించాలని సూచించారు.

ఇది జాతీయ విపత్తే

మా నాన్నను కోల్పోయినప్పటి పరిస్థితి గుర్తుకొచ్చింది: రాహుల్‌గాంధీ

- సోదరి ప్రియాంకతో కలిసి.. ముండక్కై, చురాల్‌మలలో పర్యటన
- జాతీయ విపత్తుగా ప్రకటించాలి: పినరయి
- 289కి పెరిగిన మరణాలు


పునరావాస శిబిరంలో బాధితులను ఓదారుస్తున్న రాహుల్, ప్రియాంక

వయనాడ్, ఆగస్టు 1: "వయనాడ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ఆ దృశ్యాలు హృదయాన్ని తీవ్రంగా గాయపరుస్తున్నాయి. నాకు ఏం చెప్పాలో తెలియడం లేదు. మా నాన్న చనిపోయినప్పుడు ఎలా ఉండేదో.. ఇప్పుడు అలాంటి బాధనే ఎదుర్కొంటున్నాను. నా దృష్టిలో ఇది జాతీయ విపత్తే" అని లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ఉద్వేగంతో అన్నారు. గురువారం ఆయన తన సోదరి ప్రియాంక గాంధీతో కలిసి వయనాడ్‌లో కొండచరియల బాధిత ప్రాంతాలు-- ముండక్కై, చురాల్‌మల, అట్టమల, మెప్పాడిలో పర్యటించారు. ఈ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాల్లో, ఆస్పత్రుల్లో బాధితులతో మాట్లాడారు. "దేశం మీ వెన్నంటే ఉంది.." అంటూ వారికి ధైర్యం చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇది బాధాకరమైన పరిస్థితి అని.. పినరయి ప్రభుత్వం బాధితులకు అన్ని విధాలా సాయం చేయడానికి కట్టుబడి ఉందని చెప్పారు. ముందే హెచ్చరించామంటూ లోక్‌సభలో హోంమంత్రి అమిత్ షా చేసిన ప్రకటన గురించి విలేకరులు ప్రస్తావించగా.. "ఇది రాజకీయ ఘర్షణకు సమయం కాదు. అన్ని వ్యవస్థలు కలిసికట్టుగా పనిచేయాల్సిన తరుణమిది" అని వ్యాఖ్యానించారు. కరోనా కష్టకాలంలో తాను, ప్రియాంక వయనాడ్ ప్రజలకు అండగా ఉన్న విషయాన్ని గుర్తుచేస్తూ.. ఇప్పుడు కూడా సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అనంతరం ఇదే విషయాన్ని తన ఎక్స్, ఫేస్‌బుక్ ఖాతాల్లో పోస్ట్ చేశారు. మరోవైపు కేరళ సీఎం పినరయి విజయన్ కూడా వయనాడ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 280కి పైగా పౌరులు చనిపోయారని, కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జాతీయ విపత్తుగా ప్రకటించడానికి అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న సైన్యం, రెస్క్యూ వర్కర్లు, స్థానికులను ఆయన అభినందించారు. ఆర్మీ జాగిలాలు మృతదేహాలను గుర్తిస్తున్నాయని, నదిలో కొట్టుకుపోయిన శరీర భాగాలను వెలికితీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. కాగా.. కొండచరియలు విరిగిపడ్డ ఘటనల్లో మృతుల సంఖ్య 289కి పెరిగినట్లు అధికారులు వివరించారు. గల్లంతైన వారి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

డార్క్ టూరిజం వద్దు

వయనాడ్‌లో డార్క్ టూరిజానికి రావొద్దంటూ కేరళ పోలీసులు సామాజిక మాధ్యమాల్లో విజ్ఞప్తి చేశారు. దీంతో.. 'డార్క్ టూరిజం' అనే పదం వైరల్‌గా మారింది. 'చెర్నోబిల్ అండ్ ది డార్క్ టూరిస్ట్' టీవీ షోతో ఈ పదం బాగా పాపులర్ అయింది. మరణం, విషాదం, హింస చోటుచేసుకుని, అసాధారణ పరిస్థితులు ఉండే ప్రదేశాలను సందర్శించడాన్ని డార్క్ టూరిజం అంటారు. ఉదాహరణకు ఉక్రెయిన్‌లోని చెర్నోబిల్ (అణు విద్యుత్తు కేంద్రం) ఘటన, కాంబోడియాలో కిల్లింగ్ ఫీల్డ్స్, పోలెండ్‌లోని అష్విట్జ్ క్యాంప్ వంటివి డార్క్ టూరిజం కిందకు వస్తాయి. ఇప్పుడు వయనాడ్‌కు డార్క్ టూరిస్టులు వస్తే.. సహాయక చర్యలకు ఆటంకాలేర్పడతాయని కేరళ పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు.

హమాస్‌కు భారీ దెబ్బ

- ఇజ్రాయెల్‌పై దాడుల సృష్టికర్త మిలిటరీ చీఫ్ డెయిఫ్ హతం!
- జూలై 13న గాజాలో అంతం చేశాం
- ప్రకటించిన ఇజ్రాయెల్ సైన్యం
- ఆ ప్రకటనను ఖండించిన హమాస్

జెరూసలెం, ఆగస్టు 1: పది నెలలుగా జరుగుతున్న యుద్ధంలో హమాస్‌పై తొలిసారి ఇజ్రాయెల్ ఆధిక్యతను చాటింది. హమాస్ మిలిటరీ చీఫ్, ఇజ్రాయెల్‌పై దాడుల సృష్టికర్త మహమ్మద్ డెయిఫ్‌ను అంతం చేసినట్టు అధికారికంగా ప్రకటించింది. ఇరాన్ రక్షణలో ఉన్న హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్యకు గురైన మరునాడే ఇజ్రాయెల్ ఈ ప్రకటన చేయడం గమనార్హం. ఇజ్రాయెల్ తన ప్రకటనలో ఆపరేషన్ వివరాలను వెల్లడించింది. "మా సైన్యం (ఐడీఎఫ్) గత నెల 13న గాజాలోని ఖాన్ యూనిస్ ప్రాంతంపై జెట్లతో దాడి చేసింది. అక్కడ హమాస్‌కు చెందిన డిప్యూటీ కమాండరు నివాసంలో డెయిఫ్ ఉన్నట్టు గుర్తించాం. అక్కడ జెట్లతో బాంబులు ప్రయోగించాం. ఈ దాడిలో డెయిఫ్ హతమయ్యాడు" అని ఆ ప్రకటనలో తెలిపింది. గత ఏడాది అక్టోబరు ఏడున ఇజ్రాయెల్ భూభాగంపై జరిగిన దాడుల ఆలోచన, ప్రణాళిక, అమలు అంతా డెయిఫ్ నేతృత్వంలో జరిగిందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఈ దాడుల్లో 1197 మంది ఇజ్రాయెల్ పౌరులు చనిపోయారు. కాగా, డెయిఫ్ మరణవార్తపై హమాస్ స్పందించింది. ఖాన్ యూనిస్‌పై జూలైలో ఇజ్రాయెల్ దాడులు చేసిన మాట నిజమేనని, అందులో 90మంది చనిపోయారని, మృతుల్లో డెయిఫ్ లేరని గాజాలోని హమాస్‌కు చెందిన ఆరోగ్య వర్గాలు ధ్రువీకరించాయి.

పోలవరంతో ఆరున్నర లక్షల రైతులకు లబ్ధి

- లోక్‌సభకు తెలిపిన కేంద్రమంత్రి రాజ్‌భూషణ్ చౌదరి

న్యూఢిల్లీ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు పూర్తయితే కుడి, ఎడమ కాలువల ద్వారా 6,55,151 మంది రైతులకు సాగునీరు అందుతుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఎడమ ప్రధాన కాలువ ద్వారా 3,71,680 మంది, కుడి ప్రధాన కాలువ ద్వారా 2,83,471 మంది రైతులు లబ్ధి పొందుతారని వెల్లడించింది. లోక్‌సభలో టీడీపీ ఎంపీలు పుట్టా మహేష్‌కుమార్, జీఎం హరీష్ బాలయోగి, టి.కృష్ణప్రసాద్ అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తిశాఖ సహాయ మంత్రి రాజ్‌భూషణ్ చౌదరి గురువారం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. గృహ అవసరాలకు సంబంధించి అనకాపల్లి మునిసిపాలిటీలో 86,519 మంది, గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లో 16,97,947 మంది, 540 గ్రామాలలో 28,50,000 మంది లబ్ధి పొందుతారన్నారు. 2014 ఏప్రిల్ 1 నుంచి పోలవరం ప్రాజెక్టు మిగిలిన పనుల నిర్మాణ వ్యయాన్ని 100 శాతం కేంద్రప్రభుత్వమే భరిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత అంచనాల ప్రకారం పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు తొలిదశ పనులు 2026 మార్చి నాటికి పూర్తవుతాయని, అప్పటివరకు 41.15 మీటర్ల వినిమం డ్రా డౌన్ లెవల్ వరకు నీటిని నిల్వచేసేందుకు పనులు పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే తొమ్మిది జిల్లాలకు మొత్తం 188.34 టీఎంసీల నీరు అందుతుందని చెప్పారు. పోలవరం లెక్కలను కాగ్ సమీక్షిస్తున్నట్లు తెలిపారు.

ప్రజల ఆకాంక్షల్ని చంద్రబాబు నెరవేరుస్తారు

- జగన్ పాపాలే ఆయన్ని వెంటాడుతున్నాయి: వీహెచ్

చెన్నై, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయ చైతన్యం కలిగిన నేత అని, ఆయన ప్రజల ఆకాంక్షల్ని నెరవేర్చగలరని తాను విశ్వసిస్తున్నానని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు వ్యాఖ్యానించారు. గురువారం చెన్నైలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ అధ్యక్షుడు జగన్ ఏపీకి రాజధాని లేకుండా చేశారని, అమరావతి రైతుల్ని ఎన్నో ఇక్కట్ల పాల్జేశారన్నారు. చంద్రబాబును ఉద్దేశపూర్వకంగా అవమానించి, వేధించారని అన్నారు. జగన్ చాలా తప్పులు చేశారని, అవే ఆయన్ని వెంటాడుతున్నాయన్నారు.

సీజీఎస్టీలో భారీగా బదిలీలు

విజయవాడ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కస్టమ్స్ అండ్ సెంట్రల్ ట్యాక్స్ చీఫ్ కమిషనరేట్‌లో బదిలీలు జరిగాయి. ప్రస్తుతం వివిధ స్థానాల్లో పనిచేస్తున్న వారిని కొత్త స్థానాలకు పంపారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులను ఆ శాఖ చీఫ్ కమిషనర్ సంజయ్ రాథి గురువారం విడుదల చేశారు. విశాఖపట్నం సీజీఎస్టీలో అదనపు డిప్యూటీ కమిషనర్, ఎఫ్ఏసీగా ఉన్న ఎం శ్రీకాంత్‌కు అదే పోస్టును ఖరారు చేశారు. గుంటూరు సీజీఎస్టీ జాయింట్ కమిషనర్‌గా ఉన్న ఉపేంద్ర కుమార్‌ను విశాఖపట్నంలోని సీజీఎస్టీకి బదిలీ చేశారు. గుంటూరులోని అప్పీల్స్ విభాగంలో అదనపు డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న ఎన్.మధుసూదనరెడ్డిని గుంటూరు సీజీఎస్టీకి బదిలీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న జాయింట్ కమిషనర్ ఎం.అంబేను తిరుపతి సీజీఎస్టీకి బదిలీ చేశారు. దీంతోపాటు గుంటూరు ఆడిట్ విభాగ అదనపు బాధ్యతలు అప్పగించారు. విజయవాడ సీసీపీ(చీఫ్ కమిషనర్, ప్రివెన్షన్)లో పనిచేస్తున్న అదనపు డిప్యూటీ కమిషనర్ నూతలపాటి సౌమ్యను గుంటూరు అప్పీల్స్ విభాగానికి బదిలీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న అదనపు డిప్యూటీ కమిషనర్ కాకర్ల ప్రశాంత్ కుమార్‌ను సీసీపీకి బదిలీ చేశారు. గుంటూరు సీజీఎస్టీలో ఏడీసీగా ఉన్న జి.రామకృష్ణరాజు యాదవ్‌ను కాకినాడ కస్టమ్స్ హౌస్‌కు పంపారు. విశాఖపట్నం కస్టమ్స్ హౌస్‌లో జాయింట్ కమిషనర్‌కు పీఎస్‌గా ఉన్న కె.రాజా విఎంటును కృష్ణపట్నం కస్టమ్స్ హౌస్‌కు బదిలీ చేశారు.

కమిషనర్ ఆఫ్ టెండర్స్‌గా వెంకటాచార్యులు

- జల వనరుల శాఖలో పలువురు ఇంజనీర్ల బదిలీ

అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంయుక్త కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తోన్న చీఫ్ ఇంజనీరు ఎస్‌కే వెంకటాచార్యులును కమిషనర్ ఆఫ్ టెండర్స్‌గా నియమించారు. ఈ మేరకు జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, పలువురు ఇంజనీర్లను బదిలీ చేశారు. కాడా ఎస్ఈ బి.రాంబాబును కృష్ణా డెల్టా సిస్టం సీఈగా బదిలీ చేశారు. పీఅండ్ఎం సెల్ ఎస్ఈ ఆర్‌బీ ప్రకాశ్‌ను మానవ వనరుల అభివృద్ధి సీఈగా, శ్రీశైలం డ్యామ్ మెయింటెనెన్స్ ఎస్ఈ పి.శ్రీరామచంద్రమూర్తిని రాయలసీమ సీఈ, కడప క్వాలిటీ కంట్రోల్‌గా, ఏలూరులో నీరు-ప్రగతి ఎస్ఈగా ఉన్న వై.శ్రీనివాస్‌ను మైనర్ అండ్ మీడియం ఇరిగేషన్ సీఈగా, హైడ్రాలజీ సీఈ టీవీఎస్ఏఆర్ కుమార్‌ను సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ సీఈగా, పులిచింతల-2 ఈఈ జె.గుణకరరావును విజయవాడ హైడ్రాలజీ ఎస్ఈగా, నంద్యాల ఎస్ఆర్‌బీసీ డివిజన్-4 సర్కిల్-2 ఈఈ ఎన్ఈ సుబ్బారాయుడును నంద్యాల టీజీపీ సర్కిల్ ఎస్ఈగా, గోరకల్లులో ఎస్ఆర్‌బీసీ సబ్‌డివిజన్-2 డీఈఈ ఎల్.రాజశేఖర్‌ను టీజీపీ సర్కిల్ డీఈఈగా, సీడీవో ఆఫీస్ డీఈఈ ఎస్ఎన్ సత్యనారాయణను సీడీవో సీఈ ఆఫీసు ఈఈగా బదిలీ చేశారు.

ఎన్‌హెచ్-516ఈ నిర్మాణానికి రూ.1,696 కోట్లు: కేంద్రం

న్యూఢిల్లీ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): గ్రీన్ నేషనల్ హైవేస్ కారిడార్ ప్రాజెక్టు కింద ఎన్‌హెచ్-516ఈ నిర్మాణానికి గత ఐదు ఆర్థిక సంవత్సరాలలో రూ.1696.90 కోట్ల విలువైన పనులు మంజూరు చేసినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. లోక్‌సభలో టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అడిగిన ప్రశ్నకు కేంద్ర జాతీయ రహదారులు, రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీ గురువారం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. మొత్తం 1696.90 కోట్ల నిధులలో రూ.699.28 కోట్లను గత ఐదేళ్లలో ఖర్చు చేసినట్లు తెలిపారు. ఎన్‌హెచ్-516ఈ నిర్మాణానికి సంబంధించి భూసేకరణ, అటవీ అనుమతుల మంజూరులో జాప్యం జరిగినట్లు పేర్కొన్నారు.

సెంట్రల్ ఏసీపీగా దామోదర్ బాధ్యతల స్వీకరణ



విజయవాడ: సెంట్రల్ జోన్ ఏసీపీగా కె.దామోదర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన ఇక్కడ ట్రాఫిక్ 4ఏసీపీగా పనిచేశారు. అంతకుముందు పెనమలూరు, పటమట ఇన్‌స్పెక్టర్‌గా వ్యవహరించారు. ఆయన సర్వీసులో ఎక్కువకాలం నగరం కేంద్రంగానే పనిచేశారు. తాజా బదిలీల్లో పోలీసు కమిషనరేట్‌కు వచ్చారు.

షూటింగ్‌బాల్ పోటీలకు వీరవల్లి విద్యార్థులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లోనూ ప్రతిభ చూపడం అభినందనీయమని హెచ్ఎం నిర్మల అన్నారు. వీరవల్లి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు అర్హత సాధించడంతో గురువారం అభినందన సభ నిర్వహించారు. కృష్ణాజిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామవరప్పాడు హైస్కూల్‌లో నిర్వహించిన సబ్‌జూనియర్ బాలబాలికల విభాగంలో షేక్‌గౌస్, సాయిప్రకాష్, చంద్రిక అత్యున్నత ప్రతిభ కనబరచి చిత్తూరు జిల్లా కుప్పంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం వివరించారు. పీడీ లక్ష్మణరావును గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. రమణగోపాల్, చంద్రశేఖర్, అరుణకుమారి, చంద్రలేఖ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లయోలాలో క్విజ్ పోటీలు

భారతీనగర్: ఆంధ్రా లయోలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఐక్యూఏసీ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ వెబ్ దినోత్సవం సందర్భంగా సాంకేతిక విద్యావిధానం అంశంపై అవగాహన సదస్సు జరిగింది. డేటా గోప్యత, కృత్రిమ మేధస్సు వంటి అంశాలపై క్విజ్ పోటీలను నిర్వహించారు. విజేతలకు డైరెక్టర్ ఫాదర్ డాక్టర్ బి.జోజిరెడ్డి బహుమతులను అందజేశారు. కళాశాల డైరెక్టర్ ఫాదర్ డాక్టర్ బి.జోజిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఓ మహేష్, అసిస్టెంట్ డైరెక్టర్ ఫాదర్ బాలస్వామి, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ సిస్టర్ క్యాండీ, కళావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి 11 వరకు రామవరప్పాడు, రాయనపాడు నుంచి ఆర్టీసీ బస్సులు

బస్‌స్టేషన్: నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్ నుంచి వెళ్లే కొన్ని ప్రధాన రైళ్లను దారి మళ్లిస్తున్న కారణంగా ఈనెల 2 నుంచి 11 వరకు రాయనపాడు, రామవరప్పాడు నుంచి ప్రయాణికుల సౌకర్యం కోసం బస్సులు నడుపుతున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎంవై దానం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాబట్టి ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి వినియోగించుకోవాలని కోరారు.

గాంధీ బ్యాంకుపై అవాస్తవాలు నమ్మొద్దు

భవానీపురం: ది గాంధీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకుపై ఇటీవల అవాస్తవాలు ప్రచారం జరుగుతున్నాయని, దీన్ని నమ్మొద్దని ది గాంధీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్ జగన్మోహనరావు, కార్యవర్గ సభ్యులు ఖండించారు. రాష్ట్రంలోని అర్బన్ బ్యాంకుల్లో తమ బ్యాంకు మెరుగ్గా పనిచేస్తోందని, ప్రతి ఏడాది లాభాల్లో నడుస్తూ ఖాతాదారులకు ప్రతి ఏడాది డివిడెండ్ మంజూరు చేస్తూ మంచి పనితీరు కనబరుస్తుందన్నారు. ఖాతాదారులు ఆందోళన చెందవద్దన్నారు.

కేడీసీఏ అండర్-16కు రన్నరప్

విజయవాడ స్పోర్ట్సు: నెల్లూరులో ఇటీవల జరిగిన ఏసీఏ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో కేడీసీఏ అండర్-16 బాలుర జట్టు రన్నరప్‌ను వశం చేసుకుంది. ఈ సందర్భంగా క్రికెటర్లను కేడీసీఏ సెక్రటరీ ఎం రవీంద్రచౌదరీ, కోచ్ ఎస్‌కే నాగూర్ అభినందించారు. భవిష్యత్‌లో టీమ్ మరిన్ని విజయాలను సాధించాలని కోరారు.

పేదలకు కొండంత అండ ఎన్టీఆర్ భరోసా

- ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు


రామవరప్పాడు పటేల్ నగర్లో దివ్యాంగుడికి పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గుణదల, ఆగస్టు 1: పేదలకు కొండంత అండగా నిలవాలన్న ఆలోచనతో రాష్ట్రం ఆర్థికంగా చితికిపోయినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ పథకం ద్వారా పేదలకు సమయానికి ఇంటి వద్దనే పెన్షన్లు అందజేయడం గర్వించదగిన విషయమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. రూరల్ మండలంలోని రామవరప్పాడు గ్రామంలో గురువారం జరిగిన పెన్షన్ల పంపిణీకి యార్లగడ్డ వెంకట్రావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. రామవరప్పాడులోని పటేల్ నగర్లో పెన్షన్ల పంపిణీలో పాల్గొన్న ఆయన ముందుగా వికలాంగుల ఇంటికి వెళ్లి పెన్షన్లను వారి ఇళ్లవద్దనే అందజేశారు. పంచాయతీ సిబ్బంది, టీడీపీ మండల నేతల సమక్షంలో పెన్షన్ల పంపిణీ ఓ పండుగలా జరిగింది. కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని పేదలు స్వాగతిస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి నిలబడటం చంద్రబాబు నైజమని చెప్పడానికి ఇదే నిదర్శనమన్నారు. అప్పుల్లో కూరుకుపోయిన రాష్ట్రాన్ని తిరిగి దేశంలోనే నెంబర్ వన్ స్థితికి తీసుకెళ్లాలన్న తపనతో చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. అనంతరం ఆయన ప్రసాదంపాడు వాటర్ ట్యాంక్ రోడ్డుకు చేరుకుని అక్కడ స్థానికులకు పెన్షన్లు పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది ఉత్సాహంగా పనిచేయడం వల్లే ప్రభుత్వం మధ్యాహ్న భోజన సమయానికి పెన్షన్ల పంపిణీ 90శాతం విజయవంతంగా పూర్తి చేసిందన్నారు. అక్కడ నుంచి ఎనికేపాడు ఎస్సీ కాలనీలోని సీఎస్ఈ చర్చి వద్దకు చేరుకుని అక్కడి వారికి పెన్షన్లు అందజేశారు. టీడీపీ రూరల్ మండలాధ్యక్షుడు గొడ్డళ్ల చిన్న రామారావు, రామవరప్పాడు గ్రామ టీడీపీ అధ్యక్షుడు నబిగాని కొండ, నేతలు కొల్లా ఆనంద్, తుపాకుల శివలీల, బొమ్మసాని అరుణకుమారి, సర్నాల బాలాజీ, బొప్పన హరికృష్ణ, కోనేరు సందీప్, గూడవల్లి నరసయ్య, పట్టపు చంటి, కొంగన రవి, కళ్లేపల్లి రాజు, గంధం గోవర్ధన్ పాల్గొన్నారు.

దుర్గమ్మకు 30 బృందాల సారె సమర్పణ


దుర్గమ్మకు సారె తీసుకువచ్చిన భక్తులు

వన్‌టౌన్ ఆగస్టు 1: ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మకు గురువారం వివిధ ప్రాంతాలకు చెందిన 30 మహిళా బృందాలు ఘనంగా ఆషాఢ సారె సమర్పించాయి. ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి తన బృందంతో కలిసి అమ్మవారికి సారె సమర్పించి పూజలో పాల్గొన్నారు. అధికారులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం ఆశీస్సులు అందచేశారు. నగరం నుంచి జి.అప్పారావు బృందం, మంగళగిరి నుంచి కనకమహాలక్ష్మీ బృందం, గూడవల్లి నుంచి రత్నకుమారి బృందం ఇలా పలు బృందాలు సారె సమర్పించారు. మల్లేశ్వర ఆలయ కుడ్యాల్లో ఉన్న దక్షిణామూర్తి విగ్రహానికి గురువారం సందర్భంగా అర్చకులు పూజలు నిర్వహించారు. ఈవో రామారావు దంపతులు పాల్గొన్నారు. ఆలయంలో నిత్యం జరుగుతున్న నిత్యాన్నదానానికి నగరంలోని రామకృష్ణాపురానికి చెందిన తంగిరాల వెంకటేశ్వరరావు, లక్ష్మీపార్వతి కుటుంబ సభ్యులు రూ.1,01,116లు విరాళాన్ని ఈవో రామారావుకు, గుంటూరు జిల్లా, మంగళగిరికి చెందిన రేచర్ల జయంత్ పృథ్వీరాజ్ కుటుంబ సభ్యులు రూ.1,01,116లు సూపరింటెండెంట్ సత్యన్నారాయణకు చెక్కురూపంలో అందచేశారు. దాతలకు అమ్మవారి దర్శనానంతరం ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు, అమ్మవారి చిత్రపటం అందచేశారు. సాయంత్రం ధర్మపథం వేదికపై పురాణ పండిట్ వెంకటేశ్వర శర్మ అమ్మవారి వైభవంపై పురాణ ప్రవచనం చేశారు.

కృష్ణానదిలో వేర్వేరు చోట్ల రెండు మృతదేహాలు

విద్యాధరపురం, ఆగస్టు 1: కృష్ణానదిలో వేర్వేరుగా రెండు మృతదేహాలు లభించినట్టు భవానీపురం, కృష్ణలంక పోలీస్ స్టేషన్లలో గురువారం కేసులు నమోదయ్యాయి. విద్యాధరపురం, హెడ్‌వాటర్ వర్క్స్ సమీపంలోని కృష్ణానదిలో ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్టు స్థానికులు ఆ ఏరియా సచివాలయం మహిళా పోలీసు బయ్యపురెడ్డి విష్ణుప్రియకు సమాచారం ఇవ్వడంతో ఆమె భవానీపురం పోలీసులకు తెలిపారు. వారు సంఘటనా ప్రాంతానికి వెళ్లి నదిలోని మృతదేహాన్ని బయటకు తెచ్చి పరిశీలించారు. ఎలాంటి ఆధారాలు లేనందున పోస్టుమార్టం నిమిత్తం ప్రభుతావసుపత్రికి తరలించారు. మృతుడికి సుమారు 45ఏళ్లుంటుందని, ఒంటిపై బిస్కెట్ కలర్ చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ఉన్నట్టు పోలీసులు తెలిపారు. కృష్ణలంక పోలీసు స్టేషన్ పరిధిలోని రైల్వే వంతెన దిగువన కృష్ణానదిలో ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. వారు అక్కడికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి ఒడ్డుకు తెచ్చారు. ఈ మృతదేహం వద్ద కూడా ఎలాంటి ఆధారాలు లేనందున పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి సుమారు 25 సంవత్సరాలు వయస్సు ఉంటుందని, మృతదేహం పై తెలుపురంగు చొక్కా, బ్లూ జీన్స్ ప్యాంటు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడు రైలు నుంచి కిందపడి చనిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

వన్‌టౌన్: పాత ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న చిట్టినగర్‌కు చెందిన బాలుడు మరణించినట్టు గురువారం కొత్తపేట పోలీస్‌స్టేషన్ లో కేసు నమోదైంది. చిట్టినగర్ కుండల మార్కెట్ వద్ద కుదమల పద్మ (37) తనకు సంతానం లేక, భర్త చనిపోవటంతో సోదరి కుమారుడు దివ్యాంగుడైన చైతన్య (10)ను పెంచుకుంటోంది. కొన్ని నెలల నుంచి స్థానికంగా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తోంది. వ్యాపారం సక్రమంగా లేక ఇబ్బందులకు గురవుతోంది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది గతనెల 30న రాత్రి 10 గంటలకు చనిపోదామని కూల్‌డ్రింక్‌లో గుళికలను కలిపింది. ముందుగా చైతన్యకివ్వటంతో అతను తాగాడు. తరువాత ఆమె కూడా తక్కువ మోతాదులో తాగింది. చైతన్య ఎక్కువగా వాంతులు చేసుకోవటంతో కంగారుపడి పాత ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లింది. అతడు చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం చనిపోయాడు. పద్మపై పోలీసులు హత్య కేసు నమోదు చేశారు.

యువతీ, యువకులను బెదిరించి నగదు, సెల్‌ఫోన్ అపహరణ

బైక్‌పై వెళుతున్న యువతీ, యువకులను అడ్డుకుని బెదిరించి వారి నుంచి నగదు, సెల్‌ఫోన్లను అపహరించిన ముగ్గురిపై గురువారం కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. జి.కొండూరు మండలం, కందులపాడు గ్రామానికి చెందిన ఓ యువతి (24) నగరంలోని సూర్యారావుపేటలోని ఓ ప్రముఖ హాస్పటల్‌లో స్టాఫ్‌నర్స్‌గా పనిచేస్తోంది. బుధవారం రాత్రి డ్యూటీ ముగించుకొని అదే గ్రామానికి చెందిన విజయా టాకీసు వద్ద ఉన్న ఓ యువకుడితో కలిసి బైక్‌పై ఇంటికి బయలుదేరింది. జక్కంపూడి పాముల కాలువ సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద ముగ్గురు గుర్తు తెలియని యువకులు బాధితుల బైక్‌ను ఆపి తమ వద్ద ఉన్న నగదు, సెల్‌ఫోన్‌లు ఇవ్వమని బెదిరించారు. నిరాకరించటంతో యువకుడిని కొట్టి అతడి జేబులోని రూ.500 నగదు, సెల్‌ఫోన్, యువతి వద్ద ఉన్న ఫోన్ లాక్కొని పరారయ్యారు.



మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరిస్తున్న శ్రీరామ శివ

గంజాయి, డ్రగ్స్ రహిత ఏపీ లక్ష్యం

- స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారి శ్రీరామశివ

గుణదల, ఆగస్టు 1: డ్రగ్స్‌ను వదులుకో, భవితను మలచుకో అన్న నినాదంతో యువత ఆలోచనా శక్తి ఉంటేనే గంజాయి, డ్రగ్స్ రహిత ఏపీ అనేది సాధ్యపడుతుందని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆఫీసర్ శ్రీరామ శివ అన్నారు. స్థానిక ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాలలో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జిల్లా ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, స్పెషల్ బ్యూరో విజయవాడ వెస్ట్ సీఐ శ్రీనివాసరెడ్డి, కళాశాల పీడీ డాక్టర్ డి.యుగంధర్, అధ్యాపకులు నవీన, డాక్టర్ రాధిక పాల్గొన్నారు.

టీడీపీ ఎన్నారై సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ రామ్ భూపాల్ మృతి



గన్నవరం, జూలై 1: సౌత్ ఆఫ్రికాలో టీడీపీ ఎన్నారై సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ బుడిపూడి రామ్‌భూపాల్ (38) అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయనకు భార్య ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. 20ఏళ్ల క్రితం హోటల్ మేనేజ్‌మెంట్ చేసి సౌత్ ఆఫ్రికా వెళ్లి అక్కడే స్థిరపడ్డాడు. టీడీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడంతో 2022లో అప్పటి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు రామ్‌భూపాల్‌ను ఎన్నారై టీడీపీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్‌గా నియమించారు. ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రికి వెళ్లగా క్యాన్సర్ అని తేలింది. ట్రీట్‌మెంట్ తీసుకుంటూ బుధవారం సాయంత్రం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని వచ్చే ఆదివారం స్వస్థలమైన నిడమానూరుకు తీసుకురానున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.


కేక్ కట్ చేస్తున్న పొట్లూరి వీరప్రసాద్

అభివృద్ధిపథంలో రాజధాని అమరావతి: పీవీపీ

లబ్బీపేట, ఆగస్టు 1: రానున్న ఐదేళ్లలో రాజధాని అమరావతి విశేషంగా అభివృద్ధి చెందుతుందని పీవీపీ సంస్థల అధినేత పొట్లూరి వీరప్రసాద్ అన్నారు. బందర్ రోడ్డులోని పీవీపీ మాల్ 10వ వార్షికోత్సవ వేడుకలు మాల్ ఆవరణలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాజధాని అభివృద్ధిలో తాము కూడా భాగస్వామ్యమవుతామని, అమరావతిలో పలు ప్రాజెక్టులు చేపట్టేందుకు పారిశ్రామిక వేత్తలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజల ఆదరాభిమానాలతో పీవీపీ మాల్‌కు ఓ ప్రత్యేకత ఏర్పడిందని, ఎప్పటికప్పుడు కొత్తమార్పులతో ప్రజలకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. పుట్టిన ఊరులో పీవీపీకి ఒక గుర్తింపు రావడం ఆనందంగా ఉందన్నారు. అమరావతి అభివృద్ధి చెందితే వేలాది మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. గత ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలకిచ్చే వయబిలిటి ఫండింగ్‌లో గ్యాప్ ఉందని ఆ గ్యాప్ రాకుండా చూస్తే రాష్ట్రంలో పెట్టుబడులు పెరిగి పారిశ్రామికాభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం కేక్ కట్ చేసి, రిటైలర్లకు మెమెంటోలు అందజేశారు. రవి బోయపాటి, జాస్తి మూర్తి, పారిశ్రామికవేత్తలు, మాల్ సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ టు దుబాయ్

- విమానాలను పునరుద్ధరించండి
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు ఎన్ఆర్ఐ విజ్ఞప్తి

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

దుబాయ్ నుంచి విశాఖకు విమాన సర్వీసును పునరుద్ధరించాలని యూఏఈలోని ప్రవాసాంధ్ర ప్రముఖుడు, విశాఖ నివాసి యలమర్తి శరత్ విజ్ఞప్తి చేశారు. న్యూఢిల్లీలో పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని కలిసిన ఆయన ఈమేరకు వినతిపత్రాన్ని అందించారు. 'ఉత్తరాంధ్ర వాసులు భారీ సంఖ్యలో అరబ్ దేశాల్లో పని చేస్తున్నారు. ప్రస్తుతం వీరంతా హైదరాబాద్ మీదుగా రాకపోకలు కొనసాగిస్తున్నారు. దుబాయి నుండి హైదరాబాద్ మీదుగా విశాఖకు గతంలో ఎయిర్ ఇండియా విమాన సర్వీసు ఉండేది. 2021 కరోనా సంక్షోభంలో దాన్ని రద్దు చేశారు. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్రకు చెందిన మీరు కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతో విశాఖకు విమాన సర్వీసు పునరద్ధరణపై ఆశలు చిగురించాయి. గల్ఫ్ ఎయిర్‌లైన్స్ విశాఖకు విమానాలు నడపడానికి సిద్ధంగా ఉన్నా ఎయిర్ ఇండియా మాత్రం వెనుకంజ వేస్తోంది. ఉత్తరాంధ్ర అభివృద్ధిని పరిగణలోకి తీసుకొని విమాన సర్వీసును పునరుద్ధరించాలి' అని కేంద్ర మంత్రికి శరత్ విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి రామ్మోహన్ నాయుడు సానుకూలంగా స్పందించినట్లు ప్రవాసీ ప్రముఖుడు తెలిపారు.

ఏపీ స్మార్ట్ నగరాల్లో 2,975 కోట్ల వ్యయం: కేంద్రం

న్యూఢిల్లీ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ సిటీస్ మిషన్ కింద ఏపీ నుంచి అమరావతి, విశాఖపట్నం, కాకినాడ, తిరుపతి ఎంపికవ్వగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు రూ.3,590.80కోట్ల నిధులు విడుదల చేశాయని, అందులో రూ.2,975.35 కోట్లు ఖర్చుపెట్టినట్లు కేంద్రం తెలిపింది. లోక్‌సభలో ఎంపీ కేశినేని శివనాథ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి టోకన్ సాహు గురువారం ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

ఏపీలో రోడ్లకు రూ.51,429 కోట్లు: గడ్కరీ

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం జాతీయ రహదారుల విస్తరణ, నిర్మాణపనులు 2,380 కిలోమీటర్ల మేర జరుగుతుండగా రూ.51,429 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు కేంద్రం తెలిపింది. లోక్‌సభలో టీడీపీ ఎంపీలు కేశినేని శివనాథ్(చిన్ని), పుట్టా మహేష్‌కుమార్, దగ్గుమళ్ల ప్రసాదరావు, బీకే పార్థసారథి, అంబికా జి.లక్ష్మీనారాయణ ఉమ్మడిగా అడిగిన ప్రశ్నకు కేంద్ర జాతీయ రహదారులు, రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీ గురువారం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో మరో 789 కిలోమీటర్ల జాతీయ రహదారి నిర్మాణానికి రూ.15,674 కోట్లు కేటాయించామని, ఇంకా పనులు ప్రారంభం కాలేదని తెలిపారు.

స్వాతంత్ర్య వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేయండి: సీఎస్

అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో 15న రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న 78వ భారత స్వాతంత్ర్య వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశించారు. స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లపై గురువారం అమరావతి సచివాలయంలో ఆయన సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ వేడుకల నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని.. సాయంత్రం రాజ్‌భవన్‌లో జరిగే ఎట్ హోం కార్యక్రమానికి సంబంధించి కూడా తగిన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ప్రభుత్వ పథకాలపై అవగాహనకు శాఖల వారీగా ప్రత్యేక శకటాల ప్రదర్శనను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

సీబీఐ ఎస్పీ వ్యాజ్యంపై విచారణ 12కి వాయిదా

అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): వివేకా హత్య కేసులో తప్పుడు సాక్ష్యం చెప్పాలని బెదిరించారంటూ ఏ-7 గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డి ఇచ్చిన ప్రైవేటు ఫిర్యాదు ఆధారంగా కడప రిమ్స్ పోలీసు స్టేషన్‌లో నమోదు చేసిన కేసును కొట్టివేయాలని సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్ వేసిన పిటిషన్‌పై విచారణను హైకోర్టు ఈ నెల 12కు వాయిదా వేసింది. ఆ రోజు వ్యాజ్యంపై తుది విచారణ జరుపుతామని జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ఉత్తర్వులు ఇచ్చారు. వివేకా హత్యకేసులో తప్పుడు సాక్ష్యం చెప్పాలని సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్ తనను బెదిరించారని ఉదయ్‌కుమార్‌రెడ్డి కడప ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రైవేటు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని కోర్టు కడప రిమ్స్ పోలీసులను ఆదేశించింది. పోలీసులు రామ్‌సింగ్‌పై కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ రామ్‌సింగ్ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన న్యాయస్థానం.. ఈ కేసులో తదుపరి చర్యలన్నిటినీ నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ వ్యాజ్యం గురువారం మరోసారి విచారణకు రాగా సీబీఐ తరఫున కేంద్ర ప్రభుత్వ న్యాయవాది జూపూడి యజ్ఞదత్, ఉదయ్‌కుమార్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది ప్రద్యుమ్నకుమార్‌రెడ్డి వాదనలు వినిపించారు.

పౌరసరఫరాల సంస్థ ఎండీగా వీరపాండియన్

- రామాయపట్నం, మచిలీపట్నం పోర్టుల సీఈవోగా ప్రవీణ్ ఆదిత్య

అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా జి.వీరపాండియన్‌ను కొనసాగిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జరిగిన ఐఏఎస్‌ల బదిలీల్లో వీరపాండియన్‌ను సెర్ప్ సీఈవోగా ప్రభుత్వం బదిలీ చేసింది. అలాగే, గృహనిర్మాణ సంస్థ ఎండీగా ఉన్న పి.ఎస్.గిరీషాను పౌరసరఫరాల సంస్థ ఎండీగా బదిలీ చేసింది. ఆ ఉత్తర్వుల్లో పాక్షిక మార్పులతో గురువారం తాజా ఉత్తర్వులను జారీ చేసింది. వీరపాండియన్‌ను సెర్ప్ సీఈవోగా కొనసాగిస్తూనే.. పౌరసరఫరాల సంస్థ వైస్ చైర్మన్, ఎండీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. పి.ఎస్.గిరీషాకు పోస్టింగ్‌పై విడిగా జీవో జారీ చేయనున్నట్లు పేర్కొంది. ఏపీ మారిటైమ్ బోర్డు సీఈవో ప్రవీణ్ ఆదిత్యకు రామాయపట్నం, మచిలీపట్నం పోర్టుల సీఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ముగ్గురు తపాలా ఉద్యోగులకు ఐదేళ్ల జైలు

- ఖాతాదారుల సొమ్ము స్వాహా కేసులో తీర్పు

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారులను మోసం చేసిన కేసులో ముగ్గురు తపాలా శాఖ ఉద్యోగులకు ఐదేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ సీబీఐ కేసుల న్యాయస్థానం అదనపు ప్రత్యేక న్యాయమూర్తి సీఎస్ మూర్తి గురువారం తీర్పు వెల్లడించారు. ఇందుకు సంబంధించి సీబీఐ అధికారులు ప్రకటన విడుదల చేశారు. తూర్పుగోదావరి జిల్లా ఏలేశ్వరం సబ్ పోస్టాఫీస్‌లోని సబ్ పోస్టుమాస్టర్ కొడమంచిలి రాజేంద్రప్రసాద్, పోస్టల్ అసిస్టెంట్లు ఐ.సత్యనారాయణ, పి.అప్పలస్వామి కలిసి 2009 అక్టోబరు 21 నుంచి 2012 సెప్టెంబరు 29 వరకూ రికరింగ్ డిపాజిట్లు కలిగిన 153 మంది ఖాతాదారులు మహిళా ప్రధాన్ క్షేత్రియ బచత్ యోజన (ఎంపీకేబీవై) కోసం కట్టిన రూ.30,56,429ను వారి ఖాతాలకు జమ చేయకుండా తమ సొంతానికి వాడుకున్నారు. నేరపూరిత ఆలోచనతో పథకం ప్రకారం తపాలా శాఖతోపాటు ఖాతాదారులను మోసం చేసిన ముగ్గురిపైనా సీబీఐ కేసు నమోదుచేసింది. నేరం రుజువు కావడంతో సీబీఐ కోర్టు నిందితులు ముగ్గురికీ ఐదేళ్ల జైలుశిక్షతోపాటు రాజేంద్రప్రసాద్‌కి రూ.ఏడు వేలు, ఐ.సత్యనారాయణకు రూ.8.29 లక్షలు, పి.అప్పలస్వామికి రూ.8.59 లక్షలు జరిమానా విధించింది.

లక్ష్మీపార్వతికి గౌరవ ఆచార్య హోదా తొలగింపు

- ప్రకటించిన ఏయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కిశోర్‌బాబు

విశాఖపట్నం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకురాలు లక్ష్మీపార్వతికి ప్రత్యేకంగా కట్టబెట్టిన గౌరవ ఆచార్య హోదాను ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారులు ఎట్టకేలకు ఉపసంహరించుకున్నారు. ఈ విషయాన్ని ఏయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కిశోర్‌బాబు గురువారం ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేవరకు వీసీగా పనిచేసిన ప్రసాదరెడ్డి... వైసీపీకి అనుకూలంగా అనేక నిర్ణయాలు తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే మూడేళ్ల క్రితం లక్ష్మీపార్వతికి గౌరవ ఆచార్య హోదాను కట్టబెట్టారు. ఏయూలో ప్రసాదరెడ్డి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన టీడీఆర్ హబ్‌లో ఆమెను ప్రొఫెసర్‌గా నియమించి, పది మంది పరిశోధకులను కూడా అప్పగించారు. ఆమె విజయవాడలో ఉంటారని తెలిసినా పరిశోధకుల జీవితాలను పణంగా పెట్టారు. ఆమెకు గౌరవ వేతనం కూడా పరిశోధకుల నుంచే ఇప్పించారు. ఇవన్నీ గుట్టుగా ఉంచారు. జూలై 11న 'ఆంధ్రజ్యోతి' ఈ విషయాలన్నీ వెలుగులోకి తెచ్చినా ఏయూ అధికారులు నోరు మెదపలేదు. టీడీఆర్ హబ్ డీన్‌గా వ్యవహరిస్తున్న ప్రసాదరెడ్డి అనుంగు శిష్యుడు జేమ్స్ స్టీఫెన్ మాత్రం తమను లక్ష్యంగా చేసుకొని వార్తలు రాస్తున్నారని ఖండన ఇస్తూ లక్ష్మీపార్వతి నియామకం నిబంధనల ప్రకారమే జరిగిందని సమర్థించుకున్నారు. తాము ఎటువంటి తప్పు చేయలేదని పేర్కొన్నారు. ఈ ఘటన జరిగిన 20 రోజులకు రిజిస్ట్రార్ కిశోర్‌బాబు స్పందించారు. లక్ష్మీపార్వతిని ఏయూ టీడీఆర్ హబ్ నుంచి తొలగించామని, ఆమెకు కేటాయించిన పరిశోధకులను వేరొకరికి అప్పగించాలని ఆదేశించామని ప్రకటించారు. మీడియాలో వార్తలు వచ్చిన వెంటనే స్పందించకుండా, తాము ప్రశ్నించాకే చర్యలు చేపట్టారని, ప్రసాదరెడ్డి నియామకాలపై చర్యలు తీసుకోవడానికి ప్రస్తుత అధికారులు భయపడుతున్నట్టుగా ఉందని కూటమి నాయకులు అభిప్రాయపడుతున్నారు.

ఏసీఏ కార్యవర్గం మూకుమ్మడి రాజీనామాలు

- ఈ నెల 4న ప్రత్యేక సర్వసభ్య సమావేశం
- అదేరోజు ఎన్నికల నోటిఫికేషన్..?
- కోవర్ట్ ఆపరేషన్‌కు వైసీపీ గ్యాంగ్ యత్నాలు!
- క్రికెట్‌తో సంబంధమున్న వాళ్లే కావాలంటున్న సభ్యులు
- ఎమ్మెస్కే ప్రసాద్, పవన్ రెడ్డిపై మొగ్గు

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి)

రాజకీయాలకు అతీతంగా ఉండే ఆంధ్ర క్రికెట్ సంఘాన్ని (ఏసీఏ) 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకొచ్చాక చెరబట్టింది. ఏసీఏను తమ పార్టీ అనుబంధ సంఘంగా మార్చుకొంది. తాజా ఎన్నికల్లో వైసీపీ సర్కారు ఓడి కూటమి ప్రభుత్వం అధికారంలో కొచ్చింది. ఈ నేపథ్యంలో సంఘంలో తిష్ఠ వేసుకొని కూర్చున్న వైసీపీ మద్దతు కార్యవర్గాన్ని సాగనంపి.. ఏసీఏకు పునర్వైభవం తీసుకొచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. దీంతో ఇటీవల ఎంపీ విజయసాయిరెడ్డి అల్లుడు, ప్రస్తుత అధ్యక్షుడు శరత్‌చంద్రారెడ్డి నాయకత్వంలోని అపెక్స్ కౌన్సిల్ మొత్తం మూకుమ్మడిగా రాజీనామా చేసేసింది. అయితే, ఇన్ని రోజులూ తాము గుట్టుచప్పుడు కాకుండా నడిపిన వ్యవహారాలు ఎక్కడ బయటపడతాయోనని ఆందోళనలో ఉన్న ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్ రెడ్డి కొత్త నాటకానికి తెరతీసినట్టు సమాచారం. తమతో అంటకాగే కొందరు నాయకులను తమ కోవర్టులుగా ఏసీఏలోకి చొప్పించే వ్యూహం సిద్ధం చేసినట్టు తెలిసింది. దీనికి ప్రభుత్వం ఎలా చెక్ పెడుతుంది..? ఈ నెల 4న విజయవాడలో జరిగే ఏసీఏ ప్రత్యేక సర్వసభ్య సమావేశం (ఎస్‌జీఎం)లో ఎలాంటి చర్యలు తీసుకోనుంది..? అనేదానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అదేరోజు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

ఆటలు సాగవని.. రాజీనామా

సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో మారిన రాజకీయాల సమీకరణాల నేపథ్యంలో అధ్యక్షుడు శరత్‌చంద్రారెడ్డి, కార్యదర్శి గోపీనాథ్ రెడ్డి సహా అపెక్స్ కౌన్సిల్ మొత్తం ఇక తమ ఆటలు సాగవని పసిగట్టి గతనెల 21న రాజీనామా చేసింది. ఈ రాజీనామాలను ఎస్‌జీఎంలో ఆమోదింపజేసుకుని, బాధ్యతల నుంచి పూర్తిగా పక్కకు తొలగాలని సాయిరెడ్డి గ్యాంగ్ నిర్ణయించుకుంది. దీనికి ముందే తమ అస్మదీయ కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు చెల్లింపు, తమ అనుకూల ఏసీఏ సిబ్బందికి భారీగా జీతాల పెంపు, కొత్త ఉద్యోగుల నియామకాలను చడీచప్పుడు లేకుండా కార్యదర్శి గోపీనాథ్ రెడ్డి పూర్తి చేశారని విమర్శలు వినిపిస్తున్నాయి.

మళ్లీ రాజకీయ రంగు...?

వైసీపీ ప్రభుత్వం, సాయిరెడ్డి గ్యాంగ్ ఏసీఏలో ఉన్నంతకాలం ఊడిగం చేసిన కొందరు.. ప్రభుత్వం మారేసరికి ఇప్పుడు టీడీపీ-జనసేన కూటమి నాయకులు... ఏసీఏ ప్రక్షాళన బాధ్యతలు చూస్తున్న విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారట. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా, విశాఖపట్నం జిల్లాలకు చెందిన టీడీపీ, జనసేన నాయకులు ఏసీఏ పదవులపై ఆశలు పెట్టుకోవడంతో సంఘంలోని జిల్లాలు, క్లబ్‌ల ప్రతినిధులు ఆందోళన చెందుతున్నారు. వీరంతా ఇప్పటికే ఏసీఏ పదవులు కావాలని అగ్ర నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. విశాఖపట్నం జిల్లాకు చెందిన మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే అల్లుడితో పాటు, తూర్పు గోదావరికి చెందిన ఓ నాయకుడు కూడా ఏసీఏ పీఠంపై కూర్చోవాలని బలంగా పావులు కదుపుతున్నారట. మనీలాండరింగ్ కేసులో ఉన్న ఈ తూర్పుగోదావరి జిల్లా నాయకుడు గోపీనాథ్ రెడ్డికి చెందిన ఓ క్లబ్ నుంచే పోటీపడనున్నట్టు సమాచారం.

క్రికెట్ తెలిసిన వారైతే ఉత్తమం..

గత ఐదేళ్లు రాజకీయ నాయకుల ఒత్తిళ్లు, పైరవీలు, మితిమీరిన జోక్యంతో ఏసీఏ ప్రతిష్ఠ మసకబారింది. ఈ సంస్కృతికి ముగింపు పలికి, క్రికెట్ అభివృద్ధికి నడుం బిగించాలని మెజారిటీ సభ్యులు కోరుతున్నారు. బీసీసీఐ మాజీ చీఫ్ సెలెక్టర్, ఏసీఏలో గతంలో వివిధ హోదాల్లో పనిచేసిన ఎమ్మెస్కే ప్రసాద్, ఆంధ్ర ఒలింపిక్ సంఘం మాజీ అధ్యక్షుడు, బీసీసీఐలో మంచి పరిచయాలు, ఎంఎస్ ధోనీ, విరాట్ కోహ్లీతో పాటు పలువురు క్రికెటర్లతో సన్నిహిత సంబంధాలున్న జేసీ పవన్ రెడ్డి వంటి వారు ఏసీఏలోకి వస్తే స్వాగతిస్తామని అంటున్నారు. ఎమ్మెస్కే ప్రసాద్, పవన్ రెడ్డి క్రియాశీలక రాజకీయాల్లో లేకపోవడం, గతంలో క్రీడారంగానికి సేవ చేసినవారు కావడంతో ఏసీఏ సభ్యులు మొగ్గు చూపిస్తున్నారు. ఇక, ఏసీఏ కార్యదర్శితో పాటు సీఏసీ, క్రికెట్ వ్యవహారాలు తెలిసినవారు, క్రికెట్ అనుభవం ఉన్నవాళ్లతోనే భర్తీ చేసేందుకు ప్రభుత్వం సహకరించాలని కోరుతున్నారు. అపెక్స్ కౌన్సిల్‌లో సెక్రటరీ పోస్టును ఏసీఏలో అనుభవం ఉన్నవాళ్లకి, గతంలో కార్యదర్శిగా పనిచేయని వాళ్లకి ఇవ్వాలంటున్నారు.



డిగ్రీ అడ్మిషన్లపై గందరగోళం!

- వెబ్ ఆప్షన్లపై అర్ధరాత్రి నిర్ణయం
- విద్యార్థులకు పూర్తిగా చేరని సమాచారం
- ఉన్నత విద్యాశాఖ వెబ్‌సైట్ మొరాయింపు
- సాంకేతిక లోపాలతో విద్యార్థులకు తిప్పలు
- మధ్యాహ్నానికి సవరించిన అధికారులు
- ఇప్పటికి ఐదుసార్లు వాయిదా పడిన కౌన్సెలింగ్

అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియను ఉన్నత విద్యాశాఖ అస్తవ్యస్తం చేసింది. షెడ్యూలు విడుదల చేసిన నాటినుంచీ వాయిదాల పర్వం కొనసాగింది. ఈ ఏడాది ఇప్పటివరకూ ఐదుసార్లు అడ్మిషన్ల ప్రక్రియ వాయిదా పడింది. దీంతో ఏ కాలేజీకి ఆప్షన్ పెట్టుకోవాలనే విషయంలో విద్యార్థులు అయోమయంలో పడిపోయారు. గత నాలుగైదు రోజులుగా ప్రతిరోజూ దరఖాస్తుల ప్రక్రియను వాయిదా వేస్తూ వచ్చిన ఉన్నత విద్యామండలి చివరికి బుధవారం అర్ధరాత్రి ఆప్షన్ల ఎంపికపై నిర్ణయం తీసుకుంది. అయితే ఒక్కరోజు వ్యవధి కూడా ఇవ్వకుండా గురువారం నుంచే ఆప్షన్ల ఎంపిక అని ప్రకటించింది. అర్ధరాత్రి తీసుకున్న ఈ నిర్ణయంపై కనీసం కాలేజీ యాజమాన్యాలకు కూడా సమాచారం ఇవ్వలేదు. దీంతో ఆప్షన్ల ఎంపిక ప్రారంభమైన విషయం విద్యార్థులకు తెలియలేదు. చాలాచోట్ల కాలేజీలు అప్రమత్తం చేసిన తర్వాత హడావిడిగా ఆప్షన్లను ఎంపిక చేసుకోవడం మొదలుపెట్టారు. అందులోనూ మధ్యాహ్నం వరకూ సాంకేతిక సమస్యలతో ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. గురువారం ఉదయం వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. ఒక విద్యార్థి ఒకటి కంటే ఎక్కువ కోర్సులకు అర్హత ఉన్నా.. ఒకటికి మించి కోర్సులు పెట్టుకుంటే వెబ్‌సైట్ తీసుకోలేదు. దీనిని అధికారులు మధ్యాహ్నానికి సవరించారు. తర్వాతే పూర్తిస్థాయిలో ఎంపిక ప్రక్రియ మొదలైంది. ఉన్నత విద్యాశాఖ, ఉన్నత విద్యామండలి నిర్వాకంతో విద్యార్థులు ఆప్షన్ల ఎంపికలో ఒకరోజు నష్టపోయారు.

ఇంజనీరింగ్‌లోనూ అంతే...

ఇంజనీరింగ్ అడ్మిషన్ల విషయంలోనూ ఉన్నత విద్యాశాఖ గందరగోళం సృష్టించింది. ఫీజులపై స్పష్టత రాకుండానే ఈఏపీసెట్ కౌన్సెలింగ్ ప్రారంభించింది. 8 నుంచి ఆప్షన్లు ఎంపిక చేసుకోవాలని షెడ్యూలులో ఉంటే 7వ తేదీ రాత్రి అధికారులు ఫీజులు ఖరారు చేశారు. ఆ వెంటనే ఉదయం నుంచి ఆప్షన్లు ప్రారంభం అన్నారు. కానీ ఫీజులను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడానికి ఒకరోజు పట్టింది. ఆ తర్వాత రోజు ఆప్షన్లు ప్రారంభమయ్యాయి. అయితే ప్రైవేటు వర్సిటీలను అందులో పెట్టకపోవడంతో మరో రోజు వృథా అయింది. ఇలా ఐదు రోజుల్లో ఉన్నత విద్యాశాఖ తీరువల్ల విద్యార్థులు రెండు రోజులు నష్టపోయారు. ఈ గందరగోళానికి హడావిడి నిర్ణయాలే కారణమని విమర్శలు వస్తున్నాయి.

అప్పుల ఊబిలో విశాఖ ఉక్కు!

- ప్లాంటుపై రూ.6వేల కోట్ల రుణభారం
- ముడిపదార్థాల కొనుగోలుకు నిధుల్లేవు
- నిర్వహణకు చేతిలో చిల్లిగవ్వ లేదు
- ప్రతినెలా వడ్డీలకే రూ.కోట్లు చెల్లింపు
- పాలకుల నుంచి అందని సాయం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



విశాఖ స్టీల్ ప్లాంటు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నా సాయం అందించే నాథుడు కనిపించడం లేదు. రెండేళ్ల క్రితం అతుల్ భట్‌ను సీఎండీగా ఇక్కడికి పంపించారు. మూతపడిన మూడో బ్లాస్ట్ ఫర్నేస్(బీఎఫ్) ను తెరిపించి, పూర్తి సామర్థ్యంతో ప్లాంటును నడిపిస్తామని ఆయన ప్రకటించారు. గతేడాది డిసెంబరు 29న బీఎఫ్-3 తెరుచుకోగా, ఆ తరువాత 45 రోజుల్లోనే బీఎఫ్-1 మూతపడింది. ఉన్న మూడు బీఎఫ్‌లను నడపడానికి అవసరమైన ముడిపదార్థాలు సమకూర్చుకోలేక చేతులెత్తేశారు. భట్ వచ్చాకే ప్లాంటు ఉద్యోగులకు వాయిదాల పద్ధతిలో జీతాలు ఇవ్వడం మొదలైంది. వివిధ బ్యాంకుల నుంచి తెచ్చిన రుణాలకు ప్రతినెలా వడ్డీల రూపంలో రూ.కోట్లు చెల్లిస్తున్నారు. ముడి పదార్థాలకు రూ.985 కోట్లు, విడిభాగాలకు రూ.289 కోట్లు, విద్యుత్, నీరు బిల్లులకు రూ.105కోట్లు, విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న బొగ్గు, లైమ్‌స్టోన్, నౌకల రవాణా చార్జీలకు రూ.3,338 కోట్లు, పెన్షనర్లకు రూ.360 కోట్లు, గ్రాట్యుటీ రూ.239 కోట్లు, పీఎఫ్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్లు, ఎల్ఐసీ వంటివన్నీ కలిపి రూ.400 కోట్లు, ఆపరేషన్ కాంట్రాక్టర్లకు రూ.169కోట్లు, మైన్స్ ఇతరాలకు మరో రూ.50 కోట్లు కలిపి దాదాపు రూ.6వేల కోట్ల అప్పు ప్లాంటు నెత్తిన ఉంది. ఇప్పుడు ప్లాంటును నడపాలంటే ముడిపదార్థాలకు నిధుల్లేవు. ఉద్యోగ, కార్మిక సంఘాలు ఎప్పటికప్పుడు స్థానిక, రాష్ట్ర నాయకులతోపాటు కేంద్రంలో పెద్దల దృష్టికి తీసుకువెళ్లినా ప్లాంటు పరిస్థితి మెరుగుపరచడానికి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ప్రైవేటీకరణ చేయబోమని ఒక్క మాట చెప్పడంతో తమ పని అయిపోయినట్టుగా ప్రవర్తిస్తున్నారు.

ఆరోగ్యశాఖకు పెనాల్టీ..!

- 16 మెడికల్ కాలేజీల్లో తీవ్ర ఫ్యాకల్టీ కొరత
- వాటిలో వైసీపీ ప్రభుత్వంలోని ఐదు కాలేజీలూ...
- ఎన్ఎంసీ తనిఖీల్లో బయటపడ్డ నాటి నిర్వాకం
- రూ.3-5 లక్షలు చొప్పున రూ.55లక్షల పెనాల్టీ
- ఫ్యాకల్టీ నియామకంలో గత ప్రభుత్వం విఫలం

అమరావతి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఆరోగ్యశాఖకు పెనాల్టీ పడింది. 16 బోధనాస్పత్రుల్లో సరిపడా సిబ్బంది లేరని గుర్తించిన నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ).. వాటికి జరిమానా విధించింది. ఒక్కో బోధనాస్పత్రికి రూ.3 నుంచి రూ.5 లక్షలు చొప్పున పెనాల్టీలు విధించింది. వాటిని ఆరోగ్యశాఖ చెల్లించేసింది. ఆరోగ్యశాఖ రూపురేఖలు మార్చేశామని, దేశంలో ఎవ్వరూ ఈ స్థాయిలో ఆరోగ్యశాఖను ప్రక్షాళన చేయలేదని గొప్పలు చెప్పుకొన్న మాజీ సీఎం జగన్ హయాంలో ఏర్పాటైన ఐదు మెడికల్ కాలేజీలూ జరిమానా పడిన జాబితాలో ఉన్నాయి. నాడు-నేడు అంటూ ఆరోగ్యశాఖలో నాటి వైసీపీ ప్రభుత్వం హడావుడి చేసింది. కానీ, ఈ శాఖ పరిధిలోని మెడికల్ కాలేజీలకుగానీ, కొత్తగా తామే పెట్టిన కాలేజీలకుగానీ సరిపడా ఫ్యాకల్టీని ఇచ్చిన పాపాన పోలేదు. అరకొర సిబ్బందితోనే ఐదేళ్లూ ఈ కాలేజీలను నడిపించేశారు. ఇటీవల తనిఖీలకు వచ్చిన నేషనల్ మెడికల్ కౌన్సిల్ అధికారుల తనిఖీల్లో ఈ విషయం బయటపడింది. ఆరోగ్యశాఖ చరిత్రలోనే తొలిసారి ఎన్ఎంసీకి పెనాల్టీ కట్టాల్సి వచ్చింది. ఈ పెనాల్టీల తీరు చూస్తేనే గత ప్రభుత్వం ఆరోగ్య శాఖపై, బోధనాస్పత్రులపై ఏ స్థాయిలో దృష్టిపెట్టిందో అర్థం అవుతుందని ఆరోగ్య నిపుణులు మండిపడుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి మే నెలాఖరు వరకూ ఎన్ఎంసీ రాష్ట్రంలోని 16 మెడికల్ కాలేజీల్లో అకస్మాత్తుగా ఆన్‌లైన్ తనిఖీలు చేపట్టింది. అనేక అంశాల ఆధారంగా ఈ తనిఖీలు జరిగాయి. ఇందులో ప్రధానంగా ఫ్యాకల్టీపై ప్రత్యేక దృష్టి పెట్టారు. రాష్ట్రంలో ప్రస్తుతం 21 మెడికల్ కాలేజీలు ఉన్నాయి. వాటిలో 16 కాలేజీల్లో తీవ్రమైన ఫ్యాకల్టీ కొరత ఉందని ఎన్ఎంసీ గుర్తించింది. దీనిని సరిచేసుకోవాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు సూచనలు చేయడంతోపాటు ప్రస్తుతానికి పెనాల్టీతో సరిపెట్టింది. మరోసారి చేపట్టే తనిఖీల నాటికి ఫ్యాకల్టీ సమస్య పరిష్కారం కాకుంటే ఎంబీబీఎస్ సీట్లు తగ్గించడం లేదా ఆయా కాలేజీల గుర్తింపుని రద్దు చేయడం వంటి కఠిన చర్యలు తీసుకోవచ్చు. ఆయా కాలేజీల ప్రిన్సిపాల్స్.. తమ కాలేజీల డెవలప్‌మెంట్ సొసైటీ ఖాతాల నుంచి పెనాల్టీలు చెల్లించారు.

వెన్నెముక విరిచారు...

ఎంతో చరిత్ర కలిగిన విశాఖపట్నంలోని ఆంధ్రా మెడికల్ కాలేజీ, కాకినాడలోని రంగరాయ మెడికల్ కాలేజీ, విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజీ, గుంటూరు మెడికల్ కాలేజీ, తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర మెడికల్ కాలేజీ, కర్నూలు మెడికల్ కాలేజీలు.. ఆరోగ్యశాఖకు వెన్నెముక వంటివి. రాష్ట్రంలో ఎలాంటి అనారోగ్య సమస్యలకైనా సూపర్ స్పెషాలిటీ సేవలు అందించే ఆస్పత్రులివే. అక్కడ అందుబాటులో లేని స్పెషాలిటీ సేవలు ఉండవు. వైద్య సిబ్బంది కూడా ఆరు కాలేజీల్లో పోస్టింగ్‌ల కోసం ఎగబడతారు. నియామకాలు జరిగినా, బదిలీలు చేసినా ఈ ఆరు కాలేజీలకు అత్యంత పోటీ ఉంటుంది. అటువంటి ప్రతిష్ఠాత్మకమైన కాలేజీలకు కూడా రూ.5 లక్షల చొప్పున పెనాల్టీలు పడ్డాయి. ఎక్కువ కాలేజీల్లో వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో లేరని ఎన్ఎంసీ గుర్తించింది. కేవలం గత ప్రభుత్వం తప్పుడు నిర్ణయాల వల్లనే ఈ దుస్థితి తలెత్తిందని చెప్పక తప్పదు. గత ప్రభుత్వం 'జీరో వేకెన్సీ పాలసీ'ని ఆర్భాటంగా ప్రకటించింది. ఆరోగ్యశాఖలో ఒక్క పోస్టు కూడా ఖాళీగా ఉండకూడదన్నదే లక్ష్యంగా పెట్టుకున్నామని అప్పట్లో జగన్ గొప్పగా చెప్పారు. పదుల సంఖ్యలో నోటిఫికేషన్ ఇచ్చి.. 54 వేల పోస్టులు భర్తీ చేసేశామని ప్రకటించారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ మాత్రం... మెడికల్ కాలేజీల్లో ఫ్యాకల్టీ పోస్టులు చాలావరకు ఖాళీగా ఉన్నాయని గుర్తించింది.

20 విభాగాల్లో 15 చోట్ల సిబ్బంది లేరు

ఇప్పటికే ఉన్న మెడికల్ కాలేజీల విషయం పక్కన పెడితే.. కొత్త కాలేజీలకు కూడా పెనాల్టీలు పడ్డాయి. గత ఏడాది వైసీపీ ప్రభుత్వం ఐదు కాలేజీల్లో ఎంబీబీఎస్ అడ్మిషన్లు పూర్తి చేసింది. విజయనగరం, ఏలూరు, రాజమండ్రి, మచిలీపట్నం, నంద్యాల కాలేజీలను ప్రారంభించింది. కానీ, పూర్తిస్థాయిలో ఫ్యాకల్టీని అందుబాటులో ఉంచలేదు. ఆయా కాలేజీల్లో దాదాపు 20 విభాగాలు ఉండగా 15 విభాగాల్లో సిబ్బంది కొరత ఉంది. దాదాపు ఐదు కాలేజీల్లోనూ ఇదే పరిస్థితి. ఈ కాలేజీలకు ఎన్ఎంసీ రూ.3 లక్షల చొప్పున పెనాల్టీ విధించింది. ఇలా...మొత్తం 16 మెడికల్ కాలేజీలకు రూ.55 లక్షల పెనాల్టీ విధించింది.

కోడిగుడ్ల కాంట్రాక్టర్లతో బంతాట..!

- రూ.240 కోట్లు బకాయి పడిన జగన్ ప్రభుత్వం
- కాంట్రాక్టర్లను బెదిరించి మరీ గుడ్ల సేకరణ

గుంటూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాలకు కోడిగుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టర్లను జగన్ ప్రభుత్వం బంతాట ఆడుకుంది. ఆరు నెలలకు పైగా సొమ్ము చెల్లించకుండానే గుడ్లు సరఫరా చేయాలని గొంతుమీద కత్తిపెట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో సుమారు 44వేల అంగన్వాడీ కేంద్రాలున్నాయి. వాటిద్వారా పౌష్టికాహారం పొందుతున్న చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం ప్రతి రోజూ కోడిగుడ్లు అందిస్తోంది. దానికోసం జిల్లాల వారీగా టెండర్లు పిలిచి.. ఎవరైతే తక్కువ ధరకు గుడ్లు ఇస్తారో వారికి కాంట్రాక్టు అప్పగిస్తుంది. వారికి క్రమం తప్పకుండా బిల్లులు చెల్లిస్తామని అగ్రిమెంట్ సమయంలో ప్రభుత్వం చెబుతుంది. కానీ గత ఐదు సంవత్సరాలుగా ఏనాడూ సరైన సమయానికి బకాయిలు విడుదల చేయలేదని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. బిల్లులిచ్చినా ఇవ్వకపోయినా ఒప్పుకున్నందుకు కోడిగుడ్లు సరఫరా చేశామని అంటున్నారు. అలా సరఫరా చేసిన వాటికి ప్రతి నెలా ఒక్కో జిల్లాకు రూ.40 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుంది. అయితే కాంట్రాక్టర్లకు ఫిబ్రవరి నుంచి బిల్లులు నిలిపివేశారు. అప్పటి వైసీపీ ప్రభుత్వ పెద్దలను ఎన్నిసార్లు కలిసి ప్రాధేయపడినా నిధులు విడుదల చేయలేదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. సరఫరా నిలిపివేస్తే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్న భయంతో అధిక వడ్డీలకు అప్పులు తీసుకొచ్చి మరీ గుడ్లు సరఫరా చేశామని చెబుతున్నారు. రాష్ట్రంలో కోడిగుడ్లు సరఫరా చేసిన కాంట్రాక్టర్లకు జగన్ ప్రభుత్వం సుమారు రూ.240 కోట్లు బకాయిలు పడిందని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకొని బకాయిలు వెంటనే విడుదల చేయాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

భద్రత కల్పించాలని ఆదేశించండి

- హైకోర్టును ఆశ్రయించిన ద్వారంపూడి

అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తనకు 1 ప్లస్ 1 భద్రత కల్పించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ కాకినాడ వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం గురువారం హైకోర్టులో విచారణకు రాగా, కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వాలని పోలీసులు తరఫు న్యాయవాది అభ్యర్థించారు. దీంతో పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని పోలీసులను న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ ఆదేశించారు. హోం ముఖ్య కార్యదర్శి, డీజీపీ, ఇంటెలిజెన్స్ అదనపు డీజీ, కాకినాడ ఎస్పీలకు నోటీసులు జారీ చేశారు. విచారణను మూడు వారాలకు వాయిదా వేశారు.


ఎక్సైజ్ ఏకీకరణకు అంతర్గత కమిటీ

- రేపటిలోగా నివేదిక ఇవ్వాలని ఆదేశం

అమరావతి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోల ఏకీకరణ చర్యలను ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులో భాగంగా ఎక్సైజ్ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు 19 మందితో అంతర్గత కమిటీని నియమిస్తూ ఎక్సైజ్ డైరెక్టర్ నిశాంత్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల 3 నాటికి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కమిటీలో డి.శ్రీకాంత్‌రెడ్డి, ఎస్.బాలకృష్ణన్, సీహెచ్ లావణ్య, బి.నర్సింహులు, కె.కామేశ్వరరావు, ఎం.కోటయ్య తదితరులు ఉన్నారు.

నైరుతి సెకండాఫ్‌లోనూ జోరు వానలు!

- ఆగస్టు, సెప్టెంబరులో అధిక వర్షపాతం
- ఆగస్టులో ఉత్తరకోస్తాలో తగ్గనున్న వర్షాలు
- భారత వాతావరణ శాఖ అంచనా



ఆగస్టు, సెప్టెంబరుల్లో దేశంలో వర్షపాతం అంచనా

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల సీజన్‌లో తొలి అర్ధ భాగం మంచి వర్షాలు కురిశాయి. అదేజోరు ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కొనసాగనుంది. రెండు నెలల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం (దీర్ఘకాలిక సగటులో 106 శాతం) నమోదవుతుంది. అయితే ఈశాన్య రాష్ట్రాలు, తూర్పు భారతంలో కొన్ని ప్రాంతాలు, సౌరాష్ట్ర, లద్దాక్, మధ్య, దక్షిణ భారతంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆగస్టు నెలలో ఈశాన్య రాష్ట్రాలు, వాయవ్య, మధ్య, తూర్పు, దక్షిణాదిలో పలు భాగాలు, కశ్మీర్, లద్దాక్ వంటి ప్రాంతాలు తప్ప దేశంలో మిగిలిన ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది. జూన్, జూలై నెలల్లో 445.8 మి.మీ.కు గాను 453.8 మి.మీ (సాధారణం కంటే రెండు శాతం ఎక్కువ)వర్షపాతం నమోదైంది. కాగా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో దేశంలో 422.8 మి.మీ.లు (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 106 శాతం) నమోదవుతుందని తాజా బులెటిన్‌లో పేర్కొంది. ఆగస్టు నెలలో దేశంలో 254.9 మి.మీ. (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 94 నుంచి 106 శాతం వరకు) నమోదు కానుంది. ఆగస్టులో దక్షిణాది రాష్ట్రాల్లో తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని తెలిపింది. పసిఫిక్ మహాసముద్రంలో ప్రస్తుతం తటస్థ పరిస్థితులు కొనసాగుతున్నాయని, ఈ నెలాఖరుకల్లా లానినా ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. ఆగస్టు నెలలో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షాలు కురవనున్నాయి. ఉత్తర కోస్తాలోని ఎక్కువ ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయి. ఉత్తర తెలంగాణ, ఉత్తర కోస్తాలతోపాటు, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. అయితే ఆగస్టు, సెప్టెంబరు రెండు నెలల కాలంలో మాత్రం రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో సాధారణానికి మించి వర్షాలు కురుస్తాయని తాజా బులెటిన్‌లో పేర్కొన్నారు.

కళాశాల విద్యాశాఖలో చేనేత దినోత్సవం

అమరావతి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): చేనేత దినోత్సవం రోజున చేనేత వస్త్రాలు ధరించాలని కళాశాల విద్యాశాఖ నిర్ణయించింది. చేనేత వస్త్రాలను ప్రోత్సహించేలా కమిషనరేట్‌లోని అధికారులు, ఉద్యోగులు, ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో లెక్చరర్లు, విద్యార్థులు ఈ నెల 7న చేనేత వస్త్రాలు ధరించి విధులకు, తరగతులకు హాజరుకావాలని ఆ శాఖ ఆదేశాలు జారీచేసింది. నేత కార్మికులు, కళాకారులను ప్రోత్సహించడం, చేనేత వస్త్రధారణను ప్రచారం చేయడం కోసం ఈ మేరకు చర్యలు చేపట్టినట్టు అధికారులు తెలిపారు.

80% రాయితీపై వరి విత్తనాలు

అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలకు వరి నారుమళ్లు, నాట్లు దెబ్బతిని నష్టపోయిన రైతులకు 80% రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేస్తామని వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. 6,356 క్వింటాళ్ల వరి విత్తనాలను ఉభయగోదావరి, ఏలూరు, కాకినాడ, అనకాపల్లి జిల్లాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయితీ మినహాయించి, క్వింటా ఎంటీయూ1153 విత్తనాలకు రూ.756, ఎంటీయూ 1318, 1121, 7029, 1061 రకాలకు రూ.796, బీపీటీ 5204, ఆర్‌జీఎల్ 2537రకాలకు రూ.836 చొప్పున రైతులు చెల్లించాలని కోరారు. కాగా అధిక వర్షాలకు 1,406హెక్టార్లలో వరి నారుమళ్లు, 33వేల హెక్టార్లలో నాట్లు ముంపుబారిన పడ్డాయని తెలిపారు.

ఈ ఏడాది 3లక్షల హెక్టార్లలో సూక్ష్మసేద్యం

రాష్ట్రంలో 2024-25లో 3లక్షల హెక్టార్లలో సూక్ష్మసేద్యం విస్తరణకు డ్రిప్, స్ప్రింక్లర్లను సిద్ధం చేయాలని ఉద్యానశాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్‌బాబు అధికారులను ఆదేశించారు. బుధవారం విజయవాడలోని ఆప్కాబ్ భవనంలో సూక్ష్మసేద్య సాగునీటి పథకం అమలుపై ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులుతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. సూక్ష్మసేద్య పరికరాల కంపెనీలకు రూ.175కోట్ల బకాయిలు విడుదల చేయగా, గత ప్రభుత్వ బకాయిలను నెలవారీ ప్రణాళిక ప్రకారం విడుదల చేయనున్నట్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● శుక్రవారం 2 ఆగస్టు 2024



సైన్స్ పీజీల్లో ప్రవేశానికి జామ్

బయోటెక్నాలజీ, సైన్సెస్ విభాగాల్లో పీజీ చేయాలనుకొనేవారి కోసం ఉద్దేశించిన 'జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్(జామ్) 2025' షెడ్యూల్ వెలువడింది. దీనిని ఈ ఏడాది ఐఐటీ ఢిల్లీ నిర్వహిస్తోంది. ఈ పరీక్షలో సాధించిన స్కోర్ ద్వారా ఎమ్మెస్సీ; ఎమ్మెస్సీ(టెక్); ఎంఎస్(రీసెర్చ్); జాయింట్/డ్యూయల్ డిగ్రీ ఎమ్మెస్సీ-పీహెచ్‌డీ; ఎమ్మెస్సీ-ఎంటెక్ డ్యూయెల్ డిగ్రీ; ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. దేశవ్యాప్తంగా ఉన్న 21 ఐఐటీలు అందిస్తున్న వివిధ పీజీ ప్రోగ్రామ్‌లలో సుమారు 3000 సీట్లను జామ్ స్కోర్ ద్వారా నేరుగా భర్తీ చేస్తారు. అలాగే నిట్ సంస్థలు, ఐసర్లు, ఐఐఎస్సీ, ఐఐఈఎస్‌టీ, డీఐఏటీ, ఐఐపీఈ, జేఎన్‌సీఏఎస్ఆర్, ఎస్ఎల్ఐఈటీ సహా ప్రముఖ సీఎఫ్‌టీఐ సంస్థల్లో 2300కు పైగా ఉన్న సీట్ల భర్తీకి కూడా ఈ స్కోరునే ప్రామాణికంగా తీసుకుంటారు.

జామ్ పేపర్లు: జామ్ ఎగ్జామ్‌ను ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో నిర్వహిస్తారు. ఉదయం సెషన్‌లో కెమిస్ట్రీ, జియాలజీ, మేథమెటిక్స్ పేపర్లు; మధ్యాహ్నం సెషన్‌లో బయోటెక్నాలజీ, ఎకనామిక్స్, మేథమెటికల్ స్టాటిస్టిక్స్, ఫిజిక్స్ పేపర్లు ఉంటాయి. అభ్యర్థులు గరిష్ఠంగా రెండు పేపర్లు రాయవచ్చు. రెండు పేపర్లు రాసేవారు ఉదయం సెషన్ నుంచి ఒక పేపర్, మధ్యాహ్నం సెషన్ నుంచి మరో పేపర్ ఉండేలా చూసుకోవాలి. పేపర్లకు నిర్దేశించిన సిలబస్‌ను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. కెమిస్ట్రీ పేపర్ సిలబస్ మారినందున దానిని త్వరలోనే అప్‌లోడ్ చేస్తారు.

అర్హత: అభ్యర్థి జామ్‌లో ఎంచుకొన్న పేపర్/పేపర్లను అనుసరించి సంబంధిత సబ్జెక్టులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు; సంబంధిత ఇండియన్ డిగ్రీ పూర్తిచేసిన విదేశీ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు. ఒక అభ్యర్థి ఎన్నిసార్లయినా జామ్ ఎగ్జామ్ రాయవచ్చు.

జామ్ 2025 వివరాలు: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. అన్నీ ఆబ్జెక్టివ్ ప్రశ్నలే ఇస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. పరీక్షకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని త్వరలో ప్రకటిస్తారు.

● గత ఏడాది నిర్వహించిన జామ్ 2024 ప్రకారం ప్రతి పేపర్లో మూడు సెక్షన్లు ఉన్నాయి. మొత్తం 60 ప్రశ్నలకుగాను 100 మార్కులు కేటాయించారు. మొదటి సెక్షన్‌లో 30 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇచ్చారు. వీటిలో పది ప్రశ్నలకు ఒక్కోదానికి ఒక మార్కు. మిగిలిన 20 ప్రశ్నలకు ఒక్కోదానికి రెండు మార్కులు నిర్దేశించారు. రెండో సెక్షన్‌లో 10 మల్టిపుల్ సెలెక్ట్ ప్రశ్నలను ఒకటి లేదా అంతకంటే ఎక్కువ సమాధానాలు ఉండేలా ఇచ్చారు. ప్రశ్నకు రెండు మార్కులు ప్రత్యేకించారు. మూడో సెక్షన్‌లో 20 న్యూమరికల్ ఆన్సర్ టైప్ ప్రశ్నలు ఇచ్చారు. వీటిలో పది ప్రశ్నలకు ఒక్కోదానికి ఒక మార్కు. మిగిలిన పది ప్రశ్నలకు ఒక్కోదానికి రెండు మార్కులు ప్రత్యేకించారు. వీటికి ఆప్షన్స్ ఇవ్వలేదు. ఒక నెంబర్ సమాధానంగా ఉంది. మొదటి సెక్షన్‌కు మాత్రమే కేటాయించిన మార్కుల్లో మూడోవంతు నెగెటివ్ మార్కులు నిర్దేశించారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులు ఒక పేపర్ మాత్రమే రాయాలంటే రూ.1800; రెండు పేపర్లు రాయాలంటే రూ.2500 చెల్లించాలి. మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఒక పేపర్ రాయాలంటే రూ.900; రెండు పేపర్లు రాయాలంటే రూ.1250 చెల్లించాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** సెప్టెంబరు 3
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 11
- **పరీక్ష కేంద్రం, టెస్ట్ పేపర్ తదితరాలను మార్చుకునేందుకు చివరి తేదీ:** నవంబరు 18
- **ఓబీసీ-ఎన్‌సీఎల్/ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ అప్‌లోడ్ చేసేందుకు చివరి తేదీ:** నవంబరు 20
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** 2025 జనవరిలో
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, గుంటూరు, ఒంగోలు, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం.
- **జామ్ 2025 ఎగ్జామ్ తేదీ:** 2025 ఫిబ్రవరి 2
- **ఫలితాలు విడుదల:** 2025 మార్చి 19
- **స్కోర్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** 2025 మార్చి 25 నుంచి
- **అడ్మిషన్ పోర్టల్ ఓపెన్:** 2025 ఏప్రిల్ 2
- **వెబ్‌సైట్:** jam2025.iitd.ac.in

ఆలిండియా లా ఎంట్రెన్స్ టెస్ట్



న్యూఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ(ఎన్ఎల్‌యూ)- 'ఆలిండియా లా ఎంట్రెన్స్ టెస్ట్(ఏఐఎల్ఈటీ) 2025 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ఎగ్జామ్ ద్వారా బీఏ ఎల్ఎల్‌బీ(ఆనర్స్), బీకాం ఎల్ఎల్‌బీ(ఆనర్స్) ఎల్ఎల్ఎం, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. బీఏ ఎల్ఎల్‌బీ(ఆనర్స్), బీకాం ఎల్ఎల్‌బీ(ఆనర్స్), ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్‌లలో ఒక్కోదానిలో అయిదు సీట్లను విదేశీ అభ్యర్థులకు మరో అయిదు సీట్లను ఓసీఐ/పీఐఓ అభ్యర్థులకు; పీహెచ్‌డీలో రెండు సీట్లను విదేశీయులకు ప్రత్యేకించారు. వీరికి అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. వీరు ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు.

బీఏ ఎల్ఎల్‌బీ ఆనర్స్, బీకాం ఎల్ఎల్‌బీ ఆనర్స్

● ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. బీఏ ఎల్ఎల్‌బీ ఆనర్స్ ప్రోగ్రామ్‌లో 120 సీట్లు; బీకాం ఎల్ఎల్‌బీ ఆనర్స్ ప్రోగ్రామ్‌లో 60 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 45 శాతం మార్కులతో ఏదేని గ్రూప్‌తో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఓబీసీ అభ్యర్థులకు 42 శాతం మార్కులు; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. ఓసీఐ/పీఐఓ/విదేశీ అభ్యర్థులకు కనీసం 65 శాతం మార్కులు ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ఎల్ఎల్ఎం

● ఈ ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో మొత్తం 81 సీట్లు ఉన్నాయి.

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఎల్ఎల్‌బీ లేదా తత్సమాన కోర్సు పూర్తిచేసి ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు చాలు. చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పీహెచ్‌డీ

● పీహెచ్‌డీ ఇన్ లా ప్రోగ్రామ్‌లో మొత్తం 27 సీట్లు ఉన్నాయి. యూజీసీ జేఆర్ఎఫ్ అభ్యర్థులకు 8 సీట్లు, ఏఐఎల్ఈటీ మెరిట్ సాధించిన అభ్యర్థులకు 16 సీట్లు, ఏఐఎల్ఈటీ మెరిట్ ద్వారా ఫెలోషిప్ పొందినవారికి ఒక సీటు, విదేశీ అభ్యర్థులకు రెండు సీట్లు ప్రత్యేకించారు.

● పీహెచ్‌డీ ఇన్ సోషల్ సైన్స్ ప్రోగ్రామ్‌లో 4 సీట్లు ఉన్నాయి. వీటిని యూజీసీ జేఆర్ఎఫ్ అర్హత ఉన్నవారికి నిర్దేశించారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 55 శాతం మార్కులతో ఎల్ఎల్ఎం ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు చాలు. యూజీసీ జేఆర్ఎఫ్ అర్హత ఉన్నవారు ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు.

ఏఐఎల్ఈటీ 2025 వివరాలు

● బీఏ ఎల్ఎల్‌బీ(ఆనర్స్), బీకాం ఎల్ఎల్‌బీ(ఆనర్స్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నిర్వహించే ఎగ్జామ్‌లో మొత్తం 150 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఇంగ్లీష్ లాంగ్వేజ్ నుంచి 50, కరెంట్ అఫైర్స్ అండ్ జనరల్ నాలెడ్జ్ నుంచి 30, లాజికల్ రీజనింగ్ నుంచి 70 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. తప్పుగా గుర్తించిన సమాధానానికి పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.

● ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో 'లా' విభాగాల నుంచి మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. తప్పుగా గుర్తించిన సమాధానానికి పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.

● పీహెచ్‌డీలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. రీసెర్చ్ మెథడాలజీ నుంచి 50 ప్రశ్నలు, 'లా' విభాగాలనుంచి 50 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. తప్పుగా గుర్తించిన సమాధానానికి పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ పరీక్షలో సాధించిన స్కోర్‌కు 70 శాతం; రీసెర్చ్ ప్రపోజల్, ఇంటర్వ్యూ/వైవా మార్కులకు 30 శాతం వెయిటేజీ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- ★ **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.3500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ కేటగిరీల్లో బీపీఎల్ అభ్యర్థులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది.
- ★ **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 18
- ★ **ఆన్‌లైన్ దరఖాస్తులో కరెక్షన్స్ విండో ఓపెన్:** నవంబరు 18 నుంచి 21 వరకు
- ★ **విదేశీ విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ:** 2024 ఏప్రిల్ 30
- ★ **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం
- ★ **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** నవంబరు 28 నుంచి
- ★ **ఏఐఎల్ఈటీ 2025 తేదీ:** డిసెంబరు 8
- ★ **వెబ్‌సైట్:** nationallawuniversitydelhi.in

జాబ్ కార్నర్

ఐటీబీపీలో కానిస్టేబుల్ పోస్టులు

ఖాళీలు 143

భారత హోం మంత్రిత్వ శాఖకు చెందిన ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీ)... వివిధ విభాగాల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీ అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: కానిస్టేబుల్(బార్బర్/సఫాయి కర్మచారి/గార్డెనర్)

అర్హతలు: కానిస్టేబుల్(బార్బర్/సఫాయి కర్మచారి) పోస్టులకు 10వ తరగతి ఉత్తీర్ణతతోపాటు సంబంధిత వృత్తిలో పని అనుభవం ఉండాలి. కానిస్టేబుల్(గార్డెనర్) ఖాళీలకు 10వ తరగతితోపాటు సంబంధిత విభాగంలో ఐటీఐ/డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు తప్పనిసరి.

పే స్కేల్: నెలకు రూ.21,700 - రూ.69,100

వయోపరిమితి: కానిస్టేబుల్(బార్బర్/సఫాయి కర్మచారి) పోస్టులకు 21-25 ఏళ్లు; కానిస్టేబుల్(గార్డెనర్) ఖాళీలకు 21-33 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్(పీఈటీ), ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్(పీఎస్‌టీ), రాత పరీక్ష, ఒరిజినల్ డాక్యుమెంట్ల వెరిఫికేషన్, ప్రాక్టికల్ స్కిల్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

పరీక్ష రుసుము: యూఆర్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ రూ.100. ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికోద్యోగులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 26

వెబ్‌సైట్: recruitment.itbpolice.nic.in/

ఎన్‌సీఈఆర్‌టీలో టీచింగ్ ఉద్యోగాలు

ఖాళీలు 123


న్యూఢిల్లీలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రెయినింగ్(ఎన్‌సీఈఆర్‌టీ)... కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **ప్రొఫెసర్:** 33 పోస్టులు
- **అసోసియేట్ ప్రొఫెసర్:** 58 పోస్టులు
- **అసిస్టెంట్ ప్రొఫెసర్/అసిస్టెంట్ లైబ్రేరియన్:** 32 పోస్టులు

విభాగాలు: హిస్టరీ, సోషియాలజీ, పొలిటికల్ సైన్స్, ఉర్దూ, జాగ్రఫీ, సైకాలజీ, సివిల్ ఇంజనీరింగ్, హిందీ, ఎకనామిక్స్, కెమిస్ట్రీ, చైల్డ్ డెవలప్‌మెంట్, ఇంగ్లీష్, ఆర్ట్స్, ఫిజిక్స్, జువాలజీ, అగ్రికల్చర్, మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణత. నెట్/స్లెట్/సెట్ స్కోరుతో పాటు టీచింగ్ అనుభవం ఉండాలి.

జీతం: నెలకు ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,44,200; అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,31,400; అసిస్టెంట్ ప్రొఫెసర్/అసిస్టెంట్ లైబ్రేరియన్‌కు రూ.57,700



దరఖాస్తు ఫీజు: రూ.1,000. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక విధానం: విద్యార్హతలు, దరఖాస్తుల షార్ట్ లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 16

వెబ్‌సైట్: ncert.nic.in/

హడ్కోలో మేనేజీరియల్ ఉద్యోగాలు

ఢిల్లీలోని హౌజింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(హడ్కో)... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 66

1. సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్: **1 పోస్టు**
2. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్: **1 పోస్టు**
3. జనరల్ మేనేజర్: **1 పోస్టు**
4. డిప్యూటీ జనరల్ మేనేజర్: **2 పోస్టులు**
5. అసిస్టెంట్ జనరల్ మేనేజర్: **11 పోస్టులు**
6. సీనియర్ మేనేజర్: **12 పోస్టులు**
7. మేనేజర్: **5 పోస్టులు**
8. ట్రెయినీ ఆఫీసర్: **33 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో డిప్లొమా, డిగ్రీ, సీఏ, బీఈ/బీటెక్/బీఎస్సీ, ఎంబీఏ, పీజీడీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 28 నుంచి 52 ఏళ్లు మించకూడదు

దరఖాస్తు ఫీజు: మేనేజీరియల్ పోస్టులకు రూ.1500; ట్రెయినీ ఆఫీసర్ పోస్టుకు రూ.1,000; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 11

వెబ్‌సైట్: https://hudco.org.in//

భువనేశ్వర్ ఎయిమ్స్‌లో సీనియర్ రెసిడెంట్స్

ఖాళీలు 133

భువనేశ్వర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: సీనియర్ రెసిడెంట్

విభాగాలు: అనస్తీషియాలజీ, ఈఎన్‌టీ, కార్డియాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, మైక్రోబయాలజీ, న్యూక్లియర్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్ సర్జరీ, పాథాలజీ, ఫిజియాలజీ, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్, యూరాలజీ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, ఎండీ, ఎంఎస్, ఎమ్మెస్సీ, డీఎన్‌బీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు రూ.67,700

వయోపరిమితి: 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1500, ఎస్సీ/ఎస్టీ/అభ్యర్థులకు రూ.1200, దివ్యాంగులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 15

వెబ్‌సైట్: https://aiimsbhubaneswa.nic.in/

లిటిల్స్



అనువు గాని చోట

ఒక అడవిలో పెద్ద అల్లరి కోతుల గుంపు ఉండేది. ఒక రోజు వాటికి ఎక్కడా నీళ్లు దొరకక చాలా దాహం వేసింది. ఆ గుంపులో పెద్దకోతి తొందరగా గొంతు తడుపుకోకపోతే నేను చచ్చిపోయేలాగా ఉన్నాను అన్నది. గుంపులోని మరో కోతి అదిగో అక్కడ మంచినీళ్లు ఉన్నాయి అల్లంత దూరంలో అని దూరంగా మెరుస్తున్న ఎండమావిని చూపించింది. అదేమిటో తెలియని మిగతా కోతులు ఉత్సాహంగా సరే అని, అటు వైపు వెళ్లాలి అనుకున్నాయి. పక్కనే ఉన్న పొదలో ఉండి ఈ మాటలన్నీ విన్న చిన్న



కుందేలు పిల్ల ఒకటి పాపం ఈ కోతులకు సాయం చేద్దామని అనుకుని, వాటితో ఇలా అన్నది. 'మిత్రులారా ఎక్కడైనా ఎండ మావుల్లో నీరు ఉంటుందా? అది మన భ్రమ మాత్రమే నీటిలాగా కనిపిస్తుంది కానీ అది నీరు కాదు' అని చెప్పింది. ఆ మాటలు విన్న కోతులు 'మాకు తెలియదా ఏం చేయాలో? మేమంత తెలివి తక్కువ వాళ్లమా? నువ్వు మాకు నేర్పుతావా?' అని విరుచుకు పడ్డాయి. ఆ కుందేలు అప్పటికీ ఊరుకోక ఇంకా ఏదో చెప్పబోయింది. వెంటనే కోతులు దాని మీదకు దూకి దాన్ని గాయపరిచాయి. అందుకే తగని చోట మనకు అనువు గాని చోట ఎక్కువ మాటలాడకూడదు.



జంతువులు ఎన్ని?



సరైన రెండు నీడలు ఏవి?

5 తేడాలను గుర్తించండి?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 373

					6		9	3
			2	7		1	6	
4		9	3		1	5		
			9	3				6
3		6	7		4	9		5
7				2	8			
		1	8		7	4		2
	4	8		5	2			
2	5		4					

సుడోకు - 372 సమాధానం

5	1	2	4	9	7	6	8	3
9	7	6	1	3	8	5	2	4
8	4	3	2	5	6	1	7	9
2	9	7	8	6	5	4	3	1
3	8	4	9	2	1	7	6	5
6	5	1	3	7	4	8	9	2
4	6	9	7	1	3	2	5	8
1	2	5	6	8	9	3	4	7
7	3	8	5	4	2	9	1	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.